
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 216

ఆదివారం 27-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో దీపావళి స్క్రాచ్ కార్డ్ స్కీమ్

సోనోవిజన్ స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటోంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6%, చాలా మందికి మరింత ఎక్కువ ఎమౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీపావళికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎల్.ఇ.డి, వాషింగ్ మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, ఎ.సి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 20% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 216

SUNDAY Special | ఆదివారం 27-10-2024



టెస్టు సిరీస్ కివీస్ సొంతం

రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులకు ఆలౌట్ అయింది.

- వివరాలు 16లో



ఇన్ టైమ్‌లో వస్తే... అంతా సేఫ్!

సరైన సమయానికి చికిత్స అందితే 'స్ట్రోక్' అని పిలిచే సమస్య నుంచి బయట పడటం సాధ్యమే అంటున్నారు డాక్టర్లు. 29న వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా 'బ్రెయిన్ స్ట్రోక్'పై కథనం..

- వివరాలు 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

స్కిల్స్ వర్సిటీకి 'మేఘా' రూ.200 కోట్ల విరాళం



రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భవనాల నిర్మాణానికి మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

- వివరాలు 8లో ▶

అందుకే కాంగ్రెస్‌లో చేరారు



కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రేమతో రాలేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. తమ అక్రమాస్తులు కాపాడుకోవడం, రాజకీయ భవిష్యత్ కోసమే వారు కాంగ్రెస్‌లో చేరారని వ్యాఖ్యానించారు.

- వివరాలు 14లో ▶

కలుషిత 'యమున'లో మునిగి... ఆస్పత్రి పాలు



ఆప్ ప్రభుత్వం యమునా నదిని పరిశుభ్రంగా మార్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ నదిలో స్నానం చేసిన బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ.. శ్వాస కష్టంగా మారడం, దురద సమస్యలతో ఆస్పత్రి పాలయ్యారు.

- వివరాలు 6లో ▶



శనివారం జరిగిన కేబినెట్ భేటీ వివరాలు వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

- ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- 'జీవో 317'ఉద్యోగులకు స్పౌజ్, ఆరోగ్యం, పరస్పర బదిలీలు
- మిగిలిన ఉద్యోగులతోపాటు జీవో 46 సమస్యలపై అసెంబ్లీలో చర్చ
- అనంతరం కేంద్రం ఆమోదానికి ప్రతిపాదనలు
- డీఫాల్ట్ అయిన మిల్లర్ల తొలగింపు
- పీపీపీ విధానంలో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి
- రూ. 24,269 కోట్లతో మెట్రో రెండో దశకు ఓకే
- మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

కులగణనకు ఇంటింటి సర్వే

నవంబర్ 4 లేదా 5న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం

ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేను నవంబర్ 4 లేదా 5న ప్రారంభించి 30లోగా పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. సర్వేకు సంబంధించిన ప్రశ్నావళి, విధివిధానాలను ఆమోదించింది. రాష్ట్రంలో కులగణన నిర్వహించాలని ఫిబ్రవరి 17న శాసనసభలో తీర్మానం చేయడంతోపాటు ఇప్పటికే జీవో 18 ప్రభుత్వం జారీ చేయగా సీఎం రేవంత్ సోమవారం రాష్ట్ర నోడల్ అధికారి, జిల్లా కలెక్టర్లతో సమావేశమై సర్వేపై దిశానిర్దేశం చేయనున్నారు. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా, మండల స్థాయిలోని 80 వేల మంది అధికారులు, సిబ్బందికి కులగణనపై శిక్షణ అందించనున్నట్లు పొన్నం తెలిపారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇళ్లను కేటాయించి సర్వే పూర్తి చేయడానికి 3, 4 రోజుల సమయం ఇస్తున్నామన్నారు. 15–20 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే పూర్తికానుందని... ఇప్పటికే షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం ఒక్క రోజులో కుటుంబ సర్వే నిర్వహించి వివరాలను బయటపెట్టలేదని..

మిగతా 5వ పేజీలో ▶

7 పేజీలు.. 54 ప్రశ్నలు

రాష్ట్రంలో కులగణనకు ఫార్మాట్ తయారు చేసిన ప్రణాళిక శాఖ... ఆధార్ నంబర్లు సహా కుటుంబ సభ్యుల అందరి వివరాలు నమోదు 5 లో



ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేస్తున్న టీజీఎస్పీ 3వ బెటాలియన్ సిబ్బందిని అడ్డుకుంటున్న పోలీసులు

తిరగబడ్డ 'పోలీస్'

- పలు బెటాలియన్లలో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళన
- ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు
- ఏక్ పోలీస్ విధానం సహా పలు డిమాండ్ల సాధనకు పట్టు

- వివరాలు 2లో

39 మంది సస్పెండ్

టీజీఎస్పీ బెటాలియన్లలో నిరసనలను ప్రేరేపించారంటూ పోలీసు శాఖ ఉత్తర్వులు

- ఆందోళనలకు నేతృత్వం వహించిన, ఇంటర్వ్యూలు ఇచ్చినవారి గుర్తింపు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 ప్రకారం చర్యలకు ఏర్పాట్లు
- క్రమశిక్షణారాహిత్యాన్ని సహించబోమంటూ డీజీపీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగంలో ఉండి ధర్నాలు, ఆందోళనలకు నాయకత్వం వహించారని.. నిరసనలను ప్రేరేపించి క్రమశిక్షణను ఉల్లంఘించారని 39 మంది మంది తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. అందులో వివిధ బెటాలియన్లకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. టీజీఎస్పీ బెటాలియన్లలో ఆందోళనలకు నేతృత్వం

మిగతా 2వ పేజీలో ▶

పూర్ పీపుల్.. పూర్ సిగ్నల్స్!

➤ స్మార్ట్‌ఫోన్ పుణ్యమా అని ప్రపంచమే అందివస్తున్న రోజులివి. కానీ, ఏజెన్సీ 'నట్టింటి'కి మాత్రం నేటికీ 'సిగ్నల్' అందనంటోంది. పింఛన్, రేషన్, ఇతర సేవల మాట అటుంచితే.. ప్రాణం మీదికొస్తే 'మాటసాయం' కూడా అందక ఏజెన్సీ వాసులు తండ్లాడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో నెట్‌వర్క్ కోసం జనం పడుతున్న ఇబ్బందులపై గ్రాండ్ రిపోర్ట్..

7 లో



సిగ్నల్ కోసం 'ట్రీ'ట్‌మెంట్: ఆసిఫాబాద్ జిల్లా మురళిగూడలో సిగ్నల్ కోసం యువకుడి తంటాలు

ఊరిస్తున్న ఊయల సేవ



- అమెరికా అధ్యక్షుడిని తేల్చేది 7 స్వింగ్ స్టేట్లే
- వాటిలో మెజారిటీ సాధించే వారిదే పీఠం
- అందరి చూపూ ఆ రాష్ట్రాల వైపే..
- ఆ ఏడింటా ట్రంప్, హారిస్ హోరాహోరీ

- వివరాలు 6లో



శుక్రవారం మాది!

మహిళల కోసం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. వారికి ఆర్థికంగా,



ఆరోగ్యపరంగా మంచి జీవితాన్ని ఇచ్చేందుకు ప్రతివారం 'శుక్రవారం సభ' నిర్వహిస్తున్నారు.

14 లో



ఇరాన్‌పై నిప్పుల వర్షం

- ప్రతీకారానికి దిగిన ఇజ్రాయెల్ సైన్యం
- 100 ఫైటర్ జెట్లతో 20 లక్ష్యాలపై గురి
- క్షిపణులు, డ్రోన్ల తయారీ కేంద్రాలు, సైనిక స్థావరాలపై దాడులు
- నలుగురు సైనికులు మృతి చెందినట్లు ఇరాన్ వెల్లడి

6 లో

మీ బెయిల్ రద్దవుతుందని తల్లిని కోర్టుకీడుస్తారా?



- వైఎస్ జగన్‌పై షర్మిల మండిపాటు
- సాక్షి, భారతి సిమెంట్ పేర్లపై నాడు నేను పట్టించుకోలేదు
- వాళ్ల పేర్లతో ఆస్తులు ఉంటే నిజంగా వాళ్లవైపోతాయా?
- గిఫ్ట్ అంటే బంగారం, చీర ఇస్తారు.. ఆస్తుల్లో 40 శాతం వాటా ఇస్తారా?
- నాకు హక్కు ఉంది కాబట్టే ఇస్తామన్నారు

2 లో

చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నది మీరే

- షర్మిలపై వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం
- శత్రువుతో చేతులు కలిపి అన్నయ్య నాశనం కోరుకోవడం దారుణం

2 లో

ద్రోహం తలపెట్టినా చూస్తూ ఉండిపోవాలా?

- తప్పును సరిదిద్దాలనడం నేరమా?
- ఆస్తులు ఇచ్చిన అన్నకు మీరు చేసిందేమిటి?
- షర్మిలకు నెటిజన్ల సూటి ప్రశ్నలు

2 లో



క్లుప్తంగా...

అండగా ఉంటాం..

కల్లపు సతీశ్‌కుమార్, నర్సిరెడ్డి కుటుంబాలకు సీఎం భరోసా



నర్సిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట/మద్దూరు/కొడంగల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల కుటుంబాలను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూరులో కల్లపు సతీశ్‌కుమార్, మండలంలోని రేగడి మైలారంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గుర్మిట్‌కల్ నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందడంతో సీఎం వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సిరెడ్డి భార్య యాదమ్మతో మాట్లాడారు. అండగా ఉంటామని, ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం వెంట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, శ్రీహరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితరులు ఉన్నారు. సతీశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తల్లిదండ్రులు కల్లపు శివరాజ్, శాంతమ్మ, భార్య సంగీతను పరామర్శించారు. సతీశ్ కుమారుల చదువుల బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం వెంట పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఉన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొడంగల్‌కు వచ్చిన సందర్భంగా మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పలకరించి కుశల ప్రశ్నలు వేశారు.

కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో!

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్



స్టేషన్‌ఘన్‌పూర్: అధికారం పోయినా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని... ఆయన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ జుగుప్సాకరంగా మాట్లాడుతున్నారని.. పార్టీలు మారిన ఎమ్మెల్యేలను రాజకీయ వ్యభిచారులంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా ఎందరో ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారని... చట్టం వచ్చాక కూడా ఫిరాయింపులు జరిగాయన్నారు. తెలంగాణలో పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై హైకోర్టులో కేసు నడుస్తోందని.. కోర్టు తీర్పు ఎలా వచ్చినా శిరసావహిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత, కేటీఆర్ తండ్రి కేసీఆర్ సొంత పార్టీ పెట్టక ముందు కాంగ్రెస్, టీడీపీలలో పనిచేశారని కడియం గుర్తుచేశారు. మరి ఆయన తండ్రి కూడా రాజకీయ వ్యభిచారేనా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో పార్టీలు మారిన తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిని ఏకంగా మంత్రులను చేశారని గుర్తుచేశారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికల ఆర్వోగా లక్ష్మీనారాయణ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ సంస్థాగత ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారిగా పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. శనివారం జరిగిన ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవంలో రిటర్నింగ్ అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నేత గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర సహ రిటర్నింగ్ అధికారి జీఆర్ కరుణాకర్ పాల్గొన్నారు.

డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీ ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు 'జాజుల'



కాచిగూడ (హైదరాబాద్): దేశవ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీని ముట్టడించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన శనివారం బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులగణనపై బీజేపీ స్పందించకపోతే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థులు ఎక్కువ మార్కులు పొందినప్పటికీ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఉద్యోగావకాశాలు రావడం లేదన్నారు. ఇటీవల తెలంగాణ లో జరిగిన డీఎస్సీ పరీక్షలు, గ్రూప్ 1 పరీక్షలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా తొడుకునూరి సత్యగౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా పండ్ల మనోజ్‌లను నియమించారు. కార్యక్రమంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముది రాజ్, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో నాలుగో బెటాలియన్ గేటు వద్ద బైఠాయించిన టీజీ ఎస్పీ కానిస్టేబుళ్లు



జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కాళ్లమీద పడి తమ బాధను వెల్లడిస్తున్న సిరిసిల్ల 17వ బెటాలియన్ కానిస్టేబుల్

తిరగబడ్డ 'పోలీస్'!

రాష్ట్రవ్యాప్తంగా పలు బెటాలియన్లలో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళన

సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల క్రైం/కొత్తగూడెం రూరల్/మామునూరు/ఇబ్రహీంపట్నం: రాష్ట్ర పోలీస్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది రోడ్డెక్కారు. డిమాండ్ల సాధన కోసం నేరుగా ఆందోళనకు దిగారు. టీజీఎస్పీ బెటాలియన్లలో సెలవుల మార్పు ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ మూడు రోజులుగా పలుచోట్ల టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది కుటుంబ సభ్యులు ఆందోళనలు చేస్తుండగా శనివారం కొన్ని బెటాలియన్ల సిబ్బంది కూడా యూనిఫాం దుస్తుల్లోనే నిరసనలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని థర్డ్ బెటాలియన్, వరంగల్ జిల్లా మామునూరులోని నాలుగో బెటాలియన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని ఆరో బెటాలియన్, రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌కు చెందిన కొందరు కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో నిరసనల్లో పాల్గొన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ వ్యవస్థ ఉండాలంటూ నినదించారు.

ఐదేళ్లు ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించాలి

నెలల తరబడి కుటుంబానికి దూరమై పిల్లలను కూడా చూసుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నామని... ఇతర సివిల్ పోలీసుల తరహాలో ఒకేచోట కనీసం ఐదేళ్లు ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలని టీజీఎస్పీ సిబ్బంది డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా 15 రోజులు డ్యూటీ చేస్తే నాలుగు రోజులు ఇచ్చే పర్మిషన్ సెలవులు ఇవ్వాలని... పనిగంటలను తగ్గించాలని నినాదాలు చేశారు. ప్రస్తుత నిబంధనల వల్ల తమ భర్తలు ఇళ్లకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని.. అనారోగ్యానికి గురైన తల్లిదండ్రులను, పిల్లలను ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు వారు అందుబాటులో ఉండట్లేదని కానిస్టేబుళ్ల భార్యలు వాపోయారు. కొన్ని బెటాలియన్లలో తమ భర్తలతో ఉన్నతాధికారులు వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ దుర్భర పరిస్థితులను ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. అయితే సిబ్బంది సెలవులకు సంబంధించి విడుదల చేసిన

ఇవీ టీజీఎస్పీ సిబ్బంది ప్రధాన డిమాండ్లు

- స్థానికత ఆధారంగా జిల్లాల్లో పోలీస్ స్టేషన్లకు కేటాయించాలి.
- సివిల్ పోలీసుల మాదిరిగా మూడు నుంచి ఐదేళ్ల వరకు ఒకేచోట ఉద్యోగం కల్పించాలి.
- తమిళనాడులో గతంలో అమలైనట్లుగా ఏకీకృత పోలీస్ విధానాన్ని అమలు చేయాలి.
- పిటిక్ (శ్రమదానం) డ్యూటీల్లో వివక్ష చూపకూడదు.
- తాజాగా జారీ చేసిన 26 రోజుల డ్యూటీకి నాలుగు రోజుల సెలవు విధానాన్ని ఉపసంహరించుకోవాలి. (దీన్ని ఉన్నతాధికారులు శుక్రవారం ఉపసంహరించుకున్నారు).

ఉత్తర్వులను శుక్రవారం నిలిపేసినా ఆందోళనలు కొనసాగడం వెనక ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే రాజకీయ కుట్ర దాగి ఉండొచ్చని పోలీసు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు.

ఎస్పీ కాళ్లు మొక్కి వేడుకున్న ఓ కానిస్టేబుల్

తమను భార్యాబిడ్డలకు దూరం చేయొద్దంటూ 17వ బెటాలియన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కాళ్లు మొక్కి వేడుకున్నాడు. ఈ అంశంపై అభిప్రాయ సేకరణ చేపడతామని చెప్పి బెటాలియన్ కమాండెంట్ దర్బార్ ప్రాంగణానికి రాకపోవడంతో కోపోద్రిక్తులైన దాదాపు 100 మంది సిబ్బంది కమాండెంట్ చాంబర్‌ను ముట్టడించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అక్కడికి చేరుకోగా ఓ కానిస్టేబుల్ ఆయన కాళ్లపై పడి రోదించాడు. అనంతరం ఎస్పీ దర్బార్ నిర్వహించి ఉద్యోగుల ఫిర్యాదులు స్వీకరించారు. మరోవైపు ఇబ్రహీంపట్నం–నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై టీజీఎస్పీ మూడవ బెటాలియన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఏమిటీ 'ఏక్ పోలీస్'?

రాష్ట్రంలో మొత్తం 13 బెటాలియన్లు ఉన్నాయి. వాటిలో అధికారులు, సిబ్బంది కలిపి ఒక్కో బెటాలియన్‌లో వెయ్యి మంది వరకు ఉంటారు. సాధారణంగా పోలీస్‌శాఖలో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), స్పెషల్ పోలీస్ విభాగాల్లో సిబ్బందిని భర్తీ చేస్తుంటారు. పోలీస్ స్టేషన్లలో ఉంటూ శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర విచారణ చేయడం, నేరాలు నిరోధించడం నేరస్తులను గుర్తించడం వంటి విధులను సివిల్ పోలీస్ సిబ్బంది చేస్తుండగా వారికి బందోబస్తు తదితర విధులలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు సహాయపడుతుంటారు. కానీ టీజీఎస్పీ పోలీస్ సిబ్బంది శాంతిభద్రతల విధులు నిర్వహిస్తుంటారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేస్తారు. అయితే తమను ఐదేళ్లలో ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్)లోకి, ఆ తర్వాత ఐదేళ్లకు సివిల్ కానిస్టేబుల్‌గా మార్చాలని టీజీఎస్పీ కానిస్టేబుళ్లు కోరుతున్నారు. అయితే ఇందుకు రాష్ట్ర సర్వీస్ నిబంధనలు అంగీకరించవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లిలో ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్ల భార్యలు

39 మంది సస్పెండ్

▶ మొదటి పేజీ తరువాయి

వహించిన, ఇంటర్వ్యూలు ఇచ్చినవారిని గుర్తించి.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అంతకుముందు టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనలపై డీజీపీ జితేందర్ ప్రకటన విడుదల చేశారు. వారి సమస్యలను సానుభూతితో పరిశీలిస్తామని, సిబ్బంది యథావిధిగా విధుల్లో చేరాలని హామీ ఇస్తూనే.. క్రమశిక్షణ ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. టీజీఎస్పీ సిబ్బంది పోలీసు శాఖ ప్రతిష్టకు మచ్చ తెచ్చేలా వ్యవహరించరాదని.. నిబంధనలు ఉల్లంఘించే సిబ్బందిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 39 మంది టీజీఎస్పీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నిరసనలు, ఆందోళనలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, తదనుగుణంగా చర్యలు చేపడతామని అందులో పేర్కొన్నారు.

ఉమ్మడి ఏపీ విధానాలే..

ఉమ్మడి ఏపీలో టీజీఎస్పీ పోలీసు సిబ్బంది విధులకు అనుసరించిన విధివిధానాలే తెలంగాణ రాష్ట్రంలోనూ కొనసాగుతున్నాయని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ పోలీస్ ఎంపిక రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే అభ్యర్థులు కోరుకున్న విధంగా జరిగాయన్నారు. దాదాపుగా అన్ని రాష్ట్రాలు ఈ రకమైన విధానాలనే అమలు చేస్తున్నాయన్నారు. ఇతర ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు లేనివిధంగా టీజీఎస్పీ సిబ్బందికి సరెండర్ లీవులు, అదనపు సరెండర్ లీవులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పండుగలు, సెలవుల్లో సిబ్బంది విధులను దృష్టిలో ఉంచుకొని వారికి ఈ సౌకర్యం కల్పిస్తున్నామని ఆ ప్రకటనలో డీజీపీ వివరించారు.

టీజీఎస్పీ సిబ్బందికి ఉన్నతాధికారుల కౌన్సెలింగ్..

టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనబాట పట్టడంతో పోలీస్ ఉన్నతాధికారులు వారికి పలు అంశాలపై కౌన్సెలింగ్ చేపట్టారు. నిబంధనలు ఏం చెబుతున్నాయి? వారి సమస్యల పరిష్కారానికి ఉన్న మార్గాలేమిటనే అంశాలను వివరిస్తున్నారు. ఈ మేరకు మొదటి, ఎనిమిదో బెటాలియన్ల సిబ్బందికి శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్, టీజీఎస్పీ అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్‌లు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వరంగల్‌లో సీపీ వరంగల్, 12వ బెటాలియన్‌లో నల్లగొండ జిల్లా ఎస్పీ, సిరిసిల్లలో స్థానిక ఎస్పీ, డిచ్‌పల్లిలో కామారెడ్డి ఎస్పీలు సిబ్బందితో మాట్లాడారు.

డీఏ, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం

ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఉపముఖ్యమంత్రి భట్టి హామీ



సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏతోపాటు పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. సచివాలయంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టితో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నేతలు భట్టికి 53 అంశాలు, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ప్రధానంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయితే ప్రస్తుతం ఒక డీఏతోపాటు పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని భట్టి హామీ ఇచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు. దీపావళి పండుగ తర్వాత శాఖల వారీగా, సంఘాల వారీగా పిలిపించి చర్చిస్తామని, ఆర్థిక అంశాలు, ఆర్థికేతర అంశాలు వేరు చేసి ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానమైన తొమ్మిది డిమాండ్లు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. కులగణన విషయంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని ప్రభుత్వానికి సహకరిస్తామని వారు ఈ సందర్భంగా భరోసానిచ్చారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

మంత్రి పొంగులేటి



సచివాలయంలో జరిగిన సమీక్షలో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాప్‌ను ఆయన అధికారులతో కలిసి శనివారం సచివాలయంలో పరిశీలించారు. ఇందులో కొన్ని మార్పులు సూచించిన ఆయన, వారం రోజుల్లో దాన్ని సిద్ధం చేసి అందుబాటులోకి తెస్తామని వెల్ల డించారు. మరికొద్ది రోజుల్లో ఇళ్ల నిర్మాణ పథకం ప్రారంభమవుతుందని, ఇళ్ల కేటాయింపు లో పారదర్శకత ఉంటుందని, పార్టీలు, వ్యక్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉండదని, అర్హులైనవారికే ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని, యాప్‌లో తెలుగు వర్షన్ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. ఈ పథకం అమలులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేవంత్ వైఫల్యం వల్లే రోడ్లపైకి పోలీసులు

సబితా ఇంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్ల మీదకు రావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారణమని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తోన్న రేవంత్ సీఎంగా విఫలం కావడం వల్లే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయన్నారు. పోలీసులు రోడ్డు ఎక్కడం చరిత్రలోనే మొదటిసారని, ప్రజాపాలన ఇదేనా అని ప్రశ్నించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌తో కలసి సబితా ఇంద్రారెడ్డి శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి హోం మంత్రి లేకపోవడంతో తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో కానిస్టేబుళ్లకు తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫారం వేసుకుని ధర్నాలు చేసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఏక్ పోలీసు వ్యవస్థపై గతంలో రేవంత్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రతీ 18 రోజులకోమారు కానిస్టేబుళ్లు నాలుగు రోజుల పాటు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలని డీజీపీ స్థాయి అధికారి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి అని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులతో అధికారులు ఇళ్లల్లో వివిధ పనులు చేయించుకుంటున్నారని సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం ముందు రోజూ జరుగుతున్న ధర్నాలతో రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా అని నిలదీశారు. పోలీసులు తమ విధులపై దృష్టి కేంద్రీకరించేలా ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వాణీదేవి డిమాండ్ చేశారు.

చంద్రబాబు మోచేతి నీళ్లు
తాగుతున్నది మీరే

షర్మిలపై వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ రాజకీయ శత్రువైన చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతూ.. సొంత అన్నయ్య పతనం కోరుకోవడమే కాకుండా.. సొంత బాబాయి సుబ్బారెడ్డికి కనీస గౌరవం ఇవ్వకుండా మాట్లాడటం ఏమాత్రం సబబు కాదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీని బలహీన పరచాలనే ఆలోచనతో తమ నాయకుడు వైఎస్ జగన్‌పై ఇష్టారాజ్యంగా మాట్లాడుతుండటాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శనివారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. 'వైఎస్ జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అంటూ రాజ్యసభ సభ్యుడు, స్వయానా మీకు బాబాయి అయిన వైవీ సుబ్బారెడ్డిని ఉద్దేశించి అలా మాట్లాడటం భావ్యం కాదు. మీ తప్పులను, మీరు మాట్లాడే అవాస్తవాలను ఎండగడితే మోచేతి నీళ్లు తాగినట్లా? దివంగత సీఎం వైఎస్సార్‌ను ఎవరైతే శాశ్వత శత్రువుగా చూశారో.. అలాంటి చంద్రబాబు మోచేతి నీళ్లు తాగి స్వయాన అన్నయ్య బెయిలు రద్దు చేసేందుకు కుట్ర పన్నడం దారుణం. ఇందుకు సంబంధించిన వాస్తవాలను మేము ప్రజలకు, వైఎస్సార్ అభిమానులకు చెబుతుంటే మీరెందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంఓయూ గురించి బాబుకు ఎలా తెలిసింది?

'ఐదేళ్ల క్రితమే ఆస్తులకు సంబంధించి ఎంఓయూ చేసుకున్నారు. అది బయటపెడితే వైఎస్సార్‌కు చెడ్డ పేరొస్తుందని చెప్పిన మీరు.. ఇప్పుడు ఈ విషయాలన్నీ చంద్రబాబుకు, టీడీపీకి ఎందుకు చెప్పారో సమాధానం ఇవ్వండి. మీరు లేఖలో ఎవరినైతే సాక్షులుగా చెప్పారో స్వయానా మీ బాబాయే వాస్తవాలు చెబుతున్నారు. అది జీర్ణించుకోలేక వారిపై నోరు పారేసుకుంటున్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న సరస్వతి పవర్ కంపెనీ షేర్ల విషయంలో తెలంగాణ హైకోర్టు స్టే విధిస్తే.. ఏ ఉద్దేశంతో షేర్లు బదలాయించారు? కాంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ అయితే జగనన్న బెయిల్ రద్దు కాదా? శత్రువులతో చేతులు కలిపి ఎవరి పతనం కోరుకుంటున్నారు?' అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. 'జగతి పబ్లికేషన్ (సాక్షి)లో ప్రారంభంలో నష్టాలు వచ్చాయి.. ఆదాయం పోగా రూ.20 కోట్లకు పైగా నష్టం వస్తే.. అందులో మీరు ఎంత వాటా భరించారు? వైఎస్సార్ ఇచ్చిన ఆస్తులు మీరు చూస్తున్నారు.. ఆ వ్యాపారాల్లో రూ.1300 కోట్ల అప్పుల్లో మీరు ఎంత భరించారు? వైఎస్సార్ పేరును ఛార్జ్ షీట్‌లో పెట్టిన కాంగ్రెస్ పార్టీలో ఉన్న మీరు.. ఇప్పుడు పొన్నవోలు సుధాకర్ ఆ పేరు చేర్చారని అవాస్తవాలు మాట్లాడుతున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. షర్మిల రాజకీయంగా దిగజారిపోయి మట్లాడుతున్నారని.. తన సంపాదనలో 40 శాతం వాటా ఇవ్వడానికి ముందుకొచ్చిన అన్నయ్య పతనం కోరుకోవడం దారుణం అని ధ్వజమెత్తారు. షర్మిల పాదయాత్ర చేసినప్పుడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదని, ఆమె కష్టాన్ని ఎవరూ కాదనలేదని చెప్పారు. తమ నాయకుడు జగన్, పార్టీ శ్రేణుల కష్టం వల్లే 2019లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన వారందరిలో షర్మిల ఒకరన్నారు.

మీ బెయిల్ రద్దవుతుందని తల్లిని కోర్టుకీడుస్తారా?

వైఎస్ జగన్‌పై షర్మిల మండిపాటు

సాక్షి, అమరావతి: 'మీ బెయిల్ రద్దవుతుందని తల్లిని కోర్టుకీడుస్తారా? మీ లబ్ధి కోసం అమ్మ, చెల్లిని ఇబ్బంది పెడతారా?' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీబీఐ ఛార్జిషీట్‌లో వైఎస్సార్ పేరు పెట్టకపోతే.. బెయిల్ రాదని పొన్నవోలు సుధాకర్ చేర్చిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ ఉన్నప్పుడు భారతి, సాక్షి సిమెంట్స్‌లో నలుగురు చిన్న బిడ్డలకు సమాన వాటా ఉండాలన్నారనే విషయాన్ని ప్రమాణ పూర్వకంగా చెబుతున్నానని తెలిపారు. 'ఈ లోకంలో నీ తర్వాత పాప (షర్మిల) మేలు కోరేది నేనే.. డోంట్ వర్రీ డాడ్' అని జగన్ అన్నారని ఆమె వెల్లడించారు. తాను చెబుతున్నది నిజమని ప్రమాణం చేస్తానని స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వారని, జగన్ పదవులు ఇస్తే అనుభవిస్తున్న వారు ఎలాగైనా మాట్లాడుతారని, రేపు సాయిరెడ్డి కూడా మాట్లాడుతారని చెప్పారు. 'సాక్షి'కి, భారతి సిమెంట్స్‌కి వాళ్ల పేర్లు పెట్టుకున్నారని, అందుకే ఆ ఆస్తులు వాళ్లవేనని సుబ్బారెడ్డి అంటున్నారని.. ఆరోజు పేర్లలో ఏముందిలే అని తాను అభ్యంతరం చెప్పలేదన్నారు. వాళ్ల పేర్లతో ఆస్తులు ఉంటే.. నిజంగా అవి వాళ్లవి అవుతాయా? అని ఆమె ప్రశ్నించారు. 'నా పేరు మీద ఆస్తులు రాసి ఉంటే నేను ఎందుకు జైలుకి వెళ్లలేదని అడుగుతున్నారు.. అయితే భారతి కూడా జైలుకు వెళ్లాలి కదా.. ఈ మాటలు ఎవరో అంటే పట్టించుకొనే దాన్ని కాదు.. సొంత చిన్నాన్న అనడం బాధ కలుగుతోంది. ఏ అన్న అయినా.. చెల్లికి గిఫ్ట్ అంటే ఏ బంగారమో, చీరనో ఇస్తారు.. అంతేకాని ఆస్తుల్లో 40 శాతం వాటా ఇస్తారా? నా హక్కు కాబట్టే నాకు ఇస్తామన్నారు. ఎంఓయూ రాయమని నేను అడగలేదు. సరస్వతి సిమెంట్స్ ఈడీ అటాచ్‌లో లేదు. అందుకే దాంట్లో వాటాలను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీని ఎందుకు నిలబెట్టుకోలేదు?' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ద్రోహం తలపెట్టినా చూస్తూ ఉండిపోవాలా?

సాక్షి, అమరావతి: ఆనాడు పిల్లనిచ్చి.. పదవులిచ్చి..పార్టీ నీడనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. నేడు ఆయన చేతిలో కీలుబొమ్మగా మారిన షర్మిల సొంత అన్న జగన్‌కే ద్రోహం తలపెట్టారు. ఈ కుతంత్రాలను రక్తి కట్టించడం కోసం మీడియా ముందు దొంగ ఏడుపులతో డ్రామాలాడుతున్నారు. ఇదేనా వైఎస్సార్ బిడ్డ నైజం. ..ఇంతటి మహానటిని దేశంలో మరెక్కడైనా చూస్తామా..అంటూ వైఎస్ షర్మిలపై సోషల్ మీడియా వేదికలపై నెటిజన్లు మండిపడుతున్నారు. పబ్లిక్ పోస్టులతో దుమ్మెత్తి పోస్తున్నారు. వాటి సారాంశం ఇలా ఉంది..

మీ పేరు లేదంటే ఏంటి అర్థం?

'వాళ్ళ పేర్లతో ఆస్తులు ఉంటే...నిజంగా వాళ్లవి అవుతాయా ? నా పేరు మీద ఆస్తులు రాసి ఉంటే నేను ఎందుకు జైలుకి వెళ్ళలేదు అంటున్నారు. అలా అయితే భారతి కూడా జైలుకు వెళ్లాలి కదా' అని అంటున్న షర్మిలకు భారతి పేరు ఈడీ కేసుల్లో ఉందనే విషయం తెలియదా? మరి షర్మిల పేరు ఎందుకు లేదు. అంటే ఆ ఆస్తులతో షర్మిలకు సంబంధం లేదనే కదా అర్థం. ఎవరైనా తమ ఆస్తులకు వేరే వాళ్ల పేర్లు పెట్టుకుంటుంటే పోనీలే పేరు పెట్టుకుంటే ఏముందిలే అని ఊరుకుంటారా.? అవి జగన్ ఆస్తులు కాబట్టే వాళ్ల పేర్లు పెట్టుకున్నా వైఎస్సార్ అభ్యంతరం చెప్పలేదనేది నిజం కాదా?

చిన్నాన్నను అంత మాట మీరనొచ్చా?

సొంత చిన్నాన్నా అంటుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయని, నా బిడ్డలు నీ ముందు పెరగలేదా అని సుబ్బారెడ్డిని ప్రశ్నించిన షర్మిల అదే చిన్నాన్నను జగన్ మోచేతి నీళ్లు తాగుతున్నారని, పదవులు ఇస్తే అనుభవిస్తున్నారని అనడం సమంజసమా. ఆయనపై అంత ప్రేమ ఉన్నప్పుడు ఆయన వయసుకైనా గౌరవం ఇవ్వకుండా అంత పెద్ద మాట ఎలా అనగలిగారు షర్మిలమ్మా.? చిన్నాన్న కాబట్టే, మొదటి నుంచీ జరుగుతున్న పరిణామాలను దగ్గరగా చూస్తున్నారు కాబట్టే సుబ్బారెడ్డి వాస్తవాలు మాట్లాడితే తట్టుకోలేక ఆయనను నిందించడమేనా మీ సంస్కారం.పైగా సాయిరెడ్డి, సుబ్బారెడ్డిలను పరీక్షించడం కోసం, వాళ్ల గురించి విజయమ్మకు తెలియడం కోసం లేఖలో వారి పేర్లు ప్రస్తావించారా? ఇప్పుడు మీరు వారిద్దరి గురించి విజయమ్మకు కొత్తగా చెప్పాలా?

షర్మిలకు నెటిజన్ల సూటి ప్రశ్న..

విజయమ్మ క్షోభకు కారణం మీరే కదా?

'సొంత కొడుకు తల్లిని కోర్టుకి ఈడ్చాడని, ఇలాంటి కొడుకును ఎందుకు కన్నాను. పురిటిలోనే చంపేయాల్సింది అని ఆ తల్లి అనడం లేదని, ఇది చూడటానికా నేను ఇంకా బతికి ఉన్నాను' అని విజయమ్మ ఏడుస్తోందని చెప్పుకొస్తున్నారు షర్మిల. విజయమ్మ ఈ మాటలు అన్నారో లేదో షర్మిలకే తెలియాలి. నిజానికి విజయమ్మను ఇంతటి క్షోభకు గురిచేస్తున్నది షర్మిలేనని స్పష్టంగా అర్థం అవుతోంది. ఆస్తుల కోసం షర్మిల పట్టుబట్టి తల్లిని, కొడుకిని వేరు చేయాలని ప్రయత్నిస్తుండటం విజయమ్మకు కడుపుకోత కాదా? కుమారుడి ప్రతి కష్టంలోనూ, ప్రతి విజయంలోనూ తోడున్న విజయమ్మను కూడా మీ కుట్రలకు వాడుకుంటారా. బహుశా ఇలాంటి కూతురు నాకెందుకు పుట్టిందా అని విజయమ్మ బాధపడుతూ ఉండి ఉంటారు.

మీడియా ముందు ఏడుపు డ్రామాలేంటి?

ఒకసారి చేస్తే సరేగాని ప్రతి సారీ మీడియా ముందుకు వచ్చి దొంగ ఏడుపులు ఏడ్చేయడం షర్మిలకే చెల్లింది. చంద్రబాబును కాపాడాలనుకున్న ప్రతి సారీ ప్రెస్‌మీట్ పెట్టడం..కన్నీళ్లు పెట్టేసుకోవడం ఆమెకు బాగా అలవాటైపోయింది. ప్రజలపై రూ.6 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారం వేస్తే రాని కన్నీరు, వాస్తవాలను ఒప్పుకోలేక వస్తున్నాయంటేనే అర్థం అవుతోంది ఆమెకు ప్రజల మీద ఎంత ప్రేమో..చార్జీల విషయంలో చంద్రబాబు, కూటమి సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత రాకూడదనేగా ఈ ఏడుపు డైవర్షన్లు?

నిజమే..జగన్ లాంటి అన్న ఎవరుంటారు?

ఏ అన్న అయినా...చెల్లికి గిఫ్ట్ అంటే ఏ బంగారమో, చీరనో ఇస్తారని, అంతేకాని ఆస్తుల్లో 40% వాటా ఇస్తారా? నా హక్కు కాబట్టే నాకు ఇస్తామన్నారని షర్మిల అంటున్నారు. నిజమే ఆస్తి కోసం సొంత తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్కచెల్లెళ్లను నిర్ధాక్షిణ్యంగా చంపేస్తున్న రోజులివి. అలాంటి కలికాలంలోనూ చెల్లెలికి తన సొంత ఆస్తి నుంచి, కష్టార్జితం నుంచి వాటా ఇస్తాననే అన్న బహుశా ఒక్క జగన్ తప్ప ఎవరూ ఉండరేమో. అది కూడా ఆమెకు పెళ్లి జరిగిన 20 ఏళ్ల తరువాత, తండ్రి మరణించిన 10 ఏళ్లు అయిపోయాక అంటే నిజంగా చెల్లిలి మీద ఎంత ప్రేముంటే ఇంతటి నిర్ణయం తీసుకుంటారు.? పైగా అడగకుండానే ఎంఓయూ రాసిచ్చారని మీరే అంటున్నారంటే, అంత చిత్తశుద్ధి ఉన్న అన్న ఇంకెవరుంటారు.

మీ లేఖను టీడీపీ విడుదల చేయడమేమిటి?

ఐదేళ్ల ఎంఓయూ చేతిలో ఉన్నా ఏ మీడియాకు విడుదల చేయని షర్మిల అన్నకు రాసిన లేఖను మాత్రం టీడీపీ అధికారికంగా ఎలా విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చీఫ్ లేఖ, ఆమె కాకుండా టీడీపీ అధికారికంగా ఎలా బయటపెడుతుంది.అంటే కాంగ్రెస్, టీడీపీలు ఒక్కటేనని మీరే చెప్పినట్టు కాదా.?

మీరు చేస్తున్నది సొంత లబ్ధి కోసం కాదా?

జగన్ సొంత లబ్ధి కోసం తల్లిని, చెల్లిని కోర్టుకి ఈడ్చారంటున్నారే మరి మీరు చేస్తున్నదేమిటి. మీ లబ్ధి కోసం, మీరు మోస్తున్న చంద్రబాబు లబ్ధి కోసం సొంత అన్న బెయిల్‌ను రద్దు చేయించి జైలుకు పంపాలనుకోవడం లేదా. ఇందుకోసం మీరు మీ తల్లి విజయమ్మను వాడుకోవడం లేదా...దీన్నేమనాలి?.



నన్ను చూచువాడు నన్ను పంపినవానినే చూచుచున్నాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.దశమి ఉ.7.22 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మఖ ప.3.01 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.11.42 నుండి 1.26 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.00 నుండి 4.48 వరకు, **అమృతఘడియలు:** ప.12.23 నుండి 2.06 వరకు.

సూర్యోదయం : 5.59
సూర్యాస్తమయం : 5.29
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

షేక్ హసీనా (పదవీచ్యుత ప్రధాని)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పార్టీని, ప్రజల్ని వదిలి వచ్చి నవంబర్ 5కు మూడు నెలలు అవుతుంది. నవంబరు 5న అమెరికాలో జరిగే అధ్యక్ష ఎన్నికలకు, నేను ఇండియా వచ్చి అప్పటికి మూడు నెలలు కావటానికి సంబంధమేమీ లేదు. కొన్ని ఊరికే జతపడి కనిపిస్తాయంతే!

నవంబర్ 18 లోపు నేను లొంగిపోవాలని 'బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్' అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి మారణకాండల వెనుక ఉన్నది నేనేనని ట్రిబ్యునల్ ఆరోపణ!

విధి విపరీతం కొన్నిసార్లు నవ్వు తెప్పిస్తుంది. పదిహేనేళ్ల క్రితం రెండోసారి ప్రధాని అయినప్పుడు నేను ఏర్పాటు చేసిన ట్రిబ్యునలే అది! బంగ్లా విముక్తి యుద్ధంలో పాక్ సైన్యం పాల్పడిన దురాగతాలపై విచారణకు ఏర్పాటు చేసిన ఆ ట్రిబ్యునల్ చివరికి తన దేశ ప్రధానినే విచారించేందుకు సిద్ధమైంది! భారీ మెజారిటీతో మళ్లీ మళ్లీ గెలుస్తూ వస్తున్న ఒక మహిళా ప్రధానిని దించేందుకు విద్యార్థులను రెచ్చగొట్టి మారణ హోమానికి పాల్పడిన వారిపైన కదా విచారణ జరగవలసింది! వారికి కదా అరెస్ట్ వారెంట్ జారీ చేయవలసింది!



"హసీనాజీ! మీరక్కడ నెమ్మదిగానే ఉన్నారు కదా?!" అని శనివారం రాత్రి ఎవరో నేనున్న ఢిల్లీ లూట్యెన్స్ బంగళాకు ఫోన్ చేసి నన్ను పరామర్శించారు.

"మీరెవరు?" అని అడిగాను.

"ఎక్స్‌టర్నల్ అఫైర్స్" నుంచి అన్నారు!

"ఏ ఎక్స్‌టర్నల్ అఫైర్స్? బంగ్లాదేశ్ ఎక్స్‌టర్నల్ అఫైర్సా? పాకిస్తాన్ ఎక్స్‌టర్నల్ అఫైర్సా? యూ.ఎస్. ఎక్స్‌టర్నల్ అఫైర్సా? అని అడిగాను.

అటువైపు నుంచి చిన్నగా ఒక పెద్ద నవ్వు.

"హసీనాజీ... మీరు ఇండియాలో ఉన్నప్పుడు ఇండియన్ ఎక్స్‌టర్నల్ అఫైర్సే కదా మిమ్మల్ని నేరుగా కాంటాక్ట్ చేయగల అవకాశం ఉంటుంది" అన్నారు వారు.

"కానీ మీరప్పుడు అడగవలసింది... హసీనా జీ 'మీరిక్కడ' నెమ్మదిగానే ఉన్నారా అని కదా! కానీ మీరు... 'మీరక్కడ' నెమ్మదిగానే ఉన్నారా అని అన్నారు! నేను ఢిల్లీలోనే ఉన్నానని తెలిసీ మీరు 'మీరక్కడ' అని అన్నారంటే, మీరు ఢిల్లీ నుంచి కాకుండా ఏ ఢాకా నుంచో, ఇస్లామాబాద్ నుంచో, వాషింగ్టన్ నుంచో నాకు కాల్ చేసి ఉండొచ్చని నేను అనుకునే అవకాశం లేదంటారా?" అన్నాను నవ్వుతూ.

"నిజమే హసీనాజీ! అయితే మీరున్నది ఢిల్లీలోని లూట్యెన్స్‌లో, నేనున్నది ఢిల్లీలోని సెక్రెటేరియేట్ బిల్డింగ్‌లో కనుక 'మీరక్కడ' అని అన్నాను. మీకక్కడ సౌకర్యంగానే ఉందా అని తెలుసుకొమ్మని మోదీజీ సౌత్ బ్లాక్‌కు ఫోన్ చేయించారు. నా పేరు విక్రమ్ మిస్రీ. ఫారిన్ సెక్రెటరీని..." అన్నారాయన.

"ధన్యవాదాలు మిస్రీజీ! నేనిక్కడ పూర్తి సౌకర్యంగా ఉన్నాను. ఇటీవలే లోధీ గార్డెన్‌లో వాకర్స్‌తో కలిసిపోయి నాలుగడుగులు కూడా వేసి వచ్చాను. ఢాకాలో నేను ఉండి వచ్చిన క్వీన్ ఎలిజబెత్ ప్యాలెస్‌కు, ఢిల్లీలో నేనిప్పుడు ఆశ్రయం పొందిన లూట్యెన్స్ బంగళాకు తేడా ఏమీ కనిపించటం లేదు" అన్నాను.

"అయ్యో! ఆశ్రయం అనే మాట అనకండి హసీనాజీ... మీరు మా అతిథి. మీరున్నది అతిథిగృహం..." అన్నారు మిస్రీ!

మరోకసారి ధన్యవాదాలు తెలిపాను.


"సెలవు హసీనాజీ..." అన్నారాయన.

రెండోసారి ప్రధాని కావటానికి ముందు 11 నెలలు కుట్రదారులు నన్ను బంగ్లాదేశ్ పార్లమెంటు ఆవరణలోని సబ్ జైల్లో నిర్బంధించారు. నాలుగోసారి ప్రధాని అయ్యాక మళ్లీ ఇప్పుడు నన్ను జైలుకు పంపే పన్నాగాలు జరుగుతున్నాయి.

ఏమైనా, 18 తర్వాత ఏం జరుగుతుందన్నది 18 లోపు నేను ఏం నిర్ణయం తీసుకుంటాననే దాన్ని బట్టే ఉంటుంది.

కొన్ని పైకి జతపడి లేనట్లుగా కనిపిస్తాయంతే! కానీ వాటి మధ్య సంబంధం లేకుండా ఏమీ ఉండదు.

గురి తప్పిన బాణం వెనుక..!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



గురి తప్పిన బాణాల గురించి కాదు, గురి పెడుతున్న వేటగాడి గురించి మాట్లాడుకోవాలి. ఆ వేటగాడు అల్లుతున్న ఉచ్చుల గురించి ఆలోచించాలి. ఓట్ల కోసం నూకలు చల్లి ఆపై వల వేసి బంధించే అతడి మాయోపాయాలపై మేధోమథనం జరగాలి. హిరణ్యాక్షుడు పొందిన వరాల చందంగా వార్తా ప్రసార మాధ్యమాస్త్రాలను తన అమ్ములపొదిలో దాచిపెట్టుకున్న అతని వ్యూహ రహస్యాల గురించి మాట్లాడుకోవాలి. ఒక్కో బాణాన్ని మంత్రించి వదిలి పాఠకుల మస్తిష్కాలను స్వాధీనపరచుకోవాలని చూసే అతని తంత్రాంగం గురించి జనాన్ని అప్రమత్తం చేయాలి.

రామాయణంలో కనిపించే కిష్కింధ రాజైన వాలికి ఒక విచిత్ర లక్షణం ఉన్నది. తన ఎదుటికి ఎంతటి బలవంతుడు వచ్చినా, అతని బలాన్ని తనలోకి లాగేసుకొనే శక్తి అతని సొంతం. వాలి మాదిరి బలశాలి కాదు మన అనుభవశాలి. కానీ అటువంటి లక్షణం ఒకటి ఈయనకూ ఉన్నది. తన రాజకీయ ప్రత్యర్థి ఏ విషయాల్లో బలవంతుడో గ్రహించి ఆ విషయాల్లోనే అతడు బలహీనుడని గోబెల్స్ ప్రచారం నిర్వహించడంలో మన కురువృద్ధుడు నిష్ణాతుడు. సత్య వాక్పాలన రాముడి బలం అనుకుంటే, ఆ రాముడు అబద్ధాలాడతాడని ప్రచారం చేయడం, జనాన్ని నమ్మించడమే ఈయనకున్న నైపుణ్యం.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి బలం ఆయన వ్యక్తిత్వం. మాట తప్పకపోవడం, మడమ తిప్పకపోవడం ఆ వ్యక్తిత్వ లక్షణాలు. రాజకీయ అడుగులు వేయడం మొదలు పెట్టిన తొలి రోజుల్లోనే ఇది నిరూపితమైంది. పదిహేనేళ్ల కింద ఆయన తండ్రి చనిపోయినప్పుడు ఆ షాక్ తట్టుకోలేక గుండె పగిలి చనిపోయినవారూ, ఆత్మహత్యలు చేసుకున్నవారూ వందల సంఖ్యలో ఉన్నారు. ఈ పరిణామం వల్ల ఉద్వేగానికి గురైన జగన్ ఆ అమరులందరినీ తన ఆత్మబంధువులుగా ప్రకటించారు. వారందరి ఇళ్లకు వెళ్లి దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తానన్న సంకల్పాన్ని ప్రకటించారు.

ఈ సంకల్పానికి కాంగ్రెస్ అధిష్ఠానం అడ్డుతగిలిన సంగతి తెలుగు పాఠకులకు తెలిసిన విషయమే. తమ మాట వింటే భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేస్తామని, వినకపోతే కేసులు పెట్టి జైల్లో వేస్తామని రాయబారాలు నడిపినట్టు అనంతర కాలంలో కాంగ్రెస్ నేతలే బహిరంగంగా వెల్లడించారు. ఆ రోజుల్లో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వంలో సోనియా గాంధీ మకుటం లేని మహారాణి. 'ఫోర్బ్స్' మేగజైన్ 2010లో ప్రకటించిన ప్రపంచంలోని శక్తిమంతుల జాబితా టాప్ టెన్‌లో ఆమె పేరు ఉన్నది. 2008లో 'టైమ్' మేగజైన్ ప్రకటించిన ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో కూడా ఆమె పేరున్నది. అటువంటి రోజుల్లో ఆమె మాటను ధిక్కరించే సాహసం ఎవరు చేస్తారు? కానీ జగన్ చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం!

ఈ బలమైన వ్యక్తిత్వాన్ని ఉమ్మడి రాష్ట్ర ప్రజలతో పాటు చంద్రబాబు, ఆయన పార్టీ, యెల్లో మీడియా యజమానులు కూడా గుర్తించారు. అందువల్లనే ఆయన వ్యక్తిత్వం మీద దాడిని కేంద్రీకరించారు. యెల్లో సిండికేట్‌కు కాంగ్రెస్ పార్టీ ప్రధాన శత్రువు. జగన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీని పెట్టుకున్నారు. అప్పుడు తన ఆగర్భశత్రువైన కాంగ్రెస్‌తో జతకట్టి జగన్ వ్యక్తిత్వ హననంలో, జైలు పాలు చేయడంలో బాబు కూటమి ప్రధాన బాధ్యత తీసుకున్నది. ఎందువలన? జగన్ బలమైన వ్యక్తిత్వమే భవిష్యత్తులో తమకు ప్రత్యర్థి కాగలదన్న అంచనాతోనే!

ఆ వ్యక్తిత్వం పలుమార్లు నిరూపణైంది. 2014 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో చేరిన చంద్రబాబు అసాధ్యమైన హామీలను ఇచ్చారు. అప్పుడు రైతులకు రుణమాఫీ ఒక్కటి ప్రకటించాలని శ్రేయోభిలాషులు జగన్‌కు సలహా ఇచ్చారు. అమలు చేయలేని హామీని ఇవ్వడం కన్నా ప్రతిపక్షంలో కూర్చోవడానికే జగన్ సిద్ధపడ్డారు. అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టోని మడత పెట్టేయడం ఈ రోజుల్లో రివాజుగా మారింది. ఇటువంటి వాతావరణంలో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఆనవాయితీని మార్చారు. ఎన్నికల మేనిఫెస్టోకు పటం కట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టించారు. ఆ మేనిఫెస్టో అమలుపై ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రోగ్రెస్ రిపోర్టును విడుదల చేస్తూ వచ్చారు.

అమలు చేసిన హామీల గురించి చెప్పడం కాదు, మళ్లీ గెలిస్తే అరచేతిలో వైకుంఠం పెడతాననే హామీలే ముఖ్యమని మళ్లీ సలహాలొచ్చాయి. జగన్ వాటికి చెవి ఒగ్గలేదు. కానీ చంద్రబాబు అటే మొగ్గారు. జనం ముందు బయోస్కోప్ పెట్టెను తెరిచి 'కాశీ పట్నం చూడరబాబు చూడరబాబు' అంటూ బొందితో కైలాసాన్ని హామీ ఇచ్చారు. దాంతోపాటు కూటమి సమీకృత కారణాలు, 'సాంకేతిక' కారణాలు అనేకం పనిచేసి బాబు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు హామీలు అమలుచేయాలి. అది సాధ్యమయ్యే పని కాదు. ఒక పక్క జగన్ ప్రభుత్వం హామీలను అమలు చేసిన తీరు జనం మదిలో తాజా జ్ఞాపకంగానే ఉన్నది. ఈ జ్ఞాపకాన్ని మరిపించడం కూటమి పెద్దల తక్షణ కర్తవ్యం. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వారు నెలకో రకంగా ప్రయోగిస్తున్న డైవర్షన్ రాకెట్లు ఈ తక్షణ కర్తవ్యంలో భాగమే!

ఆస్తి కోసం తల్లీ, చెల్లి మీద జగన్ కోర్టుకు వెళ్లారనే

ఆస్తి కోసం తల్లీ, చెల్లి మీద జగన్ కోర్టుకు వెళ్లారనే ప్రచారాన్ని గత రెండు మూడు రోజులుగా బాబు క్యాంప్ విస్తృతంగా చేపట్టింది. ఔను ఆయన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)కు వెళ్లారు. ఎందుకు వెళ్లారు? ఎవరి కారణంగా అలా వెళ్లక తప్పని అగత్యం ఏర్పడింది? ఈ అంశాల జోలికి మాత్రం యెల్లో మీడియా సహజంగానే వెళ్లదు. జగన్ వ్యక్తిత్వ హననం ఒక్కటే దాని ఎజెండా. ఆ ఎజెండా పరిమితులకు లోబడే దాని ప్రాపగాండా కార్యక్రమం ఆధారపడి ఉంటుంది. జగన్, షర్మిలల చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి ఈ వివాదానికి సంబంధించిన అంశాలపై మీడియాతో మాట్లాడారు. ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో అన్నాచెల్లెళ్ల మధ్యన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. జగన్ తన సొంత ఆస్తిలోంచి కొంత భాగాన్ని చెల్లెలికి ఇచ్చేలా ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇవన్నీ బయటకు వచ్చాయి. జగన్ ఎన్సీఎల్టీకి వెళ్లిన డాక్యుమెంట్ టీడీపీ అధికార ట్విట్టర్ హ్యాండిల్‌పై ప్రత్యక్షమైంది. షర్మిల రాసిన బహిరంగ లేఖ విడుదలైంది. ఆమె మీడియాతో కూడా మాట్లాడారు.
ఈ మొత్తం డాక్యుమెంట్లు, లేఖలు మీడియా సమావేశాల్లో లేవనెత్తిన అంశాలు విస్తృతంగా రెండు రాష్ట్రాల్లోనూ జనంలోకి వెళ్లాయి. ఈ అంశాలపై పెద్ద ఎత్తున చర్చోపచర్చలు కూడా జరుగుతున్నాయి. ఈ పంచాయతీని పబ్లిక్‌లోకి తీసుకొచ్చిన సూత్రధారులు, పాత్రధారుల ఉద్దేశం వేరు. జగన్ వ్యక్తిగత ప్రతిష్ఠపై బురద జల్లడం, ఆయన న్యాయపోరాటాన్ని బలహీన పరచడం, వీలైతే ఆయన బెయిల్‌ను రద్దు చేయించి మళ్లీ జైలుకు పంపించడం! ఈ పరిణామాన్ని నిశితంగా గమనించిన వారికి కుట్రదారుల ఉద్దేశం సులభంగానే అర్థమవుతుంది.

ప్రచారాన్ని గత రెండు మూడు రోజులుగా బాబు క్యాంప్ విస్తృతంగా చేపట్టింది. ఔను ఆయన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)కు వెళ్లారు. ఎందుకు వెళ్లారు? ఎవరి కారణంగా అలా వెళ్లక తప్పని అగత్యం ఏర్పడింది? ఈ అంశాల జోలికి మాత్రం యెల్లో మీడియా సహజంగానే వెళ్లదు. జగన్ వ్యక్తిత్వ హననం ఒక్కటే దాని ఎజెండా. ఆ ఎజెండా పరిమితులకు లోబడే దాని ప్రాపగాండా కార్యక్రమం ఆధారపడి ఉంటుంది. జగన్, షర్మిలల చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి ఈ వివాదానికి సంబంధించిన అంశాలపై మీడియాతో మాట్లాడారు. ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో అన్నాచెల్లెళ్ల మధ్యన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. జగన్ తన సొంత ఆస్తిలోంచి కొంత భాగాన్ని చెల్లెలికి ఇచ్చేలా ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇవన్నీ బయటకు వచ్చాయి. జగన్ ఎన్సీఎల్టీకి వెళ్లిన డాక్యుమెంట్ టీడీపీ అధికార ట్విట్టర్ హ్యాండిల్‌పై ప్రత్యక్షమైంది. షర్మిల రాసిన బహిరంగ లేఖ విడుదలైంది. ఆమె మీడియాతో కూడా మాట్లాడారు.

ఈ మొత్తం డాక్యుమెంట్లు, లేఖలు మీడియా సమావేశాల్లో లేవనెత్తిన అంశాలు విస్తృతంగా రెండు రాష్ట్రాల్లోనూ జనంలోకి వెళ్లాయి. ఈ అంశాలపై పెద్ద ఎత్తున చర్చోపచర్చలు కూడా జరుగుతున్నాయి. ఈ పంచాయతీని పబ్లిక్‌లోకి తీసుకొచ్చిన సూత్రధారులు, పాత్రధారుల ఉద్దేశం వేరు. జగన్ వ్యక్తిగత ప్రతిష్ఠపై బురద జల్లడం, ఆయన న్యాయ పోరాటాన్ని బలహీన పరచడం, వీలైతే ఆయన బెయిల్‌ను రద్దు చేయించి మళ్లీ జైలుకు పంపించడం! ఈ పరిణామాన్ని నిశితంగా గమనించిన వారికి కుట్రదారుల ఉద్దేశం సులభంగానే అర్థమవుతుంది. జగన్ మోహన్‌రెడ్డి క్రియాశీలకంగా రాజకీయాల్లో లేకపోతే లాభం పొందేదెవరు? ఆ లాభంలో ఎంతోకొంత తమ పార్టీకి కూడా దక్కకపోతుందా అని ఒంటె పెదవులకు నక్క ఆశలు పెట్టుకున్నట్టు పొంచి ఉన్నది ఎవరు?

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టకముందే, ఆ మాటకొస్తే ఆయన ప్రతిపక్ష నాయకుడి పాత్రను కూడా చేపట్టడానికి ముందే జగన్ మోహన్‌రెడ్డి విజయవంతమైన వ్యాపారవేత్త. ఆయన సండూర్ పవర్‌ను 1998లోనే ప్రారంభించారు. విజయవంతమైన వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ వెళ్లడం సహజం. వారి ట్రాక్ రికార్డును బట్టి పెట్టుబడులు రావడం కూడా సహజమే. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. డాక్టర్ వైఎస్సార్ ప్రతిపక్ష నేతగా ఉన్న కాలంలో గానీ, ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గానీ జగన్ మోహన్‌రెడ్డి బెంగళూరు కేంద్రంగానే వ్యాపారాలు చేసుకున్నారు తప్ప హైదరాబాద్‌లో లేరు. తండ్రి చనిపోయిన తర్వాత ఆయన రాజకీయాల్లో క్రియాశీల పాత్రను పోషించవలసిన అనివార్యత ఏర్పడినప్పుడే ఆయన మకాం హైదరాబాద్‌కు మారింది.

జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్ సంస్థల్లో ఇతరులు పెట్టుబడులు పెట్టడం వెనుక క్విడ్ ప్రోకో దాగున్నదనే ఆరోపణలు తెచ్చి కాంగ్రెస్–టీడీపీ కుమ్మక్కయి ఆయనపై అక్రమ కేసులు పెట్టి పదహారు నెలలు జైలుకు పంపాయి. ఆ సంస్థలు గడిచిన పదహారు పదిహేడేళ్లుగా విజయవంతంగా నడుస్తూ మదుపరులకు లాభాలు తెచ్చిపెట్టడం క్విడ్ ప్రోకో ఆరోపణల్లోని బూటకత్వాన్ని ఎండగట్టింది. మార్కెట్‌ను విస్తృతంగా అధ్యయనం చేసి సొంత ప్రాజెక్టుతో, సొంత పెట్టుబడులతో పాటు ఇతర ఇన్వెస్టర్లకు తన ప్రాజెక్టుపై నమ్మకం కలిగించి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జగన్ తన వ్యాపారాలను విస్తరించుకున్నారు. ఈ ప్రయాణంలో రాజకీయంగా మాట కోసం నిలబడవలసివచ్చిన కారణంగా ఆయన దారుణమైన వ్యక్తిత్వ హననానికి గురి కావలసి వచ్చింది. ఊహించని నిందలు మోయవలసి వచ్చింది. వ్యక్తిత్వ హననం అనేది హత్యతో సమానమంటారు. ఆ రకంగా చూస్తే కొన్ని వందల సార్లు ఆయన హత్యకు గురి కావలసి వచ్చింది.

ఇప్పుడు తల్లీ, చెల్లిపై కోర్టుకెక్కారనే నిందను మోపారు. ఈ వివాదానికి సంబంధించిన వివరాలు బయటకు వచ్చిన తర్వాత జగన్ మోహన్‌రెడ్డి వ్యక్తిగత ఔన్నత్యం ప్రజలకు తేటతెల్లమైంది. కుట్రదారుల పని కుడితిలో పడ్డట్టయింది. వారసత్వంగా సంక్రమించిన ఆస్తులతో పాటు తాను సంపాదించిన ఆస్తులను కూడా జగన్, షర్మిల మధ్య డాక్టర్ వైఎస్సార్ పంపకం చేశారు. భారతి సిమెంట్స్ గానీ, జగతి పబ్లికేషన్స్ గానీ జగన్ మోహన్‌రెడ్డి స్వార్జితం కనుక పంపకాల్లో అవి రాలేదు. పైగా ఈ రెండు కంపెనీల్లోనూ జగన్, ఆయన సతీమణి భారతిలకు తప్ప షర్మిలకు వాటా కూడా లేదు. సిమెంట్ పరిశ్రమకు తన భార్య పేరునూ, పబ్లికేషన్స్‌కు భార్యాభర్తలిద్దరి పేర్లూ కలిసేలా 'జగతి' అనే పేరును జగన్ పెట్టుకున్నారు. అప్పుడు డాక్టర్ వైఎస్సార్ జీవించే ఉన్నారు. ఒక సందర్భంలో 'ఈనాడు' రాసిన అవాకులు చెవాకులకు జవాబునిస్తూ తన భార్య మీద ప్రేమతో తన సిమెంట్ పరిశ్రమకు ఆమె పేరును పెట్టుకున్నానని కూడా జగన్ రాశారు. అప్పుడు వైఎస్సార్ జీవించే ఉన్నారు. ఈ కంపెనీలు వారి కుటుంబ వారసత్వ సంపద కాదనీ, జగన్ స్వార్జితాలే అని చెప్పడానికి ఇటువంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి.

తండ్రి చనిపోయిన తర్వాత చాలాకాలం పాటు అన్న తనను బాగానే చూసుకున్నారని షర్మిల కూడా తన బహిరంగ లేఖలో అంగీకరించారు. షర్మిల తనకు చెల్లెలు మాత్రమే కాదు, పెద్ద కూతురు వంటిదని జగన్ ఒక సందర్భంలో ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే తండ్రి మనసుతో ఆలోచించి తన స్వార్జితమైన ఆస్తుల్లో వాటాలు చెల్లెలికి ఇవ్వాలని సంకల్పించారు. అందుకోసం ఒక అవగాహనా పత్రాన్ని (ఎమ్ఓయు) కూడా రాసిచ్చారు. ఇదెప్పుడు జరిగింది... తండ్రి చనిపోయిన పది సంవత్సరాల తర్వాత, షర్మిలకు వివాహం జరిగిన 20 సంవత్సరాల తర్వాత! ఇంతకాలం తర్వాత సొంత ఆస్తిలో చెల్లెలికి భాగం కల్పించిన అన్నలెందరుంటారు? ఈ మధ్య

తండ్రి చనిపోయిన తర్వాత చాలాకాలం పాటు అన్న తనను బాగానే చూసుకున్నారని షర్మిల కూడా తన బహిరంగ లేఖలో అంగీకరించారు. షర్మిల తనకు చెల్లెలు మాత్రమే కాదు, పెద్ద కూతురు వంటిదని జగన్ ఒక సందర్భంలో ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే తండ్రి మనసుతో ఆలోచించి తన స్వార్జితమైన ఆస్తుల్లో వాటాలు చెల్లెలికి ఇవ్వాలని సంకల్పించారు. అందుకోసం ఒక అవగాహనా పత్రాన్ని (ఎమ్ఓయు) కూడా రాసిచ్చారు. ఇదెప్పుడు జరిగింది... తండ్రి చనిపోయిన పది సంవత్సరాల తర్వాత, షర్మిలకు వివాహం జరిగిన 20 సంవత్సరాల తర్వాత! ఇంతకాలం తర్వాత సొంత ఆస్తిలో చెల్లెలికి భాగం కల్పించిన అన్నలెందరుంటారు? ఈ మధ్య కాలంలో 200 కోట్ల సొంత ఆదాయాన్ని కూడా సోదరికి జగన్ అందజేశారు. ఈ వివరాలన్నీ బయటకు వచ్చిన తర్వాత జనం దృష్టిలో జగన్ ఔన్నత్యం మరింత పెరిగింది.
క్విడ్‌ప్రోకో కేసుల కారణంగా ఆస్తులు ఈడీ జప్తులో ఉన్నందువల్ల ఎమ్ఓయూ (అన్‌రిజిస్టర్డ్)ను రాసుకోవలసి వచ్చింది. లేకపోతే ఈ పంపకాల కార్యక్రమం ఇప్పటికే పూర్తయి ఉండేది. కేసుల వ్యవహారం పూర్తిగా పరిష్కారమయిన పిదప ఆస్తుల బదలాయింపు జరిగేలా ఎమ్ఓయూ రాసుకున్నారు. ఈ పత్రంలోని ప్రతి పేజీ మీద జగన్‌తో పాటు షర్మిల కూడా సంతకం చేశారు. పత్రం మొదటి పేజీలోని రెండో అంశంలోనే పంపకానికి ప్రతిపాదిస్తున్న ఆస్తుల సొంతదారు జగన్ మోహన్‌రెడ్డి అనే మాట స్పష్టంగా ఉన్నది. ఈ వాక్యం కింద షర్మిల సంతకం కూడా ఉన్నది.

కాలంలో 200 కోట్ల సొంత ఆదాయాన్ని కూడా సోదరికి జగన్ అందజేశారు. ఈ వివరాలన్నీ బయటకు వచ్చిన తర్వాత జనం దృష్టిలో జగన్ ఔన్నత్యం మరింత పెరిగింది.

క్విడ్ ప్రోకో కేసుల కారణంగా ఆస్తులు ఈడీ జప్తులో ఉన్నందువల్ల ఎమ్ఓయూ (అన్‌రిజిస్టర్డ్)ను రాసుకోవలసి వచ్చింది. లేకపోతే ఈ పంపకాల కార్యక్రమం ఇప్పటికే పూర్తయి ఉండేది. కేసుల వ్యవహారం పూర్తిగా పరిష్కారమయిన పిదప ఆస్తుల బదలాయింపు జరిగేలా ఎమ్ఓయూ రాసుకున్నారు. ఈ పత్రంలోని ప్రతి పేజీ మీద జగన్‌తో పాటు షర్మిల కూడా సంతకం చేశారు. పత్రం మొదటి పేజీలోని రెండో అంశంలోనే పంపకానికి ప్రతిపాదిస్తున్న ఆస్తుల సొంతదారు జగన్ మోహన్‌రెడ్డి (the subject properties / owned directly and indirectly through companies by YS Jagan) అనే మాట స్పష్టంగా ఉన్నది. ఈ వాక్యం కింద షర్మిల సంతకం కూడా ఉన్నది.

రెండో పేజీలో ఇంకో కీలక అంశమున్నది. తన చెల్లెలి మీద వైఎస్ జగన్‌కున్న ప్రేమాభిమానాల కారణంగా (In consideration of his love and affection for his sister, YSJ here by agrees....) ప్రతిపాదిత ఆస్తులను బదిలీ చేస్తున్నట్టున్నది. అంతేతప్ప హక్కుగా ఆమెకు బదిలీ చేస్తున్నట్టు లేదు. ఈ పేజీ మీద కూడా షర్మిల సంతకం ఉన్నది. ఈ ఒప్పందం రాసుకున్నది 2019లో. అప్పుడు ఈ ప్రతిపాదిత ఆస్తులు అన్న సొంత ఆస్తులని అంగీకరించి సంతకం కూడా చేశారు కదా!

భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్‌లో వాటాలతో పాటు సరస్వతి పవర్ పూర్తిగా షర్మిలకే బదిలీ అయ్యేటట్లుగా రాసుకుని తాత్కాలికంగా తల్లిగారి పేరు మీద గిఫ్ట్ డీడ్ చేసి కేసుల పరిష్కారం తర్వాత అది షర్మిలకు బదిలీ అయ్యేలా ఏర్పాటు చేశారు. కానీ ఆ గిఫ్ట్ డీడ్‌ను తల్లి పేరు మీద షేర్లుగా షర్మిల మార్పించారు. ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు జగన్ దగ్గర ఉన్నాయని తెలిసీ అవి ఎక్కడో పోయాయని చెప్పి, బదిలీ పత్రాలపై జగన్ సంతకం చేయకుండానే షేర్లు మార్పించారు. ఈడీ జప్తులో ఉన్న ఆస్తుల బదిలీ వల్ల కేసుల్లో న్యాయపరమైన చిక్కులను జగన్ ఎదుర్కోవలసి వస్తుందని తెలిసీ షర్మిల ఈ చర్యకు పాల్పడ్డారు. దాంతో ఈ చట్టవిరుద్ధమైన వ్యవహారాన్ని ఆపాలని జగన్ ఆమెకు లేఖ రాశారు. ఆమె ససేమిరా అనడంతో న్యాయ నిపుణుల సలహా మేరకు ఆయన ఎన్సీఎల్టీ తలుపు తట్టి ఈ బదిలీని ఆపేయాలని కోరవలసి వచ్చింది. ఇదే తల్లినీ, చెల్లినీ జగన్ కోర్టుకీడ్చారని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంలోని అసలు గుట్టు. ఈ రకమైన ప్రచారంతో తన పాలనా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవాలనీ, జగన్ ప్రతిష్ఠను దెబ్బ తీయాలనీ యెల్లో సిండికేట్ తాపత్రయపడుతున్నది. ఈ దుష్ట పన్నాగానికి షర్మిల పూర్తి స్థాయిలో సహకరిస్తున్నదని శనివారం నాటి ఆమె మీడియా సమావేశం బట్టబయలు చేసింది. జగన్ మోహన్‌రెడ్డి బెయిల్ రద్దవుతుంది కాబట్టి అమ్మను కోర్టు కీడుస్తారా అని ప్రశ్నించడం ఆశ్చర్యపరిచింది. జగన్ ముందుగానే ఎన్సీఎల్టీకి లేఖ రాయడంతో బెయిల్ రద్దయ్యే అవకాశం పోయిందని ఆమె ఆశాభంగం చెందారా అనే అనుమానం వైసీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది. చంద్రబాబుతో ఆమె పూర్తిస్థాయిలో కుమ్మక్కు అయ్యారనేందుకు ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలని వారు ప్రశ్నిస్తున్నారు.

vardhelli1959@gmail.com

ఆదివాసీ కళకు ఆయువు పోసినవాడు!

ఆదివాసీ 'గుస్సాడి' నృత్యాన్ని అంతర్జాతీయ సమాజానికి పరిచయం చేసిన కనకరాజు 'అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం' (అక్టోబర్ 25) నాడు తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహించి మొత్తం తెలంగాణ ఆదివాసీలకు గర్వకారణమైన ఆయన సేవలను ఒకసారి మననం చేసుకోవడం మన విధి. కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన కనకరాజు 1941లో జన్మించారు. చిన్నతనం నుంచే ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు అంటే మక్కువ. ఆ క్రమంలోనే గుస్సాడి నృత్యకళపై అభిరుచిని పెంచుకున్నారు. పశువులను మేపడానికి అడవిలోకి పోయిన సందర్భంలో భుజం మీద కట్టెపుల్లను పెట్టుకొని టిక్కుటిక్కుమని శబ్దం చేసుకుంటూ తనే స్వతహాగా గుస్సాడి సాధన చేసేవారు.



నిరక్షరాస్యుడైన కనకరాజు బతుకుదెరువు కోసం మార్లవాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో దినసరి కూలీగా పనిచేస్తూనే... ఊరూరా తిరుగుతూ గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించారు. అంతరించిపోతున్న కళను బతికించారు. ఏటా దీపావళికి వారం రోజుల ముందు నుండే గోండు ప్రాంతాలలో దండారి పండుగ మొదలవుతుంది. ఈ పండుగ వారికి చాలా పవిత్రం. గ్రామదేవతల శుభప్రద ఆశీస్సులను ఇతర గ్రామస్థులకు అందించే ధన్యజీవులు గుస్సాడీలు. వారు పోలికేక పెట్టి నాట్యం ఆపిన అనంతరమే వచ్చినవారికి ఆహ్వానాలు, పలకరింపులు మొదలవుతాయి. గుస్సాడీల చేతులలోని రోకళ్లను శంభు మహాదేవుని త్రిశూలంగా భావించి అభిషేకం చేస్తారు. గుస్సాడీలను శివుని ప్రతిరూపాలుగా భావించి వారి వస్తువులు, సంగీత పరిక రాలను (ఎత్మసూర్ పెన్) పూజిస్తారు. అందరూ కలసి గుస్సాడి నృత్యం చేస్తారు. తరువాత అతిథులకు భోజనం వడ్డిస్తారు. దండారీలో గుస్సాడీలు, పోరిక్‌లు ప్రముఖ పాత్ర వహిస్తారు. నెత్తి మీద నెమలి ఈకలు, పెద్ద టోపీలతో ముఖానికి, ఒంటికి రంగులతో మెడ నిండా పూసల దండలు, కాళ్లకు గజ్జెలు, చేతిలో గంగారాం సోటీతో గంతులు వేసుకుంటూ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ కళ అంతరించి పోకూడదనే ఉద్దేశంతో అప్పటి ఐఏఎస్ అధికారి మడావి తుకారాం ప్రత్యేక చొరవ తీసుకుని కనకరాజును ప్రోత్సహించారు.

దీంతో కనకరాజు శిక్షకుడిగా మారి 150 మందికి ఐదు రకాల దరువులతో కూడిన డప్పు సహాయంతో శిక్షణ ఇచ్చారు. 1976 నుండి వరుసగా ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలలో ప్రదర్శనలు ఇప్పించారు.

1981లో ప్రధాని ఇందిరాగాంధీ ముందు గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించారు. 2014లో ఎర్రకోటలో రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ముందు ప్రదర్శించారు. కొన్ని సినిమాలలో కూడా ఈ కళను ప్రదర్శించారు. కనకరాజు గుస్సాడి నృత్యానికి చేసిన సేవలకు గుర్తింపుగా 2021లో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన 'పద్మశ్రీ'ని ఇచ్చి గౌరవించింది. ఎనిమిది పదుల వయసు దాటినా, గుస్సాడిని బతికించడానికి మరో 30 మందికి శిక్షణనిచ్చారు. గుస్సాడి కళను వెలుగులోకి తెచ్చిన సామాన్యుడైన కనకరాజు ఈనాటి కళాభిమానులకు ఆదర్శప్రాయుడు. కనకరాజుకు నివాళిగా ఆయన శిష్యులు మరింతగా ఈ కళను ప్రపంచవ్యాప్తం చేస్తారని ఆశిద్దాం.

– గుమ్మడి లక్ష్మీనారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి,
తెలంగాణ | 94913 18409

7 పేజీలు.. 54 ప్రశ్నలు

- రాష్ట్రంలో కులగణనకు ఫార్మాట్ తయారుచేసిన ప్రణాళిక శాఖ
- ఆధార్ నంబర్లు సహా కుటుంబ సభ్యుల అందరి వివరాలు నమోదు
- వ్యక్తిగత వివరాలు, చదువు, వృత్తి, ఆస్తులు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు వంటి వివరాల సేకరణ
- ధరణి సమాచారం కూడా.. ఇందుకోసం ప్రత్యేక పేజీ
- రాజకీయ నేపథ్య వివరాలు కూడా నమోదు!
- ప్రతి ప్రశ్నకు అనుబంధంగా మరికొన్ని ప్రశ్నలు సూచించిన ప్రణాళిక శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన కోసం ప్రణాళిక శాఖ ప్రత్యేక ఫార్మాట్ తయారు చేసింది. మొత్తం 7 పేజీలలో 54 ప్రశ్నలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించేలా దీనిని రూపొందించింది. వ్యక్తిగత వివరాలే కాకుండా ఆస్తులు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు వంటి ఇతర వివరాలను కూడా సేకరించే విధంగా సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రతి జిల్లా, మండలం, గ్రామం, మున్సిపాలిటీ, వార్డు నంబరు, ఇంటి నంబర్లకు ప్రత్యేక కోడ్ ఇవ్వడం ద్వారా.. ఈ సమాచారాన్ని నమోదు చేసేలా ప్రణాళిక శాఖ ఏర్పాట్లు చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు కులగణన ఫార్మాట్‌లో ఉన్న ప్రశ్నలివే..

పార్ట్ –1
క్రమసంఖ్య, కుటుంబ యజమాని–సభ్యుల పేర్లు, యజమానితో సంబంధం, జెండర్, మతం, కులం/సామాజిక వర్గం, ఉప కులం, ఉప కులం యొక్క ఇతర పేర్లు, వయసు, మాతృభాష, ఆధార్ నంబర్.

పార్ట్ –2: ఎలక్షన్ కమిషన్ గుర్తింపు కార్డు, దివ్యాంగులైతే వైకల్య రకం, వైవాహిక స్థితి, వివాహ కాలం నాటికి వయసు, ఆరేళ్ల వయసులోపు పాఠశాలలో చేరారా లేదా?, పాఠశాల రకం, విద్యార్హతలు, 6–16 ఏళ్ల మధ్య వయసువారు బడి మానేస్తే ఆ సమయానికి చదువుతున్న తరగతి, వయసు, బడి మానేయటానికి గల కారణాలు, 17–40 ఏళ్లలోపు వారు విద్యను కొనసాగించకపోవడానికి గల కారణాలు, నిరక్షరాస్యులైతే చదువుకోకపోవడానికి గల కారణాలు.

పార్ట్–3
ప్రస్తుతం ఏదైనా పనిచేస్తున్నారా?, చేస్తుంటే ఆ వృత్తి, స్వయం ఉపాధి అయితే సంబంధిత వివరాలు, రోజువారీ వేతన జీవులైతే ఏ రంగంలో పనిచేస్తున్నారు?, కులవృత్తి, ప్రస్తుతం కులవృత్తిలో కొనసాగుతున్నారా లేదా?, కులవృత్తి కారణంగా ఏమైనా వ్యాధులు సంక్రమించాయా?, వార్షికాదాయం, ఆదాయ పన్ను చెల్లింపుదారులా?, బ్యాంకు ఖాతా ఉందా లేదా?

పార్ట్–4
రిజర్వేషన్ల వల్ల పొందిన విద్య ప్రయోజనాలు, ఉద్యోగ ప్రయోజనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారైతే కుల ధ్రువీకరణ పత్రం పొందారా?, సంచార లేదా పాక్షిక సంచార తెగకు చెందిన వారా?, రాజకీయ నేపథ్యం ఏమిటి?, ప్రజాప్రతినిధిగా ఉంటే ప్రస్తుత పదవి ఏమిటి?, ఎన్ని సార్లు ప్రజాప్రతినిధిగా ఉన్నారు?, మొత్తం ఎన్ని సంవత్సరాలు ఉన్నారు?, నామినేటెడ్/ కార్పొరేషన్/ ప్రభుత్వ సంస్థలు వేటిలోనైనా సభ్యులా?



పార్ట్–5
ధరణి పాస్‌బుక్ ఉందా, లేదా?, ఉంటే పాస్‌బుక్ నంబర్, భూమిరకం, విస్తీర్ణం, వారసత్వమా?, కొన్నదా?, బహుమానమా?, అసైన్డ్ భూమా?, అటవీ హక్కుల ద్వారా పొందినదా?, ప్రధాన నీటి వనరు, పండే పంటలు, ఏమైనా రుణాలు తీసుకున్నారా?, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు?, ఎక్కడి నుంచి తీసుకున్నారు?, వ్యవసాయ అనుబంధంగా ఏదైనా పనిచేస్తారా?, కుటుంబానికి చెందిన పశుసంపద (ఆవులు, ఎడ్లు, గేదెలు, మేకలు, కోళ్లు, బాతులు, పందులు, ఇతరాలు) వివరాలు.

పార్ట్–6
కుటుంబ స్థిరాస్తుల వివరాలు, ఆస్తుల సంఖ్య, చరాస్తుల వివరాలు, ఆస్తుల సంఖ్య, ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలు, నివాస గృహం రకం, స్వభావం, మరుగుదొడ్డి ఉందా/లేదా?, ఉంటే వాడుతున్నారా? వంట కోసం ఉపయోగించే ప్రధాన ఇంధనం, ఇంటికి విద్యుత్ సదుపాయం ఉందా?

(ఈ ప్రశ్నలకు ఇచ్చిన సమాచారం వాస్తవమేనని ప్రకటిస్తున్నానంటూ కుటుంబ యజమాని సంతకం చేయాల్సి ఉంటుంది. తర్వాత ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్ కూడా సంతకాలు చేసి, తేదీని నమోదు చేస్తారు)

క్లుప్తంగా...

ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

- మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లు ఆరంభమైనందున.. అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైనన్ని టార్పాలిన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు, సన్నబియ్యం నిర్ధారించే పరికరాలు ప్రతి కొనుగోలు కేంద్రానికి చేరాయో, లేదో చూసుకోవాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం తెలంగాణ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంట కొనుగోళ్లు పూర్తి కాగానే, ఎక్కడ ఏ మార్కెట్లలో ఎక్కువ ధర ఉందో విచారించి, డిస్పోజ్ చేసేవిధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పెసర కొనుగోళ్లు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఇప్పటికే రూ.8.03 కోట్ల విలువైన 924.85 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ మొదటి విడత కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల చివరి విడత, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌కు టీజీసీపీజీఈటీ–2024 అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 28 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు అర్హత గల విద్యార్థులు పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్‌లో తప్పిదాలను నవంబర్ 1న సరిచేసుకోవాలి, నవంబర్ 1 నుంచి 4 వరకు వెబ్‌ఆప్షన్స్ ఇవ్వాలి. సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను 8న విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని ఆయా కాలేజీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు నవంబర్ 12న రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

ఫిబ్రవరి 12 నుంచి మినీ మేడారం జాతర

- తేదీలు ఖరారు చేసిన పూజారులు



మినీ జాతర తేదీల ఖరారు లేఖను చూపిస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర 2025 ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వనదేవతల పూజారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం మేడారంలో విలేకరుల సమావేశంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడుతూ... ఖరారు చేసిన మినీ జాతర తేదీల లేఖను ములుగు కలెక్టర్ దివాకరన్ టీస్, మేడారం ఈఓ రాజేంద్రంకు అందజేయనున్నట్లు తెలిపారు.

జాక్టో చైర్మన్‌గా జి.సదానంద్‌గౌడ్

- పలు అంశాలపై తీర్మానం చేసిన నూతన కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. చైర్మన్‌గా జి.సదానంద్‌గౌడ్, సెక్రెటరీ జనరల్‌గా కృష్ణుడు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కోశాధికారిగా జి.హేమచంద్రుడు, ప్రచార కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్లా, కో చైర్మన్లుగా ఎం.రాధాకృష్ణ, డి.వెంకటేశ్వరరావు, చైతన్య, జయబాబు, అంజయ్య, అలీబాబా ఎంపికయ్యారు. చైర్మన్ జి.సదానంద్‌గౌడ్ అధ్యక్షతన శనివారం ఎస్టీయూ భవన్‌లో జరిగిన నూతన కమిటీ తొలి సమావేశంలో 8 అంశాలపై తీర్మానం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఐదు డీఏల్లో కనీసం మూడింటిని తక్షణమే విడుదల చేయాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, మండలంలోని సీనియర్ జీహెచ్ఎంకు ఎంఈఓ బాధ్యతలు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు అమ్మ ఆదర్శ పాఠశాల అకౌంట్‌లో జమ చేయాలన్నారు. వీటిని విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కులగణనకు ఇంటింటి సర్వే

▶ మొదటి పేజీ తరువాయి

కానీ తాము సర్వే ముగిశాక సమాచారాన్ని, ప్రయోజనాలను ప్రజా బాహుళ్యంలో ఉంచి పారదర్శకంగా వ్యవహరిస్తామని పొన్నం తెలిపారు. సర్వేలో సరైన సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం..
దీపావళి కానుకగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామసభ పెట్టి కులమతాలు, పార్టీలకు అతీతంగా పేదల్లో బహుపేదలను ఎంపిక చేయాలని నిర్ణయించామన్నారు. దీపావళి మర్నాడు లేదా ఆ తర్వాతి రోజున సీఎంతోపాటు మంత్రులం స్వయంగా ముగ్గు వేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

ఉద్యోగులకు ఒక డీఏ
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు పెండింగ్ డీఏలను చెల్లించాల్సి ఉండగా దీపావళి కానుకగా 2022 జనవరి నుంచి రావాల్సిన ఒక డీఏను మంజూరు చేశామని పొంగులేటి చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతలతో జరిపిన చర్చల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే జీవో 317 కింద గత ప్రభుత్వ హయాంలో దూర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులను స్పౌజ్, ఆరోగ్య, పరస్పర కేటగిరీల కింద తక్షణమే సొంత ప్రాంతాలకు బదిలీలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. జీవో 317 కింద దూర ప్రాంతాలకు వెళ్లిన ఇతర ఉద్యోగుల సమస్యతోపాటు ఉద్యోగ నియామకాలకు జీవో 46తో ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి చట్ట రీత్యా, కోర్టుల రీత్యా చిక్కులున్న నేపథ్యంలో తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి కేంద్రం ఆమోదం కోసం పంపాలని నిర్ణయించామని పొంగులేటి తెలిపారు. ఉద్యోగులకు ఒక డీఏ చెల్లిస్తే ప్రభుత్వంపై రూ. 3 వేల కోట్ల భారం పడనుందని.. అందుకు ప్రతి నెలా రూ. 230 కోట్లు అదనంగా కావాలని పొన్నం తెలిపారు.

నాలుగు కేటగిరీలుగా మిల్లర్ల విభజన..
రాష్ట్రంలో మిల్లర్లను నాలుగు విభాగాల కింద విభజిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేని మిల్లర్లకు ప్రథమ కేటగిరీ, ప్రభుత్వ నోటీసులకు స్పందించి చెల్లింపులు చేసిన వారిని రెండో కేటగిరీ, నోటీసులిచ్చినా చెల్లింపులు చేయక రికవరీకి గురైన వారిని మూడో కేటగిరీగా విభజించి వారి నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకున్న తర్వాత ధాన్యం సేకరణలో అనుమతించాలని, ఇంకా డిఫాల్టర్లుగా మిగిలిపోయిన వారిని అనుమతించరాదని నిర్ణయించామన్నారు. మిల్లర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి పొరుగు రాష్ట్రాల్లో అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి ఆమోదించామని చెప్పారు.

రూ. 24,269 కోట్లతో మెట్రో రెండో దశ
హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టును కేంద్రంతో కలిసి జాయింట్ వెంచర్ కింద నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. నాగోల్–శంషాబాద్, రాయదుర్గ్–కోకాపేట, ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట, మియాపూర్–పటాన్‌చెరు, ఎల్బీనగర్–హయత్‌నగర్ కారిడార్లలో 76.4 కి.మీ. కొత్త మెట్రో రైల్వే లైన్‌ను రూ. 24,269 కోట్ల అంచనాలతో ఏర్పాటు చేయడానికి రూపొందించిన డీపీఆర్‌ను కేంద్రానికి పంపేందుకు మంత్రివర్గం ఆమోదించింది.

పీపీపీ విధానంలో రోడ్ల అభివృద్ధి
పంచాయతీరాజ్ శాఖ, ఆర్ అండ్ బీ పరిధిలో 16–17 వేల కి.మీ. కొత్త రోడ్ల నిర్మాణం/పునరుద్ధరణ పనుల విషయంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి తప్పనిసరిగా బీటీ రోడ్డు, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు, ప్రతి జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు 4 లేన్ల రోడ్లను నిర్మించాలన్న ప్రతిపాదనలను ఆమోదించింది. ప్రతి ఉమ్మడి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని పీపీపీ విధానంలో వచ్చే 4 ఏళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ. 25 వేల కోట్ల నుంచి రూ. 28 వేల కోట్ల వ్యయం కానుందని ప్రాథమికంగా అంచనా వేసింది.


మరికొన్ని నిర్ణయాలు..
- ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి గోషామహల్ స్టేడియం స్థలాన్ని అప్పగించడంతోపాటు ములుగులోని గిరిజన వర్సిటీకి 211 ఎకరాల భూమిని, స్పోర్ట్స్ వర్సిటీకి గచ్చిబౌలి స్టేడియాన్ని అప్పగించాలనే ప్రతిపాదనలకు ఆమోదం.
- మధిర, వికారాబాద్, హుజూర్‌నగర్‌లో స్కిల్స్ వర్సిటీకి అనుబంధంగా కొత్త ఐటీఐల మంజూరు.
- కొత్తగా ఏర్పడిన 8 కోర్టులు, రెండు వైద్య కళాశాలలకు సిబ్బంది మంజూరు.
- కేంద్ర ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా పైలట్ ప్రాజెక్టులో భాగంగా కడెం ప్రాజెక్టులో పూడికతీతకు ఆమోదం. అన్ని ప్రాజెక్టుల్లో 23 శాతం పూడికతో నిండి ఉన్నాయని, భవిష్యత్తులో వాటిలోని పూడిక తొలగిస్తామని పొంగులేటి తెలిపారు.

సినీనటుడు బాలకృష్ణకు స్టూడియో నిర్మాణానికి ఎలాంటి స్థలం కేటాయించలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

దీపావళికి ముందే పొలిటికల్ బాంబుల పేలుళ్లు

రాష్ట్రంలో పొలిటికల్ బాంబులు ఒకట్రెండు రోజుల్లో పేలబోతున్నాయని దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. దీపావళి టపాసుల కంటే ముందే ఇవి పేలుతాయని స్పష్టం చేశారు. కాగా, దక్షిణ కొరియాలో అమలైన నదుల పునరుజ్జీవ ప్రాజెక్టు గురించిన వివరాలను మంత్రులు పొంగులేటి, పొన్నం తమ సహచరులకు వివరించినట్లు సమాచారం. అయితే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి ప్రభుత్వం తీసుకోనున్న చర్యలపై ప్రత్యేకంగా మరో సమావేశం ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లాలనే అభిప్రాయం కేబినెట్‌లో వ్యక్తమైనట్లు తెలియవచ్చింది.

భద్రాద్రిలో జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా 2025 జనవరి 9న రాత్రి తెప్పోత్సవం, 10వ తేదీ తెల్ల వారుజామున ఉత్తరద్వార దర్శన వేడుకలు ఉంటాయని ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు దేవస్థానం ఆధ్వర్యంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. పగల్ పత్తు, రాపత్తు ఉత్సవాలు, విశ్వరూప సేవ అంగరంగ వైభవంగా జరుగుతాయి. పగల్ పత్తు ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు
భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్. రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2, 3, 9, 10, 12, 15, 16, 17, 23, 24, 26, 30, డిసెంబర్ 1 తేదీల్లో ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకు చిత్రకూట మండపంలో వ్రతాలు జరుగుతాయని వివరించారు. టికెట్ ధర రూ.516గా నిర్ణయించామని పేర్కొన్నారు. వ్రతానికి అవసరమైన సామగ్రిని దేవస్థానం ఆధ్వర్యంలో సమకూరుస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పైపులైన్ మరమ్మతులు 24 గంటల్లో పూర్తిచేయాలి

- నీటి సరఫరాపై ఫిర్యాదులకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పీఆర్, గ్రామీణ నీటిసరఫరా శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఒక్కరికి శుద్ధిచేసిన తాగునీటిని అందించడం మిషన్ భగీరథ ఇంజినీర్ల బాధ్యత అని స్పష్టం చేశారు. పైపులైన్లు లీకైనా, పగిలినా వెంటనే వాటిని సరిదిద్ది నీటి సరఫరాను 24 గంటల్లో పునరుద్ధరించాలని ఆదేశించారు. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, అతిసార కేసుల విషయంలో అప్రమత్తతతో ఉండాలన్నారు. గ్రామాలలోని ఓవర్ హెడ్ ట్యాంకులలో ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ప్రతి 10 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రపరచాలని, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. నీటి సరఫరా ఫిర్యాదుల కోసం ఓ టోల్ ఫ్రీ నంబర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని తెలియజేశారు. రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి కలుగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. శనివారం మిషన్ భగీరథ ఇంజనీర్–ఇన్–చీఫ్ కార్యాలయంలో సీఈలు, ఎస్ఈలు, ఈఈలతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో తాగునీటి సరఫరా, వచ్చే వేసవి సన్నద్ధతను సమీక్షించారు. అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నా ప్రజలు బోర్లు వేయించాలని, ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరడాన్ని మంత్రి సీతక్క ప్రస్తావించారు. ఈ విషయంలో మార్పు వచ్చేలా సిబ్బంది పనిచేయాలని, మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలని చెప్పారు. పీఆర్ కార్యదర్శి లోకేశ్ కుమార్, ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, వివిధ స్థాయిల ఇంజనీర్లు పాల్గొన్నారు.

పల్లె రోడ్ల నిర్మాణానికి నూతన విధానం

- హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ అమలుకు కేబినెట్ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి ఇకపై నూతన విధానం అనుసరించనున్నారు. రహదారుల నిర్మాణ పనులకు 'హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హామ్)'ను అమలు చేయనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, జాతీయ రహదారులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు కూడా ఇదే విధానం పాటించనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలు సమర్పించగా.. కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్ల నిర్మాణానికి సంబంధించి సరికొత్త విధానానికి కేబినెట్ పచ్చజెండా ఊపినట్టు అయింది. దీనికి సంబంధించిన ఆర్థిక విధివిధానాలు ఖరారు కాగానే కొత్త విధానంలో వేగంగా గ్రామీణ రోడ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయని పంచాయతీరాజ్ వర్గాలు చెప్తున్నాయి. కాంట్రాక్టర్లకు బ్యాంక్ ష్యూరిటీ ఇప్పించడం ద్వారా రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టనున్నట్టు వివరిస్తున్నాయి. గతంలోని విధానం వల్ల గ్రామ రహదారుల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని నేపథ్యంలో ఈ మార్పులు చేసినట్టు పేర్కొంటున్నాయి.

పెరుగుతున్న అమోయ్‌కుమార్ బాధితులు

- ఈడీ అధికారులకు తాజాగా శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ ఫిర్యాదు
- తమ ప్లాట్లను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: భూ కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్ బాధితులు ఒక్కొక్కరుగా ఈడీ కార్యాలయం బాట పడుతున్నారు. అమోయ్‌కుమార్‌పై ఓ వైపు ఈడీ విచారణ జరుగుతుండగానే, దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువ చేసే భూములను కబ్జాదారులకు కట్టబెట్టారని ఆరోపిస్తూ శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో మధురానగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. తాజాగా శనివారం వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌ను వినియోగించుకుని 200 ఎకరాల అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. రాత్రికి రాత్రే పత్రాలు సృష్టించి తమ ప్లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారని పేర్కొన్నారు. 1983లో రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టి నాగులపల్లిలోని 460 ఎకరాల్లో.. 3,333 ప్లాట్లను కొనుగోలు చేశామని అసోసియేషన్ సభ్యులు లక్ష్మీకుమారి, కృష్ణారెడ్డిలు తెలిపారు. ఇందులో 3,228 మంది ఓనర్లను ప్లాట్ల దగ్గరికి వెళ్లనీయకుండా.. బీఆర్ఎస్ సర్కార్‌లోని పెద్దల అండతో వ్యవసాయ భూమిగా చిత్రీకరించి, విద్యుత్ పర్మిషన్ తీసుకొని కబ్జా చేశారని ఆరోపించారు. తమ పేరుపై ఉన్న స్థలాలను ఫోనెక్స్, శ్రీనిధి కంపెనీలకు కట్టబెట్టారని, అప్పటి మంత్రి కేటీఆర్ ప్రోద్బలంతోనే కలెక్టర్ అమోయ్‌కుమార్ స్థలాల బదలాయింపు చేశారని వారు వెల్లడించారు. వేల కోట్ల విలువ చేసే తమ ప్లాట్లను తమకు ఇప్పించడంతోపాటు అవినీతికి పాల్పడిన ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్ పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడికి రిమాండ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ అచ్చంపేట రూరల్: దొంగ పట్టాల కేసులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్‌కు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్ 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను మహబూబ్‌నగర్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. దొంగ పట్టాల కేసులో ఏ–4 శ్రీకాంత్‌గౌడ్‌ను అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఉత్తర్వుల మేరకు 14 రోజుల రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించామన్నారు. మహబూబ్‌నగర్‌లోని సర్వే నం.523లో దొంగ పట్టాలు సృష్టించారన్న ఆరోపణలపై స్థానిక అర్బన్ తహసీల్దార్ విచారణ చేపట్టగా, తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకున్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు.

మూసీ నిర్వాసితుల కోసం టవర్లు

- సకల సౌకర్యాలతో నిర్మిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వారికోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం
- నిర్వాసితులైన డ్వాక్రా మహిళలకు రూ.1,000 కోట్ల వడ్డీలేని రుణాలిస్తాం
- మూసీ, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు
- 30 వేల ఎకరాల్లో అద్భుతంగా ఫ్యూచర్ సిటీ ఏర్పాటు
- బిల్డర్ల సమస్యలపై త్వరలోనే బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని.. నిర్వాసితులకు అక్కడే అద్భుతమైన టవర్లు నిర్మిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. నిర్వాసితులు సకల సౌకర్యా లతో ఉండేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో భట్టి ప్రసంగించారు. మూసీ నిర్వాసితుల పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిర్వాసితులైన డ్వాక్రా మహిళలకు రూ.1,000 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని.. చిన్నతరహా పరిశ్రమలు ఏర్పా టు చేసి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. పరీవాహక ప్రాంతంలో మురుగునీటి శుద్ధి కోసం 39 ఎస్టీపీలు మంజూరు చేశామని భట్టి చెప్పారు. రియల్ ఎస్టేట్ డెవలపర్లకు బ్యాంకర్లతో ఉన్న సమస్యలపై త్వరలోనే ఎస్ఎల్‌బీసీ సమావేశం ఏర్పాటు చేసి స్పష్టత ఇస్తామని వివరించారు. గత ప్రభుత్వం తరహాలో అనుకూలంగా ఉన్న వాళ్లను దగ్గరికి తీసుకోవడం, లేని వాళ్లను దూరం పెట్టడం వంటి ఆలోచన తమకు లేదన్నారు.


అద్భుతంగా ఫ్యూచర్ సిటీ..: హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిపై కొన్ని నెలలుగా కావాలనే కొందరు విష ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్డుతోపాటు 30 వేల ఎకరాల్లో అద్భుతంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి 30 నిమిషాల్లో ఫ్యూచర్ సిటీకి చేరుకోవచ్చని.. అక్కడ ప్రపంచ స్థాయి యూనివర్సిటీ, క్రికెట్ స్టేడియం వంటివెన్నో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి, సంకల్పంతో ఉందన్నారు. నాటి పాలకులు బీహెచ్ఈఎల్, సీసీఎంబీ, హెచ్ఈ ఎల్ వంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారని.. ఫలితంగా వారి నివాసం కోసం కూకట్‌పల్లి, వెంగళరావునగర్, బర్కత్‌పుర వంటి హౌసింగ్ బోర్డులు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ. పది వేల కోట్లు కేటాయించామన్నారు. ఆ నిధులతో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, డ్రైనేజీలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించి ప్రపంచ డెవలపర్లను ఆకర్షిస్తామని చెప్పారు.

ఊరిస్తున్న ఊయల సేవ

అమెరికా అధ్యక్షున్ని తేల్చేది 7 స్వింగ్ స్టేట్లే

- వాటిలో మెజారిటీ సాధించే వారిదే పీఠం
- అందరి చూపు ఆ రాష్ట్రాలవైపే
- ఆ ఏడింటా ట్రంప్, హారిస్ హోరాహోరీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు కురుక్షేత్రాన్ని తలపిస్తూ అత్యంత హోరాహోరీగా సాగుతోంది. రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాట్ ప్రత్యర్థి కమలా హారిస్ నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్నారు. ఎన్నికలు మొత్తం 50 రాష్ట్రాల్లోనూ జరుగుతున్నా వాటిలో ఏడు రాష్ట్రాలు విజేతను తేల్చడంలో అతి కీలకంగా మారాయి. స్వింగ్ స్టేట్స్‌గా పిలిచే ఆ ఏడింటిపైనే అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. వాటిలో మెజారిటీ రాష్ట్రాలను నెగ్గిన వారే అధ్యక్షుడు కావడం ఖాయంగా కన్పిస్తోంది. అయితే అన్ని పోల్స్‌లోనూ ఆ ఏడు రాష్ట్రాల్లో కూడా ట్రంప్, హారిస్ దాదాపుగా సమవుజ్జీలుగా నిలుస్తుండటం విశేషం. దాంతో ఈ ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారిపోయాయి.



స్వింగ్ స్టేట్స్ అంటే...?

అమెరికాలోని 50 రాష్ట్రాల్లో చాలావరకు డెమొక్రాట్, రిపబ్లికన్ పార్టీల్లో ఏదో ఒకదానివైపు స్పష్టంగా మొగ్గేవే ఉంటాయి. వాటిని సేఫ్ స్టేట్స్‌గా పిలుస్తారు. పార్టీల జెండా రంగుపరంగా వీటిని బ్లూ (డెమొక్రాట్), రెడ్ (రిపబ్లికన్) స్టేట్స్‌గా పేర్కొంటారు. కొన్ని రాష్ట్రాలు మాత్రం ఒక ఎన్నికలో డెమొక్రాట్లకు జై కొడితే మరో ఎన్నికలో రిపబ్లికన్ అభ్యర్థిని గెలిపిస్తుంటాయి. వీటినే స్వింగ్ స్టేట్స్, బ్యాటిల్‌గ్రౌండ్ స్టేట్స్, పర్పుల్ స్టేట్స్ (డెమొక్రాట్, రిపబ్లికన్ పార్టీల్లో ఎటైనా మొగ్గవచ్చనే అనే అర్థంలో) అని పిలుస్తుంటారు. అభ్యర్థులు సేఫ్ స్టేట్స్‌పై పెద్దగా దృష్టి పెట్టరు. ఈ స్వింగ్ స్టేట్స్‌ను తమవైపు తిప్పుకోవడం, లేదా అవి ప్రత్యర్థికి జై కొట్టకుండా చూడటంపైనే శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరిస్తారు. దాంతో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ హోరాహోరీ ప్రచారం సాగుతుంటుంది. మీడియాలోనూ, బయటా భారీగా ఎన్నికల ప్రకటనలు ఇతరత్రా హడావుడి కూడా స్వింగ్ స్టేట్స్‌లోనే ఎక్కువ.

ఆ 7 రాష్ట్రాలివే...

ఈ ఎన్నికల్లో 7 రాష్ట్రాలు స్వింగ్ స్టేట్లుగా అందరి దృష్టినీ తమవైపు తిప్పుకుంటున్నాయి. అవి...
పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, జార్జియా, అరిజోనా, మిషిగన్, నెవడా, విస్కాన్సిన్

- సాక్షి, నేషనల్ డెస్క్

అరిజోనా



ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	11
రాష్ట్ర జనాభా	74 లక్షలు
2020లో విజేత	బైడెన్ (10 వేల ఓట్ల మెజారిటీ)

2020 అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయంలో ఈ రాష్ట్రానిదే కీలక పాత్ర. ఇక్కడ డెమొక్రాట్ అభ్యర్థి గెలవడం 1990ల తర్వాత అదే తొలిసారి కావడం విశేషం. మెక్సికోతో అరిజోనా వందలాది కిలోమీటర్ల మేరకు సరిహద్దులను పంచుకుంటుంది. దాంతో సహజంగానే వలసలు ఇక్కడ కీలక ఎన్నికల అంశంగా మారాయి. తాను గెలిస్తే ఏకంగా 10 లక్షల మంది అక్రమ వలసదారులను వెనక్కు పంపుతానన్న ట్రంప్ ప్రకటన అరిజోనావాసులను బాగా ఆకట్టుకుంటోంది. వలసలపై హారిస్ విధానాల పట్ల వారు పెదవి విరుస్తున్నారు. అయితే అబార్షన్లపై ట్రంప్ స్పష్టమైన వైఖరంటూ ప్రకటించకపోవడంపై ఆయనకు కాస్త మైనస్‌గా మారే ఆస్కారముంది. మహిళా ఓటర్లలో హారిస్ పట్ల స్పష్టమైన మొగ్గు కనిపిస్తుండటం కూడా డెమొక్రాట్లకు సానుకూలాంశమే.

తాజా పరిస్థితి
ట్రంప్ ఏకంగా దాదాపు 3 శాతం ఆధిక్యం కనబరుస్తున్నారు

విస్కాన్సిన్



ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	10
రాష్ట్ర జనాభా	59 లక్షలు
2020లో విజేత	బైడెన్ (21 వేల ఓట్ల మెజారిటీ)

స్వతంత్ర అభ్యర్థిగా తొలుత బరిలో ఉన్న మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెనెడీ మేనల్లుడు రాబర్ట్ ఎఫ్.కెనెడీకి విస్కాన్సిన్‌లో భారీ జనాదరణ దక్కింది. ఆగస్టు చివర్లో ఆయన బరి నుంచి తప్పుకుని ట్రంప్‌కు మద్దతు పలకడం రిపబ్లికన్లకు బాగా కలిసొచ్చేలా ఉంది. దీనికి తోడు గ్రీన్ పార్టీ అభ్యర్థి జిల్ స్టెయిన్ ఇక్కడ డెమొక్రాట్ల అవకాశాలకు మరింత గండి కొట్టేలా కన్పిస్తున్నారు. ఆయన్ను ఎలాగైనా బరిలోంచి తప్పించాలని డెమొక్రాట్లు చివరిదాకా ప్రయత్నించినా కుదర్లేదు.

తాజా పరిస్థితి
హారిస్ ఒక్క శాతం కంటే తక్కువ ఆధిక్యంలో ఉన్నారు

నెవడా



ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	6
రాష్ట్ర జనాభా	32 లక్షలు
2020లో విజేత	బైడెన్ (34 వేల ఓట్ల మెజారిటీ)


కొద్ది ఎన్నికలుగా వరుసగా డెమొక్రాట్లకే జై కొడుతూ వస్తున్న రాష్ట్రమిది. కానీ ఈసారి మాత్రం ట్రంప్ ఖాతాలో పడే సూచనలు గట్టిగానే కన్పిస్తున్నాయి. పోల్ ట్రాకింగ్ సంస్థ 538 తాజా గణాంకాల ప్రకారం ట్రంప్‌కు ఈ రాష్ట్రంలో ఆదరణ బాగా పెరిగింది. హారిస్ రంగ ప్రవేశంతో పరిస్థితి కాస్త మారినా ఇప్పటికీ ఇక్కడ ట్రంప్‌దే పై చేయిగా కన్పిస్తోంది. అమెరికాలోకెల్లా నిరుద్యోగం అతి ఎక్కువగా (5.1 శాతం) ఉన్న రాష్ట్రం నెవడానే. ఇక్కడ లాటిన్ అమెరికన్లు చాలా ఎక్కువ. వారంతా చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. వారిలో హోటళ్లలో వెయిటర్లు తదితర పనులు చేసేవాళ్లే ఎక్కువ. టిప్పులపై పన్ను ఎత్తేస్తామన్న ట్రంప్ హామీ వారిని బాగా ఆకట్టుకుంది. దాన్ని గమనించిన హారిస్ తాను కూడా ఈ మేరకు గత ఆగస్టులోనే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ రాష్ట్రం వారిలో ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

తాజా పరిస్థితి
హారిస్ ఒక్క శాతం కంటే తక్కువ ఆధిక్యంలో ఉన్నారు

పెన్సిల్వేనియా

ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	19
రాష్ట్ర జనాభా	1.3 కోట్లు
2020లో విజేత	బైడెన్ (82 వేల ఓట్ల మెజారిటీ)

ఏడు స్వింగ్ స్టేట్లలో అత్యధిక ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్న రాష్ట్రం. దాంతో సహజంగానే ఇక్కడ గెలుపు అభ్యర్థులకు అత్యంత కీలకం. ట్రంప్‌పై గత జూలైలో హత్యాయత్నం జరిగింది పెన్సిల్వేనియాలోనే. ఇది బైడెన్ సొంత రాష్ట్రం కూడా. ఆర్థిక పరిస్థితులు ఈసారి ఇక్కడ కీలక ఎన్నికల అంశంగా మారాయి. ధరాభారంతో పెన్సిల్వేనియా వాసులు నానా కష్టాలు పడుతున్నారు.



అమెరికా అంతటినీ అతలాకుతలం చేస్తున్న జీవన వ్యయం మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ మరీ ఎక్కువగా పెరిగిందని మార్కెట్ సర్వే సంస్థ డేటాసెంబ్లీ సర్వేలో తేలింది. కనీవిని ఎరగని రీతిలో రాష్ట్రంలో ప్రతి పదిమందిలో ఏకంగా ఎనిమిది మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నట్టు ఆ సర్వే తేల్చింది! ఇది హారిస్‌కు బాగా ప్రతికూలంగా మారవచ్చంటున్నారు.

తాజా పరిస్థితి
తాజా పోల్ ఆఫ్ పోల్స్‌లో హారిస్ 0.9 శాతం ఆధిక్యంలో ఉన్నారు

నార్త్ కరోలినా

ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	16
రాష్ట్ర జనాభా	10.8 కోట్లు
2020లో విజేత	ట్రంప్ (74 వేల ఓట్ల మెజారిటీ)

గత ఎన్నికల్లో ట్రంప్ గెలిచిన ఏకైక స్వింగ్ స్టేట్ ఇదే. ఈసారి కూడా బైడెన్ ప్రత్యర్థిగా ఉన్నన్ని రోజులూ ట్రంప్ హవాయే నడిచింది. ఆయన తప్పుకుని హారిస్ తెరపైకి రావడంతో పరిస్థితి మారుతూ వచ్చింది. దాంతో ఈ రాష్ట్రాన్ని నిలబెట్టుకోవడం ట్రంప్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ విషయాన్ని ఆయన కూడా అంగీకరించారు. అందుకే ఇక్కడ వీలైనన్ని ఎక్కువ ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు.

తాజా పరిస్థితి
ట్రంప్ 0.9 శాతం ఆధిక్యంలో ఉన్నారు



మిషిగన్



ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	15
రాష్ట్ర జనాభా	కోటి
2020లో విజేత	బైడెన్ (1.5 లక్షల ఓట్ల మెజారిటీ)

గత ఎన్నికల్లో బైడెన్‌కు మంచి మెజారిటీ కట్టబెట్టిన రాష్ట్రమిది. కానీ రాష్ట్రంలో ప్రబల శక్తిగా ఉన్న అరబ్ అమెరికన్లు హారిస్ పట్ల చాలా ఆగ్రహంగా ఉన్నారు. ఆమె ఇజ్రాయెల్‌కు మద్దతిస్తుండటం బాగా ప్రతికూలంగా మారేలా కన్పిస్తోంది. దీన్ని గమనించి కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ విషయంలో హారిస్ కాస్త విమర్శనాత్మక వైఖరి అవలంబిస్తూ వస్తున్నారు. అది ఇక్కడ అరబ్ ఓటర్ల ఆగ్రహాన్ని ఏ మేరకు చల్లార్చిందన్నది ఫలితాలొస్తే గానీ తేలదు.

తాజా పరిస్థితి
కమలా హారిస్ 0.8 శాతం ఆధిక్యంలో ఉన్నారు

జార్జియా

ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు	16
రాష్ట్ర జనాభా	1.1 కోట్లు
2020లో విజేత	బైడెన్ (13 వేల ఓట్ల మెజారిటీ)

గత ఎన్నికల్లో అత్యంత వివాదాస్పదంగా నిలిచిన ఫలితం జార్జియాదే. ఇక్కడి ఓటమిని ఒప్పుకునేది లేదంటూ ట్రంప్ భీష్మించారు. ఏకంగా ఫలితాలనే మార్చేసేందుకు ప్రయత్నించి భంగపాటుకు గురయ్యారు. దీనికి సంబంధించి నాలుగు కేసులను కూడా ఎదుర్కొంటున్నారు. ఒకదాంట్లో ట్రంప్ ఇప్పటికే దోషిగా తేలగా మూడింట్లో విచారణ కొనసాగుతోంది.

జార్జియా జనాభాలో ఏకంగా మూడో వంతు ఆఫ్రికా మూలాలున్న వారే. 2020లో బైడెన్‌ను గెలిపించినా, ఆయన నాలుగేళ్ల పాలనపై వారంతా పెదవి విరుస్తున్నారు. ఇది హారిస్‌కు ప్రతికూలంగా మారేలా కన్పిస్తోంది. కానీ ఇక్కడ నిర్వహించిన ముమ్మర ప్రచారం పరిస్థితిని ఆమెకు కాస్త అనుకూలంగా మార్చిందంటున్నారు.

తాజా పరిస్థితి
ట్రంప్ ఏకంగా దాదాపు 2 శాతం ఆధిక్యం కనబరుస్తున్నారు



ఇనుప ఖనిజం అక్రమ ఎగుమతి కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఏడేళ్ల జైలు



బెంగళూరు: బెళెకెరి నౌకాశ్రయంలోని ఇనుప ఖనిజం దొంగతనం, అక్రమ ఎగుమతి కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ కృష్ణ సాయిల్‌కు ప్రత్యేక కోర్టు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 కోట్ల భారీ జరిమానా విధించింది. ప్రజాప్రతినిధులపై కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానం సాయిల్‌తోపాటు ఆరుగురికి జైలు శిక్ష, భారీగా జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. శ్రీ మల్లికార్జున షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీగా ఉన్న సాయిల్(58) తాజా పరిణామంతో ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యే అవకాశముంది. బళ్లారి గనిలో అక్రమంగా వెలికి తీసిన ఇనుప ఖనిజాన్ని 2010లో బెళెకెరి పోర్టులో అధికారులు నిల్వ ఉంచారు. దీనిపై కన్నేసిన సాయిల్, మరికొందరు కోట్లాది రూపాయల ఖనిజాన్ని దొంగచాటుగా చైనాకు ఎగుమతి చేశారు. తాజాగా దోషులుగా తేలిన వారిలో ప్రైవేట్ కంపెనీల నిర్వాహకులతోపాటు పోర్టుల డిప్యూటీ కన్జర్వేటర్ మహేశ్ జె బిలియె కూడా ఉన్నారు. ఈ నెల 24వ తేదీన తీర్పు వెలువడిన వెంటనే ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు సాయిల్, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

యమునలో స్నానం చేసి... ఆస్పత్రిపాలైన ఢిల్లీ బీజేపీ చీఫ్



న్యూఢిల్లీ: యమునను పరిశుభ్రపరచడంలో ఆప్ సర్కారు విఫలమైందని నిరూపించేందుకు నదిలో స్నానం చేసిన ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ అనారోగ్యం పాలయ్యారు. 2025కల్లా యమున జలాలను కాలుష్యరహితంగా మారుస్తామన్న హామీని కేజ్రీవాల్ పార్టీ నిలుపుకోలేకపోయిందని విమర్శిస్తూ ఆయన గురువారం ఢిల్లీలోని ఛాత్ ఘాట్ వద్ద నదిలో స్నానం చేశారు. అయితే స్నానం చేసిన కాసేపటికే చర్మంపై పొక్కులు వచ్చాయి. శ్వాస పీల్చుకునేందుకు కూడా ఇబ్బంది పడ్డారు. వైద్య పరీక్షల అనంతరం మూడు రోజుల పాటు మందులు వాడినా లాభం లేకపోయింది. శ్వాస కష్టంగా మారడం, దురద సమస్య పెరగడంతో సచ్‌దేవ శనివారం ఆస్పత్రిలో చేరారు. ఆయనకు గతంలో ఎప్పుడూ ఇలాంటి ఆరోగ్య సమస్యలు లేవని బీజేపీ మీడియా విభాగం పేర్కొంది. ఆప్ మాత్రం దీన్ని మీడియా స్టంట్‌గా కొట్టిపారేసింది.

కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ కుట్ర: ఆప్


సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: తమ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆరోపించింది. జరగరానిదేదైనా ఆయనకు జరిగితే బీజేపీయే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. పశ్చిమ ఢిల్లీలోని వికాస్‌పురిలో ప్రచార పాదయాత్ర చేస్తున్న కేజ్రీవాల్‌పై శుక్రవారం బీజేపీ గూండాలు దాడికి దిగారని పేర్కొంది. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ శనివారం మీడియాతో మాట్లాడారు. 'దాడి ఘటనపై పోలీసుల వైఖరిని బట్టి చూస్తే దీని వెనుక కేజ్రీవాల్‌ను చంపేందుకు పెద్ద కుట్రే ఉందని స్పష్టమవుతోంది. ఆయనకు బీజేపీ శత్రువుగా మారింది' అని పేర్కొన్నారు. ఆయనకు హాని తలపెట్టాలనుకుంటే ప్రజలు ఊరుకోరన్నారు. ఇటువంటి వాటికి కేజ్రీవాల్ వెనుకడుగు వేయరన్నారు. వికాస్‌పురిలో ముందుగా ప్రకటించిన విధంగానే కేజ్రీవాల్ పాదయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేజ్రీవాల్‌పై మొదటగా దాడి చేసింది బీజేపీ ఢిల్లీ యువ మోర్చా ఉపాధ్యక్షుడు కాగా, రెండో వ్యక్తి ఢిల్లీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అని ఆప్‌కే చెందిన ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. దాడి అనంతరం వీరిద్దరూ అక్కడ డ్యాన్స్ చేశారన్నారు. ఘటనపై చట్ట పరంగా ముందుకెళ్లే విషయమై నిపుణుల సలహాలను తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఆరోపణలను బీజేపీ ఖండించింది. అటువంటిదేమీ జరగలేదంది.

ఇరాన్‌పై నిప్పుల వర్షం

- ప్రతీకార దాడులకు దిగిన ఇజ్రాయెల్ సైన్యం
- మూడు ప్రావిన్స్‌ల్లో తెల్లవారు జామునే భీకర దాడులు
- 100 ఫైటర్ జెట్లతో 20 లక్ష్యాలపై గురి
- క్షిపణులు, డ్రోన్ల తయారీ కేంద్రాలు, సైనిక స్థావరాలపై దాడులు
- నలుగురు సైనికులు మృతి చెందినట్లు ఇరాన్ వెల్లడి
- తమకు పరిమిత నష్టమే వాటిల్లిందని స్పష్టీకరణ


ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీ
ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

టెల్ అవీవ్: పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిపోయాయి. ఊహించినట్లుగానే ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం ప్రతీకార చర్యలు ప్రారంభించింది. శనివారం తెల్లవారుజామున యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. ఇలామ్, ఖుజిస్తాన్, టెహ్రాన్ ప్రావిన్స్‌ల్లోని సైనిక, ఆయుధ స్థావరాలే లక్ష్యంగా దాడులకు దిగింది. మొత్తం 100 ఫైటర్ జెట్లతో మూడు దశల్లో 20 లక్ష్యాలపై కచ్చితత్వంతో కూడిన దాడులు నిర్వహించింది. ఇరాన్‌కు చెందిన క్షిపణి, డ్రోన్ల తయారీ కేంద్రాలు, ప్రయోగ కేంద్రాలపై వైమానిక దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే, చమురు నిల్వలపై దాడులు జరిగాయా లేదా అనేది తెలియరాలేదు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు సమాచారం. తాజా దాడుల్లో ఇరాన్‌కు ఎంతమేరకు నష్టం వాటిల్లిందన్న సంగతి ఇజ్రాయెల్ బయట పెట్టలేదు. ఇరాన్‌పై దాడుల తర్వాత తమ యుద్ధవిమానాలు క్షేమంగా వెనక్కి తిరిగి వచ్చాయని వెల్లడించింది. గత నాలుగు దశాబ్దాల తర్వాత ఇరాన్‌పై మరో దేశం నేరుగా దాడికి దిగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ఆపరేషకు ఇజ్రాయెల్ 'పశ్చాత్తాప దినాల మిషన్' అని పేరుపెట్టింది.

రంగంలోకి అత్యాధునిక యుద్ధ విమానాలు

ఇజ్రాయెల్ సైన్యం పక్కా ప్రణాళికతో ఇరాన్‌పై దాడికి దిగినట్లు సమాచారం. అత్యాధునిక ఫైటర్ జెట్లను సైన్యం రంగంలోకి దించింది. ఐదో తరం ఎఫ్–35 అడిర్ ఫైటర్ జెట్లు, ఎఫ్–15ఐ గ్రౌండ్ అటాక్ జెట్లు, ఎఫ్–16ఐ సూఫా ఎయిర్ డిఫెన్స్ జెట్లు ఇందులో ఉన్నాయి. ఇవి 2 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలవు. ఇజ్రాయెల్ ప్రధానంగా ఇరాన్ సైనిక, ఆయుధ స్థావరాలపైనే గురిపెట్టింది. జనావాసాల జోలికి వెళ్లలేదు. తొలుత రాడార్, ఎయిర్ డిఫెన్స్ కేంద్రాలపై దాడికి పాల్పడింది. అనంతరం సైనిక స్థావరాలు, మిస్సైల్, డ్రోన్ల కేంద్రాలపై క్షిపణుల వర్షం కురిపించింది. మొత్తం మూడు దశల్లో దాడులు జరగ్గా, ఒక్కో దశ దాడిలో దాదాపు 30 చొప్పున యుద్ధవిమానాలు పాల్గొన్నాయి. మరోవైపు ఇరాన్ నుంచి ప్రతిదాడులు జరిగే అవకాశం ఉందన్న అంచనాతో ఇజ్రాయెల్, అమెరికా తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను అప్రమత్తం చేశాయి. విమానాల రాకపోకలకు వీల్లేకుండా ఇరాన్, ఇరాక్ తమ గగనతలాన్ని మూసివేశాయి.

టెహ్రాన్‌లో సాధారణ పరిస్థితులే..

ఇజ్రాయెల్ దాడుల్లో తమకు పరిమిత నష్టమే వాటిల్లిందని, ఎదురుదాడిలో నలుగురు సైనికులు మృతి చెందారని ఇరాన్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ దాడులను తమ గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టిందని చెప్పారు. దాడుల అనంతరం టెహ్రాన్‌లో సాధారణ పరిస్థితులే కనిపించాయి. పిల్లలు స్కూళ్లకు వెళ్లారు. దుకాణాలు ఎప్పటిలాగే తెరుచుకున్నాయి. పెట్రోల్, డీజిల్ బంకుల వద్ద మాత్రం జనం బారులు తీరి కనిపించారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌పై దాడుల పట్ల మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఇజ్రాయెల్ చర్యను పలు దేశాలు ఖండించాయి. సంయమనం పాటించాలని సూచించాయి. అమెరికా వంటి మిత్రదేశాలు మాత్రం ఇజ్రాయెల్‌కు మద్దతు పలికాయి.

25 రోజుల తర్వాత ప్రతిదాడి

ఇరాన్‌పై దాడుల సందర్భంగా కొన్ని ఫొటోలు, వీడియోలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఇందులో టెల్ అవీవ్ ఉన్న కిర్యా మిలటరీ బేసులోని మిలటరీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ సైనిక సలహాదారులతో, సైనికాధికారులతో చర్చిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా, హమాస్ నాయకులు మరణించడం పట్ల ఇరాన్ ఆగ్రహంతో రగిలిపోయింది. ఈ నెల 1న ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్ భూభాగంపై దాదాపు 200 క్షిపణులు ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఇరాన్ పెద్ద తప్పు చేసిందని, తాము తగిన జవాబు ఇవ్వక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అప్పుడే హెచ్చరించారు. ఇరాన్ దాడి చేసిన వెంటనే ఇజ్రాయెల్ ప్రతిదాడులకు దిగే అవకాశం ఉందని అప్పట్లో భావించినప్పటికీ ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గింది. అప్పుడు వాతావరణం అనుకూలించకపోవడంతో తమ ఆపరేషన్ వాయిదా వేసుకుంది. పరిస్థితులు సానుకూలంగా మారడంతో 25 రోజుల తర్వాత ఇరాన్‌పైకి యుద్ధ విమానాలు పంపించింది.

జూనియర్లకు సరైన వేతనాలివ్వండి

సీనియర్ లాయర్లకు సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సూచన

న్యూఢిల్లీ: "న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి, నైపుణ్యాలు పెంచుకోవడానికి మీ వద్ద పనిచేసే యువతకు సరైన వేతనాలు, పారితోషికాలు చెల్లించడం మీరు తప్పనిసరిగా నేర్చుకోవాలి" అని న్యాయవాదులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సూచించారు. న్యాయవాద వృత్తి చాలా సంక్లిష్టమైందని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో నేర్చుకున్న నైపుణ్యాలే యువ న్యాయవాదులను ముందుకు నడిపిస్తాయని, అవి వారికి జీవితాంతం తోడ్పడుతాయని తెలిపారు. పునాది బలంగా ఉండాలని పేర్కొన్నారు. తాజాగా ఆలిండియా రేడియో ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్ పలు విషయాలు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు ఉంటాయని, ప్రారంభంలో వేతనాలు ఎక్కువగా ఉండకపోవచ్చని వెల్లడించారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చేవారు కష్టపడి పనిచేయాలని, నిజాయతీగా ఉండాలని పేర్కొన్నారు. యువ లాయర్లను ప్రోత్సహించడం చాలా ముఖ్యమని స్పష్టంచేశారు. జూనియర్లకు సీనియర్ లాయర్లు గురువులుగా కొత్త విషయాలు నేర్పిస్తూనే సంతృప్తికరమైన వేతనాలు చెల్లించడం తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. తాను కాలేజీలో చదువుకొనే రోజుల్లో ఆలిండియా రేడియోలో ప్రయోక్తగా పనిచేశానని జస్టిస్ చంద్రచూడ్ గుర్తుచేసుకున్నారు. శాస్త్రీయ సంగీత కళాకారిణి అయిన తన తల్లి తనను ముంబైలోని ఆలిండియా రేడియో స్టూడియోకు తీసుకెళ్తూ ఉండేవారని చెప్పారు. 1975లో ఢిల్లీకి వచ్చాక ఆకాశవాణిలో హిందీ, ఇంగ్లిష్ కార్యక్రమాలు నిర్వహించానని వివరించారు. చిన్నప్పుడు తన తల్లిదండ్రులతో కలిసి రేడియోలో హిందీ, ఇంగ్లిష్, సంస్కృత కార్యక్రమాలు విన్నానని తెలిపారు. దేవకి నందన్ పాండే, పమేలా సింగ్, లోతికా రత్నం గొంతులకు తాను అభిమానినని చెప్పారు.



చెరో 47 శాతం!

ట్రంప్, హారిస్ హోరాహోరీ

అట్లాంటా: అమెరికా అధ్యక్ష రేసు అత్యంత హోరాహోరీగా సాగుతోంది. సీఎన్‌ఎన్ వార్తా సంస్థ తాజాగా నిర్వహించిన జాతీయ స్థాయి పోల్‌లో ప్రధాన అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ చెరో 47 శాతంతో సమానంగా నిలిచారు. అంతేగాక అక్టోబర్ 20–23 మధ్య న్యూయార్క్‌టైమ్స్/సియెనా కాలేజీ జరిపిన జాతీయ సర్వేలోనూ వారిద్దరికీ చెరో 48 శాతం దక్కడం విశేషం. ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దడంలో ఎవరు మెరుగనే అంశంపై ఫైనాన్షియల్ టైమ్స్, మిషిగన్ వర్సిటీకి చెందిన రాస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సరిపిన సంయుక్త సర్వేలో మాత్రం ట్రంప్‌ది పైచేయి అయింది. ఆయనకు 44 శాతం, హారిస్‌కు 43 శాతం మంది ఓటర్లు మద్దతు పలికారు. మొత్తమ్మీద చూస్తే మాత్రం ట్రంప్ కంటే హారిస్‌కు 1.7 శాతం మొగ్గున్నట్టు 538 పోల్ ట్రాకర్ విశ్లేషణలో తేలింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గేందుకు 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లలో కనీసం 270 ఓట్లు సాధించాలి.

ఎలక్ట్రికల్ థ్రస్టర్లతో ఉపగ్రహ ప్రయోగం

డిసెంబరులో చేపడతాం: సోమనాథ్

న్యూఢిల్లీ: నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి ఎలక్ట్రికల్ థ్రస్టర్లను వాడనున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎలక్ట్రికల్ ప్రొపెల్లర్లను డిసెంబరులో చేపట్టనున్న టీడీఎస్–01 ఉపగ్రహ ప్రయోగంలో వాడతామని వెల్లడించారు. నాలుగు టన్నుల బరువున్న సంప్రదాయ రాకెట్‌లో 2 నుంచి 2.5 టన్నుల ఇంధనం ఉంటుందని, అదే ఎలక్ట్రికల్ ప్రొపల్షన్‌ను వాడితే 200 కేజీల ఇంధనం సరిపోతుందని తెలిపారు. ఇంధన ట్యాంకు పరిమాణం తగ్గిపోతే.. దానికి అనుగుణంగా అన్నీ తగ్గుతాయని, ఉపగ్రహం రెండు టన్నుల్లోపే ఉంటుందని చెప్పారు. అయితే నాలుగు టన్నుల రాకెట్‌కు సరిపడా శక్తి ఉంటుందని వివరించారు. సాధారణంగా కెమికల్ థ్రస్టర్ల ద్వారా రాకెట్ మండించి ఉపగ్రహాన్ని ప్రయోగిస్తే.. వారం రోజుల్లో నిర్దేశిత కక్ష్యలోకి చేరుకుంటుందని, అయితే ఎలక్ట్రికల్ ప్రొపెల్షన్‌ను వాడితే మూడునెలల సమయం పడుతుందని తెలిపారు.

నవంబర్ 26న పార్లమెంట్ సంయుక్త సమావేశం

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని నవంబర్ 26వ తేదీన పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశం ప్రత్యేకంగా ఉంటుందని అధికారులు తెలిపారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు సమావేశమవుతారన్నారు.

పూర్ పీపుల్.. పూర్ సిగ్నల్స్


ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం చిత్తబట్టలో సిగ్నల్ కోసం వాటర్ ట్యాంక్ ఎక్కిన గ్రామస్తులు

ఏజెన్సీ ఏరియాల్లో ప్రజలకు మొబైల్ కష్టాలు

అందని సిగ్నళ్లు.. పల్లెలకు చేరని ఈ-గవర్నెన్స్

- ఫోన్ వాడాలంటే దగ్గరిలోని కొండలు, గుట్టలు, చెట్లు ఎక్కాల్సిందే..
- సరైన సమాచార వ్యవస్థ లేక సంక్షేమ పథకాలు అందుకునేందుకూ అవస్థలు
- పలుమార్లు అత్యవసర సాయం అందక పోతున్న ప్రాణాలు
- శాటిలైట్ ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలనే సూచనలు

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/నెట్‌వర్క్

ఇంట్లోనే కూర్చుని సమస్త పనులూ మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌తో చక్కబెట్టు కుంటున్న రోజులివి.. స్మార్ట్ ఫోన్ ఉంటే ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోతున్న ఈ సమయంలో.. ఏజెన్సీ ప్రాంతాల వాళ్లు కనీస కమ్యూనికేషన్ కోసం కూడా తండ్లాడుతున్న పరిస్థితి ఉంది. సర్వం చక్కబెట్టు కోవడం, సరుకులు తెప్పించుకోవ డం మాట అటుంచితే.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అత్యవసర సేవలను సైతం అందుకోలేని దుస్థితిలో ఏజెన్సీ ప్రాంతాల వాళ్లు కొట్టు మిట్టాడు తున్నారు. పింఛన్లు, రేషన్ తీసుకునేందుకు కూడా ఫోన్ సిగ్నల్స్, ఇంటర్నెట్ అందే గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. అనారోగ్యంతోనో, ప్రమాదం జరిగో ప్రాణాలమీదకొస్తే సాయం అందడం కూడా ఆలస్యమవుతోంది.

ఇక్కడ ఇప్పటికీ ఇక్కట్లే..

ఎంతో అభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్నప్పటికీ.. ఇప్పటికీ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని పలు మండలాలతో పాటు మహారాష్ట్ర – తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నెట్‌వర్క్ కోసం ఇబ్బంది పడే పరిస్థితులు ఎక్కువగానే ఉన్నాయి. నత్తవేగంతో దూసుకుపోయే బీఎస్‌ఎన్‌ఎల్ ఇక్కడకు రావడానికి సమయం పడుతుండటం, వచ్చినా నిర్వహణ లేకపోవడంతో సేవలు అందట్లేదు. మరోవైపు పెట్టుబడి – రాబడి లెక్కలతో ప్రైవేట్ ఆపరేటర్లు దృష్టి పెట్టడం లేదు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు విషయంలో అర్బన్, రూరల్ కేటగిరీలుగానే ప్రభుత్వ దృక్పథం ఉంది. అలాకాకుండా అటవీ, కొండ ప్రాంతాలతో కూడిన ఏజెన్సీ ప్రాంతాన్ని ప్రత్యేక కేటగిరీగా తీసుకోవాలనే అభిప్రాయం ఎప్పట్నుంచో ఉంది. ఇక్కడి ప్రజలకు మెరుగైన ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ అందించడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలనే డిమాండ్లూ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మెరుగైన సమాచార వ్యవస్థ అందుబాటులోకి తెచ్చేలా వసతుల కల్పన ఖర్చుతో కూడుకున్న అంశంగా భావిస్తే కనీసం శాటిలైట్ ఇంటర్నెట్ సదుపాయం కల్పనకు అడుగులు వేయాలనే సూచనలూ ఉన్నాయి.

శాటిలైట్ ఇంటర్నెట్ అందుబాటులోకి తేవాలి

➤ ప్రస్తుతం పట్నం, పల్లె, ఏజెన్సీ అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో డిష్ టీవీ సౌకర్యం అందుబాటులో ఉంది. అదే తరహాలో టవర్లు ఏర్పాటు చేసి, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి తేవడం కష్టమనిపించిన ప్రదేశాల్లో శాటిలైట్ ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తెస్తే ఇటు మొబైల్ కమ్యూనికేషన్, అటు బ్రాడ్‌బ్యాండ్ కనీస స్థాయిలో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం 2 ఎంబీపీఎస్‌ను బ్రాడ్‌బ్యాండ్‌గా గుర్తిస్తున్నారు. పదేళ్ల క్రితం ఇది 512 కేబీపీఎస్‌గానే ఉండేది. ఇప్పుడు శాటిలైట్ ఇంటర్నెట్‌లో గరిష్ట స్పీడ్ 20 ఎంబీపీఎస్‌కు మించకపోయినా ఏజెన్సీ ప్రజల కనీస అవసరాలకు ఇది సరిపోతుందని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

భద్రాద్రి జిల్లాలోని కారెగట్టు.. మండల కేంద్రమైన పాల్వంచ నుంచి 16 కి.మీ దూరంలో ఉంది. ఈ గ్రామానికి చెందిన కారెం నాగేశ్వరరావు పొలంలో పని చేస్తుండగా పాము కరిచింది. 108కు ఫోన్ చేద్దామని పొలంలో పని చేస్తున్న వారు ప్రయత్నించినా నెట్‌వర్క్ లేకపోవడంతో వీలు కాలేదు. చివరకు బైక్‌పై పాల్వంచ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా విషం శరీరమంతా వ్యాపించడంతో చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతిచెందాడు. సకాలంలో వైద్యసాయం అందితే నాగేశ్వరరావు ప్రాణాలు దక్కేవని ఆయన కుటుంబం ఇప్పటికీ బాధ పడుతోంది.


మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందగోకుల్‌లో సిగ్నల్ లేక ఫించన్ తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు

➤ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెంచికలపేట మండల పరిధిలో మురళిగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, నందిగాం, గుండేపల్లి గ్రామాలకు మొబైల్ సిగ్నల్స్ అందడం లేదు. స్థానికులు ప్రతి నెలా పింఛను కోసం 15 కి.మీ దూరంలో ఉన్న బెజ్జూర్, పెంచికలపేట వెళ్లాల్సి వస్తోంది. హెల్త్ ఎమర్జెన్సీ అవసరమైతే సమీపంలోని కొండ ప్రాంతాలకు చేరుకుని అక్కడి మహారాష్ట్ర సిగ్నల్స్ ద్వారా 108కి సమాచారం ఇస్తున్నారు.


భద్రాద్రి జిల్లా చర్ల మండలం తిప్పాపురంలో మొబైల్ సిగ్నల్స్ లేక పక్క ఊరైన పెద్ద మిడిసిలేరుకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న ఆదివాసీలు

నెట్ కావాలంటే 30 కి.మీ వెళ్లాలి

నేను డిగ్రీ పూర్తి చేశా. ఆన్‌లైన్‌లో చదువుకోవాలంటే ఇక్కడ సిగ్నల్స్ లేక గుండాల లేదంటే ఇల్లెందు వెళ్లాల్సి వస్తోంది. చివరకు ఆధార్ అప్‌డేట్ కోసం కూడా 30 కి.మీ. దూరంలోని మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. పట్టణ ప్రాంతాల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఆర్థిక స్తోమత లేదు. ఉద్యోగ నోటిఫికేషన్ల సమాచారం కూడా సిగ్నల్ లేకపోవడంతో అందదు. ఊరు చివరలోకి వెళ్లి మిత్రుల ద్వారా ఫోన్లో సమాచారం తెలుసుకుంటాం. మా దగ్గర బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నా సరిగ్గా పనిచేయదు.

– సుధాకర్, చెట్టుపల్లి, గుండాల మండలం, భద్రాద్రి జిల్లా



కొడంగల్ నుంచే సర్కారుపై తిరుగుబాటు మొదలైంది

- బీఆర్‌ఎస్‌లో పలువురు కొడంగల్ కాంగ్రెస్ నేతల చేరిక సందర్భంగా కేటీఆర్
- ఫార్మా కంపెనీ ప్రతిపాదనను సీఎం నియోజకవర్గ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని వెల్లడి
- అక్కడి నుంచి కాంగ్రెస్‌ను స్థానికులు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్య


పార్టీలో చేరిన కొడంగల్ నేతలతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు వ్యాఖ్యా నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్.. అధికారంలోకి వచ్చాక కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారని విమర్శించారు. దీంతో స్థానికులు కాంగ్రెస్‌ను తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్‌కు చెందిన కొడంగల్ నియోజకవర్గ మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి, బీఎస్పీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నర్మద శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారితోపాటు కొడంగల్ నియోజకవర్గానికి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు కూడా గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికలను పక్కనపెట్టి కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టును రేవంత్ చేపట్టారు. మొన్నటిదాకా రేవంత్ తిట్టిపోసిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీతోపాటు మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు ఏమిటో అర్థం చేసుకోవాలి. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు వివిధ వర్గాలు చేస్తున్న ధర్నాలు, రాస్తారోకోలతో తెలంగాణ అట్టుడుకుతోంది. కానీ మంత్రులు విహార యాత్రలతో ఎంజాయ్ చేస్తున్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గి కాంగ్రెస్ నేతల ఆదాయం పెరుగుతోంది. కాంగ్రెస్ నేతలు మూటలు నింపుకొనే పనిలో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తరిస్తోంది. స్థానికసంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కొడంగల్‌లో కాంగ్రెస్‌ను మట్టికరిపించాలి' అని పిలుపునిచ్చారు.

పేగులు తెగేదాకా కొట్లాడుతాం..

ప్రస్తుతం తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు కనిపిస్తుండగా ప్రజలపక్షాన బీఆర్‌ఎస్, ప్రత్యర్థిగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సంక్షోభం వైపు పయనిస్తోందని.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్కారు తీరుపై ప్రజలు అగ్గిలా మండుతూ తిరగబడుతున్నారని చెప్పారు. 'పేగులు తెగేదాకా ప్రజల కోసం కొట్లాడి తెలంగాణను అవకాశవాదుల నుంచి కాపాడుకుంటాం. గాంధీ ఆస్పత్రిని గాలికొదిలి సీఎం, మంత్రులు గాల్లో చక్కర్లు కొడుతున్నారు. పత్తికి బోనస్ ఇచ్చే మాట దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కులేక రైతు దళారుల చేతిలో చిత్తవుతున్నాడు. కొర్రీలు పెడుతూ సీసీఐ కొనుగోలు నిలిపివేయగా ప్రభుత్వం పత్తా లేకుండా పోయింది. పత్తి కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి చొరవ లేదు. కాంగ్రెస్ కర్షక ద్రోహి, అది ప్రకటించిన రైతు డిక్లరేషన్ బోగస్' అని కేటీఆర్ మండిపడ్డారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న మేఘా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్. చిత్రంలో పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

స్కిల్స్ యూనివర్సిటీకి 'మేఘా' రూ.200 కోట్లు

- సీఎస్‌ఆర్ కింద భవనాలు నిర్మించేందుకు సుముఖత
- సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ప్రతినిధుల సంప్రదింపులు
- ప్రభుత్వంతో ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భవనాల నిర్మాణానికి మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎస్) సంస్థ ముందుకు వచ్చింది. యూనివర్సిటీ భవన సముదాయం నిర్మాణం కోసం సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచ స్థాయిలో అధునాతన వసతులు ఉండేలా మేఘా సంస్థ యూనివర్సిటీ భవనాలను నిర్మిస్తుంది. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్ రెడ్డితో 'మేఘా'ఎండీ కృష్ణారెడ్డితో పాటు సంస్థ ప్రతినిధుల బృందం సచివాలయంలో సంప్రదింపులు జరిపింది. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. అకడమిక్ బిల్డింగ్, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ భవనాలు నిర్మిస్తామని కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్‌లతో తయారు చేయించిన యూనివర్సిటీ భవన నిర్మాణ నమూనాలను, డిజైన్లను ఈ సమావేశంలో ప్రదర్శించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నవంబర్ 8వ తేదీ నుంచి వర్సిటీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా సంస్థ శనివారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు జరిగాయి. హైదరాబాద్ శివారులోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్ ఇటీవల భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే.

2 నుంచి నాగార్జునసాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం

శ్రీశైలం వెళ్లే లాంచీ



నాగార్జునసాగర్: ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం పునఃప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ శనివారం వెల్లడించింది. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయల్దేరి.. శ్రీశైలానికి సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుంది. మర్నాడు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయల్దేరి నాగార్జునసాగర్‌కు సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుంది. వన్‌వే ప్రయాణా నికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు(వయసు 5–12 ఏళ్లు)రూ.1,600, వెళ్లి రావడానికి (అప్ అండ్ డౌన్) పెద్దలకు రూ.3,000, చిన్న పిల్లలకు రూ.2,400 టికెట్ ధర నిర్ణయించారు. ప్రయాణికులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించనున్నారు. లాంచీ దిగిన తర్వాత రవాణా, రాత్రి బస, వసతికి అయ్యే ఖర్చు ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. డిమాండ్‌ను బట్టి సోమవారం నుంచి శుక్రవారం వరకు ఏ గ్రూప్ అయినా 50 మందికి చార్జి చెల్లిస్తే లాంచీ ట్రిప్ వేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు కూడా వన్‌వే బుకింగ్ ఉందని తెలిపారు. లాంచీ ప్రయాణ వివరాలు, టికెట్ బుకింగ్ సమాచారం తెలుసుకునేందుకు 9848540371, 9848125872 సంప్రదించాలని, www.tgtdc.inవెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

ఆ మూడు ఆలయాలు కోయరాజులు నిర్మించినవే

కేదార్‌నాథ్, బద్రీనాథ్, అమర్‌నాథ్ దేవాలయాలపై సమ్మక్క– సారలమ్మ పరిశోధన కేంద్రం డైరెక్టర్ నర్సింగరావుకోయ

ఎస్ఎస్‌తాడ్వాయి: ఉత్తరకాండములోని మూడో గోట్టుకు సంబంధించిన 36 కోయ రాజ్యాల పూర్వకోటలు, పూర్వ దేవాలయాల మూలాలపై అధ్యయనం చేస్తున్నట్లు సమ్మక్క–సారలమ్మ పరిశోధన కేంద్రం డైరెక్టర్ కాక నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వర రావు తెలిపారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్, అమర్ నాథ్ ఆలయాలు కోయ రాజులు నిర్మించారని వారు వెల్లడించారు. శనివారం ములుగు జిల్లా తాడ్వాయిలో వారు మాట్లాడుతూ పూర్వ దేవాల యాల మూలాలపై అధ్యయనానికి 12 రోజుల క్రితం సమ్మక్క– సారలమ్మ ఆర్కియాలజీ, ఇండిజినస్ పరిశోధన బృందం బయల్దేరిందన్నారు. కేదార్‌నాథ్ గుడి నాడు హిమాలయ పర్వతాల్లోని వాతావరణ పరిస్థితిని అంచనా వేయడానికి నిర్మించిన ఒక శక్తిపీఠం అని వారు పేర్కొన్నారు. కోయ డోలి మౌఖిక సాహిత్యం ఆధారంగా తమ పరిశో ధన బృందం సేకరించిన పూర్వకాల తాళ పత్రాల ఆధారంగా దేశ మూలం కోయ భాషలోనే రాసి ఉందని నిర్ధారణ చేసి చరిత్రలో నిలబెట్టడమే ఈ పరిశోధన కేంద్రం కర్తవ్యమని నర్సింగరావు తెలి పారు. ఈ పరిశోధన బృందం 9 రాష్ట్రాలలో 7 వేల కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు తెలిపారు. ఈ పరిశోధనలో సెంటర్ అడ్వైజర్ సోడే శ్రీరామ్ పాల్గొన్నారు.

వీహెచ్‌ఆర్ పుస్తకం భ్రమలని తొలగిస్తుంది

పుస్తకావిష్కరణలో మీరా కుమార్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మీరాకుమార్. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, డి.రాజా

సాక్షి, న్యూఢిల్లీ: సమాజంలో పేదల ఉద్ధరణపై అనేక భ్రమలు ఉన్నాయని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అన్నారు. ఆ భ్రమలను వీహెచ్‌ఆర్ పుస్తకం తొలగిస్తుందని పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు జీవిత చరిత్రపై సీనియర్ జర్నలిస్టు కృష్ణ కంభంపల్లి రాసిన 'వీహెచ్‌ఆర్–ది ఎక్స్‌ట్రాడిరీ లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ వి.హనుమంతరావు' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగింది. టీపీసీసీ చీఫ్ బొమ్మా మహేశ్ కుమార్ గౌడ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, కొప్పుల రాజు తదితరులతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన మీరా కుమార్ పుస్తకావిష్కరణ చేశారు. హనుమంతరావు పార్టీకి చేసిన సేవలు నిరంతరం యువకులకు స్ఫూర్తినిస్తాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలు వీడియో సందేశం ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మీరా కుమార్ మాట్లాడుతూ.. వీహెచ్ సోదరుడి లాంటివారని కొనియాడారు. కాంగ్రెస్‌కు వీహెచ్ లాంటి నిజాయితీ కలిగిన కార్యకర్త దొరకరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అన్నారు. వీహెచ్ మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి జయాలు, అపజయాలు అన్ని విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయని పేర్కొన్నారు.

అవసరమైన బడులకు కొత్త టీచర్లు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను.. వారు అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధి కారులకు పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఉపాధ్యాయులు చేరిన పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నవాటిని గుర్తించారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను ఉంచి, ఎక్కువమంది ఉంటే.. అవసరమైన పాఠశాలలకు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా మార్పు చేసిన కొత్త ఉపాధ్యాయులు 870 మంది ఉంటారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

చేరికలకు స్వల్ప విరామం మాత్రమే ఇచ్చాం

- కేటీఆర్‌తో రోజూ టచ్‌లో ఉండే ఎమ్మెల్యేలే సంప్రదిస్తున్నారు
- బీఆర్‌ఎస్ పెద్ద నేతల అరెస్టులు ఉండవచ్చు
- మంత్రివర్గ విస్తరణ సీఎం, ఏఐసీసీ పరిధిలోని విషయం
- మీడియా చిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



రాహుల్‌తో సమావేశమైన మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్‌కు చెందిన చాలా మంది ఎమ్మెల్యేలు ఇప్పటికీ తమకు టచ్‌లో ఉన్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రతిరోజూ తమతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో త్వరలో చేరికలు పునః ప్రారంభం అవుతాయని ప్రకటించారు. తమ ప్రభుత్వం కూలిపోతుందని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యలు చేయడం వల్లనే తాము బీఆర్‌ఎస్ నేతలను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్ శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్ చేశారు.

స్వల్ప విరామం అంతే..

కాంగ్రెస్ పార్టీలో చేరికలకు కేవలం స్వల్ప విరామం ఇచ్చామని మహేశ్‌గౌడ్ తెలిపారు. అయితే చేరికల నేపథ్యంలో పాత, కొత్త వారి మధ్య కొన్ని ఇబ్బందులు కూడా వస్తున్నాయని అన్నారు. కేటీఆర్‌తో రోజూ టచ్‌లో ఉండే ఎమ్మెల్యేలు కూడా పార్టీలోకి వస్తామంటూ ప్రతిరోజూ సంప్రదింపులు జరుపుతున్నారని మహేశ్‌గౌడ్ చెప్పారు.

త్వరలో కొత్త కమిటీలు

అధిష్టానం కొత్త కమిటీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని మహేశ్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ కోసం పని చేసేవారు, కష్టపడే వారికి మాత్రమే అవకాశాలు ఉంటాయన్నారు. సమర్థులకు జిల్లా అధ్యక్షులుగా అవకాశం ఇస్తామన్నారు. మంత్రి కొండా సురేఖ.. అక్కినేని నాగార్జున, నటి సమంతలపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ తప్పేనని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలను తమ పార్టీ, అధిష్టానం సహించదన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు!

'మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏం బాంబు పేల్చుతారో.. నేనూ చూస్తున్నా'అని మహేశ్ గౌడ్ అన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చాలా మంది అధికారులు అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. తనకు తెలిసి అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు ఉండవచ్చని అనుకుంటున్నానన్నారు. కాగా, బీఆర్‌ఎస్‌లోని పెద్ద నేతల అరెస్టులు ఉంటాయా? అని మీడియా ప్రశ్నించగా.. 'ఏమో అవి కూడా ఉండొచ్చు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు అయినా గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడ్డవారిపై చర్యలు ఏవీ అంటూ అందరూ ప్రశ్నిస్తున్నారు. నేను కూడా పెద్ద తలకాయల అరెస్టులు జరిగితే బాగుండు'అని అనుకుంటున్నా అని మహేశ్‌గౌడ్ అన్నారు.

కేటీఆర్ పదేళ్లు ఉన్నా తప్పలేదు

కేటీఆర్ చేసిన తప్పులకు ఆయన రెండు, మూడేళ్లు కాదు.. పదేళ్లు జైలులో ఉన్నా తప్పు లేదని మహేశ్‌గౌడ్ అన్నారు. కమీషన్ల కోసమే వాళ్లు కాళేశ్వరం నిర్మించారని విమర్శించారు. అన్యా యంగా ఎవరిపైనా కేసులు పెట్టేది లేదని స్ప ష్టం చేశారు. గత పదేళ్లలో రైతులకు కేసీఆర్ చేసిన రుణ మాఫీ కంటే తామే ఎక్కువ రుణ మాఫీ చేశామన్నారు. హైడ్రా, మూసీ విషయంలో బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. జీవో 29 ప్రకారం గ్రూప్–1 అభ్యర్థులకు ఏవిధమైన అన్యాయం జరగదన్నారు. రాష్ట్రంలో కులగణనపై రాహుల్‌గాంధీ చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. కాగా, మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, సీఎం ప రిధిలో ఉన్న అంశం అని మహేశ్‌గౌడ్ చెప్పారు.



కొండపల్లి బొమ్మలకు..
నగరానికి చెందిన 23 ఏళ్ల అభినవ్ సాయి తన సృజనాత్మకత చాటుతున్నాడు. అధునాతన హంగులతో కొండపల్లి బొమ్మలకు ప్రాణం పోస్తున్నాడు. - సిటీప్లస్‌లో



తెలంగాణ శివకాశి సనత్‌నగర్
బాణాసంచా అమ్మకాల్లో తెలంగాణ శివకాశిగా పేరున్న సనత్‌నగర్‌లో కొనుగోలుదారుల సందడి మొదలైంది. హోల్‌సేల్, రిటైల్ టపాసుల అమ్మకాలు సాగనున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/19.0
నగరంలో ఆదివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగ మంచు కురుస్తుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







క్రాకర్స్ కోసం..

దీపావళి అనగానే మొదట గుర్తుకు వచ్చేది టపాసులు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా బాణాసంచా కాలుస్తూ ఆనందంలో మునిగి తేలుతుంటారు. ప్రస్తుతం నగరంలోని టపాసుల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆబాల గోపాలం క్రాకర్స్ వైపు ఆకర్షితులవుతున్నారు. శనివారం బేగంబజార్‌లోని ఓ బాణాసంచా దుకాణం ఎదుట వినియోగదారులు క్యూ కట్టిన దృశ్యం కనిపించింది.

రెండో దశ మెట్రోకు | గ్రీన్ సిగ్నల్

ఆమోదించిన కేబినెట్
- కేంద్రం అనుమతిస్తే పనులకు పచ్చజెండా

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు రెండో దశపై మరో అడుగు పడింది. దీనికి శనివారం రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఇక కేంద్రం నుంచి అనుమతి లభించడమే తరువాయి కానుంది. కేంద్రం కూడా ఈ ప్రాజెక్టును ఆమోదించి నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.24 వేల కోట్లకు పైగా నిధులతో చేపట్టనున్న రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్రాల అనుమతితో పాటు సకాలంలో నిధులు లభిస్తే నిర్ణీత గడువులోగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రైలు పరుగులు పెట్టనుందని అధికారులు తెలిపారు. ఫోర్త్ సిటీతో కలిపి మొత్తం ఆరు కారిడార్‌లలో 116.2 కిలోమీటర్ల మెట్రో రెండో దశకు ఇటీవల హైదరాబాద్ మెట్రో రైల్ డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి అందజేసిన సంగతి తెలిసిందే.

భూగర్భంలో మెట్రో రైలు

నాగోలు నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 36 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న నాలుగో కారిడార్ ఎల్‌బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, కొత్త హైకోర్టు మీదుగా శంషాబాద్ జంక్షన్ నుంచి జాతీయ హైవే మార్గంలో సాగుతుంది. ప్రస్తుతం ఉన్న రాయదుర్గం నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ కారిడార్లు ఎయిర్‌పోర్టు మార్గంలో నాగోలు, ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్ట స్టేషన్ల వద్ద అనుసంధానమవుతాయి. మొత్తం 36.6 కిలోమీటర్ల ఎయిర్‌పోర్ట్ మెట్రో రూట్‌లో 35 కిలోమీటర్లు ఎలివేట్ చేయనున్నారు. 1.6 కిలోమీటర్‌ల వరకు మెట్రోలైన్ భూగర్భంలో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్టుస్టేషన్ కూడా భూగర్భంలోనే ఉంటుంది. అలాగే రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు కొత్తగా నిర్మించనున్నారు. ఇది బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్‌గూడ జంన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ వరకు (బ్లూ లైన్ పొడిగింపుగా) ఉంటుంది. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. ఈ 11.6 కిలోమీటర్ల మార్గంలో సుమారు 8 స్టేషన్లను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

పాతబస్తీ మెట్రో చాంద్రాయణగుట్ట వరకు....

జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న గ్రీన్‌లైన్ పొడిగింపుగా ఆరో కారిడార్‌ను విస్తరించనున్నారు. గతంలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించిన ఈ మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇది ఎంజీబీఎస్ నుంచి ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు ఉంటుంది.

ముందస్తు అవగాహనతో | కేన్సర్‌ను జయించవచ్చు

మంత్రి దామోదర రాజనర్సింహ

నాంపల్లి: కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్య చికిత్స చేస్తే త్వరితగతిన నయమవుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ వ్యాధిపై సరైన అవగాహన లేకనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, క్రమశిక్షణ లేని జీవన విధానం సహా అనేక కారణాలు ఈ వ్యాధి ప్రబలడానికి కారణాలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో లుంబినీ పార్కు నుంచి రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వరకు రొమ్ము కేన్సర్‌పై చేపట్టిన అవగాహన వాక్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. అనంతరం ఎంఎన్‌జేలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. దేశంలో ఏటా సుమారు 14 నుంచి 15 లక్షలు, తెలంగాణలో 50 నుంచి 60 వేల కేన్సర్ కేసులు నమోదవుతున్నట్లు వివరించారు. సరైన అవగాహన, క్రమశిక్షణ కలిగిన జీవన విధానంతోనే కేన్సర్‌ను జయించవచ్చని పేర్కొన్నారు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము కేన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. దీనిపై అవగాహన కల్పించి స్క్రీనింగ్ చేస్తే ఎర్లీ స్టేజ్‌లో రోగ నిర్ధారణ చేయవచ్చని చెప్పారు. ఏడాదికి ఒకసారైనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా స్క్రీనింగ్ ట్రీట్‌మెంట్ అందిస్తోందని తెలిపారు. ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎంఎన్‌జే ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు.



కేన్సర్ అవగాహన వాక్‌లో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఏ రైలు ఎప్పుడొచ్చేనో!

ఎంఎంటీఎస్ సర్వీసుల్లో కొరవడిన సమయపాలన

స్టేషన్‌లలో మౌలిక సదుపాయాల కొరత
- వచ్చే నెలలోనే చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం
- ఇప్పటికీ పట్టాలెక్కని ఎంఎంటీఎస్ కనెక్టివిటీ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–లింగంపల్లి ఎంఎంటీఎస్ ట్రైన్. మధ్యాహ్నం 12.50 గంటలకు బయలు దేరాలి. ప్రయాణికులంతా ట్రైన్‌లోకి ఎక్కి కూర్చున్నారు. కానీ గంటలు గడిచినా ట్రైన్ కదల్లేదు, చివరకు ఆ సర్వీసును రద్దు చేసినట్లు తెలిసి ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ట్రైన్ బయలుదేరింది. అప్పటి వరకు ప్రయాణికులంతా మేడ్చల్‌లోనే పడిగాపులు కాశారు. కొద్ది రోజుల క్రితం చోటుచేసుకున్న ఈ ఆకస్మిక రద్దుపై ప్రయాణికుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇలా ఒక్క మేడ్చల్– లింగంపల్లి సర్వీసు మాత్రమే కాదు. నగరంలోని వివిధ మార్గాల్లో ఎంఎంటీఎస్ రైళ్లు ఏ క్షణంలో ఎందుకు రద్దవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఆకస్మికంగా రద్దు చేయడంతో ఎంఎంటీఎస్‌పై ప్రయాణికుల్లో నమ్మకం కొరవడింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ సభ్యుల సమావేశంలోనూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించడం గమనార్హం. గతంలో ప్రతి రోజు 121 సర్వీసులు నడిచేవి. రోజుకు 1.5 లక్షల మంది ప్రయాణం చేసేవారు. ఇప్పుడు 10 రైళ్లు మాత్రమే రోజుకు 40 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. కేవలం ఎంఎంటీఎస్ సర్వీసులపై గ్యారంటీ లేకపోవడంతోనే ప్రయాణికులు వెనుకంజ వేస్తున్నారని జంట నగరాల సబర్బన్ ప్రయాణికుల సంఘం ప్రతినిధి నూర్ విస్మయం వ్యక్తం చేశారు.

ఒక్క ట్రైన్‌కు 4 సర్వీసులు రద్దు..

ఒక్క ట్రైన్ ఎంపిక చేసిన రూట్‌లో రోజుకు 4 నుంచి 6 ట్రిప్పులు తిరుగుతుంది. ఏ రూట్‌లో అయినా సరే అలాంటి ట్రైన్ ఒకటి రద్దయితే నాలుగు ట్రిప్పుల సర్వీసులు నిలిచిపోయినట్లే. ప్రస్తుతం నగరంలో ఎంఎంటీఎస్ రూట్‌లు పెరిగాయి. గతంలో లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు నడిచేవి. ఇప్పుడు ఉందానగర్ వరకు పొడిగించారు. మేడ్చల్ నుంచి నేరుగా ఉందానగర్ వరకు ఎంఎంటీఎస్‌లు ప్రవేశపెట్టారు. లింగంపల్లి నుంచి నేరుగా మేడ్చల్ వరకు ప్రయాణం చేయవచ్చు. గతంలో లింగంపల్లి వరకు ఉన్న మార్గాన్ని రామచంద్రాపురం వరకు పొడిగించారు. ఇలా అన్ని రూట్‌లలో రెండోదశ కింద లైన్‌ల విస్తరణ జరిగినప్పటికీ రైళ్లు మాత్రం అందుబాటులో లేవు. మరోవైపు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే బేగంపేట్, లింగంపల్లి, హైటెక్ సిటీ వంటి కొన్ని స్టేషన్‌లలోనే ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు ఉన్నాయి. కానీ నగర శివార్లలోని ఎంఎంటీఎస్ స్టేషన్‌లలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కూడా లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

చర్లపల్లికి చేరేదెలా..

వచ్చే నెల నవంబర్‌లో చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. కానీ.. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు సరైన బస్సు, రైలు సదుపాయాలు లేవు. ఇప్పటి వరకు రోడ్డు కనెక్టివిటీ పూర్తికాకపోవడం వల్ల సిటీ బస్సులపైన నమ్మకం లేదు. ప్రస్తుతం ఘట్కేసర్ నుంచి లింగంపల్లికి రోజుకు రెండు ట్రిప్పులు ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి చొప్పున మాత్రమే ఉన్నాయి. చర్లపల్లి నుంచి ప్రతి రోజు 25 జతల రైళ్లు నడపాలని దక్షిణమధ్య రైల్వే ప్రణాళికలను రూపొందించింది. దీంతో ప్రతి రోజు సుమారు 50 వేల మంది రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఘట్కేసర్–లింగంపల్లి మధ్య మరిన్ని సర్వీసులను పెంచడంతో పాటు, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి,తదితర ప్రధాన స్టేషన్‌ల నుంచి కూడా ప్రయాణికులు చర్లపల్లికి చేరుకొనేలా ఎంఎంటీఎస్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ దిశగా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

టైమ్ టేబుల్ ప్రకారం రైళ్లు నడపాలి



కొద్ది రోజుల క్రితం హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్‌లతో సమావేశం జరిగింది. ఆ సందర్భంగా రైళ్ల వేళలపై టైమ్ టేబుల్‌ను రూపొందించి అధికారులకు అందజేశాం. అందులో పేర్కొన్నవిధంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు రైళ్లు నడిపితే బాగుంటుంది. – నూర్, సబర్బన్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి



కోవిడ్‌కు ముందు ప్రతిరోజూ 121 సర్వీసులు తిరిగాయి. కోవిడ్ కాలంలో రైళ్లను నిలిపివేశారు. ఇప్పటి వరకు పూర్తిగా పునరుద్ధరించలేదు. ట్రిప్పులు పెంచకుండా ప్రయాణికుల డిమాండ్‌లను తీర్చడం సాధ్యం కాదు. – సుధ, మల్కాజిగిరి

మెప్మా అడిషనల్ డైరెక్టర్‌గా సత్యనారాయణ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కార్యదర్శిగా, విద్యుత్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. సత్యనారాయణ మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి నలుగురిని జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. మెదక్ మున్సిపల్ కమిషనర్ ఎస్వీ జానకిరామ్, ఖమ్మం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సైఫుల్లా, భూత్పూర్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, నల్గొండ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.కరుణాకర్‌లను జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. వీరిలో కరుణాకర్‌ను జీహెచ్‌ఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. మిగతా వారిని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆయా పోస్టుల్లో నియమమించనున్నారు. ఇప్పటికే లెక్కకు మిక్కిలి ఉద్యోగులున్న జీహెచ్‌ఎంసీకి మరికొందరిని పంపించడం వల్ల జీహెచ్‌ఎంసీకి అదనపు భారమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి: మేయర్

లక్డీకాపూల్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాలికల జీవితాలపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బాల్య వివాహం చేసుకున్నవారితో పాటు వీటికి మద్దతు తెలిపిన వారు, పాల్గొన్నవారు శిక్షార్హులవుతారని చెప్పారు. బాల్య వివాహంతో పేదరికం, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు పెరుగుతాయన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.



నాలా సేఫ్టీ.. ఏదీ?

ఏటా ప్రమాదాలు షరామామూలు
- ప్రకటనల్లోనే పకడ్బందీ చర్యలు
- ఇటీవల చాక్నవాడిలో కూలిన నాలా పైకప్పు
- యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమని ప్రజల ఆరోపణలు



చాక్నవాడిలో ఇటీవల కుప్పకూలిన నాలా పైకప్పు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలాల ప్రమాదాలు వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ ప్రకటిస్తున్నప్పటికీ ప్రతియేటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల గోషామహల్ నియోజకవర్గంలోని చాక్నవాడిలో నాలా పైకప్పు కూలింది. ఈ ఘటన తెల్లవారుజామున జరగడంతో ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. ఇదే నాలా పైకప్పు రెండేళ్ల క్రితం కూలింది.. దీనికి సమీపంలోనే మళ్లీ కూలడంతో అధికారుల అశ్రద్ధే అందుకు కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

మొక్కుబడిగా ఆడిట్..

నాలాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతియేటా నాలా సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. అందుకు ప్రైవేటు ఏజెన్సీలను నియమిస్తున్నారు. ఆడిట్‌లో వెల్లడయ్యే లోపాలను సరిదిద్దే బాధ్యత సంబంధిత ఇంజినీర్లకు అప్పగించారు. అన్ని సర్కిళ్లలో నాలాలను స్కెచ్‌లుగా విభజించి ఒక్కో ఇంజినీర్‌కు ఒక్కో స్కెచ్ బాధ్యత అప్పగించారు. ఆ స్కెచ్‌లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా సంబంధిత ఇంజినీర్‌ను బాధ్యుడిగా చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కానీ.. ప్రాణాలు పోయిన ఘటనల్లోనూ ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

కాగితాల్లోనే నిబంధనలు..

- నాలా సేఫ్టీ చర్యల్లో భాగంగా ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో నాలా ఉన్నంత దూరం నడుచుకుంటూ వెళ్లి పరిశీలించాలి. ఎక్కడా కూడా ప్రజలు నాలాల్లో పడిపోయే పరిస్థితులు ఉండకుండా భద్రత ఏర్పాట్లు చేయాలి. వెడల్పు ఎక్కువగా ఉన్న ఓపెన్ నాలాలకు అంతటా ఫెన్సింగ్ ఉండాలి. పైకప్పులున్న నాలాల్లో ఎక్కడైనా కప్పులు దెబ్బతిన్నా, ఓపెన్‌గా ఉన్నా గుర్తించాలి. మరమ్మతులు చేయడమో, కొత్తగా నిర్మించడమో చేయాలి. అవసరమైన ఇతరత్రా చర్యలు చేపట్టాలి. ఇలా.. ఇంకా పలు నిబంధనలైతే ఉన్నాయి కానీ అన్ని ప్రాంతాల్లోని ఇంజినీర్లు వీటిని పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులున్నాయి.
- చాక్నవాడిలో నాలా పైకప్పు కూలడంతో అధికారులు పట్టించుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని స్థానికులు భావిస్తున్నారు. అంతే కాదు.. ఆ నాలాపై గతంలోనూ ఓసారి పైకప్పు కూలినందున.. ఆ ప్రాంతంతో పాటు దానికి రెండువైపులా కొత్త కప్పును నిర్మిస్తే ఈ ఘటనకు తావుండేది కాదంటున్నారు. నాలాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన పనులు చేయాలనే ఆదేశాలున్నా ఇంజినీర్లు అశ్రద్ధ చూపడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. నాలాల రక్షణ చర్యల పేరిట, పూడికతీత పేరిట జీహెచ్‌ఎంసీ ఏటా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నప్పటికీ, అధికారుల అశ్రద్ధ వల్ల ప్రమాదాలు తప్పడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దెకు తీసుకున్న ఇంటిని అనుమతి లేకుండా కూల్చారు

పోలీసులకు మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి ఫిర్యాదు

బంజారాహిల్స్: తన ఇంటిని అద్దెకు తీసుకున్న వ్యక్తులు తన నోటీసులో లేకుండానే, జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకోకుండానే ఇంటిని కూల్చివేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్‌–62లో ప్లాట్‌నెంబర్ 1250 పేరుతో జేసీ దివాకర్‌రెడ్డి ఇల్లు ఉంది. ఈ ఇంటిని మూడేళ్ల అద్దె ఒప్పందం మేరకు 2020 జూన్ 15వ తేదీన సాహితీ ఇన్‌ఫ్రా అధినేత భూదాటి లక్ష్మీనారాయణకు అద్దెకు ఇచ్చారు. 2023 జూన్ 15వ తేదీన ఈ ఒప్పందం ముగిసింది. అయితే జేసీ దివాకర్‌రెడ్డి సంతకాలు ఫోర్జరీ చేసి భూదాటి లక్ష్మీనారాయణ, ఆయన కొడుకు సాత్విక్‌లు కలిసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టులో తప్పుడు రెంటల్ అగ్రిమెంట్ పిటిషన్ వేశారు. ఇందులో మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను తెరిచారు. ఈ నెల 18వ తేదీన జేసీ దివాకర్‌రెడ్డి తన మేనేజర్ జగదీష్‌యాదవ్‌తో కలిసి ఇంటిని సందర్శించారు. తన ఇల్లు కూల్చివేసి ఉండడం గమనించి ఆయన షాక్‌కు గురయ్యారు. అక్కడే ఉన్న రాజీవ్ సోలోమన్ అనే వ్యక్తితో పాటు మరికొందరు జేసీ దివాకర్‌రెడ్డిని, ఆయన మేనేజర్‌ను బెదిరిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. 'ఈ ఇంటిని నా ఇష్టమొచ్చినట్లు కూల్చుకుంటాను, మీకు అద్దె కూడా ఇవ్వను..ఏమి చేసుకుంటావో చేసుకో' అంటూ జేసీకి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో జేసీ మేనేజర్ అక్కడ ఫోటోలు తీసుకుంటుండగా రాజీవ్‌తో పాటు ఆయన అనుచరులు అడ్డుకుని దుర్భాషలాడుతూ దాడి చేశాడు. రాజీవ్ తన ఇంటిని అక్రమంగా కూల్చివేశాడని, టౌన్‌ప్లానింగ్ అనుమతులు కూడా లేవని, ఇందులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజీవ్ సోలోమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఈ ఘటనపై బీఎన్ఎస్ సెక్షన్ 329, 351(2), 324 (2), రెడ్ విత్ 3 (5) కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీ కారిడార్‌లో బైక్ రేస్

40 బైక్‌లు సీజ్..40 మందిపై ఐదు కేసులు నమోదు



నాలెడ్జి సిటీలో రేసింగ్‌కు ఉపయోగించిన బైక్‌లు ఇవే

గచ్చిబౌలి: బిగ్గరగా అరుస్తూ..వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ బైక్‌రేసింగ్‌కు పాల్పడిన 40 మందిపై రాయదుర్గం పోలీసులు కేసులు నమోదు చేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. ప్రమాదకర స్థితిలో బైక్‌లతో స్టంట్లు చేస్తూ నాలెడ్జి సిటీలోని టి–హబ్ జంక్షన్‌లో కేకలు వేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో బైక్ రేస్‌కు పాల్పడిన యువకులు వేర్వేరు రోడ్లలో పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. 40 మందిపై ఐదు కేసులు నమోదు చేసి 40 బైక్‌లను సీజ్ చేశామని, వాటిని ఆర్టీఏ అధికారులకు అప్పగిస్తామని వెల్లడించారు. స్టంట్లు చేసే వారితో పాటు అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. రేసింగ్‌కు పాల్పడుతున్న పిల్లలను తల్లిదండ్రులు కట్టడి చేయాలని డీసీపీ సూచించారు. రేసింగ్‌లకు ఎలాంటి అనుమతులు లేవని, ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు: మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ కార్గో హోండెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. తమ ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు లాజిస్టిక్స్ (కార్గో) సేవలను మరింత విస్తరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందులో భాగంగానే నగరంలో వేగవంతమైన సేవలను అందించేందుకు హోం డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం (ఈ నెల 27) నుంచి నగరంలోని 31 ప్రాంతాల్లో హోం డెలివరీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల నుంచి హైదరాబాద్‌లో ఎక్కడికైనా హోం డెలివరీ చేయవచ్చని మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో ఇంటి నుంచి ఇంటి వరకు సేవలు అందించేలా లాజిస్టిక్స్ విభాగాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రజలందరూ హోం డెలివరీ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. పార్శిళ్ల హోం డెలివరీ చార్జీలు ఇలా ఉన్నాయి. – 0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50, 1.01 నుంచి 5 కేజీలకు రూ.60. 5.01 నుంచి 10 కేజీలకు రూ.65. 10.1 నుంచి 20 కేజీలకు రూ.70. 20.1 నుంచి 30 కేజీలకు రూ.75. 30.1 కేజీలు దాటితే.. పైన పేర్కొన్న స్లాబ్‌ల ఆధారంగా చార్జీలు ఉంటాయి.

పనిచేసే సంస్థకే కన్నం

దాదాపు రూ.1.40 కోట్ల మోసానికి పాల్పడిన ఉద్యోగి

బంజారాహిల్స్: నమ్మకంగా పనిచేస్తూ పనిచేసే సంస్థకే ఉద్యోగి దాదాపు రూ.1.40 కోట్ల మోసానికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏషియన్ ముక్తా ఏ2 సినిమాస్‌లో దాదాపు ఏడున్నర ఏళ్లుగా విశ్వనాథ్‌రెడ్డి అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అదే సంస్థలో అతని భార్య సఫియా నజీర్ మేనేజర్‌గా పనిచేస్తుంది. ఈ నెల 18న ఏషియన్ ముక్తా సంస్థలో అంతర్గతంగా నిర్వహించిన ఆడిటింగ్‌లో భాగంగా విశ్వనాథ్‌రెడ్డి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేసినట్లు గుర్తించారు. నకిలీ బ్యాంక్ ఖాతాలు సృష్టించి సంస్థ రూ.1,47,08,928 నిధులను తన భార్య, సోదరుడు రాసిం రాజశేఖర్, స్నేహితుడు శశాంక్ పేరుతో ఉన్న ఖాతాల్లోకి మళ్లించినట్లు గుర్తించారు. హిందుస్థాన్ కోకోకోలా బేవరేజస్, సాయి సైన్ ఎంటర్‌ప్రైజెస్‌ల పేర్లతో మొత్తం నాలుగు ఖాతాల్లోకి ఈ మొత్తం డబ్బును మళ్లించినట్లు గుర్తించారు. ఆడిటింగ్‌లో భాగంగా ఈ నిధుల గోల్‌మాల్ పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు ఏషియన్ ముక్తా ఏ2 సినిమాస్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ సునీల్ నారంగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ 316 (4), 318 (4), 335, 336 (3), 338, రెడ్ విత్ 3(5)ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ పోస్తుండగా నిప్పుపెట్టిన ఆకతాయి

తప్పిన పెనుప్రమాదం..

మల్లాపూర్: మల్లాపూర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోస్తుండగా ఓ ఆకతాయి నిప్పు అంటించిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సిబ్బంది అప్రమత్తమై మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, ఎస్‌ఐ మైబెలి తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ ఓల్డ్ మీర్‌పేట్‌కు చందన్‌కుమార్ (19) తన స్నేహితులతో కలిసి యాక్టివా ద్విచక్రవాహనంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి వచ్చారు. అదే సమయంలో సిబ్బంది వేరే కస్టమర్‌కు బాటిల్‌లో పెట్రోల్ పోస్తుండగా చందన్‌కుమార్ సడన్‌గా జేబులోంచి లైటర్ తీసి వెలిగించాడు. 'అంటించమంటారా..' అంటూ పెట్రోలు నింపుతున్న సిబ్బంది దగ్గరకు వచ్చి అంటించాడు. దీంతో గన్‌కు మంటలు అంటుకున్నాయి. తీవ్ర భయాందోళనకు గురైన సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఫైర్ ఫోమ్‌తో మంటలు ఆర్పివేశారు. దీంతో పెట్రోల్ బంక్‌లో ఉన్నవారందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా..చందన్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




పెట్రోల్ బంక్‌లో చెలరేగిన మంటలు

రూ.2 లక్షల విలువైన హాష్ ఆయిల్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారిన ఇద్దరు స్నేహితులు చివరకు విక్రేతలుగా మారి పోలీసులకు పట్టుబడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ప్రేమ్ ఉపాధ్యాయ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పులిపాక అషుతోష్ ట్యాటూ ఆర్టిస్టు. ఇద్దరు మంచి స్నేహితులు. వీరిద్దరూ గతంలో గంజాయి అమ్మకాల కేసుల్లో నిందితులు. వీరు ఇటీవల గంజాయికి బదులు హాష్ అయిల్, ఓజీ గంజాయి (మామూలు గంజాయి కంటే పదిరెట్లు అధిక పవర్ కలిగిన విదేశీ గంజాయి)కి అలవాటు పడ్డారు. చివరకు విక్రేతలుగా మారారు. వీరికి బెంగళూరు నుంచి షేక్ హుస్సేన్ (బిట్టు) అనే వ్యక్తి హాష్, ఓజీ గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఒక గ్రాముకు రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేసి రూ.2500 నుంచి రూ.3000 లకు గ్రాము చొప్పున అమ్మకాలు సాగిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసుల విచారణలో వెల్లడైంది. పక్కా సమాచారం మేరకు గచ్చిబౌలి సమీపంలో ఎస్‌టీఎఫ్ టీమ్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. 285 గ్రాముల హాష్ ఆయిల్, 20 గ్రాముల ఓజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుల నుంచి 4 సెల్‌ఫోన్లు, 2 బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన సరఫరాదారు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

డీసీఎం ఢీకొని ఒకరు మృతి



అనంతయ్య (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: పొట్టకూటి కోసం నగరానికి వలస వచ్చిన ఇద్దరు వ్యక్తులను డీసీఎం వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా..మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సత్యకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన బిజ్జారం అనంతయ్యగౌడ్ (52), లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన కోవాకుల అంజయ్య (52)లు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఇద్దరు కలిసి సైకిల్‌పై కాటేదాన్ ఆటోస్టాండ్ నుంచి బయలుదేరగా హర్యానాకు చెందిన డీసీఎం లోడు వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనంతయ్య గౌడ్ మృతి చెందాడు. అంజయ్య పరిస్థితి విషమంగా ఉంది. కాగా స్థానికులు డ్రైవర్‌ను చితకబాదగా పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'డిజిటల్ అరెస్టు' మోసగాడి పట్టివేత

రాయదుర్గం: 'డిజిటల్ అరెస్ట్' కేసులో మోసగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ కె రామిరెడ్డి నేతృత్వంలో పుణేలో ఈ మేరకు నిందితుడు కపిల్‌కుమార్ (42)ను అరెస్ట్ చేశారు. ఇతను 40 ఏళ్ల మహిళను లక్ష్యంగా చేసుకొని డిజిటల్ అరెస్ట్ మోసానికి పాల్పడ్డాడు. బాధితురాలికి ఆమె పేరుతో ఉన్న సమస్యకు సంబంధించి ఢిల్లీ హైకోర్టునుంచి ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. ఫోన్ లిఫ్ట్ చేసిన మహిళను మీ బ్యాంకు ఖాతా ద్వారా మోసపూరిత కార్యకలాపాలు, మనీ లాండరింగ్ లావాదేవీలు జరిగాయని పేర్కొన్న నిందితులు డిజిటల్ అరెస్టు పేరుతో ఆమెను 24 గంటలపాటు భయపెట్టారు. అనంతరం భారీ మొత్తం నగదును బదిలీ చేయించుకున్నారు. ఈ కేసులో ఈ కేసులో ఏ1గా కింగ్‌శుక్ శుక్లా, ఏ2గా కపిల్‌కుమార్ ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఏలో ప్రో కబడ్డీ లీగ్ స్టార్‌ల సందడి

సాక్షి, సిటీబ్యూరో: ఎస్‌ఎఫ్ఏ చాంపియన్‌షిప్‌– 2024 ఎడిషన్‌లో భాగంగా 12వ రోజు పోటీలను తమిళ తలైవాస్‌కు చెందిన ప్రో కబడ్డీ లీగ్ స్టార్స్ నరేందర్ కండోలా, సచిన్ తన్వర్, బెంగళూరు బుల్స్‌కు చెందిన అజింక్యా సందర్శించారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో శనివారం జరిగిన పోటీలను ప్రో కబడ్డీ లీగ్ స్టార్స్ తిలకించి క్రీడాకారులకు ప్రోత్సహించారు. విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్ (నిజాంపేట) జట్టు అండర్‌–14 బాలుర కబడ్డీ ఫైనల్లో రెయిన్‌బో స్కూల్ (చింతల్)పై స్ఫూర్తిదాయకమైన విజయం సాధించింది. గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయం జట్టు అండర్‌– 14 బాలికల ఫైనల్‌లో స్వర్ణం సాధించింది. మరోవైపు గచ్చిబౌలి స్టేడియంలో బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. అండర్‌–16 బాలికల వాలీబాల్ టైటిల్‌ను శేరిలింగంపల్లి కార్నర్ స్టోన్ స్కూల్ గెలుచుకుంది. అండర్‌–16, అండర్‌–18 బాలుర వాలీబాల్ ఫైనల్స్‌లో మేడ్చల్ విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్, గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయం విజేతలుగా నిలిచాయి. ఫుట్‌బాల్‌లో ఖాజాగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు అండర్ –16, అండర్ –18 బాలుర విభాగాల్లో స్వర్ణాన్ని గెలుచుకుని ఆధిపత్యాన్ని చాటుకుంది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE WANTED

■ మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న Omni maruthi Van కొనుటకు కావలెను బ్రోకర్స్ సంప్రదించవద్దు. Ph: 9014094488 [SCA24000513]

Real Estate

■ SVS బిల్డింగ్ & కన్‌స్ట్రక్షన్ కస్టమర్ చాయస్‌తో 100% వాస్తుతో హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. (SFT 1600). Ph: 8142364118 [SCA-24000493]

■ గుంటూరు సిటీలో గోరంట్ల, లాం, JKC రోడ్, ఇన్నర్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ, మంగళగిరి, తాడికొండ రాజధానిలోని ప్లాట్లు అమ్ముదలచినవారు సంప్రదించండి. 9948779955 [G-9386]

FLAT FOR SALE

■ అమ్మడానికి ఫ్లాట్ ఆసిఫ్ నగర్ వద్ద 3వ అంతస్తులో 2BHK ఫ్లాట్, గాంధీ విగ్రహం ఎదురుగా, లిఫ్ట్ & కార్ పార్కింగ్ సౌకర్యం. ఫోన్: 9849261602 [HA-98806]

■ Bumper Festival offer-2/3 BHK HMDA RERA Flats in Kuntloor near Hayathnagar. Possession in 6 months. 9440632043 [SCA24000376]

HOUSE FOR SALE

■ హయత్‌నగర్, మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 చ॥గ॥ S/F 1600 SFT కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. త్రాగునీరు, డ్రైనేజి కూడా కలదు. కేవలం 95L. 9849688626 [HA-2949]

■ ECIL, Kapra, Saket indp luxury new house Gated comm 120 sqyds G+2 Rs.1.78 Cr. Rents 40k. Kukatpally, Pragati Nagar Flats 2 BHK 52L, 3BHK 69L, Occup 3yrs. Ph: 7416613247 [HA-14740]

■ 168 Sq.yds G+1, W/F, Independent House, Ananthaveni Nagar, Cricket Ground, Vanasthalipuram. Ph: 9849401891, 9700515521, +1 704-615-9893 [HA-2946]

LAND FOR SALE

■ Rs. 7600 గజం(రేటు తగ్గించబడును) 100 అడుగుల మెయిన్ రోడ్‌కి 3వ ప్లాటు 240 గజాల ప్లాట్లు అమ్మబడును @ మహేశ్వరం DTCP అప్రూవల్. 9966521191 [SCA24000481]

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వెస్ట్ జోన్‌లో ఉన్న శంకర్ పల్లి, సంగారెడ్డి నుండి జస్ట్ 20ని॥ల వ్యవధిలో DTCP, RERA సర్టిఫైడ్ ప్లాట్లు కలవు. 9666199799 [HA-98837]

■ యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్‌పూల్, పార్క్ అన్ని వసతులతో. Ph: 8106340199 [HA-14739]

■ JBINFRA విజయవాడ హైవే చౌటుప్పల్ & సాగర్ హైవే ఆదిభట్ల HMDA ప్లాట్స్ 13,000/-- 20,000/- Rambabu. 9989584648 [SCA24000407]

■ గజం కేవలం 2500/- మాత్రమే. రామోజీ ఫిలిం సిటీ, ఇండస్ట్రియల్ పార్క్ దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. ఫోన్: 8919577389 [HA-8201]

■ మాల్కాజ్‌గిరి 50 గజాలు రిజిస్ట్రేషన్ ప్లాట్ Rs. 16,00,000/- మాత్రమే. మంజీరా వాటర్, కరెంట్ కలదు. క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్. Ph: 9121599325 [HA-15296]

FLAT FOR SALE
- 2BHK, 936 Sq.ft,
- 43.5 sq.yards UDS,
- Car Parking, North Face
- Flat No: 302,
- Simhadri Tower's At Madhavi Nagar, KPHB
- Two sides 30' Roads

Ph: 90141 35437 Timings: 10Am to 7:00p.m.

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 93985 76997 [B-93]

■ Ghatkesar Jodimetla to Chowdariguda 60 feet Road Commercial plot 400 Sq yds East facing plot for sale.Contact; 9849084905 [H-16424]

■ Gandipet: 900 Sq.yds, Semi-Commercial Plot for Sale (W/F) 30 feet Road, 130 feet (R/F) Contact: 9182559677 [SCA24000515]

■ Sale 300 Yards East Plot with compound wall Manasa Hills, Rajendranagar. Contact: 8106929462 [SCA24000522]

■ Shathabdhi. prop. Bengaluru Highway@Shadnagar 100% vasthu DTCP&RERA&MUDA approved sqy15999/- B.Varsha: 9640516184 [SCA24000501]

Services

■ Constructions/ Fabrications. RZ Interior/ Carpenter Cuboids, Door, Sofa, Flat Interior, Moulder Kitchen, Wall Painting, Water Proofing, Interior Cleaning 7330678327. [HA-14743]

CATERING

■ మెషిన్ మేకింగ్ చపాతీ, పూరి (చపాతీ కాల్చినవి/ పచ్చివి & పూరి పచ్చివి) క్యాంటీన్స్, క్యాటరింగ్, హాస్టల్‌లకు సప్లై చేయబడును. ఫోన్: 7396798623 [SCA24000430]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800515]

BUSINESS OFFER

■ ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/బిజినెస్ ఫైనాన్స్ సలహాలకై సంప్ర : 9100729447 [HA-3881]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796641]

■ Running Convention Hall for Sale, Rajendra Nagar, 200ft Road,3000 Sq.yds, Builtup 27000 Sqft.Cont: 9885271600 [SCA24000517]

■ Kapil properties Invest 48 lakhs earn monthly returns 48000/- up to 25 months After that 27000/- ROI for 20 years Kapil business park (WTC) Krishna- 6300883718 [HA-158]

CHITS & DEPOSITS

■ కపిల్ చిట్స్ (Since 44yrs) లో 10, 25, 30 లక్షలు, 50 లక్షలు & 1 కోటి రూపాయల చిట్స్ కలవు. వేకెంట్ చిట్స్ ఇప్పించబడును. Ph: 8464919899 [HA-10868]

PLOT FOR SALE
VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 90141 35437 TIMINGS: 10am to 7pm only

■ కపిల్ చిట్స్‌లో ఒక లక్ష నుండి కోటి రూపాయల వరకు చిట్స్ కలవు మరియు పెండింగ్ చిట్స్ ఇప్పించబడును. సంప్ర: ఉపేందర్ రెడ్డి ఫోన్: 9705713305 [HA-2953]

INSURANCE

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి లేదా ఏజెంట్‌గా చేరడానికి సంప్రదించండి. ఫోన్: 9000543747 [HA-14733]

■ SBI Life:- GUARANTEED INCOME (PENSION) Upto 100 years & 1 Crore Financial protection for your Wife & Kids & Health insurance policy Call: 9398143903 [H-804873]

PRECAST WALLS

■ ప్రికాస్ట్ కాంపౌండ్ వాల్స్ ల్యాండ్ & ప్లాట్స్‌కి రక్షణగా, ప్రికాస్ట్ గోడలు & ఫెన్సింగ్, అన్ని మెటీరియల్స్ & లేబర్స్‌తోసహా HYD & TS అన్ని జిల్లాలలో వర్క్ చేయబడును. Ph: 9951599935 [SCA24000514]

HOME NEEDS

■ సిరి క్వాలిటీ ఇంటీరియర్ వర్క్స్ 25 సం. Exp. అన్ని రకాల ఫాల్ సీలింగ్ కబోర్డ్స్ మాడ్యులర్ కిచెన్ పెయింటింగ్ వుడ్, మార్బుల్ పాలిషింగ్ వాల్ పేపర్స్ మెష్, మెష్ డోర్స్ స్పేస్ హ్యాంగర్స్ CB ఆర్ట్స్. రాఘవరెడ్డి : 9848087754 [SCA24000413]

PEST CONTROL

■ SATYA'S PEST Control చెదలు, బొద్దింకలు నివారణకై, బొద్దింకలు జెల్ ట్రీట్‌మెంట్ కిచెన్ & బాత్రూం Rs.599/- చెదలు నివారణకై సంప్ర: Ph: 9292407782 [HA-832]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Awantika Aruni Ray, W/o Aruni Ray, R/o-Block 7, Flat 1002, My Home Vihanga, Financial District, Gachibowli, Hyderabad, T.S. I have changed my name from Awantika Aruni Ray to Awantika Ray. [HA-1224]

■ I, Osa Gangamani, W/o. Birkurwar Kasiram, R/o. Flat No: 302, Srinivasam Apts, Raghavendra colony, Puppalaguda, Manikonda, K.V.Ranga Reddy -500089. I have been to OSA GANGAMANI, GANGAMANI, B G MANI, GANGAMANI O, GANGAMANI BIRKURWAR All names belong to me only. [HA-16420]

■ I, P.VENKATANARAYANAMMA W/o. CHAVVA GOPAL REDDY H No. 262G/F, 2 nd floor, Road No-3 , Phase -2, Near Janapriya school, Janapriya Nagar, Miyapur, K.V Ranga Reddy, Telangana-49 Changed My New Name As CHAVVA NAVANEETHA Wide Affidavit No.258254 [SCA24000519]

■ I, CHEVA GOPAL REDDY S/o. CHAVVA VENKAT RAMI REDDY H.No. 262G/F, 2nd floor, Road No-3, Phase -2 Near Janapriya School Janapriya Nagar, Miyapur, K.V Ranga Reddy, Telangana-49 changed My New Name as CHAVVA GOPAL REDDY Vide Affidavit No.258255 [SCA24000520]

■ I, Nita Pravin Kumar W/o M. Pravin Kumar Dhapte R/o: Flat No.204, Sri Kailash Apartment 3-7-234 Vijaya Nagar Colony, Behind Sec-Bad Club Picket. Wrongly Mentioned My Husband Name In My Passport As Pravin Kumar Changed As M. PRAVIN KUMAR DHAPTE For All Purpose [SCA24000502]

■ I, Ravula Parvathi W/O Chikkulapally Vijaya Raghu Nandan Rao, R/o: Flat No-913, Block-4, Manasarovar Heights -2, Hasmathpet, Tirumalagiri, Secunderabad 09, changed my name from Chikkulapally Parvathi (post marriage) to Ravula Parvathi W/o. Chikkulapally Vijaya Raghu Nandan Rao for all purposes [SCA24000506]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039890, 8074327715 [H-783357]

■ సూర్యతేజ హోంకేర్ : వృద్ధులకు, పేషెంట్ల సేవకు, బేబికేర్, వంట/ఇంటి పనికి స్త్రీ/పు. కేర్ టేకర్స్ పంపగలము. 8309069400 [SCA24000396]

TOURS & TRAVELS

■ SVS టూర్స్ శ్రీలంక, కాశీ, నేపాల్, భూటాన్, గుజరాత్, ఉజ్జయిని, ఒరిస్సా, అస్సాం చార్‌దామ్, వైష్ణదేవి TN 9030123243, 7386579123 [SCA24000456]

■ సాయిటూర్స్ Nov-2 అష్టగణపతులు, భీమశంకర్, పరలి వైద్యనాథ్ త్రయంబకేశ్వర్, షిరిడీ. Nov-10 కాశీ 9 నిద్రలు అయోధ్య. Nov-26 కర్ణాటక టూర్. Dec-9 గుజరాత్ టూర్. 9848664831 [HA-1155]

Wanted

■ వంట పనిచేయుటకు అనుభవం కలిగిన ఆడ వంట మనిషి కావలెను మరియు ఆయాలు కూడా కావలెను. మంచి జీతం + వసతి కలదు. @ అన్నోజిగూడ - హైదరాబాద్. Ph: 8790838511/ 9177202888 [HA-831]

■ భార్యాభర్తలు, డ్రైవర్లు, కుక్స్, ఆఫీస్ అసిస్టెంట్స్ : బంజారా హిల్స్ ఇంటిలో క్లీనింగ్‌కు భార్యాభర్తలు కావలెను. జీతం + వసతి: Ph: 9381248799 [SCA24000523]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్ , జీ: 20K, Ph: 8977639662, 8977639663 [SCA24000512]

■ హాస్పిటల్‌లో పనిచేయుటకు ట్రాన్స్‌పోర్టేషన్ బాయ్స్ కావలెను. జీ: 15,000+ESI + PF. 12 hrs, బంజారాహిల్స్ సంప్ర: 8686512852/ 9666249852 [783359]

■ అనుభవజ్ఞులైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు & కార్పెంటర్లు కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మంగళ్‌పల్లి, ఇబ్రహీంపట్నం నందు ఉ: 2గంటల నుండి సా: 4.30 గంటల వరకు. సంప్రదించగలరు. 9963477871/ 9963488553 [14741]

■ లేడీ టెలికాలర్స్, టైపింగ్, కలెక్షన్స్, ఆ-బాయ్స్, న్యూస్ యాంకర్స్, డ్రైవర్లు, సూ॥వైజర్స్, హెల్పర్స్, జీ: 10K-18K ఫ్రీ హాస్టల్ Ph: 9505261777 [SCA24000516]

■ వంట, ఇంటిపని, పిల్లలను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును Ph: 6309807798, 9121099519 స్త్రీ/పు కావలెను. [SCA24000495]

■ 24గం ఇంట్లో ఉంటూ బేబీ, పేషెంట్ కేర్ చేయుటకు స్త్రీలు కా & ఇంటి, వంట పనికి భార్యభర్త కావలెను ఆకర్షణీయ జీతం: 18–25వేలు భోజనం+రూం. ఫ్రీ: Ph: 9640837801 [SCA24000508]

■ టీ తయారు చేయడానికి మంచి అనుభవం గల టీ మాస్టర్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్. Ph: 9177558502 [HA-14738]

■ అబ్దుల్లాపూర్‌మెట్, హట్టిగూడ, తట్టి అన్నారం, ప్రతాపసింగారం, రాంపల్లి, జవహర్ నగర్, అహ్మద్ గూడ, మురహరిపల్లి, తూంకుంట ఏరియాలలో సెక్యూరిటీ గార్డులు 8 గంటలు జీ: 13500/- మరియు 12 గంటలు జీ: 16500/-. డ్యూటీ చేయుటకు కావలెను. సంప్ర : 9246355129 [H-804879]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185494]

■ దుండిగల్, కోకాపేట్, నానక్‌రామ్ గూడలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం రూమ్ కలదు. Ph: 8328622868 [H-783406]

■ హోటల్‌లో పనిచేయుటకు అనుభవం గల ఆడ వంట మనుషులు కావలెను. రోజుకు 700 రూపాయలు వరకు జీతం+వసతి+భోజనం, కే.పి.హెచ్.బి. కాలనీ, కూకట్‌పల్లి. 9247478121 [HA-33171]

■ రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్‌కు M/F కావలెను. సాలరీ+ కమీషన్, ఫ్రీ ట్రైనింగ్ (Freshers only) 9032882395 [HA-10870]

■ PVC డోర్లు, కప్‌బోర్డ్స్ చేయుటకు పని తెలిసిన కార్పెంటర్లు, హెల్పర్లు కావలెను. మూసారాంబాగ్. ఫోన్: 9963149933 [HA-2940]

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14726]

■ పనివారు కావలెను. Hyd, బెంగళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు కావలెను. ఫోన్: 9391912949, 040-40123376 [SCA24000427]

■ Walk-in Interview at Amrat Chits, Sec-bad 28th Oct 2024, 11AM-4pm for Business Development Officers.9676387760. [SCA24000518]

■ Wanted DriverExp of 5-10yrs at Road No: 12 banjarahills for 9:00-9:00pm sunday holiday Sal: 20,000/- Ph:9885712584 [SCA24000511]

■ Wanted exp. M/F Sales executive for Faizan Furniture Asifnagar Expert in all Languages, Sal+ ince 9000842431 [SCA24000521]

■ Wanted Assistant Store Incharges At URC 1 EME Centre Application Last Date 10 Nov 24 Details Ph: 040-29881012 [SCA24000498]

■ Wanted Salesmen Cum Marketing with exp in Textiles & Auto Drivers for delivery, Girls for Store Sales @ Sec-bad Ph: 9391644112 [HA-6106]

■ Required ARC/ TIG Welders for a Manufacturing Company at Autonagar, Guntur. Attractive Salary Package Available for Experienced Welders. Contact: 9063183834 [G-3252]

■ Wanted Primary EVS Teacher & P.E.T. Beside TKR College, LB Nagar, Ql: Degree Sal: 12-16k. Ph: 9618253290, 7680803231 [SCA2400431]

FACULTY TEACHERS

■ Alpha Model High school, karmanghat, LB Nagar Wanted English Faculty Ist- Xth class full time 9052221375,9292920070 [H-782720]

■ Wanted Teachers to Teach High School English and Social. Contact: 9849842536 [HA-14742]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అఖిలపక్షం అభిప్రాయం తర్వాతే కులగణన సర్వే చేయాలి

పంజగుట్ట: సమగ్ర ఇంటింటి కులగణన సర్వేలో ప్రామాణిక పద్ధతులు అనివార్యమని, ఎలాంటి అంశాలు చేర్చారో వివరాలను అఖిపక్షం, బీసీ నాయకులతో చర్చించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్, తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కులగణనపై పబ్లిక్ హియరింగ్, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావుల సమక్షంలో పబ్లిక్ జ్యూరీ ప్యానల్ ఏర్పాటు చేశారు. పబ్లిక్ జ్యూరీ ప్యానల్ న్యాయమూర్తులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి. చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఉస్మానియా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాలు తీసుకుని పలు తీర్మానాలు చేశారు. సంచార, అర్ధసంచార, విముక్త జాతుల వివరాలను ప్రత్యేకంగా వారు నివాసాలు ఉండే ప్రాంతాలను గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. అఖిలపక్ష, కుల సంఘాలు, రాజకీయ పార్టీలతో సమగ్రంగా చర్చించిన తరువాతే కులగణన సర్వేని ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్, దేవళ్ల సమయ్య, ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, ప్రొఫెసర్ బాగయ్య, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యేసుప్రభు మార్గం ఆచరణీయం



రహమత్‌నగర్: యేసుక్రీస్తు బోధించి ఆచరించిన కరుణా, ప్రేమ, శాంతి మార్గాలు సర్వమానవళికి ఆచరణీమని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో శుక్రవారం రాత్రి యేసు క్రీస్తు సువార్త సంఘం 19వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మతం శాంతియుత సమాజాన్నే కోరుకుటుందని, అన్ని మత గ్రంథాలు వీటినే బోధిస్తాయన్నారు. 19 ఏండ్లుగా యేసు క్రీస్తు సువార్త వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రైస్తవులు అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పాస్టర్ టీసీ సామ్యూల్ మాట్లాడుతూ యేసు ప్రభువు కృపతో తమసంఘం 19 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విశ్వాసులు ప్రదర్శించిన నాటికలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జేబీరాజ్, మోజస్, శ్రీనివాస్, వినోద్, సుధాకర్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు మన్సూర్, వేముల యాదయ్య, సింగారి శ్రీనివాస్, జేపీ జ్ఞానేశ్వర్, నయూం ఖాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు



ప్రాంగణాన్ని క్లీన్ చేయిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని షౌకత్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణం చెత్తా చెదారాలు, మట్టి కుప్పలు, ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోవడంతో డంపింగ్ యార్డును తలపించేలా తయారైంది. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఇక్కడి పరిస్థితిని పారిశుద్ధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో పేరుకుపోయిన వ్యర్థాలను దగ్గరుండి తొలగింపజేశారు. పెరిగిన పచ్చిమొక్కలను పీకివేయించారు. మొత్తం క్లీన్ అయ్యేవరకు అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. కమ్యూనిటీ హాల్ నిర్వహణను చక్కగా చూసుకోవాలని స్థానికులకు ఆమె సూచించారు.

ప్రతి ఇంట్లో ఒక్క ఆయుర్వేద మొక్కనైనా పెంచాలి



వెంగళరావునగర్: ప్రతి ఇంట్లో తప్పనిసరిగా కనీసం ఒక ఆయుర్వేద మొక్కనైనా పెంచుకోవాలని ప్రభుత్వ ఎర్రగడ్డ ఆయుర్వేద హాస్పిటల్ డాక్టర్ మమత సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్యశాలలో శనివారం జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వారి సహాయకులకు ఆయుర్వేద ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. దీంతోపాటుగా ఆయుర్వేద మొక్కలను పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులను సైతం తగ్గించగల శక్తి ఆయుర్వేదానికి ఉందని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యంలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కా లేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.యశోద, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాయి, ద్రవ్యగుణ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డా క్టర్ జీ. స్వరూపరాణి, డాక్టర్ బాబూరావు, డాక్టర్ నరసింహ, డాక్టర్ విశ్వనాథ్, ఇతర పీజీ, యుజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

24 రోజుల్లో 700 టన్నుల వ్యర్థాల తొలగింపు..!

డిసెంబర్ 31 వరకు కొనసాగనున్న కార్యక్రమం

- 90రోజులు ప్రత్యేక కార్యాచరణ
- ఇప్పటి వరకు 12బృందాలతో 570మ్యాన్‌హోళ్లు క్లీన్

బంజారాహిల్స్: సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జలమండలి డివిజన్-6 పరిధిలో సీవరేజీ పైప్‌లైన్ల వ్యర్థాల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతి రోజు ప్రారంభమైన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, ఎస్ఆర్‌నగర్, బోరబండ, ఫతేనగర్, సోమాజీగూడ, జూబ్లీహిల్స్, వెంకటగిరి, బంజారాహిల్స్, ఎస్పీఆర్‌హిల్స్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, తట్టిఖానా సెక్షన్ల పరిధిలో ఇప్పటి వరకు 700 టన్నుల వ్యర్థాలను తొలగించారు. ప్రతి రోజూ 30 టన్నుల మేర వ్యర్థాలను తొలగిస్తూ సిల్ట్ కార్టింగ్ డీ సిల్టింగ్ వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇందు కోసం 12 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సెక్షన్ పరిధిలో ఒక్కో బృందం నిర్విరామంగా పనిచేస్తుంది. మ్యాన్‌హోళ్ల నుంచి, పైపుల నుంచి సిల్ట్ తీయడానికి 36 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 12 సిల్ట్ కార్టింగ్ వెహికల్స్ ద్వారా ఈ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. డివిజన్-6 పరిధిలో 740 కిలోమీటర్ల మేర సీవరేజీ పైప్‌లైన్లు ఉన్నాయి. ఇందులో 80 కిలోమీటర్ల మేర సమస్యాత్మక పైప్‌లైన్లు ఉన్నట్లుగా గుర్తించారు. కార్యాచరణ ప్రణాళికలో ఈ 80 కిలోమీటర్ల మేర వ్యర్థాలు, బురద తొలగించాలని తలపెట్టారు. ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మేర సిల్ట్ తొలగించారు. అంతేకాకుండా 570 మ్యాన్‌హోల్స్‌ను ఇప్పటి వరకు క్లీన్ చేశారు. డివిజన్-6 పరిధిలో మొత్తం 30వేల మ్యాన్‌హోల్స్ ఉండగా ఇందులో సమస్యాత్మకంగా 1800 డీప్ మ్యాన్‌హోల్స్ ఉన్నాయి.

మ్యాన్‌హోళ్ల క్లీనింగే లక్ష్యం

హరిశంకర్, జీఎం,జలమండలి డివిజన్-6

సీవరేజీ పైప్‌లైన్ల నుంచి సిల్ట్ తొలగించడంతో పాటు మ్యాన్‌హోళ్లను క్లీన్ చేయడమే లక్ష్యంగా ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ డిసెంబర్-31 వరకు కొనసాగుతోంది. ఇందులో భాగంగా సీవరేజీ పైప్‌లైన్ల నుంచి వ్యర్థాలను తొలగిస్తూ వాటిని సిల్ట్ కార్టింగ్ వాహనాల ద్వారా తొలగిస్తున్నాం. మా పరిధిలో ఉన్న 12 సెక్షన్ల పరిధిలో 12 వెహికల్స్ ఉండగా ఒక్కో వెహికల్ రోజుకు మూడు టన్నుల వ్యర్థాలను తొలగిస్తున్నది. కార్టింగ్ వెహికల్‌లో రిమూవర్ స్టాఫ్ నిరంతరంగా పనిచేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టనున్నాం. ఇప్పటికే చాలా మ్యాన్‌హోళ్ల నుంచి వ్యర్థాలతో పాటు బురద, మట్టి, రాళ్లు, ఇతర వస్తువులను తొలగించడం జరిగింది. మ్యాన్‌హోళ్లతో పాటు పైప్‌లైన్లలో చిక్కుకున్న ఈ వ్యర్థాలతో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతూ సీవరేజీ రోడ్లపై పారుతూ పారిశుధ్య సమస్య తలెత్తడంతో దీనిపైనే దృష్టి ఎక్కువ కేంద్రీకరించాం.



వ్యర్థాలను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

'టీటీఐ' ఏసీపీ వెంకటేశ్వర్లు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. నగర కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్‌ల ఆదేశాల మేరకు శనివారం పంజగుట్టలోని అరోరా పీజీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ ఏడాది 1700 మంది లైసెన్స్ లేని వారికి, 100 మంది ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి టీటీఐ బేగంపేటలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని, అలా చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష కూడా పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తే శిక్షార్హమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సుష్మ, హెచ్ఓడీలు అంజలి, మహ్మద్ హుస్సేన్, సిబ్బంది కృష్ణ, అబ్దుల్ మాజిద్, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్‌వైజర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు సంఘటితం కావాలి

పంజగుట్ట: విశ్వ హిందూ రక్ష పరిషత్ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు హిందువులందర్నీ సంఘటితం చేస్తుందని పరిషత్ జాతీయ అధ్యక్షుడు గోపాల్ రాయ్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వ హిందూ రక్ష పరిషత్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా అధ్యక్షురాలు యమునా పాఠక్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ గడప లోపలే కులం, గడప దాటితే హిందువులం అనే నినాదంతో ముందుకుపోతామన్నారు. ఇటీవలి కాలంలో హిందూ ధర్మంపై, దేవాలయాలపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని హిందువులు ఇప్పుడు కూడా ఐక్యం కాకపోతే దేశం మరో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌గా మారుతుందన్నారు. హిందువులకు ఉన్న ఒక్కదేశాన్ని కాపాడుకునేందుకు అందరం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశ్వ హిందూ రక్ష పరిషత్ జాతీయ అధ్యక్షునిగా గోపాల్‌రాయ్, జాతీయ మహిళా అధ్యక్షురాలిగా యమునా పాఠక్, జాతీయ ఆర్గనైజర్ చెరువు రాంబాబు, నగర అధ్యక్షుడు మల్లేష్, నగర మహిళా అధ్యక్షురాలు ప్రసన్న, ప్రతినిధులు వైభవ్ సూర్య, దయానంద్, భవాని, విజయలక్ష్మి, పార్వతి, అశ్విని, ఆనంద్ తదితరులు ఉన్నారు.



నియామక పత్రాలు చూపుతున్న హిందూ రక్ష పరిషత్ ప్రతినిధులు

ప్రత్యేక నిధులతో శ్మశాన వాటిక పనులు

పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల సంఘం హర్షం



మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ప్రత్యేక నిధులతో బోరబండ సైట్-3 శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు మొదలుకావడం పట్ల పీజేఆర్ ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. శ్మశాన వాటికలో జరుగుతున్న పనులను ఆ సంఘం అధ్యక్షుడు వేముల యా దయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన చెట్ల మూలంగా పాములు, విష కీటకాలు బయటికి వస్తున్నాయని దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వాటికకు వచ్చే వారు భయపడ్డున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పా రు. శ్మశాన వాటికలో నెలకొన్న ఇతర సమస్యలను సైతం పరిష్కరించాలని బాబా ఫసియుద్దీన్‌ను యాదయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



వెంకటేశ్వరకాలనీ: ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి బాసటగా నిలిచారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఖైరతాబాద్ డివిజన్ మహాభారత్‌నగర్‌కు చెందిన పత్లావత్ కృష్ణ కుమార్తె లయశ్రీ ఎంబీబీఎస్ చదువుతుంది. అయితే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వారి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పందించి ఎంజీఆర్ ఆసరా ఫౌండేషన్ ద్వారా ఆమె ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు లయశ్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సాయిసరస్వతీ విద్యార్థుల సత్తా

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిసరస్వతీ విద్యానికేతన్ విద్యార్థులు కరాటే పోటీల్లో తమ సత్తా చాటారు. డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని అనేక పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. కాగా కరాటే అండర్-12 బాలికలకు నిర్వహించిన పోటీలో ఏడో తరగతి చదువుతున్న యశస్వి గోల్డ్‌మెడల్, పి. యతిక రజత, ఆరో తరగతి స్టూడెంట్ సిరి కాంస్య పతకాలను కై వసం చేసుకున్నారు. బాలుర విభాగంలో ఏడో తరగతి విద్యార్థి దాని పునీత్ రాజ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శిరీష భవానీశంకర్ ఆయా విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషా మీనాక్షి, ఇతర టీచర్లు, సిబ్బంది అభినందించారు.



పతకాలతో విద్యార్థులు

ప్రజలు చైతన్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

పంజగుట్ట: మతశక్తుల పట్ల ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి అన్న విషయాలపై భగత్‌సింగ్ అద్భుతమైన వ్యాసాలు రాశారని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన 'హైదరాబాద్ ఇమేజ్‌ని దెబ్బతీసే మతోన్మాద రాజకీయ కుట్రలపై ప్రజలను చైతన్యవంతులు చేద్దాం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణలో కొన్నిరోజులుగా మతసామరస్యాన్ని దెబ్బతీసేలా అనేక చిల్లర ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో కూడా అపోహలు సృష్టిస్తూ సుమారు 500వీడియోలు విడుదల చేసిందని ఆరోపించారు. ఆ రోజుల్లో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు మైత్రి సంఘాలు ఏర్పాటు చేసి హిందూ, ముస్లింలల్లో ఏదైనా అపోహలు ఉంటే కూర్చుని మాట్లాడుకునే వారని, మతసామరస్యాన్ని పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడేవని కానీ గత కొన్ని సంవత్సరాలుగా అవి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టీ.నరసింహ, వీ.ఎస్.బోస్, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీటు పేరుతో మోసం

చెక్‌మేట్ కన్సల్టెన్సీ ప్రతినిధిపై కేసు నమోదు

బంజారాహిల్స్: మెడికల్ సీటు పేరుతో మోసం చేసిన చెక్‌మేట్ కన్సల్టెన్సీ ప్రతినిధిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... శ్రీనగర్‌కాలనీలోని గణపతి కాంప్లెక్స్ వద్ద రచ్చ నవిత రెమిడీస్ ల్యాబ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంది. తన స్నేహితురాలు నాగమణి ఇటీవల తన కూతురు రిషికాకు ఎంబీబీఎస్ కావాలని అడిగింది. దీంతో శ్రీనగర్‌కాలనీలోని చెక్‌మేట్ కన్సల్టెన్సీ ప్రతినిధి రోహిత్‌ను కలిశారు. గత ఆగస్టు మొదటి వారంలో వీరి మధ్య జరిగిన సమావేశంలో గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని, అయితే రూ.15 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. ఆగస్టు 24వ తేదీన నాగమణి రూ.15 లక్షలు తన స్నేహితురాలి ద్వారా వెళ్లి రోహిత్‌కు ఇచ్చింది. సెప్టెంబర్ 28వ తేదీన బాధితురాలు చెక్‌మేట్ ఆఫీసుకు వెళ్లి ఈ సీటు గురించి ప్రశ్నించగా దాటవేత సమాధానం చెప్పాడు. అయితే రోజులు గడిచినా ఎంబీబీఎస్ సీటు రాలేదు. ఇటీవల ఆఫీసుకు వెళ్లి చూడగా అది మూసివేసి ఉంది. రోహిత్‌కు ఫోన్ చేస్తే కాల్స్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో తమను మోసం చేశారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన లాగే ఇంకా చాలామంది వద్ద నుంచి మెడికల్ సీట్ల పేరుతో రోహిత్ డబ్బులు వసూలు చేసి ముఖం చాటేశాడని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల తీరుతో పేదలకు అన్యాయం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్

రహమత్‌నగర్: అధికారుల తీరుతో పేదలకు తీరని అన్యాయం జరుగుతుందని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, పట్టాలున్నా నిర్మాణాలను సైతం రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్నారని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్ ఆరోపించారు. ఇటీవల ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేసిన నీలమ్మ అనే మహిళ ఇంటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం ఇంటి పట్టాలు చూడకుండా రెవెన్యూ అధికారులు పేదల నివాసాలకు కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు కూల్చివేస్తున్నారని బాధితులు అడిగిన సమాధానం చెప్పకుండా, వివరణ ఇవ్వకుండా పేదల ఇళ్లను నేలమట్టం చేస్తూ పేదలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జరుగుతున్న పరిణామాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని భవానిశంకర్ స్పష్టం చేశారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, బెన్నార్, సాయి, మేఘన పద్మ, సువర్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.



నీలమ్మ ఇంటిని పరిశీలిస్తున్న భవానిశంకర్

ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ పర్యటన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కేబీఆర్ పార్కు చౌరస్తాతో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లో ట్రాఫిక్‌ను పరిశీలించేందుకు నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ పర్యటించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ ట్రాఫిక్ స్తంభించకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చేయాల్సిన చర్యలపై సమీక్షించారు. ఫ్రీ లెఫ్ట్‌లో కేబీఆర్ పార్కు వాకర్లు కార్లు పార్కింగ్ చేయకుండా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

శ్మశానవాటికలపై ప్రత్యేక దృష్టిసారించాలి

కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: శ్మశానవాటికలపై ప్రత్యేక దృష్టిసారంచాలని, వాటికలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ జీహెచ్ఎంసీ అధికారులకు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్‌పార్కు ఎదురుగా ఉన్న శ్మశానవాటిక, పార్కు మొదటి గేటు పక్కనున్న మరో శ్మశానవాటికలో ముళ్ల పొదలు, పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఈ సమస్యలపై స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో శనివారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో పార్కును సందర్శించి అప్పటికప్పుడు శ్మశానవాటికను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం రోడ్లతో పాటు శ్మశాన వాటికలను కూడా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రాజ్‌కుమార్, డీఈ రాంచంద్రరాజు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజు, యాదగిరి, బాలు, రాజు, సత్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటిను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్



చీటింగ్ కేసులో 7ఏళ్ల జైలు శిక్షపడేలా ప్రతిభ కనబరిచిన ఫిల్మ్‌నగర్ సీఐ శ్రీనివాసులుకు ప్రశంసా ప్రతాన్ని అందజేస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్
– బంజారాహిల్స్

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్రపతి నిలయ సందర్శనలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థులు శనివారం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. విద్యార్థులు అక్కడి థిమాటిక్ గార్డెన్స్, కిచెన్ టన్నెల్‌ను తిలకించి మురిసిపోయారు. మ్యూజికల్ పౌంటెన్లు, పచ్చదనంతో కూడిన రాక్ గార్డెన్ చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. అలాగే దేశంలోని వివిధ సంప్రదాయ నీటి నిర్వహణ వ్యవస్థల గురించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే నాలెడ్జ్ గ్యాలరీని సందర్శించి ఎన్నో విషయాలను అవగతం చేసుకున్నారు. 15వ రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో పాటు గతంలో రాష్ట్రపతులుగా పనిచేసిన వారి వివరాలు, ఫొటోలు, అవార్డులతో కూడిన గ్యాలరీని సందర్శించి ఆయా విశేషాలను తెలుసుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వాహనాలు, వస్తువులు, రాతిశిలా ఫలకాలపై ముద్రించిన ప్రముఖుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను స్వయంగా చూసి తెలుసుకోవడానికి ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఫీల్డ్ ట్రిప్‌ల నిర్వహణకు ప్లాన్ చేయనున్నట్లు చెప్పారు.

ఓటరు అవగాహనపై మీడియా అవార్డులు

లక్డీకాపూల్: ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార మీడియా అవార్డులకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి శనివారం తెలిపారు. ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పర్చడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి అవార్డును అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఓటరు అవగాహన ప్రచార మీడియా అవార్డును కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమన్నారు. అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 25న అందజేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10వ తేదీ లోగా తమ సిఫార్సులను రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ–110001 చిరునామాకు పంపాలన్నారు. ఈమెయిల్‌లో media&division@eci.gov.inకు పంపవచ్చని, హిందీ లేదా ఇంగ్లిష్ కాకుండా ఇతర భాషల్లో ఉంటే ఆంగ్ల అనువాదాన్ని కూడా జతపరచాలని తెలిపారు.

29న ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ల మహాధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ల నాయకులు

శంషాబాద్: వివిధ డిమాండ్లతో ఈ నెల 29న ఖైరతాబాద్ ఆర్టీఏ ఎదుట ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టనున్నట్లు భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ చెప్పారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను శంషాబాద్ పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ఆటో డ్రైవర్లు ఇప్పటికే వీధిన పడ్డారన్నారు. మహాలక్ష్మీ పథకం తర్వాత ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న సర్కారు ఆ మాటే మరిచిపోయిందన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్, నాయకులు రవీందర్, నరసింహ, సలీం, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బీఎంఎస్ కార్యాలయంలో తెలంగాణ ఆటో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు యూనియన్స్ ఐకాస ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 29న ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రతినిధులు హబీబ్, కిషన్, టీఆర్ఏకే టీయూ రవికుమార్, ఈశ్వర్, ఎన్‌టీఏడీయూ రవి, బీపీటీఎంఎం ప్రతినిధి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రతిష్టాత్మక సైన్స్ హబ్‌గా సేవలందిస్తున్న ఐకేపీ నాలెడ్జ్ పార్క్ వేదిక 25 సంవత్సరాల వార్షిక వేడుకలను హెచ్ఐసీసీలో ఘనంగా ప్రారంభించారు. ''ఐకేపీ @25: యాన్ ఎపిక్ రాప్సోడీ అండ్ ది నెక్స్ సింఫనీ' అనే థీమ్‌తో శనివారం ప్రారంభమైన ఈ ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ 28వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఐకేపీ నాలెడ్జ్ పార్క్ చైర్మన్, సీఈఓ దీపన్వితా చటోపాధ్యాయ మాట్లాడుతూ.. 1999లో ప్రారంభమైన ఐకేపీ భారత్‌లో లైఫ్ సైన్సెస్ కోసం ఏర్పడిన మొదటి సైన్స్ పార్కుగా మారిందన్నారు. 25 ఏళ్లుగా జీనోమ్ వ్యాలీలోని ఐకేపీ సైన్స్ పార్క్ లారస్ ల్యాబ్స్, డుపాంట్, యూఎస్పీ, సాయి లైఫ్ సైన్సెస్‌తో సహా లైఫ్ సైన్స్ రంగంలోని అనేక ప్రముఖ కంపెనీలకు వేదికగా ఉందని, ఇప్పటి వరకు ఐకేపీ వివిధ రంగాల్లో దేశవ్యాప్తంగా 1800 స్టార్టప్‌లకు తన సహకారాన్ని అందించిందని తెలిపారు. ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ సెల్–జీన్ థెరపీ, వన్ హెల్త్, స్మార్ట్ ప్రొటీన్‌లలో సాధించిన పురోగతిపై దృష్టి సారిస్తుందన్నారు. ఈ రంగాల భవిష్యత్‌పై చర్చ జరుగుతుంది. స్టార్ట్–అప్ షో కేస్‌లో భాగంగా 150 మందికి పైగా ఇన్నోవేటర్లు, స్టార్టప్‌ల ప్రతినిధులు తమ అత్యాధునిక ఉత్పాదనలు, సేవలను ప్రదర్శిస్తారు. ఐకేపీ షేపర్స్ అవార్డు ద్వారా ఐకేపీ ఈ మైలురాయిని చేరుకోవడంలో కీలకపాత్ర పోషించిన 25 మంది వ్యక్తుల పాత్రను గుర్తిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌ను నిజం చేయడంలో శ్రీనారాయణన్ వాఘుల్ విశేష కృషి స్ఫూర్తిదాయకం అన్నారు.

చెకుముకి సైన్స్ సంబురాల పోస్టర్ ఆవిష్కరణ




చెకుముకి సైన్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబురాల 2024 పోస్టర్‌ను హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టెస్టుల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారని కొనియాడారు. ఈ ఏడాది నిర్వహించే చెకుముకి సంబరాల్లో విద్యార్థులంతా పాల్గొనాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి జనవిజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తుందని అభినందించారు. బాల–బాలికల విద్య, విజ్ఞానం, వికాసం కోసం వచ్చేనెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిల్లో సైన్స్ టెస్ట్ (సంబురాలు) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ లింగస్వామి, జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు, నగర నాయకులు చంద్రశేఖరరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'ఐటీ'.. క్లీన్‌సిటీ

సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేక ప్రణాళిక

- జీఐఎస్ ద్వారా నెట్‌వర్క్ మార్కింగ్
- ఆర్క్ సాంకేతిక పరిజ్ఞానంతో డేటా ప్రోగ్రామింగ్
- డీసిల్టింగ్ మొబైల్ యాప్‌నకు రూపకల్పన
- వర్క్ ఫొటోలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్
- ఆన్‌లైన్‌లో క్షేత్రస్థాయి పనితీరుపై నివేదిక
- జలమండలి సరికొత్త ప్రయోగం సక్సెస్



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల 'సీవరేజీ స్పెషల్ డ్రైవ్' పనితీరు పర్యవేక్షణపై సరికొత్త ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రయోగిస్తోంది. నిత్యం క్షేత్రస్థాయిలో జరుగుతున్న సీవరేజీ పనులను కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేలా సమగ్ర భౌగోళిక సమాచార వ్యవస్థ(జీఐఎస్)తో నెట్‌వర్క్‌ను అనుసంధానం చేసుకొని ప్రత్యేక డ్యాష్ బోర్డుల ద్వారా సమీక్షిస్తోంది. రోజువారీగా ఏ సెక్షన్ పరిధిలో.. ఎక్కడ నుంచి ఎక్కడి వరకు సీవరేజీ పైపులైన్ క్లీనింగ్, మ్యాన్‌హోళ్ల డీసిల్టింగ్, ఎయిర్‌టెక్ మెషీన్, సిల్ట్ వెహికిల్స్ పనితీరు, అవసరమైన రిపేర్, కొత్త పైపులైన్ల ప్రతిపాదనలు తదితర అంశాలు ఫొటోలతో యాప్ ద్వారా అప్‌లోడ్ అయ్యేలా జలమండలి ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో గుర్తించిన పరిస్థితుల నివేదికల ఆధారంగా సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యకు తాత్కాలికంగా చెక్ పెడుతూ శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు సాగేందుకు కసరత్తు చేస్తోంది.

ఆర్క్ జీఐఎస్ టెక్నాలజీతో..

ఆధునిక ఆర్క్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) టెక్నాలజీ సాయంతో సీవరేజీ మొత్తం నెట్‌వర్క్ పైపులైన్, మ్యాన్‌హోల్ పాంతాలను మార్కింగ్ చేసింది. ప్రత్యేక 'ఎస్రి' ఆన్‌లైన్ వెబ్– బేస్డ్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీతో నెట్‌వర్క్‌ను జలమండలి మెట్రో కస్టమర్ కేర్ సెంటర్ సర్వర్‌కు అనుసంధానం చేసింది. ప్రధాన సర్వర్ అనుసంధానంతో డ్యాష్ బోర్డులను ఏర్పాటు చేసి ఎండీ, డైరెక్టర్లకు పూర్తి స్థాయి నెట్‌వర్క్ పరిధి, సీజీఎంలకు సర్కిల్ పరిధి, జీఎంలకు డివిజన్ పరిధి వరకు నెట్‌వర్క్ మ్యాపింగ్ కనిపించేలా ఏర్పాటు చేసుకుంది. జీఐఎస్ మ్యాపింగ్ మార్కింగ్ ఆధారంగా ప్రత్యేకంగా అప్లికేషన్ డెవలప్ చేసి క్షేత్రస్థాయి సెక్షన్ మేనేజర్‌తో పాటు జెట్టింగ్ మెషీన్ ఇన్‌చార్జి, ఫీల్డ్ సూపర్‌వైజర్లకు మొబైల్స్‌లో డీసిల్టింగ్ యాప్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసింది. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే ముందు మొబైల్ యాప్‌లో లాగిన్ అయి మ్యాన్‌హోళ్ల వద్ద అక్షాంశం, రేఖాంశాలను గుర్తించేలా ఆదేశాలు జారీ చేసింది. ఎప్పటికప్పుడు జరిగిన పైపులైన్ల క్లీనింగ్, డీసిల్టింగ్, సిల్ట్ కార్టింగ్ పనుల ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేలా ఆదేశాలు జారీ చేసింది. డ్యాష్ బోర్డులో జరిగిన సీవరేజీ పైపులైన్, మ్యాన్‌హోళ్ల పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చేలా ఏర్పాటు చేసింది.

ఏడాది ఫిర్యాదుల ఆధారంగా..

జలమండలి మెట్రో కస్టమర్ కాల్ సెంటర్‌కు ఒక ఏడాదిలో మొత్తంలో వచ్చిన ఫిర్యాదులను సీవరేజీ నెట్‌వర్క్ మ్యాపింగ్‌తో ఐటీ విభాగం పొందుపర్చింది. తాజా ఫిర్యాదుతో సంబంధం లేకుండా ఏడాది కాలంలో అత్యధికంగా ఫిర్యాదులు వచ్చిన ప్రాంతంపై సెక్షన్ పైపులైన్, మ్యాన్‌హోళ్ల వారీగా రెడ్ బబుల్ వెలిగేలా సాఫ్ట్‌వేర్‌లో రూపకల్పన చేసింది. ప్రతిరోజూ దీని ఆధారంగా సీవరేజీ పనులు కొనసాగుతోంది. మరోవైపు తాజాగా మురుగు సమస్యపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించిన మ్యాన్‌హోళ్లపై కూడా తక్షణమే రెడ్ బబుల్ లైట్ వెలుగుతుంది. ఏ ప్రాంతం నుంచి ఫిర్యాదు వచ్చిందనే సమాచారం డాష్‌బోర్డు ఆధారంగా గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది అక్కడికి చేరుకుని ఎయిర్‌టెక్ యంత్రాలతో క్లీనింగ్‌తో పాటు మిగతా పనులు చేపడుతున్నారు. పనులు పూర్తి కాగానే వాటి ఫొటో తీసి మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. మరుసటి రోజు సిల్ట్ కార్ట్ వాహనం అక్కడికి చేరుకొని చెత్త తొలగించి ఫొటోతీసి అప్‌లోడ్ చేస్తోంది. పర్యవేక్షణ సక్రమంగా ఉండటంతో మురుగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై టెక్నాలజీ పర్యవేక్షణతో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, వాహనాల పనితీరు మెరుగుపడుతోంది.

జీఐఎస్ డ్యాష్‌బోర్డు ద్వారా సమీక్షిస్తున్నాం



సీవరేజీ స్పెషల్ డ్రైవ్ పనులను డ్యాష్ బోర్డు ఆధారంగా సమీక్షిస్తున్నాం. క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు మ్యాన్‌హోళ్లు, డీసిల్టింగ్, వ్యర్థాలను(సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలింపు తదితర సమగ్ర వివరాలు ఆన్‌లైన్ లో నమోదవుతున్నాయి. ఆయా సెక్షన్‌ల పనితీరు బహిర్గతమవుతోంది. సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు 90 రోజుల స్పెషల్ డ్రైవ్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

– అశోక్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

నగరంలో నేడు

- తెలంగాణ ప్రభుత్వం, స్వదేశీ జాగరణ మంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళా ముగింపు సభ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం11 గంటలకు సదర్ సమ్మేళనం జరుగుతుంది.
- మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార్‌లో ఉదయం 11 గంటలకు జరిగే కఠిన చీవర దానోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

టీఎస్‌పీఈఏ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఎస్‌పీఈఏ) 2024–2027 కాలానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 28 నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, వచ్చేనెల 3న నామినేషన్ల ఉపసంహరణ, 8న బ్యాలెట్ పేపర్ల పంపిణీ, 13న ఎన్నికల నిర్వహణ, 15న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కె.సమ్మయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

4 వారాల్లో అనధికార నిర్మాణాలపై నివేదిక ఇవ్వండి

- ఆసిఫ్‌నగర్‌లోని అక్రమ నిర్మాణాలను పరిశీలించండి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. 4 వారాల్లోగా అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకుని, హైకోర్టు రిజిస్ట్రార్(జుడీషియల్)కు పూర్తి నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. తన పూర్వీకుల నుంచి వచ్చిన 426 చదరపు గజాల ఆస్తిలోని నిర్మాణాలపై జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మహ్మద్ అబ్దుల్ ముబిన్‌తో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆ ప్రాంతంలో అనేక అనధికార నిర్మాణాలు ఉన్నాయని, వాటిపై ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ సంబంధిత అధికారులు ఏనాడూ స్పందించలేదన్నారు. కుమ్మరివాడి ప్రాంతంలో 350కి పైగా నిర్మాణాలు అనధికార నిర్మాణాలేనని నివేదించారు. అదే ప్రాంతంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు కూడా అనుమతి లేకుండా భవనాలు నిర్మించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించని అధికారులు.. ముబిన్‌కు మాత్రం షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది పిటిషనర్‌కు నోటీసులు జారీ చేశారని, ఆ ప్రాంతంలో ఎవరికీ నోటీసులు జారీ చేయలేదని తెలిపారు. జీహెచ్ఎంసీ సిబ్బంది పక్షపాతంతో వ్యవహరిస్తోందని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అక్కడి అక్రమ నిర్మాణాలు పరిశీలించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. తదుపరి విచారణ వచ్చే నెలకు వాయిదా వేశారు.

తీర్థ, విహార యాత్రలకు సురక్షిత సేవలు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అన్ని తీర్థ యాత్ర ప్రదేశాలు, విహార యాత్రలకు అతి తక్కువ ధరలతో ప్యాకేజీలు అందిస్తూ విశేష సేవలందిస్తున్నామని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత ఆర్‌వీ రమణ తెలిపారు. కఠినమైన మానస సరోవరం, అమర్నాథ్, చార్ధామ్ వంటి యాత్రలతో పాటు ప్రతి సంవత్సరం జరిగే పుష్కరాలు వంటి ఎన్నో ప్రయాణాలను సైతం సులభమైన యాత్రలుగా మార్చి ప్రజల మన్ననలను పొందడమే కాకుండా.. యూరోప్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, జర్మనీ, స్విజర్లాండ్, శ్రీలంక, సింగపూర్, మలేషియా, లండన్, స్కాట్లాండ్, నార్వే, డెన్మార్క్, స్వీడన్ వంటి అంతర్జాతీయ టూర్స్ ప్రతినెలా ఫిక్స్‌డ్ డిపార్చర్ రూపంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ కన్నడ ప్రజలకు చేరువగా ఈ నెల 25న గంగానగర్‌లో నూతన కార్యాలయం ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ప్రముఖ నటి ప్రణీత పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 31లోపు బుకింగ్ చేసుకునేవారికి బ్యాంకాక్ రూ.32,999, కాశీ–అయోధ్య రూ.19,999, సింగపూర్–మలేషియా రూ.1,06,000, దుబాయ్ రూ.97,500 ఇలా పలు ఓపెనింగ్ ఆఫర్స్ అందిస్తున్నామన్నారు.

సాంకేతికతపై అవగాహన తప్పనిసరి

ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ తదితరులు

నాగోలు: విద్యార్థులు సాంకేతికతపై అవగాహన పెంచుకొని జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల 23వ ఫ్రెషర్స్ డే ఉమాంగ్ 2కె24 పేరుతో శనివారం నాగోలులోని కల్యాణ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతపై దృష్టి సారించి అవగాహన పెంచుకొని జాతి నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించాలని విద్యార్థులకు సూచించారు. టెక్ మహీంద్రా హైదరాబాద్ హెడ్ ట్రైనర్ సిద్ధిక్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం అన్వేషించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. అవంతి గ్రూప్ కళాశాలల వ్యవస్థాపకులు, చైర్మన్, మాజీ ఎంపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిభావంతులను వెలికితీయాలని ఆయన కోరారు. 33 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో అవంతి గ్రూప్ కళాశాల ద్వారా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, అవంతి గ్రూప్ జనరల్ సెక్రటరీ ఎం.ప్రియాంక, అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వీరసోమయ్య, డాక్టర్ ఎస్.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రొమ్ము కేన్సర్‌పై అప్రమత్తత అవసరం

తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా



రొమ్ము కేన్సర్‌పై అవగాహన వాక్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ సూరేపల్లి నందా

బంజారాహిల్స్: ప్రపంచంలో కేన్సర్ అవగాహన మాసం పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని రెనోవా సెంచరీ హాస్పిటల్ నుంచి రోడ్డు నంబర్–1 సిటీ సెంటర్ వరకు మూడు కిలోమీటర్ల మేర శనివారం అవగాహన వాక్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరేపల్లి నందా మాట్లాడుతూ రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు వాక్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుతున్న జీవన శైలి, ఒత్తిడి, ఇతర కారణాల వల్ల మహిళలు ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. మరీ ముఖ్యంగా కేన్సర్, మహిళల్లో వచ్చే కేన్సర్లలో రొమ్ము కేన్సర్ కేసులు ఇటీవల కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల వారిలో ఇది బయటపడుతోందన్నారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 2.3 మిలియన్ కొత్త కేసులతో రొమ్ము కేన్సర్ ప్రబలుతుందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయమం, సరైన జీవనశైలి కలిగి ఉండటం, ధూమపానం, ఆల్కాహాల్ వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నివారణ, స్క్రీనింగ్ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆరోగ్య శిబిరాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రెనోవా సెంచరీ హాస్పిటల్స్ చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ అండ్ హైపెక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ జూలూరి, సీఓఓ రవీంద్రనాథ్ గరగ, సీనియర్ కన్సల్టెంట్ హెడ్ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీ డాక్టర్ కే.శ్రీనివాసరావు, ఉదయకుమార్, అశ్విన్ పండిట్, నిషిత్ వడ్డెబోయిన, జ్యోతి జొన్నాదుల, అర్జున్, జహీర్ అహ్మద్, దినేష్, సాయిబాబు, సాయికుమార్ పాల్గొన్నారు.

హైడ్రాకు వంద రోజులు!

నిర్మాణ వ్యర్థాలను తొలగించాల్సిన బాధ్యత బిల్డర్లదే..: రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చెరువులు, కాల్వలు, ప్రభుత్వ స్థలాలను కాపాడుతూ.. నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన హైడ్రాకు నేటితో వంద రోజులు పూర్తయ్యాయి. ప్రభుత్వ అనుమతులు ఉన్న భవనాలను హైడ్రా కూల్చదని, సర్వే నంబర్లు మార్చేసి.. తప్పుడు సమాచారంతో అనుమతులు పొంది.. భూములు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా కూల్చిన తర్వాత ఆ వ్యర్థాలను సదరు బిల్డరే తొలగించాలని, లేనిపక్షంలో వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేశామని, అయితే కొంతమంది నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తుండగా మరి కొందరు అలసత్వం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. మరి కొంతమంది అక్కడ ఉన్న విలువైన ఇనుప చువ్వలు, ఇతర సామగ్రిని తీసుకుని వ్యర్థాలను వదిలేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. అక్కడ పూర్వ స్థితికి భూమిని తీసుకురావాల్సిన బాధ్యత బిల్డర్లపైనే ఉందని తెలిపారు. చెరువులకు పునరుజ్జీవం కల్పించే క్రమంలో హైడ్రా చొరవచూపి.. అక్కడ నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తోందని, ఇందుకు అయ్యే ఖర్చును నిర్మాణదారుడి నుంచి వసూలు చేస్తోందని చెప్పారు. నగరంలో ట్రాఫిక్, వరద నీటి సమస్య పరిష్కారానికి హైడ్రా కృషి చేస్తోందని ఈ క్రమంలో వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటోందని వివరించారు.

నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లను పునఃపరిశీలించాలి



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన నూతన ఎక్సైజ్ స్టేషన్లను పునఃపరిశీలించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్య కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది సంఘం నాయకుల దురాలోచన మేరకు కొంత మంది అధికారుల పోస్టింగ్‌ల గురించి ఎలాంటి శాస్త్రీయత పాటించకుండా అడ్డగోలుగా కుత్బుల్లాపూర్, బాలానగర్, మల్కాజిగిరి, ఉప్పల్, ఘట్‌కేసర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ తదితర ఎక్సైజ్ స్టేషన్లను రెండుగా విభజించారని ఆరోపించారు. చాలా తక్కువ నేరాల సంఖ్య కలిగిన స్టేషన్లను రెండుగా విభజించి, అత్యంత ఎక్కువ నేరాల సంఖ్య కలిగిన ధూల్‌పేట వంటి స్టేషన్లను విభజించలేదన్నారు. నూతన స్టేషన్ల ఏర్పాటును పరిశీలించి కొంత మంది అధికారులు, పైరవికారులకు లబ్ధి చేకూర్చే విధంగా కాకుండా ఎక్సైజ్ నేరాలను అదుపుచేసే విధంగా ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బడేసాబ్, సాయిబాబ, సుమన్, నాగేష్, నవీన్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ మార్కెటింగ్‌పై సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ ఇంటిగ్రేటెడ్ డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్ సమావేశం శనివారం ఆదర్శనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో జరిగింది. సంస్థ పీజీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎఫ్‌టీటీహెచ్ వ్యాపార అభివృద్ధిపై చర్చించారు. సలహాలు, సూచనలు అందించారు.

పారా మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి



కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎస్వీ నాయకులు, పారా మెడికల్ విద్యార్థులు

సుల్తాన్‌బజార్: పారా మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ పారామెడికల్ కళాశాల విద్యార్థులతో కలిసి శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం విద్యార్థులు ఫీజులు కట్టి కోర్సులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆ కళాశాల ఫేక్ కళాశాలగా తేలడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అకాడమిక్ ఇయర్ నష్టం కలగకుండా ప్రభుత్వం ఈ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై బోర్డు కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. బీఆర్ఎస్ ఎస్వీ ఉపాధ్యక్షులు బాలు, సాయితేజతో పాటు పెద్ద ఎత్తున పారా మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాలలకు వీసీ పదవి కేటాయించాలి



మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన వీసీ నియామకాల్లో మాలలకు అన్యాయం జరిగిందని మాల ప్రజాసంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు ఆదర్శ్‌నగర్‌లో మాల విద్యార్థి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ.. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో యావత్ మాల సమాజం మొత్తం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి పట్టం కట్టిందని గుర్తుచేశారు. ఇటీవల తొమ్మిది విశ్వవిద్యాలయాలకు వైస్‌చాన్స్‌లర్లను నియమిస్తే అందులో ఒక్క మాల ప్రొఫెసర్ కూడా లేకపోవడం శోచనీయన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జేఎన్‌టీయూలకు మాల ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, మాల ఉపకులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రాంచందర్, మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బాలకిషన్, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లింగస్వామి, మాల జనసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, ఆదివారం, 27, అక్టోబర్, 2024



పూర్వవైభవానికి కృషి..

మళ్లీ ఈ కళలకు పూర్వవైభవం తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాను. నా స్టార్టప్ 'క్యాపిబరో' ఆధ్వర్యంలో కొండపల్లి బొమ్మల నేపథ్యంలో ఇండియన్ డిస్నీల్యాండ్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నాను. ఈ థీమ్ పార్క్‌లో కొండపల్లితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 32 రకాల బొమ్మల తయారీలను భాగం చేయాలనుంది. ఇందులో భాగంగా కొండపల్లి బొమ్మకు బిజినెస్ మార్కెట్ కల్పించి.. కొండపల్లి కళాకారులకు నెలవారీ జీతాలు, ఇన్సూరెన్స్‌లు, ప్రొఫెషనల్ పనిరోజులు, సెలవులు ఉండేలా చేయాలనుంది.



కొండపల్లి బొమ్మలకు.. మార్వెలెస్ టచ్

యాక్షన్ మూమెంట్ ఉండేలా మార్పులు

- కదలికలకు పేటెంట్ పొందిన అభినవ్
- హాలీవుడ్ టాయ్‌స్టిక్ స్ట్రాటజీలో భాగంగా యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్
- దాదాసాహెబ్ ఫాల్కే మొదలు ఐదు నేషనల్ అవార్డులు
- 'క్యాపిబరో' స్టార్టప్‌తో 'కల్కి' ప్రభాస్, బుజ్జిలకు 3డీ డిజైన్‌లు
- కొండపల్లి కళతో ఇండియన్ డిస్నీల్యాండ్ థీమ్ పార్క్ లక్ష్యం
- సినిమాల్లోనూ రాణించాలనుంది: అభినవ్ సాయి

ఈ తరం యువతకు అధునాతన ఆవిష్కరణల పై ఉన్న ఆసక్తి.. మన మూలాలను అన్వేషించడంపై ఉండదని తరచూ వింటుంటాం. కానీ నగరానికి చెందిన అభినవ్‌సాయి అనే 23 ఏళ్ల యువకుడు తన సృజనాత్మకతతో సాంస్కృతిక వైభవానికి అధునాతన హంగులను అద్దుతూ రెండు తరాలకూ మధ్య వారధిలా నిలుస్తున్నాడు. కళ పరంగా ఎంతో విశిష్టత ఉన్నప్పటికీ ఆదరణకు దూరమవుతున్న కొండపల్లి బొమ్మలకు అధునాతన హంగులతో మళ్లీ ప్రాణం పోస్తున్నాడు. వోక్సన్ యూనివర్సిటీ వేదికగా తను చదువుకున్న విజ్ఞానాన్ని సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆద్యం పోస్తున్నాడు. ఇలా కొండపల్లి బొమ్మకు తాను రూపొందించిన మోడ్రన్ జాయింట్ టెక్నాలజీకి పేటెంట్ సైతం లభించింది. తాను అందించిన ప్రొడక్ట్ డిజైన్ నేపథ్యంతో స్వయంగా రూపొందించిన యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు ఐదు నేషనల్ అవార్డులను పొందింది. అంతేకాకుండా తన స్టార్టప్ 'క్యాపిబరో' ఆధ్వర్యంలో హాలీవుడ్ లెగో టాయ్స్ తరహాలో రూపొందించిన కల్కి మూవీ టాయ్స్ వినూత్న ఆవిష్కరణను తలపిస్తున్నాయి. ఇలా కొండపల్లి బొమ్మలు మొదలు తన సినిమా ప్రయాణం ఈ తరానికి స్ఫూర్తి దాయకమే. ఆ విశేషాలు అభినవ్ మాటల్లోనే తెలుసుకుందాం...!!

– సాక్షి, సిటీబ్యూరో

చిన్నప్పటి నుంచి క్రియేటివ్ పెయింటింగ్, రాక్ స్కల్ప్చరింగ్, మినియేచర్ స్కల్ప్చర్ వంటి సృజనాత్మకత కళలు అంటే ఇష్టం. ఇలా కళాత్మక ప్రయోగాల్లో భాగంగానే నేను 7వ తరగతి (12 ఏళ్ల వయసులో..) చదువుతున్నప్పుడే ఫ్రెండ్స్‌తో నా మొదటి షార్ట్‌ఫిల్మ్ తీశాను. అప్పటికీ నాకు ఎడిటింగ్ అంటే కూడా సరిగా తెలీదు. ఐ మూవీస్ యాప్ సహాయంతో దానిని పూర్తిచేశాను. అలా బ్లాక్ అండ్ వైట్ సినిమా, థ్రిల్లర్, యానిమేషన్, ఫ్యాషన్ తదితర వేరియేషన్స్‌తో 50 షార్ట్‌ఫిల్మ్స్ చేశాను. ఈ క్రియేటివిటీ, ఐడియాలజీతోనే నగరంలోని వోక్సెన్ యూనివర్సిటీలో ఆర్ట్స్ అండ్ డిజైనింగ్‌లో గ్రాడ్యుయేషన్‌లో చేరాను. వోక్సెన్ వేదికగా తెలుగు సంస్కృతిలో విశిష్టత కలిగిన కొండపల్లి బొమ్మలపైన పరిశోధనలు చేశాను. నా క్రియేటివిటీలో భాగంగా కొండపల్లి బొమ్మకు యాక్షన్ మూమెంట్ ఉండేలా మార్పు చేశాను.



డెమోక్రసీ డెత్ ఆఫ్ ఆర్ట్స్..

నా గ్రూప్ ప్రాజెక్ట్‌లో భాగంగా టాయ్‌కథాన్ అనే కాంపిటీషన్‌లో పలు ఆసక్తికర విషయాలను తెలుసుకున్నాను. ముఖ్యంగా 95 శాతం ట్రెడిషనల్ బొమ్మల విషయంలో ప్రచారం వేరు, వాస్తవికత వేరు. ఆన్‌లైన్‌లో కూడా ఔట్‌డేటెడ్ సమాచారం ఉంటుంది. కొండపల్లి బొమ్మలకు ఎంతో విశిష్టత ఉంది. 400 ఏళ్ల క్రితం రాజస్థాన్ నుంచి రాజుల కళాభిరుచిలో భాగంగా తెలుగు నేలకు వచ్చి ఇక్కడే స్థిరపడిపోయింది. తేలికైన తెల్లపానిక చెక్కతో చేస్తారు. కానీ వాటికి ప్రస్తుతం అంతగా మార్కెట్ లేదు. ఒకప్పుడు 6 అడుగుల వరకూ ఉంటే ఇప్పుడు 4, 5 ఇంచులకు మారిపోయాయి. సహజసిద్ధమైన రంగులు వినియోగించేవారు. ప్రస్తుతం అవి వాడట్లేదు. ఎయిర్ పోర్ట్‌లు, పెద్ద షాపింగ్ మాల్స్‌లో అమ్మే బుట్ట బొమ్మలు కూడా కొండపల్లి బొమ్మలు అనుకుంటారు చాలమంది. ఇలాంటి అంశాల వెనుకున్న కారణాలను నా పరిశోధనలో తెలుసుకున్నారు.

ఒక స్పైడర్ మ్యాన్ బొమ్మలా మన కొండపల్లి చెక్క బొమ్మలు కూడా కదిలేలా డిజైన్ చేశాను. ప్రయోగంలో మా యూనివర్సిటీ అందించిన ప్రోత్సాహంతో నాకు పేటెంట్ రైట్స్ లభించాయి. హాలీవుడ్‌లో టాయ్‌స్టిక్ స్ట్రాటజీ బాగా ఆదరణ పొందింది.

యూనివర్సిటీ ప్రోత్సాహంతో పేటెంట్

బార్బీ వంటి బొమ్మలను రూపొందించి వాటి మార్కెట్ కోసం భారీ సినిమాలను సైతం నిర్మిస్తారు. ఈ కోణంలోనే నా ప్రొడక్ట్ డిజైన్ నేపథ్యంలో తీసిన యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు మరో ఐదు నేషనల్ అవార్డులు పొందింది. మరో 10 నేషనల్ అవార్డులకు ఎంపికైంది. ఈ విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయ్యే అవకాశాన్ని తృటిలో కోల్పోయింది.



3డీ డిజైన్.. గ్లిమ్స్‌తో యానిమేషన్..

హాలీవుడ్ లెగో టాయ్స్‌లాగే.. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలుగు సినిమా 'కల్కి' సినిమాలోని బుజ్జీ కారు, ప్రభాస్ తదితర పాత్రధారులను నా స్టార్టప్ 'క్యాపిబరో' ఆధ్వర్యంలో స్కెచ్ వేసి, 3డీ డిజైన్‌తో కొండపల్లి క్రాఫ్ట్ మెన్‌తో బొమ్మలు చేయించాను. అంతేకాకుండా కల్కి గ్లిమ్స్ ఆధారంగా యానిమేటెడ్ వీడియో చేశాను. ఈ విషయం తెలుసుకుని కల్కి నిర్మాత స్వప్న, దర్శకులు నాగ్ అశ్విన్ నా క్రియేటివిటీని అభినందించారు. వారితో కలిసి ఒక ప్రాజెక్టులా ఈ బొమ్మలను తయారు చేయాలని ప్లాన్ చేశాం. కానీ సినిమా విడుదల బిజీ నేపథ్యంలో కుదరలేదు. నా క్రియేటివిటీతో దర్శకునిగా సినిమాలు చేయాలని ఉంది. ఇప్పటి వరకూ తొమ్మిది కమర్షియల్ సినిమా స్క్రిప్ట్‌లు రెడీ చేశాను. ఇందులో ఒక కథ ప్రముఖ దర్శకులు సుకుమార్‌కు నచ్చి చర్చలు జరుగుతున్నాయి. తన సుకుమార్ రైటింగ్స్ ఆధ్వర్యంలో నా సినిమా తీయడానికి ప్రయత్నం చేస్తున్నాను.

గచ్చిబౌలిలో.. లైమ్‌లైట్ డైమండ్ స్టోర్



ప్రారంభించిన సినీ నటి, నిర్మాత మంచులక్ష్మి

గచ్చిబౌలి: బంగారం శక్తిని ఆకర్షిస్తుందని సినీ నటి, నిర్మాత మంచులక్ష్మి పేర్కొన్నారు. గచ్చిబౌలిలో లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ స్టోర్‌ను సంస్థ డైరెక్టర్ నీరవ్‌భట్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా దేవాలయాలను సందర్శించేటప్పుడు మహిళలు బంగారం ధరించడానికి ఇష్టపడతారని, ఇది మన సంస్కృతిలో భాగంగా ఉందన్నారు. స్టోర్, ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ కాన్సెప్ట్‌ని చూసి ఆశ్చర్యపోయానన్నారు. ప్రయోగశాలలో పెరిగిన వజ్రాలు పర్యావరణ అనుకూలమైనవి, సరసమైనవి, ప్రయోగశాలలో పెరిగిన వజ్రాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నాయన్నారు. నేను వాటిని ధరించినప్పుడు అవి బాగా కనిపిస్తాయని, కాబట్టి అవి ప్రకృతి సిద్ధమైనవా లేదా ల్యాబ్‌లో పెరిగినవా అనే విషయాన్ని నేను పట్టించుకోనన్నారు. వజ్రాలు భారతదేశంలో తయారు చేయబడ్డాయి, ప్రతి భారతీయ మహిళా ఈ వజ్రాలను ధరించేందుకు గర్వపడతారని నేను భావిస్తున్నాను అని అన్నారు.

దక్షిణ భారత మార్కెట్‌కు గేట్‌వేగా హైదరాబాద్..

హైదరాబాద్ వజ్రాలను ఇష్టపడే నగరం. దక్షిణ భారత మార్కెట్‌కు గేట్‌వేగా ఈ నగరం గుర్తింపు సాధించిందని లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ సీవీడీ డైమండ్స్ డైరెక్టర్ నీరవ్‌భట్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైమండ్స్‌కి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి డిసెంబర్‌లోపు భారతదేశం అంతటా 15 కొత్త స్టోర్లను ప్రారంభించాలని లైమ్‌లైట్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మేము చెన్నై, బెంగళూరులో కలిసి ఐదు శాఖలను ప్రారంభించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లైమ్‌లైట్ ప్రాంతీయ భాగస్వామి, ఏఎస్–3 జ్యూవెల్స్‌కి చెందిన నిపున్‌గోయల్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



'విద్యాజ్యోతి'లో 'టెడెక్స్ వీజేఐటీ'

వృత్తి నైపుణ్యం, పరిశోధనలపై చర్చాగోష్టి

సాక్షి, సిటీబ్యూరో: 'పవర్ ఆఫ్ పెర్సిస్టెన్స్' అనే వినూత్న ఆలోచనతో నగరంలో ఏర్పాటు చేసిన 'టెడెక్స్' విభిన్న రంగాలకు చెందిన నిపుణులు, ఆవిష్కర్తలతో ఆకట్టుకుంది. నగరంలోని విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వేదికగా శనివారం నిర్వహించిన మొదటి టెడెక్స్ కార్యక్రమంలో ది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నిఖిల్ దేశాయ్, పర్వతారోహకురాలు హస్వి మురికి, మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2022 లిఖిత యలమంచిలి, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృత్తి నైపుణ్యం, పరిశోధనాత్మకతపై ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో వారి ఆలోచనలను ఔత్సాహికులతో పంచుకున్నారు. వారి చర్చలు పరిశోధనాత్మక అంశాలు, న్యాయం, వ్యక్తిగత–వృత్తిపరమైన నైపుణ్యం, మూస పద్ధతులను విచ్ఛిన్నం చేయడానికి శిఖరాలను జయించడం తదితర విషయాలతో స్ఫూర్తి నింపింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాయి కీర్తన కూరపాటి, ఔత్సాహిక ఆవిష్కర్తలు, విద్యార్థులతో పాటు ఆకాష్ మల్లారెడ్డి, వీజేఐటీ చైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబా రెడ్డి, డాక్టర్ ఎ.పద్మజ, శ్రీలత, వెంకటాచలం పాల్గొన్నారు.



తెలంగాణ శివకాశి.. సనత్‌నగర్

దీపావళి సందడి మొదలు.. బాణాసంచా షాపుల ప్రక్రియ పూర్తి

సనత్‌నగర్: టపాసుల అమ్మకాల్లో తెలంగాణ శివకాశిగా పేరున్న సనత్‌నగర్‌లో అప్పుడే దీపావళి బాణాసంచా దుకాణదారుల, కొనుగోలుదారుల సందడి మొదలైంది. దీపావళి సమీపిస్తుందంటే పండుగ శోభ అంతా ఇక్కడే ఉందా? అన్న అనుభూతి కలుగక మానదు. సాధారణ రోజుల్లోనే బాణాసంచా అమ్మకాలకు కేంద్రంగా ఉన్న సనత్‌నగర్.. ఇక దీపావళి పండుగ వేళల్లో వాటి అమ్మకాలు ఏవిధంగా ఉంటాయో ఊహించనవసరంలేదు. నాలుగు దశాబ్దాల నుంచి హోల్‌సేల్, రిటైల్‌గా ఇక్కడ టపాసుల అమ్మకాలను కొనసాగిస్తూ వస్తున్నారు. ఎక్కడా లేనివిధంగా టపాసుల దుకాణదారులు ప్రత్యేక వెల్ఫేర్ అసోసియే షన్లు కూడా ఏర్పాటు చేసుకుని ఏయేటికాయేడు అమ్మకాలను కొనసాగిస్తున్నారు. ఏటా మాదిరే ఈ సంవత్సరం సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కు చుట్టూ స్టాల్స్‌ను నెలకొల్పి అమ్మకాలు సాగించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి టపాసులను కొనుగోలు చేసుకుని వెళ్లడం ఏటా అలవాటుగా మారింది.

రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికే పుట్టినిల్లుగా ఉన్న సనత్‌నగర్‌లో పారిశ్రామిక రంగం ఒక వెలుగు వెలిగిన సమయంలో ఇక్కడ టపాసుల అమ్మకాలకు బీజం పడింది. కాలక్రమేణా లెక్కకు మించి పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పబడ్డాయి. ఈ క్రమంలో దీపావళి వచ్చిందంటే ఆ పరిశ్రమల యాజమాన్యాలు ఇచ్చే బోనస్‌లతో కార్మిక కుటుంబాలకు పెద్ద పెండుగే. అందుకే దీపావళి టపాసులకు ఇక్కడ పెద్ద డిమాండ్ ఉండేది. ఈ నేపథ్యంలో సనత్‌నగర్‌లో టపాసుల అమ్మకాలు విరివిగా జరుగుతూ వస్తున్నాయి. 1980లో సనత్‌నగర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు మరి

అసోసియేషన్ల దుకాణాల ఏర్పాటు


కొన్ని అసోసియేషన్లు టపాసుల దుకాణాల నిర్వహణకు ముందుకొచ్చాయి. రిటైల్‌తో పాటు హోల్‌సేల్ దుకాణాలు ఇక్కడ వెలిశాయి. ఇక్కడి నుంచి వివిధ జిల్లాలకు దీపావళి టపాసులు పంపిణీ జరుగుతుంటోంది. నేరుగా శివకాశి నుంచి ఇక్కడికి టపాసులను తీసుకొచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఇదిలా ఉంటే అప్పట్లో ఎక్కడపడితే అక్కడ రిటైల్ దుకాణాలు నెలకొల్పి అమ్మకాలు కొనసాగిస్తూ వస్తుండగా.. పదేళ్ల క్రితం అవన్నీ ఒకేచోటకు చేర్చి అమ్మకాలు చేయడం ప్రారంభించారు. ఇలా ఒకేచోట 120 వరకూ దుకాణాలు ఏర్పాటుచేస్తారు. ఇందుకు సంబంధించి జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, పోలీసుల అనుమతి తీసుకున్న తరువాతనే ఇక్కడ స్టాళ్ల ఏర్పాటు జరుగుతోంది.

అంతా ఫ్యాన్సీ మయం

ఇక్కడ ఏర్పాటయ్యే స్టాళ్లలో ఫ్యాన్సీ బాణాసంచా విక్రయమే అధికంగా ఉంటుంది. స్టాండర్డ్‌తో పాటు పలు రకాల బ్రాండ్‌లకు చెందిన బాణాసంచా అమ్మకాలు ఇక్కడ కొనసాగుతాయి. ముఖ్యంగా పీకాక్ డ్యాన్స్, ప్యారడైజ్ 250 షాట్స్, పనోరమా 500 షాట్స్, సిల్వర్ డ్రాగన్, క్రాక్లింగ్ సైక్లోన్, గ్రీన్‌హెవెన్, గార్డెన్ ఇడెన్, సింగింగ్ బర్డ్స్, బటర్ ఫ్లైతో పాటు ఎన్నో రకాల ఫ్యాన్సీ బాణాసంచాలు ఇక్కడ లభిస్తాయి.



నిబంధనలు తప్పనిసరి..



124 షాపులకు దరఖాస్తు చేసుకోగా అందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెండింటిని తిరస్కరించాం. ఓపెన్ ప్లేస్‌లో రేకుల షెడ్డులోనే దుకాణాలు ఏర్పాటు చేయాలి. ప్లాస్టిక్ మెటీరియల్ నిషేధం. ముఖ్యంగా ఇసుక బక్కెట్లు, వాటర్ డ్రమ్ములు ఏర్పాటుచేసుకోవాలి. కాలం చెల్లిన టపాసులతో ప్రమాదకరం. అలాంటి వాటిని విక్రయించకూడదు.

– రాజు, ఇన్‌ఛార్జి ఎస్ఎఫ్ఓ, సనత్‌నగర్



'స్టార్'లో మెన్ ఫర్ విమెన్

స్టార్ ఆస్పత్రి కృషిని అభినందించిన సినీ నటుడు శ్రీకాంత్

రాయదుర్గం: ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేటప్పుడు ఐకమత్యంగా నిలబడడం అవసరమని ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలోని స్టార్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'మెన్ ఫర్ విమెన్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు అండగా నిలిచిన పురుషులు, రొమ్ము క్యాన్సర్ బాధితుల వెనుక నిలిచిన పలువురిని సత్కరించారు. అనంతరం వారికి ప్రేరణాత్మక స్టార్ అవార్డులు అందించారు. స్టార్ ఆస్పత్రి చేస్తున్న కృషిని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వైద్యులకు సమాజంలో ఎంతో గౌరవం ఉందని, వైద్య రంగంలో వస్తున్న మార్పులు, అధునాతన సౌకర్యాలను కల్పించడంలో స్టార్ ఆస్పత్రి ముందుందని శ్రీకాంత్ అన్నారు. దేశంలోని మహిళల్లో రొమ్ముక్యాన్సర్ అత్యంత సాధారణంగా గుర్తించబడుతున్న క్యాన్సర్ అని స్టార్ ఆస్పత్రుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం అన్నారు. దేశంలో 2022లో 2,16,108 రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, సంవత్సరానికి 2.3 మిలియన్ల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, దీని కారణంగానే ప్రపంచవ్యాప్తంగా సుమారు 670,000 మంది మరణిస్తున్నారని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, ముందస్తుగా గుర్తించడమే దీనికి పరిష్కారమన్నారు. వైద్యాధికారులు డాక్టర్ రమేష్ గుడిపాటి, డాక్టర్ రాహుల్ మేదక్కర్, వాకా భాస్కర్‌రెడ్డి, డాక్టర్ విపిన్ గోయల్, డాక్టర్ సాయినాథ్ బేతన బొట్ల, ఏఎంవీఆర్ నరేంద్ర ప్రసంగించారు.



నోవోటెల్‌లో.. బ్లూ జోన్ డిన్నర్

సాక్షి, సిటీబ్యూరో: బ్లూ జోన్ డిన్నర్ సిరీస్‌లో భాగంగా ఎయిర్‌పోర్ట్ నోవోటెల్ వేదికగా ఏర్పాటు చేసిన పాశ్చాత్య, చైనీస్–ప్రేరేపిత వంటకాలు నగరానికి వినూత్న రుచుల సమ్మేళనాన్ని అందించాయి. శనివారం నిర్వహించిన బ్లూ జోన్ డిన్నర్ ఈ ప్రపంచంలోని అత్యంత ఆరోగ్యకరమైన, ఎక్కువ కాలం జీవించే జాతుల ఆహారాలను నగర ఫుడ్ లవర్స్‌కు పరిచయం చేశాయి. ప్రముఖ చెఫ్ అమ్మన రాజు పాకశాస్త్ర నైపుణ్యాలతో వండిన స్మోక్డ్ టొమాటో కౌలిస్‌తో చేసిన బచ్చలికూర, మష్రూమ్ కాన్ఫిట్ ఫింగర్ మిల్లెట్ టోర్టెల్లిని, స్పానిష్ రైస్‌తో వెజిటబుల్ చిమిచాంగాస్, సోపా డి అల్బోండిగాస్, గాల్లో పింటో, బ్యూరే బ్లాంక్ సాస్‌తో పాన్–రోస్ట్ చేసిన రెడ్ స్నాపర్ వంటి రుచులు ఆహార ప్రియులను ఆహా అనిపించాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నోవోటెల్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ మాట్లాడుతూ.. మొక్కల ఆధారిత సంపూర్ణ పోషకాలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో తయారు చేసిన ఈ డిష్‌లు ఆరోగ్య సంరక్షణతో పాటు వినూత్న జీవనశైలిని పరిచయం చేస్తాయన్నారు. ఈ బ్లూ జోన్ డిన్నర్ మెనూలో ఆసా, చికెన్ కన్సోమ్ సూప్, పైనాపిల్ స్కేవర్‌లు, మారినేటెడ్ రివర్ సాల్మన్, హెర్బ్–సీన్డ్ కాలామారి, మెరినేడ్‌లతో కాల్చిన రొయ్యలు, అవకాడో మాష్, మొక్కజొన్న సల్సా, సక్యూలెంట్ ప్రాన్ టపాస్ వంటి విభిన్న రుచులు అలరించాయి.



శుక్రవారం మాది..

ముందు మా సేవలు చూడండి

మహిళ పరిపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా 'శుక్రవారం సభ'

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న కార్యక్రమం

పిల్లల మానసిక వికాసానికి అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టి

నేటి కాలంలో ఆడపిల్ల కడుపున పడినప్పటి నుంచీ కష్టాలే. ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్లు చేయించుకోవడం నుంచి కిశోర బాలికలకు, బాలింతలకు పోషకాహారం అందకపోవడం దాకా ఎన్నో సమస్యలు. మహిళలు కేన్సర్లు సహా ఎన్నో శారీరక రుగ్మతలకు లోనైనా కప్పిపుచ్చుకుంటూ జీవిస్తున్న పరిస్థితి. పిల్లలను అంగన్‌వాడీలకు పంపడం లేదు. తెలియక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించేలా, మహిళల్లో అవగాహన కల్పించేలా కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, స్వయం సహాయక సంఘాలను ఒకే తాటిపై తీసుకువచ్చారు. 'శుక్రవారం సభ' పేరిట ప్రభుత్వ సేవలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

- సాక్షి ప్రతినిధి, కరీంనగర్



చిన్నారికి ఉగ్గుఅన్నం తినిపిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నేటి కాలంలో మహిళలు కూడా ఏదో ఒక పనిచేస్తున్నారు. పిల్లలను ప్రైవేటు బడులకు పంపుతున్నారు. అనారోగ్యమొస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఈ క్రమంలో 'ప్రభుత్వ పథకాలను ఆసరాగా చేసుకుని ఎదగండి. చిన్నారులకు అంగన్‌వాడీలలో అందించే బాలామృతం, కిశోర బాలికలకు రక్తహీనతను తగ్గించే పోషకాహారం, బాలింతలకు బలవర్ధకమైన ఆహారం, మధ్య వయసు స్త్రీలకు ప్రతీ 3 నెలలకోసారి ప్రభుత్వ ఆస్పత్రిలో 'ఆరోగ్య మహిళ' పేరిట లభించే 52 ఉచిత పరీక్షల వివరాలు తెలుసుకోండి. ఈ సేవలన్నీ ప్రభుత్వం వద్ద ఉచితంగా అందుతాయి..' అంటూ 'శుక్రవారం సభ' పేరిట వారానికి ఒక మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అక్కడే గర్భవతులకు సీమంతం, బాలింతలకు పోషకాహార పంపిణీ వంటివాటిని కలెక్టర్ స్వయంగా చేపడుతుండటం గమనార్హం.

పీసీవోడీ, కేన్సర్, భ్రూణహత్యలపైనా..

నడి వయసు మహిళలకు ఆరోగ్య మహిళా పథకం ద్వారా పీసీవోడీ (గర్భాశయంలో కణతులు), కేన్సర్ నిర్ధారిత పరీక్షలు నిర్వహిస్తారు. వాటి ముప్పును ముందుగా గుర్తించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని.. అవే పరీక్షలు, చికిత్సలు ప్రైవేటులో చేస్తే రూ.లక్షల ఖర్చు అవుతుందని, ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందని కలెక్టర్ సత్పతి మహిళలకు భరోసా కల్పిస్తున్నారు. మహిళలు తీవ్ర అనారోగ్యాల పాలైతే వారి కుటుంబాలు ఆగమవుతాయని సూచిస్తున్నారు. పిల్లల మానసిక వికాసానికి వీలుగా అంగన్‌వాడీలను ఆహ్లాద వాతావరణం ఉండేలా మారుస్తున్నారు. భ్రూణహత్యలను అరికట్టేలా మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

పోషకాహారం ప్రాధాన్యం తెలిసింది..



కలెక్టర్ సత్పతి మేడం మొదలుపెట్టిన శుక్రవారం సభ మాలో చైతన్యం తెచ్చింది. బాలింతలకు, గర్భవతుల సంక్షేమం కోసం మొదలు పెట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. మాలో రక్తహీనత నివారించేలా అవగాహన కల్పించారు. తల్లి పాల ప్రాముఖ్యత, అంగన్‌వాడీలలో లభించే సేవల గురించి చక్కగా వివరించారు.

–అనిత, గృహిణి, వెంకట్రావుపల్లి, హుజూరాబాద్

కేన్సర్ ముప్పు గురించి చెప్పారు



కలెక్టర్ మేడం పీసీవోడీ, కేన్సర్ ఎలా వస్తాయో వివరించారు. మా ముందు తరాల వారు పనిలో పడి ఎలాంటి పరీక్షలు చేయించుకోకుండా ప్రాణాలు పోగొట్టుకున్నారు. కలెక్టర్ మేడం తల్లిలా మాపై శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆడపిల్లల ప్రాధాన్యం వివరించి భ్రూణహత్యల నివారణపైనా అవగాహన కల్పించారు.

– అఖిల, గృహిణి, వెంకట్రావుపల్లి, హుజూరాబాద్

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మంద కృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని చెప్పి నమ్మక ద్రోహం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారిని నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. కాళ్లు, చేతులు లేని దివ్యాంగుల పెన్షన్‌ను గత పది నెలలుగా ప్రభుత్వం ఇవ్వకుండా ఆ డబ్బులను మిగుల్చుకుందని, ఆ డబ్బును రైతు రుణమాఫీకి మళ్లించిందని ఆరోపించారు. వచ్చే నెలలో మొత్తం 10 నెలల పెన్షన్ ఇవ్వాలని, దానిని రూ. 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే వికలాంగుల పోరాట సమితి (వీహెచ్‌పీ), ఎమ్మార్పీఎస్ కలసి ఉద్యమిస్తాయని హెచ్చరించారు. పెన్షన్ల పోరాటంలో భాగంగా నవంబర్ 1 నుంచి 16వ తేదీ వరకు రోజుకు రెండు జిల్లాల్లో మహాసభలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. తర్వాత నవంబర్ 17 నుంచి 23 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. 26న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.


'వర్గీకరణ జరిగితే ఎమ్మార్పీఎస్ దుకాణం బంద్'



కూసుమంచి/వైరా: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపడితే ఎమ్మార్పీఎస్ దుకాణం బంద్ అవుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో శనివారం మాదిగల జేఏసీ ఆధ్వర్యాన జరిగిన సమ్మేళనంతో పాటు వైరాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణ జరిగితే తమకు ఉపాధి ఉండదనే భయంతోనే మంద కృష్ణ మాదిగ సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు అనుమానంగా ఉందన్నారు. ఆయన ఉద్యమంతో కార్యకర్తలకు పేదరికం, అనారోగ్యమే తప్ప మరేమీ లేదన్నారు. మంద కృష్ణ టీడీపీకి, బీజేపీకి ఓటేయండి అంటున్నాడే తప్ప వర్గీకరణ కోసం సీఎంల వద్దకు వెళ్లడం లేదని తెలిపారు. ఏపీలో టీడీపీ, బీజేపీకి మద్దతు ఇచ్చిన ఆయన వర్గీకరణపై ఎందుకు పట్టుబట్టడం లేదని ప్రశ్నించారు. అంతేకాక ఉద్యమ కార్యాచరణ పేరిట కార్యకర్తలను మళ్లీ రోడ్లపైకి తీసుకొస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి 12 శాతం వర్గీకరణ కోసం కోరవచ్చని తెలిపారు.

దుష్ప్రచారం చేస్తున్న వారికి లీగల్ నోటీసులిస్తా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి సంగారెడ్డి: తనను అప్రతిష్టపాలు చేసే విధంగా దుష్ప్రచారం చేస్తున్న సామాజిక మాధ్యమాలు, టీవీ మీడియాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారందరికీ లీగల్ నోటీసులు ఇస్తానన్నారు. రెండేళ్ల క్రితం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని తాను బహిరంగ సభలో వెల్లడించానని, అయితే ఓ మహిళా కలెక్టర్‌ను తాను తిట్టినట్టు, బూతులు మాట్లాడినట్టు కొన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. ప్రస్తుతమున్న మహిళా కలెక్టర్‌ను తానేమీ అనలేదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. గతంలో కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియోను ఇప్పుడు వక్రీకరిస్తున్నారన్నారు. కాగా, జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోను జర్నలిస్టు శంకర్ పేరుతో ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. అది వైరల్ కావడంతో వివాదం ముదిరింది. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన శంకర్‌పై సంగారెడ్డి డీపీఆర్ఓ ఏడుకొండలు ఫిర్యాదుతో సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

నిధుల మళ్లింపు నిజమే

'స్కిల్' కుంభకోణంలో వెలుగులోకి సరికొత్త విషయాలు.. నిగ్గు తేల్చిన ఈడీ

ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం ఎలా మొదలైంది.. నిధులు ఎలా మళ్లించారు.. ఎంత మొత్తంలో మళ్లించారు.. అందులో ఎవరెవరు ఉన్నారు.. ఎన్ని సూట్‌కేస్ కంపెనీలు ఏర్పాటు చేశారు.. ఏ ఏ దేశాల్లో ఆ కంపెనీలున్నాయి.. ఆ కంపెనీల ప్రతినిధులు ఎవరు.. వారికి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును నడిపిన వ్యక్తులకు మధ్య సంబంధం ఏమిటి.. మళ్లించిన నిధులను తిరిగి ఎలా నగదు రూపంలో తీసుకున్నారు.. ఇలా పలు కీలక విషయాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ద్వారా పూసగుచ్చినట్లు బట్టబయలు అయ్యాయి. ఇకపై సాగనున్న దర్యాప్తులో ఈ స్కామ్‌లో గత ప్రభుత్వ పెద్దల పాత్ర నిగ్గు తేలనుంది.



APSSDC Fund → DTSPL → SEPL → ACI → Layer-2 Entities → Layer-3 Entities

18 Apart from ACI, investigation also revealed that the other entities namely Inweb Services Pvt Ltd, Patrick Info Services Pvt Ltd, ITSmith Solutions Pvt Ltd, Provestment Services Ltd, Bhartiya Global Infomedia Ltd., etc. have also been used for bogus billing entry to divert the funds received directly from SEPL. So far diversion of funds of around Rs. 151 Crore has been revealed during investigation.

షెల్ కంపెనీల వివరాలతో పాటు వాటిలోకి నిధులు ఎలా మళ్లించారో తెలియజేస్తూ ఈడీ దాఖలు చేసిన కౌంటర్.. ఇప్పటివరకు సాగిన దర్యాప్తులో రూ.151 కోట్ల నిధులు మళ్లించినట్లు తేల్చిన ఈడీ

సాక్షి, అమరావతి : నారా చంద్రబాబునాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కనుసన్నల్లో సాగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో సరికొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఈడీ సాగించిన దర్యాప్తులో మొత్తం రూ.151 కోట్ల మేర నిధులను పలు కంపెనీలకు మళ్లించినట్లు తేలింది. ఇందులో విదేశీ కంపెనీల ప్రమేయం కూడా ఉన్నట్లు ఈడీ బయటపెట్టింది. ఈ కుంభకోణంలో పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగిందనేందుకు స్పష్టమైన ఆధారాలను సేకరించింది. ఈ వివరాలన్నింటినీ ఇటీవల ఓ కేసులో హైకోర్టు ముందు ఉంచింది. ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, ఆ నిధులను తిరిగి డబ్బు రూపంలో ఎలా పొందారో ఈడీ తన కౌంటర్‌లోను స్పష్టంగా వివరించింది. ఇప్పటి వరకు ఈడీ తన దర్యాప్తును ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు పరిమితం చేసింది. దర్యాప్తు ఓ కొలిక్కి రావడంతో ఇకపై స్కిల్ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్రపై దృష్టి సారించనుంది. అసలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎలా మొదలైంది.. ఏకపక్ష నిర్ణయాలు ఎవరు తీసుకున్నారు.. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్ర, ఆయన జోక్యం, ఇతర అధికారుల పాత్రపై ఈడీ పూర్తి స్థాయి దర్యాప్తు మొదలుపెట్టనుంది. మళ్లించిన ప్రజాధనం చివరకు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే చేరినట్లు సీఐడీ ఇప్పటికే ప్రాథమికంగా తేల్చిన నేపథ్యంలో ఈడీ ఈ అంశంపై కూడా లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిసింది.

ఇదీ కుంభకోణం..

- నిరుద్యోగ యువతకు అత్యాధునిక సాంకేతికపరమైన శిక్షణ ఇచ్చేందుకు 2015లో చంద్రబాబు ప్రభుత్వం సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. సీమెన్స్ ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినయ్ ఖన్వీల్కర్ ఇందులో కీలక పాత్ర పోషించారు. ఈ ఒప్పందం ప్రకారం శిక్షణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ టెక్ అందించాలి.
- ఈ ప్రాజెక్టులో మొత్తం ఆరు క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో క్లస్టర్‌ను రూ.546.84 కోట్లతో ఏర్పాటు చేయాలి. దీని ప్రకారం మొత్తం వ్యయం రూ.3,281.40 కోట్లు. ఇందులో 90 శాతం నిధులు.. అంటే రూ.2,951 కోట్లను సీమెన్స్, డిజైన్ టెక్ భరిస్తాయి. మిగిలిన 10 శాతం అంటే రూ.330 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి.
- అయితే సీమెన్స్, డిజైన్ టెక్‌లు తమ వాటా నిధులను ఇవ్వక ముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన రూ.330 కోట్లను ఆ కంపెనీలకు ఇచ్చేసింది. ఇదంతా కూడా అప్పటి మంత్రి మండలి ఆమోదం లేకుండానే జరిగిపోయింది. చంద్రబాబు ఆదేశాలతో అధికారులు కిక్కురు మనకుండా ఆయన చెప్పినట్లు చేసేశారు.
- ఇదిలా ఉండగా 2018లో షెల్ కంపెనీ అయిన ఏసీఐ.. (అల్లాయిడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ (ఏసియా) లిమిటెడ్) నకిలీ బిల్లులు, ఇన్వాయిస్‌లు తయారు చేసి పలువురికి లబ్ధి చేకూరుస్తున్నట్లు జీఎస్టీ అధికారులు గుర్తించారు. సుమన్ బోస్ తదితరులు తమ అక్రమ కార్యకలాపాలకు ఈ ఏసీఐ కంపెనీని వాడుకున్నారు. 2019లో ఈ మొత్తం కుంభకోణం గురించి పుణేకు చెందిన ఓ సామాజిక కార్యకర్త అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది.
- ప్రాథమిక విచారణలో ఈ కుంభకోణం మొత్తం చంద్రబాబు కనుసన్నల్లో జరిగినట్లు తేలింది. దీంతో ఆయన్ను ఏ1గా పేర్కొంటూ సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత ఈ కుంభకోణంపై ఈడీ కూడా దర్యాప్తు మొదలు పెట్టింది. 2024లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్కిల్ కుంభకోణంలో సీఐడీ తన దర్యాప్తును పక్కన పెట్టేసింది. అయితే ఈడీ తన దర్యాప్తును కొనసాగిస్తూనే ఉంది.

డిజైన్ టెక్ నుంచే నిధుల మళ్లింపు మొదలు..

- దర్యాప్తులో భాగంగా ఆయా కంపెనీల బ్యాంకు ఖాతాలను ఈడీ విశ్లేషించింది. డిజైన్ టెక్ నుంచి పొందిన నిధుల్లో దాదాపు రూ.58 కోట్లను స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్, ఆ తర్వాత ఏసీఐకి బదలాయించినట్లు ఈడీ గుర్తించింది. అక్రమ పద్ధతిలో వచ్చిన డబ్బును పలు షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లు స్కిల్లర్ కంపెనీ వ్యవహారాలు చూసే వ్యక్తి శిరీష్ షా ఈడీ విచారణలో అంగీకరించారు.
- స్కిల్లర్ నుంచి వచ్చిన సొమ్ముతో స్కిల్ డెవలప్‌మెంట్ సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి వస్తువులను గానీ, సేవలను గానీ అందించలేదు. వ్యక్తిగతంగా లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ నిధులను డిజైన్ టెక్ కంపెనీ స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్‌కు, స్కిల్లర్ తిరిగి ఆ నిధులను ఏసీఐకి బదలాయించినట్లు ఈడీ తేల్చి చెప్పింది. నిధుల మళ్లింపుకు సహాయ పడిన వారి వాంగ్మూలాలను ఈడీ రికార్డ్ చేసింది. సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, వస్తువులు, సేవలు.. ఏవీ అందించలేదని వారు అంగీకరించారు. నకిలీ, కల్పిత పర్చేజ్ ఆర్డర్లు, ఇన్వాయిస్‌లు, తప్పుడు బిల్లులు సృష్టించినట్లు కూడా వారు ఈడీ ఎదుట ఒప్పుకున్నారు.
- ఏసీఐ నుంచి వచ్చిన నిధులను నగదు రూపంలో మార్చినట్లు కూడా వారు అంగీకరించారు. ఈ విషయాలన్నింటినీ ఎంట్రీ ప్రొవైడర్లయిన యోగేశ్ గుప్తా, మనోజ్ కుమార్ జైన్ ఈడీ వద్ద నిర్ధారించారు. ఈ షెల్ కంపెనీలేవీ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌తో సంబంధం ఉన్న కంపెనీలు కాదని కూడా ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది.
- ఈ గొలుసు లావాదేవీల ద్వారా వచ్చిన నగదు మొత్తాన్ని యోగేశ్ గుప్తా, ముకుల్ అగర్వాల్‌కు అందచేసినట్లు సావన్ జాజూ ఈడీకి తెలిపారు. నగదు విషయంలో ముకుల్ చంద్ర అగర్వాల్.. యోగేశ్ గుప్తా వద్దకు వెళ్లినట్లు కూడా ఈడీ దర్యాప్తులో తేలింది. బ్యాంకు ఖాతాల ద్వారా వచ్చిన నిధులను నగదు రూపంలో వీరు అందుకున్నట్లు కూడా స్పష్టమైంది.
- ఏసీఐ మాత్రమే కాకుండా ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రో వెస్ట్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్, భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్‌లను నిధుల మళ్లింపు కోసం వాడుకున్నారు. ఇందుకు బోగస్ బిల్లులను చూపారు. తద్వారా స్కిల్లర్ నుంచి నేరుగా నిధులు పొందారు. ఇలా ఇప్పటి వరకు రూ.151 కోట్ల మేర నిధులను మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

ప్రజా ధనాన్ని మళ్లించేందుకే స్కిల్లర్ ఏర్పాటు


- స్కిల్లర్ తనకొచ్చిన నిధుల్లో నుంచి కొంత భాగం ముకుల్ అగర్వాల్‌కి చెందిన నాలెడ్జ్ పోడియం సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలాయించింది. అక్కడి నుంచి ఆ నిధులు ముకుల్ చంద్ర, ఆయన కుటుంబ సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లోకి, అతని నియంత్రణలో పని చేసే కంపెనీల ఖాతాల్లోకి చేరాయి. ముకుల్ చంద్ర అగర్వాల్ పలు కంపెనీలు ఏర్పాటు చేశారు. వాటన్నింటిపై తనకు నియంత్రణ ఉండేలా చూసుకున్నారు. ప్రభుత్వానికి చెందిన అత్యధిక భాగం నిధులు ఈ కంపెనీల మధ్యే సర్క్యులేట్ అయ్యాయి. సుమన్ బోస్ అవసరాల కోసమే ఇన్ని కంపెనీలను ఏర్పాటు చేసినట్లు ముకుల్ చంద్ర అగర్వాల్ ఈడీ ముందు అంగీకరించి, ఆ మేరకు వాంగ్మూలం కూడా ఇచ్చారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో సీఐడీ దర్యాప్తు మొదలు కాగానే సుమన్ బోస్ తన విదేశీ బ్యాంకు ఖాతాలను మూసేశారు. దీనిపై కూడా ఈడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతోంది.
- పలు విదేశీ కంపెనీలతో బోస్‌కు సంబంధాలున్నాయన్న విషయం కూడా ఈడీ దర్యాప్తులో తేలింది. నేరపూరిత చర్యల ద్వారా బదలాయించిన మొత్తాలను ఆ షెల్ కంపెనీల ద్వారా తిరిగి నగదు రూపంలో పొందిన విషయాన్ని కూడా ఈడీ గుర్తించింది.

ప్రజాధనం దోచేసేందుకే సుమన్ బోస్ మిలాఖత్

- ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేందుకు నాలెడ్జ్ పోడియం సిస్టమ్స్, టాలెంట్ ఎడ్జ్, ఏసీఐ, స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్, డిజైన్ టెక్ కంపెనీలు, వారి యజమానులతో కలిసి సుమన్‌బోస్ పని చేశారని సీమన్స్ నివేదిక స్పష్టం చేసింది. సీమెన్స్ ప్రస్తుత ఎండీ కూడా ఇందుకు సంబంధించిన సంభాషణలు, వాట్సాప్ చాట్‌లు, ఇతరత్రా పలు వివరాలను ఈడీకి అందజేశారు. డిజైన్ టెక్ వికాస్ ఖాన్వీల్కర్, సుమన్ బోస్‌ల మధ్య డబ్బు తరలింపును కూడా ఈడీ గుర్తించింది.
- ముకుల్ అగర్వాల్, సురేష్ గోయల్ తనకు సన్నిహిత మిత్రులన్న విషయాన్ని సుమన్ బోస్ ఈడీ ముందు అంగీకరించారు. డీసాల్ట్ ప్రస్తుత చిరునామా, ఎస్ఎస్ఆర్ఏ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చిరునామా ఒకే విధంగా ఉంది. ఈ ఎస్ఎస్ఆర్ఏ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సురేశ్ గోయల్ సతీమణి ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్నారు. పలు ఇతర కంపెనీలు కూడా ఇదే చిరునామాపై రిజిస్టర్ అయి ఉన్నాయి. నిధుల మళ్లింపు వ్యవహారంలో సుమన్ బోసే మాస్టర్ మైండ్, ఇందుకు ఖాన్వీల్కర్, సురేశ్ అగర్వాల్‌ల సాయం తీసుకున్నారు.
- సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న బెన్ రీసెర్చ్ పీటీఈ లిమిటెడ్ కంపెనీ తులసీదాస్ శివకుమార్‌కు చెందింది. ఇతను సీమెన్స్ సుమన్ బోస్‌కు అత్యంత సన్నిహితుడు. గతంలో సీమెన్స్‌లో పని చేశాడు. ఈ కంపెనీకి రూ.3,48,95,191 మళ్లించారు. మరో సింగపూర్ కంపెనీ అయిన ఇంక్‌ఫిష్ హాస్పిటాలిటీ పీటీఈ లిమిటెడ్‌కు రూ.74.51 లక్షలు, యూకేకు చెందిన ఎస్‌జీకే వరల్డ్ ఫారెక్స్ లిమిటెడ్‌కు రూ.73.67 లక్షలు జమ చేశారు. ఈ మొత్తాలన్నీ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీ) నుంచి డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పొందిన నిధులు.

నిధుల మళ్లింపులో కీలక వ్యక్తులు

- సుమన్ బోస్ (స్కిల్ ప్రాజెక్ట్ రూపకర్త)
- వికాస్ వినయ్ ఖాన్వీల్కర్ (డిజైన్ టెక్ సిస్టమ్స్ ఎండీ)
- ముకుల్ చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్ సిగ్నేటరీ, సుమన్ బోస్ సన్నిహితుడు, నాలెడ్జ్ పోడియం సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కీలక వ్యక్తి)
- సురేష్ గోయల్ (సుమన్ బోస్ స్నేహితుడు, చార్టెడ్ అకౌంటెంట్, ముకుల్ అగర్వాల్ కోసం డబ్బు నిర్వహించిన వ్యక్తి)
- శిరీష్ షా (ఏసీఐ వ్యవహారాలు చూసే వ్యక్తి, ఎంట్రీ ఆపరేటర్)
- సావన్ కుమార్ జాజు (ఎంట్రీ ఆపరేటర్)
- యోగేష్ గుప్తా (ఎంట్రీ ఆపరేటర్)
- మనోజ్ కుమార్ జైన్ (ఎంట్రీ ఆపరేటర్)
- తులసీదాస్ శివకుమార్ అలియాస్ టి.శివకుమార్ (సింగపూర్ – బెన్ రీసెర్చ్ పీటీఈ లిమిటెడ్, సుమన్ బోస్ సన్నిహితుడు)



స్కిల్ కుంభకోణానికి సంబంధించి హైకోర్టులో ఈడీ దాఖలు చేసిన కౌంటర్



సింగపూర్ కంపెనీలకు, యూకే బేస్డ్ కంపెనీలకు నిధుల మళ్లింపు ఇలా

ఈడీ బయటపెట్టిన షెల్ కంపెనీలు...

- మెసర్స్ సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఐఎస్‌డబ్ల్యూ)
- మెసర్స్ డిజైన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డీటీఎస్‌పీఎల్)
- స్కిల్లర్ ఎంటర్‌ప్రైజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఈపీఎల్)
- అల్లాయిడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ ఏసియా లిమిటెడ్ (ఏసీఐ) (షెల్ కంపెనీ)
- కాడెన్స్ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీ (షెల్ కంపెనీ)
- ఈటీఏ గ్రీన్ బిల్డ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- నాలెడ్జ్ పోడియం సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కేపీఎస్‌పీఎల్) (షెల్ కంపెనీ)
- ఎస్ఎం ప్రొఫెషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- ఐటీ స్మిత్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- ప్రో వెస్ట్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్ (షెల్ కంపెనీ)
- మెసర్స్ టాలెంట్ ఎడ్జ్ (షెల్ కంపెనీ)
- డిఅసాల్ట్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (డీఎస్ఐపీఎల్) (గతంలో బోస్, ముకుల్ అగర్వాల్, నరేష్ గోయల్ పని చేసిన కంపెనీ)
- ఎస్ఎస్ఆర్ఏ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈ కంపెనీలో సురేష్ గోయల్ భార్య డైరెక్టర్. డిఅసాల్ట్ సిస్టమ్స్ కంపెనీదీ ఇదే చిరునామా)
- బెన్ రీసర్చ్ పీటీఈ లిమిటెడ్ (సింగపూర్ కంపెనీ)
- ఇంక్‌ఫిష్ హాస్పిటాలిటీ పీటీఈ లిమిటెడ్ (సింగపూర్ కంపెనీ, ఈ కంపెనీకి నిధులు మళ్లించారు)
- ఎస్‌జీకే వరల్డ్ ఫారెక్స్ లిమిటెడ్ (యూకే కంపెనీ, ఈ కంపెనీకి నిధులు మళ్లించారు)

అక్రమాస్తులు కాపాడుకునేందుకే కాంగ్రెస్‌లో చేరారు

- బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలపై మధుయాష్కీగౌడ్ వ్యాఖ్య
- కొత్త వారిని చేర్చుకున్నంత మాత్రాన పాత వారిని అవమానించం



గంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మధుయాష్కీగౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు

జగిత్యాల రూరల్: కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రేమతో రాలేదని, తమ అక్రమాస్తులు కాపాడుకోవడం, రాజకీయ భవిష్యత్ కోసం పార్టీలో చేరారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శనివారం ఆయన ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలసి జగిత్యాల జిల్లా, రూరల్ మండలం జాబితాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి సంతాపసభలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేటీఆర్, కిషన్‌రెడ్డి.. పదేపదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని పడగొడతామని అనడంతో స్వతహాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలో చేరారని వివరించారు. కొత్త వారిని చేర్చుకున్నంత మాత్రాన పాతవారిని అవమానించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నామినేటెడ్ పదవులన్నీ పార్టీ కోసం పనిచేసే వారికే ఇచ్చేలా అధినాయకత్వంతో మాట్లాడతానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా 32 నియోజకవర్గాల్లో జీవన్‌రెడ్డి ఒక్కరే ఎమ్మెల్యేగా గెలిచి పార్టీని కాపాడారని గుర్తు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని సవరించి, ఫిరాయింపులకు పాల్పడినవారు పదవులు కోల్పోయేలా చట్టం తెస్తామని రాహుల్ గాంధీ చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి, పార్టీ నాయకుడు హత్యకు గురికావడం బాధాకరమన్నారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, పోలీసుల నిర్లక్ష్యంతోనే నిందితుడు రెచ్చిపోయి గంగారెడ్డి హత్యకు పాల్పడ్డాడని, నిందితుడికి నేర చరిత్ర ఉన్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ నిందితుడు పోలీస్‌స్టేషన్‌లో రీల్స్ చేసి సోషల్ మీడియాలో పెట్టినా, అతడిపై పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ప్రొఫెషనల్ హంతకుడిగా తయారయ్యాడని పేర్కొన్నారు. ఇంత తీవ్రమైన కేసులో దర్యాప్తు పూర్తయిందని పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. నిందితుడు పాతకక్షలతోనే గంగారెడ్డిని హత్య చేశాడని పోలీసులు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు బండ శంకర్, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, గర్వందుల నరేశ్‌గౌడ్, కొత్త మోహన్, చంద రాధాకిషన్‌రావు, షేక్ చాంద్‌పాషా, గుండ మధు, రఘువీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి బీసీ కమిషన్ క్షేత్ర పర్యటన

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సర్వం సిద్ధం చేసింది. రేపట్నుంచి జిల్లాల వారీగా పర్యటనలు చేపట్టి బహిరంగ విచారణ నిర్వహించనుంది. సాధారణ ప్రజల నుంచే కాకుండా వివిధ కుల సంఘాలు, మేధావుల నుంచి వినతులు స్వీకరించడంతో పాటు సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించనుంది. బీసీ కమిషన్‌కు ఇవ్వాల్సిన విజ్ఞాపనలను నిర్దేశిత ఫార్మాట్‌లో అందించాలని ఇప్పటికే కమిషన్ స్పష్టం చేసింది. ఈ ఫార్మాట్‌ను కమిషన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీవరకు చేపట్టనున్న పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ విడుదల చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 27-10-2024

ఈస్ట్‌మన్ కలర్

సాటిమనిషి నవ్వులే మతాబులు



బొమ్మ: చిదంబరం

ఈసారి కొంచెం ముందే వచ్చిందిగాని దీపావళి నవంబర్ వస్తే తప్ప రాదు. అన్ని మతాల వాళ్లకి విడివిడిగా పండుగలుంటాయి. దీపావళి అందరి పండుగ. అంటే అన్ని మతాల పిల్లల పండుగ. 'టపాకాయలు కాల్చాలి'... ఈ కోరిక గాలిలో మందుగుండు వాసనలా తిరుగాడుతూ ఉంటుంది. వేరే పండుగలు ఇంటి మర్యాదను బజారున పడేయవు. కాని దీపావళి పడేస్తుంది. 'ఆ ఇంటి ముందు టపాకాయలు కాల్చడం లేదేమి?' ఈ ప్రశ్న పరువు తక్కువగా ఉంటుంది. ఎంత లేమి ఉన్నా పటాసులు తెచ్చి కాల్చితే, అందరితో కలిసి కాల్చితే సంతోషం. కనీసం ప్రమిదలైనా వెలిగించాలి. ఊరంతా అట్టహాసపు వెలుతురులో మెరుస్తున్నప్పుడు ఏ ఇల్లైనా ఉదాసీనంగా ఉంటే ఆ ఇంటివారికే కాదు వీధిలో ఉన్నవారికి కూడా బెంగ.

'పర్లేదు లేరా... మా నాన్న తెచ్చిన వాటిలో నీక్కొన్ని ఇస్తా'... చిన్నబుచ్చుకున్న ముఖంతో ఉన్న ఫ్రెండును చూసి అంటాడో ఫ్రెండు. దీపావళి సమయంలో స్నేహం మిరుమిట్లు గొలుపుతుంది. అయితే ఇది పిల్లల ఎదురుచూపులకు నాన్నలు ఇబ్బంది పడే కాలం. 'రేపు కొనిస్తా లేరా' దొంగ వాగ్దానాల కాలం. అందరూ చిన్న పనులు చేసే వారే. తాపీమేస్త్రీలు, టైలర్లు, పండ్లు అమ్ముకునే వారు, షాపుల్లో పని చేసేవారు, క్లీ బంకులు... ప్రయివేటు టీచర్లు.. అసలు ఏ పనీ దొరకనివారు... లంకంత సంసారం... వారిలో పిల్లలు... 'నాన్నా... నాకు చాలా కొనివ్వాలి ఈసారి' అనంటే ఇంటి వైపుకే రారు. పిల్లలు నిద్రపోయాకే వస్తారు.

టపాకాయలు కొని తేలేదని పిల్లలు ఊరికే ఉండరు. ఒకరు, ఇద్దరు, ముగ్గురూ కలిసి... చేతులు పట్టుకుని... అలా బజారులోకి వచ్చి కొత్తగా తెరిచిన టపాకాయల అంగళ్లను సందర్శిస్తారు. ప్రతి చోటా ఆగడం.. ప్లాస్టిక్ రేపర్లలో గట్టి రంగుల్లో కనిపించే టపాకాయలను కళ్లు విప్పార్చి చూడటం. లక్ష్మీ ఔట్లు నీలం రంగులో ఉంటాయి. పసుపు రంగు ఔట్ల సౌండ్ చాలా ఎక్కువ. పురికొస బాంబులది ముదురు ఆకుపచ్చ రంగు. కాకర పువ్వొత్తులది సిల్వర్ కలర్. చిచ్చుబుడ్లకు డిజైన్లున్న పేపర్ చుట్టి ఉండేది. అరచెయ్యంత పెద్దగా ఉన్న భూచక్రాన్ని చూస్తే, అది తిరిగే వేగాన్ని ఊహించుకుని గుటకలు మింగడమే కదా ఎప్పుడు కొనగలమో అనుకుని. పాముబిళ్లలు, కలర్ అగ్గిపెట్టెలు, పెన్సిళ్లు, రిబ్బన్లు... విష్ణుచక్రాలకు గుచ్చి ఉన్న కమ్మి చాలా సన్నది. అది పట్టుకుని అందరూ కాల్చలేరు. ఆకాశ చువ్వలను చేత్తో పట్టుకుని అంటించాక గాల్లో వదిలేవాడే అసలైన హీరో.

దీపావళి వస్తే ఊరంతా పోలీసులే. దొంగలు విచ్చలవిడిగా తలుపు వెనుకా, మంచం కిందా, నాన్న వెనుక, అమ్మ కొంగు చాటున దాక్కుంటారు. పోలీసుగాడు ధామ్మని కాలిస్తే దొంగలు ధమ్‌ధమాయిస్తారు. రీలు చుట్టే తుపాకులు కొన్ని. బిళ్లలు పెట్టి పేల్చే తుపాకులు కొన్ని. రీలు చుట్టగలిగే స్టీలు తుపాకీ ఉన్న పోలీసు మన క్లాస్‌లో ఉన్నాడంటే వాడు గొప్ప. వాళ్ల నాన్న తప్పకుండా స్థితిమంతుడే అయి ఉంటాడు. 'ఒరే... ఒక్కసారి కాల్చి ఇస్తాఇవ్వరా'...'నేను ఇవ్వనా'.... పిల్లల ముఖాలను అమాసలుగా మార్చే కాలం కూడా ఇది. ఇంటి గడప మీద దిగాలుగా కూచుని పక్కింటి వాళ్లు కాలుస్తూ ఉంటే సిగ్గుతో లోపలికొచ్చి ఏడ్చిన నాటి పిల్లలు నేడు బహుశా తండ్రులై తమ పిల్లలకు దీపావళి రాక ముందే గంపెడన్ని టపాసులు తప్పక తెచ్చిస్తుంటారు... వారిలో తమను చూసుకోవడానికి! ఒక్క స్టీలు తుపాకీ దొరికితే దిండు పక్కన పెట్టుకుని పడుకోవాలని కలగన్న కాలం కదా అది.

> దీపావళి వస్తే ఊరంతా పోలీసులే. దొంగలు విచ్చలవిడిగా తలుపు వెనుకా, మంచం కిందా, నాన్న వెనుక, అమ్మ కొంగు చాటున దాక్కుంటారు. పోలీసుగాడు ధామ్మని కాలిస్తే దొంగలు ధమ్‌ధమాయిస్తారు.

శతకోటి ఆనందాలకు అనంతకోటి ఉపాయాలు. పేదవారికి సలీసు ధరల్లో మట్టి చిచ్చుబుడ్లు దొరికేవి. చిల్లరకు వంద పిల్లిపెసర ఔట్లున్న గుచ్చం దొరికేది. పావలాకు కూడా దొరికే అందమైన తాటాకు గుమ్మటాలు అమ్మకానికి వచ్చేవి. వాటిని వేలాడదీసి ప్రమిదలు పెడితే లేమి అంతా పారిపోయేది.

చీకటి కనికరం లేనిది. కాని దానంతటినీ చిటికెలో పారవేయించగలిగే అనంత దయామయ వెలుగు మనిషి గుండెల్లో ఉంది. దీపావళి అంటే ఇంటి గుమ్మాన వెలుతురు దేదీప్యం కావడం కాదు. సాటి మనిషిని కాసింత కని, విని అతని ముఖాన వెలుతురు దరహాసాన్ని పూయించడం.

హ్యాపీ దీపావళి.

– ఖదీర్



తేనెతో ముడతల నివారణ..?

టీ స్పూన్ తేనెలో టీస్పూన్ పాల మీగడ కలిపిన మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తరవాత గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా 30 రోజులు చేస్తే మంచిఫలితం ఉంటుంది.



వాడిన విరులూ పరిమళిస్తాయి



అమ్ముడు పోని పూలు ఏమవుతాయి? కొనేవాళ్ల కోసం ఎదురు చూసే సహనం పూలమ్మాయికి ఉంటుంది, కానీ పూలకు ఉండదు. రెక్కలు విచ్చుకోవడం, ఆ రెక్కలు వాలిపోవడంలో అవి వాటి సమయాన్ని క్రమం తప్పనివ్వవు.

మార్పుకు నాంది

పూలసాగు రైతుల జీవితాలను సువాసనభరితం చేస్తోందా? మొక్కనాటి, నీరు పెట్టి, ఎరువు వేసి పెంచిన మొక్కలు మొగ్గతొడిగితే ఆనందం. ఆ మొగ్గలు విచ్చేలోపు కోసి మార్కెట్‌కు చేర్చాలి. తెల్లారేటప్పటికి నగరంలోని మార్కెట్‌కు చేరాలంటే పూలను కోసే పని అర్ధరాత్రి నుంచి మొదలవ్వాలి. ఆ సమయంలో పొలంలో పనికి వచ్చే వాళ్లు ఉండరు. వచ్చినా రెండింతల కూలి ఇవ్వాలి. సాగు ఖర్చులు, రవాణా ఖర్చులు, తన శ్రమ కలిపి ధర నిర్ణయించుకోవాలి. చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. మార్కెట్‌లో పూలు ఎక్కువైపోయి డిమాండ్ తగ్గిన రోజుల్లో పూలు కోయడానికిచ్చే కూలి కూడా గిట్టదని ఆ పూలను చెట్లకే వదిలేస్తుంటారు. ఇంజనీరింగ్ టెక్నాలజీతో పరిమళాలను మట్టిపాలు కాకుండా కాపాడుతున్నారు కేజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ సంయుక్త. తక్కువ ఖర్చులో ఆటోమేటిక్ ఇన్‌సెన్స్ మేకింగ్ మెషీన్‌కు రూపకల్పన చేశారామె. ఇంజనీర్ సమాజంలో మార్పు తీసుకువచ్చే చేంజ్‌మేకర్ కావాలనే ఆశయాన్ని ఆచరణలో పెట్టారామె. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రత్యేకమైన శ్రద్ధతో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌లో పరిశోధన చేస్తున్న సంయుక్త పర్యావరణహితమైన ఆవిష్కరణ కోసం గ్రామాల బాట పట్టారు. ఈ మెషీన్ రూపకల్పనకు దారి తీసిన కారణాలను సాక్షితో పంచుకున్నారామె.

తయారీ ఇలాగ...

సేకరించిన పూల నుంచి రెక్కలను వేరు చేసి ఉప్పు నీటిలో కడిగి ఓ గంటసేపు ఎండలో పెడతారు. ఆ పూలను పొడి చేస్తారు. పది కేజీల పూల నుంచి కేజీ పొడి వస్తుంది. ఆటోమేటిక్ మెషీన్ కాబట్టి మెటీరియల్ పెట్టి సెట్ చేసి ఆ మహిళలు మరొక పని చేసుకోవచ్చు. గంటకు అగరువత్తులు 900, సాంబ్రాణి కడ్డీలైతే మూడు వందల వరకు చేయవచ్చు. రా మెటీరియల్ లభ్యత, మార్కెట్ అవసరాలను బట్టి ఇప్పుడు ఈ మహిళలు రోజుకో గంట పని చేస్తున్నారు. వర్షాకాలంలో పూలను ఎండబెట్టడం కష్టం. కాబట్టి ఆ రోజుల్లో గోమయం కడ్డీలను చేస్తారు. గ్రామాల్లో మహిళలు గోమయాన్ని వేసవిలో సేకరించి ఎండబెట్టి నిల్వ చేసి ఉంచుతారు. ఆసక్తి ఉన్న మహిళలు ఇంట్లోనే రోజుకో గంటసేపు పని చేసుకుని తాము ఉంటున్న అపార్ట్‌మెంట్, ఇరుగుపొరుగు ఇళ్లు, దగ్గరున్న ఆలయాలకు సప్లయ్ చేయవచ్చు. ఇందులో భారీ లాభాలను ఇప్పుడే ఆశించలేం. కానీ పర్యావరణహితమైన పని చేస్తున్నామనే సంతోషం ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యాపకంతో ఎకో వారియర్‌గా గుర్తింపు పొందవచ్చు.

– సంయుక్త,
ఇన్‌సెన్స్ స్టిక్స్ మెషీన్ ఆవిష్కర్త



మహిళలతో ముందడుగు

సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌ను "2020లో స్థాపించాం. సమాజంలో అవసరమైన ఇంజనీరింగ్ ఆవిష్కరణల గురించి అధ్యయనం చేయడానికి 72 గ్రామాల్లో పర్యటించాం. మహిళలు, మగవాళ్లు, రైతులు, ఇతర వృత్తుల్లోని వారు, పిల్లలు, వృద్ధులు... ఇలా అన్ని కేటగిరీల వ్యక్తులతో మాట్లాడాం. అక్కడి సమస్యలు తెలిశాయి, అవసరాలు అర్థమయ్యాయి. వాటిని పరిష్కరించడానికి ఏం చేయాలనే స్పష్టత కూడా వచ్చింది. అన్నింటినీ మేం పరిష్కరించలేం, ప్రభుత్వాలు మాత్రమే చేయగలిగిన వాటిని వదిలేసి, మా స్థాయిలో పరిష్కరించగలిగే పన్నెండు ప్రాజెక్టుల జాబితా తయారు చేసుకున్నాం. వాటిలో మొదటిది అగరువత్తి తయారీ యంత్రం. అప్పటికి మార్కెట్‌లో ఉన్న అగరువత్తి మేకింగ్ మెషీన్‌ల ధర నాలుగైదు లక్షల్లో ఉంది. మేము అరవై వేలలో తయారు చేశాం. రైతుల దగ్గర వృథా అయ్యే పూలు, ఆలయాల దగ్గర అమ్ముడు కానివి, దేవునికి పెట్టి తీసిన పూలను సేకరించి అగరువత్తి, సాంబ్రాణి కడ్డీలు తయారు చేస్తున్నాం. స్థానిక మహిళలకు శిక్షణనిచ్చాం. వారే స్వయంగా నిర్వహించుకుంటున్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు వస్తే శిక్షణనిచ్చి, వాళ్లకు తగినట్లు మెషీన్ తయారు చేసిస్తాం" అన్నారు ప్రొఫెసర్ సంయుక్త.

– వాకా మంజులా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఆమెకు హ్యాట్సాఫ్



దానా తుపాను ఒడిశా తీరంలోకి ప్రవేశించింది. గంటకు 120 కి.మీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. దీంతో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ప్రభుత్వం ముందస్తుగా ప్రజా సంక్షేమం కోసం రక్షణ చర్యలు చేపట్టింది. ఈ సమయంలో కేంద్రపారా జిల్లా రాజ్‌నగర్ బ్లాక్‌లోని ఖస్ముండా గ్రామానికి చెందిన ఆశా వర్కర్ సిబానీ మండల్ చేసిన సాహసం, ఆమె చూపిన కరుణ స్ఫూర్తి దాయకంగా ఉన్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన వీపుపై ఒక వృద్ధ మహిళను మోస్తూ బురద దారిలో నడుస్తూ, సమీపంలోని తుపాను బాధితుల శిబిరానికి ఆశ్రయానికి తీసుకెళుతూ కనిపిస్తుంది. ప్రమాదాన్ని ఊహించి, ముందస్తుగా ఆమెను ఇంటినుంచి తీసుకొచ్చి, శిబిరానికి చేర్చింది. ఆమెలో ఉన్న దయ, ధైర్యానికి నెటిజనులు ఫిదా అయిపోయి నారీశక్తి హ్యాట్సాఫ్ అంటున్నారు.

కిచెన్ టిప్స్




- చిన్న కొబ్బరి ముక్కను పెరుగులో వేస్తే పుల్లగా మారకుండా ఉంటుంది.
- ఒక గుడ్డు సొనలో టీ స్పూన్ మైదాపిండి కలిపితే, ఆమ్లెట్ పొంగినట్టుగా, పెద్దగా వస్తుంది.
- పచ్చిమిర్చి ఫ్రిజ్‌లో కాకుండా బయట నిల్వచేసుకునేవారు రంగు మారకుండా ఉండాలంటే కొద్దిగా పసుపు కలిపి ఉంచాలి.

హెల్త్

● బ్రెయిన్ స్ట్రోక్

ఇన్ టైమ్‌లో వస్తే... అంతా సేఫ్!



కాలూ, చేయి చచ్చుపడిపోతే పక్షవాతం అనిపిలిచే సమస్య వస్తే కేవలం మంచానికి పరిమితమైపోవడమనే అనే భావన ఒకప్పుడు ఉండేది. ఇప్పటికీ కొందరిలో ఉంది. కానీ సమయానికి సరైన చికిత్స అందితే 'స్ట్రోక్' అని పిలిచే ఈ సమస్య నుంచి బాగుపడటం సాధ్యమే అని చెబుతున్నారు డాక్టర్లు. ఈ నెల (అక్టోబరు) 29న వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా 'బ్రెయిన్ స్ట్రోక్'పై అవగాహన కోసం...

మెదడును రక్షించుకోవడంలో టైమ్ చాలా కీలకం. స్ట్రోక్ వచ్చాక వైద్యం అందడంలో జరిగే ప్రతి నిమిషం జాప్యానికి కోటీ ఇరవై లక్షల న్యూరాన్లు నశించిపోతుంటాయి. అందుకే "టైమ్ ఈజ్ బ్రెయిన్" అంటారు. అందుకే స్ట్రోక్ గురించి మరింతగా తెలుసుకోవడం అవసరం.

స్ట్రోక్‌లో రకాలు...

1) **ఇస్కిమిక్ స్ట్రోక్ :** రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల మెదడులో ఒక భాగానికి రక్తం అందక ఆ భాగం దెబ్బతినడాన్ని 'ఇస్కిమిక్ స్ట్రోక్' అంటారు.

2) **హేమరేజిక్ స్ట్రోక్ :** మెదడు లోపలి రక్తనాళాలు చిట్లడంతో మెదడులో రక్తస్రావం కావడం వల్ల వచ్చే స్ట్రోక్‌ను 'హేమరేజిక్ స్ట్రోక్' అంటారు.

ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ అటాక్ (టిఐఏ)...

పక్షవాతం లక్షణాలు కనిపించాక అవి ఒకటి నుంచి రెండు గంటలలోపు తగ్గిపోయి బాధితుడు కోలుకుంటే దాన్ని 'ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ అటాక్' అని పిలుస్తారు. అంటే... పెద్ద భూకంపానికి ముందు చిన్న చిన్న ప్రకంపనల్లా ఒక పెద్ద స్ట్రోక్ రావడానికి ముందు సూచనలుగా ఇలాంటివి వస్తుంటాయి. ఒకవేళ చిన్న చిన్న లక్షణాలు కనిపించాక 24 గంటల తర్వాత కూడా బాధితుడు వాటి ప్రభావం నుంచి బయటపడకపోతే అప్పుడు దాన్ని పూర్తిస్థాయి స్ట్రోక్‌గా పరిగణిస్తారు.

ఎవాల్వింగ్ స్ట్రోక్ : కాళ్లూ చేతులు చచ్చుబడుతూ పూర్తి స్థాయి స్ట్రోక్ క్రమంగా రావడాన్ని ఎవాల్వింగ్ స్ట్రోక్ అంటారు.

ఈ టిఐఏ, ఇవాల్వింగ్ స్ట్రోక్‌లను ముందుగానే గుర్తించి తగిన చికిత్స చేయిస్తే పూర్తిస్థాయి స్ట్రోక్ రాకుండా నివారించవచ్చు. అందుకే పైన పేర్కొన్న ఏదైనా లక్షణం లేదా కొన్ని లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స చేయించుకుని భవిష్యత్తులో పక్షవాతం రాకుండా నివారించుకోవడం సాధ్యమే.



స్ట్రోక్‌కు కారణాలు : నిజానికి బ్రెయిన్ స్ట్రోక్ అన్నది ఎవరికైనా రావచ్చుగానీ సాధారణంగా చాలామందిలో హైబీపీ, డయాబెటిస్, పొగతాగడం, అతిగా మద్యం తాగే అలవాటు, సరైన వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, ఒత్తిడికి గురికావడం, రక్తంలో కొవ్వులు (కొలెస్ట్రాల్) ఎక్కువగా ఉండటం అనే అంశాలు స్ట్రోక్‌కు కారణమవుతాయి. అలాగే గుండె జబ్బులు, రక్తం గడ్డకట్టే స్వభావం ఎక్కువగా ఉండటమూ స్ట్రోక్‌కు కారణాలే.

లక్షణాలు

- పక్షవాతంలో సాధారణంగా ఒక చేయీ, కాలూ చచ్చుపడిపోవడం
- మూతి వంకరపోవడం / మాట స్పష్టంగా రాకపోవడం
- కళ్లు తిరిగి పడిపోవడం
- శరీరం తూలడం
- మాట పడిపోవడం
- ఒకవైపు చూపు తగ్గిపోవడం
- మింగడం కష్టం కావడం
- ఎదురు గా ఉన్న వస్తువులు, మనుషులు ఒకటి రెండుగా/ఒకరు ఇద్దరుగా కనిపించడం
- అరుదుగా పూర్తిగా స్పృహతప్పి పడిపోవడం జరగవచ్చు.

పైన పేర్కొన్నవాటిల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలు కనిపించవచ్చు.

చికిత్స

- మొదటి నాలుగున్నర గంటల్లోపు హాస్పిటల్‌కు తీసుకు వస్తే అది ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే వాళ్లకు టిష్యూ ప్లాస్మినోజెన్ యాక్టివేటర్ అనే మందును రక్తనాళంలోకి ఇస్తారు.
- మొదటి ఆరు గంటలలోపు హాస్పిటల్‌కు తీసుకువస్తే పెద్ద రక్తనాళాలలో అడ్డంకులు (క్లాట్స్) ఏర్పడి స్ట్రోక్ వచ్చినవాళ్లలో స్టెంట్ ద్వారా క్లాట్స్‌ను తొలగించవచ్చు. పై రెండు పద్ధతుల ద్వారా మంచి ఫలితం ఉంటుంది. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చినవారు రక్తం పలుచబడటానికి వాడే మందులు జీవితాంతం వాడాల్సి ఉంటుంది. లేని పక్షంలో మళ్లీ స్ట్రోక్ రావచ్చు. అలాగే హైబీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఉన్న వాళ్లు వాటిని అదుపులో పెట్టే మందులు వాడాలి.

పునరావాస సేవలు (రీహ్యాబిలిటేషన్ సర్వీసెస్): స్ట్రోక్ వచ్చిన మొదటిరోజు నుంచే మొదలుపెట్టి తమ రోజువారీ కార్యక్రమాలను స్వతంత్రంగా చేసుకునేవరకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, సరైన రీతిలో నడిచేలా శిక్షణ వైద్యచికిత్సలో ముఖ్యం.

స్ట్రోక్ నిర్ధారణ ఇలా...

సీటీ స్కాన్ (బ్రెయిన్)తో స్ట్రోక్ వచ్చిందనే నిర్ధారణతో పాటు... అది ఇస్కిమిక్ స్ట్రోకా లేదా హేమరేజిక్ స్ట్రోకా అన్నది నిర్ధారణ చేయవచ్చు. ఒకవేళ సీటీ స్కాన్ (బ్రెయిన్)లో నిర్ధారణ కాకపోతే ఎమ్మారై (బ్రెయిన్), ఎమ్మార్ యాంజియో పరీక్ష చేయించాలి. అలాగే ఈ స్ట్రోక్ ఎందుకు వచ్చిందో తెలుసుకుని, మళ్లీ రాకుండా చూసుకోడానికి టూడీ ఎకో, గొంతు రక్తనాళాల డాప్లర్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించడం, షుగర్ మోతాదులు తెలుసుకోవడం... ఇవన్నీ రొటీన్‌గా చేయించే పరీక్షలు. చిన్న వయసులో స్ట్రోక్ వచ్చినా లేదా మందులు వాడుతున్నప్పటికీ మళ్లీ స్ట్రోక్ వచ్చినా కొన్ని అరుదైన పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.

నివారణే ప్రధానం...

- జీవనశైలి (లైఫ్‌స్టైల్)లో, ఆహారంలో మార్పులు

లైఫ్ స్టైల్ మార్పులు

- ప్రతిరోజూ వ్యాయామం
- మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం
- తిండి, నిద్రలలో వేళలు పాటించడం.

ఆహారంలో మార్పులివి

- ఉప్పు తగ్గించడం
- తాజా కూరగాయలు, ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తీసుకుంటూ సరైన సమయంలో చికిత్స పొందితే స్ట్రోక్ వల్ల మంచానికే పరిమితమైపోతామనే దురభిప్రాయం నుంచి బయటికి రావచ్చు.



డా. చంద్రశేఖర్ రెడ్డి,
సీనియర్ న్యూరో ఫిజీషియన్

జామపండుతో ఎన్నో వ్యాధుల నివారణ...!

విటమిన్-సి అనేక వ్యాధులను నివారిస్తుందన్న విషయం తెలిసిందే. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... చాలామంది అనుకునేదానికి భిన్నంగా నారింజ వంటి పండ్లతో పోలిస్తే జామపండులో ఉండే విటమిన్-సి మోతాదులు ఇంకా ఎక్కువ. అందుకే జామ అనేక వ్యాధులను సమర్థంగా నివారిస్తుంది. టొమాటోలో ఉన్నట్లుగానే జామపండులోనూ లైకోపీన్ మోతాదులు చాలా ఎక్కువ అనేది యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ మాట. ఈ 'లైకోపీన్' అనే పోషకం... ప్రోస్టేట్ క్యాన్సర్‌తో పాటు చాలా రకాల క్యాన్సర్లను నివారిస్తుంది. ఉదాహరణకు ఈసోఫేజియల్ క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్లను జామపండు సమర్థంగా నివారిస్తుంది. పచ్చికాయ కంటే కాస్తంత



ముగ్గిన జామపండులో పీచు (ఫైబర్) మోతాదులు చాలా ఎక్కువ. దాంతో అది మలబద్ధకాన్ని నివారిస్తుంది. పొద్దున్నే సాఫీగా మల విసర్జన జరగడమనే మంచి శానిటరీ హ్యాబిట్‌తో చాలా రకాల జబ్బులు నివారితమవుతాయన్నది తెలిసిందే. అంతేకాదు జామలో పొటాషియమ్ కూడా ఎక్కువే కావడం వల్ల అది హైబీపీ నివారణకూ తోడ్పడుతుంది. దాదాపు 100 గ్రాముల జామపండులో 300 మి.గ్రా. మేరకు కండర నిర్మాణ సామర్థ్యం ఉండటం వల్ల కండరాలు పెరుగుతూ ఎదిగే వయసు పిల్లలకు ఈ పండు ఎంతో మేలు చేస్తుంది. ఇలా ఏ రకంగా చూసినా జామపండు ఆరోగ్యాన్నిచ్చే నిధి. ఎన్నో వ్యాధుల నివారణకు పనిచేసే పెన్నిధి.



● పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ)

మనసులో సునామి!

అది ఇటీవల కేరళలో పారుతూ ముంచేసిన బురద ప్రవాహమే కావచ్చు... లేదా అప్పట్లో చార్‌ధామ్‌లో తుడిచిపెట్టేసిన వరద ప్రవాహమే కావచ్చు. అలనాటి సునామీ లేదా ఉత్తర కాశీ భూకంపమే కావచ్చు... ఇంకా యుద్ధ ఘటనలు.. దాడి లేదా దౌర్జన్యం, లైంగిక దాడి, ముష్కరులు మూకుమ్మడిగా విరుచుకుపడటం, గాయాలపాలు చేయడం, దోపిడీ... ఇలా ఏదైనా సరే అది మానసికంగా షాక్‌కు గురిచేయవచ్చు. ఇవే కాదు... తుఫాను, భారీ అగ్నిప్రమాదం, భూకంపం వంటి ప్రకృతి విపత్తులు, కుటుంబసభ్యులెవరైనా దూరం కావడం, హత్య, ఆత్మహత్య వంటి ఘటనల్లో షాక్‌కు గురవుతారు. షాక్ తర్వాత బాధితులను నిస్తేజంగా మార్చే పరిస్థితిని 'పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్' (పీటీఎస్‌డీ) అంటారు. ఈ 'పీటీఎస్‌డీ' గురించి అవగాహన కోసమే ఈ కథనం.

పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బారిన పడ్డ వ్యక్తులు సురక్షితంగా ఉన్నప్పుడూ లేదా అలాంటి పరిస్థితులేమీ లేని సమయాల్లో కూడా తీవ్రంగా భయపడుతుంటారు. మిగతా వాళ్లతో పోలిస్తే స్త్రీలు, పిల్లలు ఈ షాక్‌కు గురయ్యే ఛాన్స్ ఎక్కువ.



లక్షణాలు...

- ఆ సంఘటన మళ్లీ మళ్లీ జరుగుతున్నట్లే ఫీల్ కావడం లేదా ఆ సంఘటనలో ఉన్నట్లే ఫీలవుతారు.
- నిద్రలో పీడకలలు. అందులో అదే సంఘటన జరుగుతున్నట్లుగా కలలు వస్తాయి
- ఆ సంఘటన గురించి తలచుకోడానికి, మాట్లాడానికి ఇష్టపడకపోవడం
- ఎంత వద్దనుకున్నా మాటిమాటికీ ఆ సంఘటనల తాలూకు ఆలోచనలే రావడం
- సంఘటన తాలూకు ప్రదేశాలకు వెళ్లడానికి ఇష్టపడకపోవడం
- ఆ టైమ్‌లో తమతో ఉన్న వాళ్లను కలవకపోవడం లేదా తప్పించుకుని తిరగడం
- మూడ్స్ వేగంగా మారిపోవడం
- ఒక్కోసారి ఆ సంఘటన తాలూకు ఎలాంటి జ్ఞాపకమూ లేకపోవడం
- ఆ సంఘటన గురించిన భయాలు, విపరీతమైన కోపం, సిగ్గుగా ఫీల్ కావడం
- ప్రతికూల ఆలోచనలే వస్తుండటం
- సంఘటన పట్ల తనను తానుగానీ లేదా ఇతరులను గానీ నిందిస్తూ ఉండటం
- ఎవ్వరితోనూ కలవకుండా ఒంటరి గా ఉండటం
- ఒకప్పుడు తనకు సంతోషం కలిగించిన అవే పనులు ఇప్పుడు ఏమాత్రం ఆనందం ఇవ్వకపోవడం
- పరిసరాల పట్ల చాలా ఎక్కువ అనుమానాస్పదంగా ఉండటం
- ఏ విషయంపై దృష్టి పెట్టలేకపోవడం, నిద్ర సమస్యలు (నిద్రపట్టకపోవడం లేదా ఎప్పుడూ నిద్రలోనే ఉండటం).

పిల్లలైతే...

- ఎప్పుడో వదిలేసిన పక్క తడపడం వంటి అలవాటు పునరావృతం కావడం
- మాటలు మరచిపోవడం, మాటల కోసం తడుముకోవడం
- హాయిగా, ఆడుకోలేకపోవడం
- ఆత్మీయులైన పెద్దలను విడవకపోవడం.

బాధితులతో వచ్చే ముప్పు...

- తమను తాము ఎంతో నిస్సహాయులుగా పరిగణించి బాధపడటం
- తీవ్రమైన భయాలతో ఎవరితోనూ కలవక, ఒంటరిగా ఉండిపోవడం
- తమను తాము బాధించుకోవడం, ఆత్మహత్యకు పాల్పడటం లేదా ఒక్కోసారి ఎదుటి వాళ్లపై దాడికి దిగడం.

నిర్ధారణ...

- బాధితుల లక్షణాలనూ వాళ్ల మెడికల్ హిస్టరీని బట్టి
- బాధితుల స్నేహితులు, బంధువుల నుంచి వివరాలను రాబట్టడం ద్వారా
- కొన్ని మానసిక పరీక్షల ద్వారా.

మేనేజ్‌మెంట్ / చికిత్స...

- సపోర్టివ్ థెరపీ, రీ ఎష్యూరెన్స్, యాక్టివ్ లిజనింగ్, కోపింగ్ స్కిల్స్ నేర్పడం వంటి చికిత్సలు.
- **ఎక్స్‌పోజర్ థెరపీ :** ఒకేసారి ఆ సంఘటనను గుర్తు చేయకుండా మెల్లమెల్లగా ఆ సంఘటన గురించి వివరిస్తూ, ఆ దుర్ఘటన జరిగిన ప్రదేశానికి మెల్ల మెల్లగా తీసుకెళ్తూ, ఇప్పుడు అక్కడ అలాంటి పరిస్థితి లేదనీ, ఇకపై అక్కడ ఎంతమాత్రమూ హాని జరగదనే భరోసా కల్పించడం.

కాగ్నిటివ్ రీ కన్‌స్ట్రక్షన్

ఆ సంఘటనలో బాధితుల ప్రమేయం లేదనీ, ఆ సంఘటన గురించి అపరాధభావనతో ఉండాల్సిన అవసరం లేదనీ, అప్పుడున్న మనుషుల నుంచి తప్పించుకుని తిరగాల్సిన పనిలేదనే నమ్మకాన్ని కల్పించడం. ఇలా సైకోథెరపీ చేస్తూ, ఆత్మహత్య ఆలోచనలనుంచి బయటపడేసే మందులతోపాటు సెలెక్టివ్ సెరిటోనిన్ రీ-అప్‌టేక్ ఇన్హిబిటార్స్, సెరిటోనిన్ నార్ ఎపీనెఫ్రిన్ రీ అప్‌టేక్ ఇన్హిబిటార్స్, నార్ ఎపీనెఫ్రిన్-డోపమైన్ రీ అప్‌టేక్ ఇన్హిబిటార్స్ వంటి మందులు, యాంటీ డిప్రెసెంట్స్‌తో చికిత్స అందిస్తారు.



డా. శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై,
సీనియర్ సైకియాట్రిస్ట్



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జొహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!


విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు


సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజులో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.**
వికెట్ల పతనం: 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఓ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

యాభైఏళ్ల రాజీనామా



చిరంజీవి

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సపూర్‌లోని వైఎన్ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.


రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

– దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘అమరన్’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్ గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

– కిరణ్ అబ్బవరం


నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్


‘క’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటివారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ


విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్పైక్ ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురేందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

– దర్శకుడు సూరి




శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెడుతూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కాపీ కొడుతూ పట్టుబడిన మరో అభ్యర్థి

ఫిలింనగర్/ఇబ్రహీంపట్నం: షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో గ్రూప్-1 పరీక్షకు హాజరైన ఒక అభ్యర్థి చూసిరాస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేశారు. వివరాలివి. షాద్‌నగర్‌కు చెందిన పి.తరుణ్‌రాజ్ శనివారం అయిదో పేపర్ పరీక్ష రాస్తుండగా.. అతని దగ్గర ఇన్విజిలేటర్‌కు చిట్టీలు దొరికాయి. కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, తరుణ్‌రాజ్‌పై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

పట్టుబడిన ప్రభుత్వోపాధ్యాయినిపై కేసు

రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లి గ్రామ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ సెంటర్‌లో శుక్రవారం గ్రూప్-1 పరీక్షలో చూసి రాస్తూ పట్టుబడిన ప్రభుత్వోపాధ్యాయిని ఇస్లావత్ లక్ష్మిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లా పెద్దమందాడి గ్రామానికి చెందిన లక్ష్మి, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఎదుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

67.4% హాజరు

శనివారం జరిగిన గ్రూప్-1 పేపర్-5 (సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్‌ప్రిటేషన్) పరీక్షకు 21,181 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 46 పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పేపర్-5 పరీక్షకు 67.4 శాతం హాజరు నమోదైంది.

కోర్టులకూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత

- న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్



బెల్లంపల్లి: పర్యావరణ పరిరక్షణలో కోర్టులకు కూడా బాధ్యత ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ అన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో శనివారం రూ.1.1 కోట్లతో నిర్మించిన జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి నివాస గృహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఏడుగురికి ఒక చెట్టు ఉండాల్సి ఉండగా.. దేశంలో ప్రతీ 700 మందికి ఒక చెట్టు ఉందన్నారు. మొక్కలను నాటడంతోనే సరిపెట్టకుండా శ్రద్ధతో సంరక్షించాలని సూచించారు. ఎగువ శ్రేణి కోర్టులు ఇచ్చే తీర్పులను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

- ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బీసీల ప్రదర్శనలో కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: జన గణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో భారీ ప్ర దర్శన నిర్వహించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యో గులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నేతలు కోరారు. జాతీయ బీసీ సంక్షే మ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి నందగోపాల్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, సీపీఐ కార్యదర్శి నారాయణ, మాజీ ఎంపీ ఆనంద భాస్కర్, మరో నేత హనుమంతరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రదర్శనను ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకేరోజులో బిల్లు పెట్టి ఆగమేఘాలపై 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని, కానీ బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు ఇవ్వాలని 30 సంవత్సరాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బకాయిల విడుదలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తెలంగాణ సచివాలయ ముట్టడికి ఏఐఎస్ఎఫ్ నేతలు యత్నించారు. బీఆర్‌కే ఆర్ భవన్ నుంచి ర్యాలీ ప్రదర్శ నతో వస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్య కర్తలు, విద్యార్థులను అడ్డుకుని పోలీసులు అరెస్టు చేశారు.

'కాఫర్ డ్యామ్' నిర్లక్ష్యం పాక్షికంగా నిజమే!

- పీసీ ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో రామగుండం సీఈ అంగీకారం
- తక్కువ వ్యవధి, వ్యయంతో నిర్మించవచ్చనే బరాజ్ నిర్మాణంలో సికెంట్ పైల్స్ వాడినట్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తయ్యాక కాఫర్ డ్యామ్, షీట్‌పైల్స్‌ను పూర్తిగా తొలగించకపోవడంతో వరద ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి బరాజ్ దెబ్బతిందని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వ్యాఖ్యానించింది. ఇందుకు నీటిపారుదల శాఖ, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం కారణం కాదా? అని అధికారులను ప్రశ్నించగా 'పాక్షికంగా నిజమే'నని కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం సీఈ కె.సుధాకర్‌రెడ్డి అంగీకరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా శనివారం ఆయన్ను కమిషన్ సుదీర్ఘంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఒప్పందం ప్రకారం బరాజ్ కట్టాక నిర్మాణ సంస్థ కాఫర్ డ్యామ్‌ను ఎందుకు పూర్తిగా తొలగించలేదని నిలదీసింది. ఈ పనుల వ్యయాన్ని తొలి సవరణ అంచనాల్లో రూ. 61.21 కోట్లకు పెంచారని.. ఆ డబ్బును మిగుల్చుకోవాలని ఉద్దేశపూర్వకంగానే ఒప్పందాన్ని ఉల్లంఘించారని తప్పుబట్టింది. 2019లో వచ్చిన వరదలతో దెబ్బతిన్న మేడిగడ్డ బరాజ్‌ను నిర్మాణ



సీఈ కె.సుధాకర్‌రెడ్డి

సంస్థ నిర్వహించలేదని సుధాకర్‌రెడ్డి బదులిచ్చారు. 2020 వరదల్లో బరాజ్ దిగువన కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోగా పునరుద్ధరించాలని నిర్మాణ సంస్థను కోరారా? అని కమిషన్ ప్రశ్నించగా అప్పట్లో తానక్కడ లేనని బదులిచ్చారు. బరాజ్‌ల నిర్మాణం జరిగి అవి వినియోగంలోకి వచ్చినట్టు ధ్రువీకరించుకున్నాకే వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లపై కౌంటర్ సంతకం చేశానని సమర్థించుకున్నారు. ఈ సర్టిఫికెట్ల జారీకి విధివిధానాలేవి లేవని ఆయన తెలపగా, కమిషన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. విధివిధానాలు లేకున్నా రబ్బర్ స్టాంపులాగా సర్టిఫికెట్ల జారీకి మీ అంతరాత్మ ఎలా ఒప్పుకుందంటూ నిలదీసింది. మిమ్మల్ని మీరు ఇరకాటంలో పడేసుకుంటున్నారని మండిపడింది.

సికెంట్ పైల్స్‌పైనే కమిషన్ గురి..

దేశంలో జలాశయాల నిర్మాణంలో సికెంట్ పైల్స్ వినియోగించరని, అలాంటిది మేడిగడ్డ బరాజ్‌కు ఎందుకు వాడారని కమిషన్ ప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదని, వాటి డిజైన్లను సీఈ సీడీఓ ఇచ్చారని సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. బరాజ్ కుంగిపోవడానికి మరో కారణంగా పునాదుల కింద సికెంట్ పైల్స్‌ను నిట్టనిలువుగా, క్రమబద్ధంగా నిర్మించలేదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ పేర్కొన్న విషయాన్ని కమిషన్ గుర్తుచేయగా ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన బదులిచ్చారు. సీఈ సీడీఓ డయాఫ్రమ్ వాల్ డిజైన్లు ఇచ్చినా దానికంటే తక్కువ వ్యవధి, వ్యయంతో నిర్మించవచ్చనే సికెంట్ పైల్స్‌కు మొగ్గు చూపినట్టు తెలిపారు. డీవాటరింగ్‌కు అంచనాల కంటే 49.6 శాతం అధిక చెల్లింపులను నిబంధనల ప్రకారమే చేశామని సుధాకర్ రెడ్డి తెలియజేశారు.

టెండర్లు లేకుండానే డీపీఆర్ తయారీనా?

టెండర్లు లేకుండానే నామినేషన్‌పై కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతను వ్యాప్కోస్‌కు అప్పగించినట్టు సుదాకర్‌రెడ్డి తెలిపారు. టెండర్లు పిలవొద్దని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించగా క్షేత్రస్థాయి పరీక్షల రికార్డులను వ్యాప్కోస్‌కు ఇవ్వాలని నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారని సుధాకర్‌రెడ్డి వివరించారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు మరో ప్రశ్నకు బదులిచ్చారు.

సెక్స్ వర్కర్లకూ పౌర హక్కులు

హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్



బంజారాహిల్స్: సెక్స్ వర్కర్లు చేసే పనికి గుర్తింపు నివ్వాలని, వాళ్లు కూడా మనుషులేనని, వాళ్లను కూడా జన జీవన స్రవంతిలో ఒకరిగా చూడాలని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ శనివారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 'స్టేట్ లెవల్ కన్సల్టేషన్ మీట్ ఆన్ రైట్స్ ఆఫ్ సెక్స్‌వర్కర్స్'అనే అంశంపై మాట్లాడారు. పౌరులకు ఉండే హక్కులన్నీ సెక్స్ వర్కర్లకు కూడా ఉంటాయన్నారు. 2022 మే 19న సుప్రీంకోర్టు బుద్ధదేవ్ కర్మస్కర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో చరిత్రాత్మక తీర్పునిస్తూ సెక్స్ వర్క్‌ను ఒక వృత్తిగా గుర్తించి వారికి చట్టప్రకారం సమాన రక్షణ పొందే హక్కు ఉందని ప్రకటించిందన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో 4,728మంది సెక్స్ వర్కర్లు గుర్తింపు పొంది ఉన్నారని, వీరందరికీ ప్రతీనెలా ఉచిత రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారన్నారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 2,610 మంది సెక్స్ వర్కర్లు ఉన్నారన్నారు. సమావేశంలో ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్ మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్, సివిల్ డిపార్ట్‌మెంట్, కమ్యూనిటీ బేస్ ఆర్గనై జేషన్లు, సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు. సాటి సౌజన్యంతో ఈ సమావేశం నిర్వహించారు.

కక్షిదారులకు సత్వర న్యాయం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ

మధిర: కోర్టుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు న్యాయవాదులు సహకరిస్తే కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని హైకోర్టు న్యాయ మూర్తి, ఖమ్మం జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ తెలిపారు. మధిరకు మంజూరైన సబ్ కోర్టును శనివారం ప్రారంభించిన ఆమె, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ కె.శరత్‌తో కలిసి కోర్టు భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ కోర్టుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. ఈమేరకు న్యాయాధికారులతో పాటు ఉద్యోగుల పోస్టులు కూడా భర్తీ చేస్తే సత్వర న్యాయంతో పాటు న్యాయ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా జడ్జి కె.రాజగోపాల్, మధిర న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డితో పాటు న్యాయవాదుల ఆధ్వర్యాన హైకోర్టు జడ్జీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు పాల్గొన్నారు. తొలుత హైకోర్టు జడ్జీలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా, ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో న్యాయమూర్తులు పూజలు చేశారు. ఖమ్మంలో ప్రారంభమైన ఐలు రాష్ట్రస్థాయి సదస్సులో హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ 'రాజ్యాంగ పరిరక్షణ–మహిళా న్యాయవాదుల పాత్ర' అంశంపై మాట్లాడారు.



మధిరలో కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు జడ్జీలు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నగేశ్, జస్టిస్ శరత్

అధికార లాంఛనాలతో కనక రాజు అంత్యక్రియలు



కనకరాజు పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దొత్రే

కెరమెరి(ఆసిఫాబాద్): గుస్సాడీ రాజుగా ప్రసిద్ధి చెందిన కనకరాజు అంత్యక్రియలను శనివారం కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లావాయి గ్రామంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. గత కొంతకాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతూ తన స్వగ్రామంలో శుక్రవారం కనకరాజు తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దొత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, గిరిజన సంఘాల నాయకులు హాజరై కనకరాజు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కడసారి చూపుకోసం ఆదివాసీ లోకం దండులా కదిలివచ్చింది. ఆదివాసీ సంస్కృతి, ఆచార వ్యవహారాలతో అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనకరాజు మృతికి ప్రధాని సంతాపం

గుస్సాడీ నృత్యానికి ఆయన చేసిన సేవలను కొనియాడిన మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్: ప్రముఖ నృత్యకారుడు, సాంస్కృతిక మణిదీపం పద్మశ్రీ కనకరాజు మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. గుస్సాడీ నృత్యానికి ఆయన చేసిన సమున్నతమైన సేవలను, అంకితభావాన్ని మోదీ కొనియాడారు. సాంస్కృతిక వారసత్వ చిహ్నాలేవీ వాటి స్వాభావిక స్వరూపాన్ని కోల్పోకూడదన్న ఆయన తపనను ప్రశంసించారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా మోదీ తన భావాలను వ్యక్తపరిచారు. 'ప్రముఖ నృత్యకారుడు, సాంస్కృతిక మణిదీపం కనకరాజు మరణం చాలా విచారం కలిగించింది. గుస్సాడీ నృత్యాన్ని పరిరక్షించేందుకు ఆయన చేసిన సేవలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. కళారంగం కోసం ఆయన పడిన నిరంతర తపన, అంకితభావం ప్రశంసనీయం. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. ఓం శాంతి' అని అన్నారు. గుస్సాడీ నృత్యం గుర్తింపు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కనకరాజు మృతి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీరని లోటని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పేర్కొన్నారు. గోండు సంప్రదాయ కళ చిరునామాని కోల్పోయామని గొండి ఆదివాసీ అధ్యయన వేదిక అధ్యక్షుడు, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రొఫెసర్ గూడూరు మనోజ అన్నారు.

అధికారులు ఏం చేస్తున్నారు?

- రోడ్డు ప్రాజెక్టులకు అటవీ అనుమతుల్లో జాప్యం తగదు
- మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులకు అటవీ అనుమతులివ్వడంలో నిర్లక్ష్యానికి తావు లేదని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆయా ప్రాజెక్ట్‌లకు అటవీ అనుమతుల సాధనలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి రాష్ట్ర ప్రగతికి ప్రతిబంధకంగా మారిందని అన్నారు. శనివారం సచివాలయంలో రోడ్లు, భవనాలు, అటవీ శాఖల అధికారులతో ఇద్దరు మంత్రులు నిర్వహించిన సమీక్షలో పలు రహదారుల పరిస్థితిపై చర్చించారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా 7 రోడ్డు ప్రాజెక్టుల పనులు, నాలుగేళ్లుగా ఒక ప్రాజెక్టు, మూడేళ్లుగా 20 ప్రాజెక్టులు, ఏడాది కాలంగా 31 ప్రాజెక్టులు అటవీ అనుమతులు లేక ఆగిపోయాయని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లుగా ఇన్ని అనుమతులు పెండింగ్ లో ఉంటే రెండు శాఖల అధికారులు ఏం చేస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం నుంచి అనేక రహదారులకు అనుమతులు సాధించినా ఒక్కడ అనుమతులు లేక కొత్త రోడ్ల మంజూరీ గురించి కేంద్రాన్ని అడగడం ఇబ్బందిగా మారిందన్నారు. అటవీ అనుమతుల కోసం ఉమ్మడి జిల్లాల వారీగా పర్యవేక్షణాధికారులను నియమించాలని ఈ సందర్భంగా అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియల్‌లను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. డీఎఫ్ఓల స్థాయిలో 11 అటవీ అనుమతుల ఫైళ్ల ఆలస్యంపై అధికారులను ఆమె ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డికి హామీనిచ్చారు. కాగా, అటవీ అనుమతుల సాధన పర్యవేక్షణకు ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఎస్ఈ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమిస్తామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

రీజనల్ ఆఫీసర్ తీరు సరికాదు..

రాష్ట్ర రోడ్డు ప్రాజెక్టుల అటవీ అనుమతులను పర్యవేక్షించే కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ రీజనల్ ఆఫీసర్ త్రినాథరావు చిన్న చిన్న అంశాలపై వివరణలతో కాలయాపన చేయడంపై ఇద్దరు మంత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అండగా నిలబడాల్సిందిపోయి.. సాంకేతిక కారణాలతో ఫైళ్లను జాప్యం చేయడం తగదన్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ఆదివారం । 27-10-2024



మనోహరం

పల్లె ముంగిట పంట చేలు.. ధాన్యపురాశుల్లో పిచ్చుకల గుంపులు.. అలికిడైతే చాలు.. తుర్రుమంటూ జారుకుంటూ.. విద్యుత్ తీగల నిండా పూదండలా అల్లుకుపోతూ.. ఈ మనోహర దృశ్యం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనగర్తి గ్రామ శివారులో కనువిందు చేసింది. పంట పొలాల్లోని విద్యుత్ తీగలపై.. పూలదండలా అల్లుకుపోయాయిలా..

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలపై వివరణివ్వండి

హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న పిటిషనర్ అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని అసోసియేషన్‌ను హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అసోసియేషన్‌తో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. తెలంగాణ కబడ్డీ సంఘం కార్యవర్గం ఈ నెల 7న ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు బసాని హేమంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



ఎన్నికల ప్రక్రియలో కల్పిత ఓటర్ జాబితాను ఉపయోగిస్తున్నారని, జాతీయ క్రీడాభివృద్ధి కోడ్ 2011, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను పాటించడం లేదన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, చట్టప్రకారం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల వాయిదాకు నిరాకరించారు. అయితే, అక్రమాలు జరిగినట్లు తేలితే ఎన్నికలను రద్దు చేస్తామని చెప్పారు. ఈ నెల 27న తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

రాజకీయ ప్రచారానికి ప్రభుత్వ హెలికాప్టరా?

కాంగ్రెస్‌పై కేఏ పాల్ ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: కేరళ వయనాడ్‌లో రాజకీయ ప్రచారానికి తెలంగాణ ప్రభుత్వానికి చెందిన హెలికాప్టర్‌ను వినియోగించడంపై ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మండిపడ్డారు. ఆ హెలికాప్టర్ ద్వారా వంద కోట్లు వయనాడ్‌కు తరలించారనే విమర్శలు కూడా ఉన్నాయని విమర్శించారు.



శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. కేరళ, ఖమ్మం వరదల్లో ప్రజలను రక్షించడానికి ఆ హెలికాప్టర్ ఎందుకు వాడలేదని ప్రశ్నించారు. బాంబులు పేల్చుతాం అంటూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మీరు వేల కోట్లు ఎలా సంపాదించారో నన్ను నోరు విప్పమంటారా అంటూ నిలదీశారు. వేరే గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకోవడంపై పాల్ మండిపడ్డారు.

సన్నాలకు.. సాంకేతికత

క్వింటాకు రూ.500 బోనస్ | గింజను ఒలవడానికి ప్యాడిహస్కర్

సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ / సంచులకు కోడ్.. ఎర్ర దారంతో కుట్లు.. సంచిపై ఎస్ అనే అక్షరం / రాష్ట్రవ్యాప్తంగా 7,185 కొనుగోలు కేంద్రాలు

సాక్షి, సిద్దిపేట: సన్న బియ్యాన్ని గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నారు. రాష్ట్రంలో సన్న రకాల ధాన్యం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేసింది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 60.8 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. అందులో 40 శాతం వరకు సన్నాలు సాగు చేశారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తంగా 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తాయని, ఇందుకోసం 7,185 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే చాలా వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చెల్లించనున్నారు.



33 సన్న రకాలకు బోనస్

ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. బీపీటీ-5204, డబ్ల్యూయజీఎల్ -44, కేపీఎస్-2874, జేజీఎల్-27356, జేజీఎల్ 28545, డబ్ల్యూజీఎల్-14, డబ్ల్యూజీఎల్-32100, జేజీఎల్-11470, జేజీఎల్-384, ఆర్ఎన్ఆర్-2458, జేజీఎల్-384, జేజీఎల్-3828, తెలంగాణ సోనా, వరంగల్-1119, కేఎల్ఎం-1638, వరంగల్-962, రాజేంద్రనగర్, కేఎల్ఎం-733, జేజీఎల్-1798, జేజీఎల్3844, జేజీఎల్ 3855, జేజీఎల్-11118, ఎన్ఆర్ఎల్-34449, సుగంధ సాంబ, శోభిని, సోమనాథ్, ఆర్ఎన్ఆర్-31379, కేపీఎస్-6251, జేజీఎల్ 33124, హెచ్ఎంటీ సోనా, ఎంజీయూ-1224, ఎంటీయూ-1271 రకాలకు బోనస్ చెల్లించనున్నారు.

బియ్యం గింజగా మార్చేందుకు ప్యాడిహస్కర్



వడ్లకున్న పొట్టును ఒలిచేందుకు ప్యాడిహస్కర్ యంత్రాలను అందజేస్తున్నారు. 20 వడ్ల గింజలను తీసుకుని ఈ యంత్రంలో పోసి తిప్పితే.. పొట్టూడిపోయి బియ్యం గింజలు బయటికొస్తాయి. పాత కాలంలో వడ్లను చేతితో నలిపేవారు. అప్పుడు వడ్ల నుంచి బియ్యం వచ్చేవి. ఇప్పుడు ప్యాడిహస్కర్‌ను వినియోగిస్తున్నారు. ఈ బియ్యం గింజలను సుమారు 10 గింజలను తీసుకుని అన్నింటిని ఒక్కొక్కటిగా గ్రెయిన్ కాలిపర్ మెషీన్‌లో పెట్టి కొలవనున్నారు.

గ్రెయిన్ కాలిపర్ యంత్రాలు



సన్నధాన్యం గుర్తించేందుకు కొనుగోలు కేంద్రాలకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్) యంత్రాన్ని అందజేస్తున్నారు. దీంతో సన్న బియ్యం గింజ పొడవు, వెడల్పు కొలవనున్నారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండాలని నిర్ణయించారు. బియ్యం గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా నిర్దేశిత ప్రమాణాలుంటేనే కొనుగోలు చేయనున్నారు. ఇలా ఉన్న ధాన్యాన్నే సన్నాలుగా గుర్తించి వారికి క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ అందజేయనుంది. ఇప్పటికే ఈ యంత్రంపై కొనుగోలు కేంద్రాల వారికి అవగాహన కల్పించారు.

సంచులకు కోడ్

సన్నాల సంచులకు ఎరుపు రంగు దారంలో కుట్టి.. వాటిపై ఎస్ అనే అక్షరం రాయనున్నారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారంతో కుట్లు వేయనున్నారు. కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ఓపీఎంఎస్ కోడ్‌ను రాయనున్నారు. మిల్లుకు చేరిన తర్వాత సైతం ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించనున్నారు.

ఒక్కో సెంటర్‌కు ఒక్కో మీటర్



సన్నాలు కొనుగోలు చేసే కేంద్రాలకు.. ఒక్కొక్క కేంద్రానికి ఒకటి గ్రెయిన్ కాలిపస్, ప్యాడిహస్కర్‌లను, ఓపీఎంఎస్ కోడ్‌లను అందించాం. ఇంకో 10 రోజులైతే సన్నాలు కొనుగోలు కేంద్రాలకు రానున్నాయి. సన్న వడ్ల సంచులకు ఎస్ అనే అక్షరం సైతం రాయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించాం.

- ప్రవీణ్, డీఎం,
సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, సిద్దిపేట



20 అడుగుల జొన్న

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా మిర్యాల గూడ పట్టణంలోని చింతపల్లి రోడ్డులో ఉన్న విద్యానగర్ కాలనీలో డాక్టర్ సాహితీ సాంబశివరావు ఇంటిఎదుట మొలిచిన జొన్న మొక్క ఏపుగా పెరిగింది. ప్రస్తుతం దీని ఎత్తు 20 అడుగుల వరకు ఉంది. చుట్టుపక్కల వారు, దారిన వెళ్లేవారు ఈ మొక్కను ఆసక్తిగా చూస్తున్నారు.

మంత్రి కోమటిరెడ్డితో ఏపీ మంత్రి సుభాష్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో.. ఆంధ్ర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వసంశెట్టి సుభాష్ భేటీ అయ్యారు. రీజినల్ రింగురోడ్డు, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ తదితర ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వివరించారు.



రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరుకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రథమ సమావేశం శనివారం బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది.

అడవిలో ఆఖరి పోరాటం

శాంతిదళం నుంచి ఫైనల్ మిషన్ ◆ మావోయిస్టులపై ముప్పేట దాడి

అన్ని విభాగాల సమన్వయంతో జాయింట్ ఆపరేషన్లు • ఉధృతంగా యాంటీ నక్సల్స్ ఆపరేషన్లు • కాలానుగుణంగా కొత్త ఎత్తుగడలు • ఆదిలో పలకరించిన అపజయాలు • లోపాలను సరిదిద్దుకుంటూ కేంద్ర బలగాలు ముందుకు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశంలో మావోయిస్టులను 2026 మార్చి కల్లా ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల ప్రకటించడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సల్వాజుడుం పేరుతో 2007లో మావోయిస్టుల ఏరివేతలో నేరుగా కేంద్రం జోక్యం చేసుకునే ప్రక్రియ.. ప్రస్తుతం ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)కు చేరుకుంది.

యూపీఏ హయాంలో..

దేశంలోని ప్రధాన విప్లవ శక్తులైన పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్లు విలీనమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఏపీలోని తిరుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ఆయా పార్టీల నేతలు ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దీంతో మావోయిస్టు పార్టీకి గెరిల్లా జోన్‌గా ఉన్న బస్తర్ అడవుల నుంచి యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌ను కేంద్రం ప్రారంభించింది. మావోయిస్టులకు ఎక్కువ మద్దతిచ్చే తెగకు.. ఎదురు నిలిచే మరో తెగ సభ్యులను ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించింది. వారి చేతికి ఆయుధాలిచ్చి శాంతిదళం (సల్వాజుడుం)ను 2007లో ఏర్పాటు చేసింది. సల్వాజుడుం మొదటి అడుగు నుంచి 2011లో రద్దయ్యే వరకు వివాదాలకు కేంద్ర బిందువుగా ఉంది. సల్వాజుడుంపై విమర్శలు ఎక్కువ రావడంతో 2009 సెప్టెంబర్‌లో పెద్దఎత్తున సీఆర్‌పీఎఫ్ బలగాలను బస్తర్ అడవుల్లోకి పంపాలని కేంద్రం నిర్ణయించింది. దీన్నే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌గా పేర్కొంటున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ కారణంగా మావోయిస్టుల చేతిలో భద్రతా దళాలకు చెందిన జవాన్లు తీవ్రంగా నష్టపోయారు. బస్తర్ అడవులపై ప్రభుత్వ దళాలకు పట్టు చిక్కలేదు.

నాగా కమాండోలు..

2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం అమలు చేసిన గ్రీన్‌హంట్‌కు మరింత పదును పెట్టింది. అప్పటికే పశ్చిమ బెంగాల్‌లో మావోయిస్టులను అణచివేయడంలో కీలక పాత్ర పోషించిన నాగా బెటాలియన్‌ను బస్తర్ అడవులకు



పంపాలని నిర్ణయించింది. వీరి చేతుల్లో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్, శాటిలైట్ ఫోన్లు పెట్టింది. అప్పటికే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్) దళాలు రంగంలో ఉన్నాయి. అయినప్పటికీ కేంద్రం ఆశించిన ఫలితాలు రాలేదు.

ఆపరేషన్ సమాధాన్..

యాంటీ మావోయిస్టు ఆపరేషన్లు చేపట్టి పదేళ్లు దాటినా బస్తర్ అడవులపై పట్టు చిక్కకపోవడానికి వ్యూహాల్లో లోపాలే కారణమనే భావనకు కేంద్రం వచ్చింది. దీంతో 2017లో ఆపరేషన్ సమాధాన్ (ఎస్ - స్మార్ట్ లీడర్‌షిప్, ఏ - అగ్రెసివ్ స్ట్రాటజీ, ఎం - మోటివేషన్ అండ్ ట్రైనింగ్, ఏ - యాక్షనబుల్ ఇంటెలిజెన్స్, డీ - డ్యాష్‌బోర్డ్ బేస్డ్ కీ రిజల్ట్ ఏరియా, హెచ్ - హర్నెస్సింగ్ టెక్నాలజీ, ఏ - యాక్షన్ ప్లాన్, ఎన్ - నో ఆక్సెస్ టు ఫైనాన్సింగ్)ను తెరపైకి తెచ్చింది. మావోయిస్టుల ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టడం, వారి స్థావరాలను కచ్చితంగా కనుక్కోవడం, ఔషధాలు అందకుండా చూడటం, మావోయిస్టుల్లోకి కొత్త నియామకాలు జరగకుండా జాగ్రత్త పడటం వంటి పనులపై ఎక్కువ శ్రద్ధ చూపించారు. దీంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణంలో వేగం పెంచారు.

గగనతల దాడులు

ఆపరేషన్ సమాధాన్‌తో పరిస్థితులు అనుకూలంగా మారాయని నిర్ధారణకు వచ్చిన తర్వాత 2021 జూన్ 19న తొలిసారిగా వాయుమార్గంలో మావోయిస్టు శిబిరాలపై కేంద్ర బలగాలు దాడులు చేశాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే మావోయిస్టు శిబిరాలపై వాయుమార్గంలో దాడులు చేయడంపై ఆందోళన వ్యక్తం కావడం, నిరసనలు రావడంతో.. ఈ తరహా దాడులపై కేంద్రం వెనక్కి తగ్గింది. అయినప్పటికీ 2021 జూన్ నుంచి 2022 చివరి వరకు నాలుగుసార్లు తమపై గగనతల దాడులు జరిగాయని మావోయిస్టు పార్టీ పలు సందర్భాల్లో ఆరోపణలు చేసింది.

లోపాలను అధిగమిస్తూ..

మావోయిస్టుల ఏరివేతలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సరికొత్త వ్యూహాలను కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చాయి. లొంగిపోయిన, అరెస్టయిన మావోయిస్టుల (సాధారణంగా స్థానిక ఆదివాసీలకే అధికారం)తో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ పేరుతో ప్రత్యేక దళాలను తయారు చేసింది. నాగా కమాండోలు ఇక్కడి అడవులపై పట్టు సాధించలేకపోవడంతో.. వారికి బదులుగా ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లను రంగంలోకి దించింది. సాయుధులైన పురుష కమాండోల వల్ల వచ్చే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేకంగా విమెన్ కమాండో దళాలను తయారు చేసింది. ఎండాకాలం, వానాకాలం అని తేడా లేకుండా ఏడాదంతా అడవుల్లో కూంబింగ్ చేపట్టేలా ఆపరేషన్ సూర్యశక్తి, ఆపరేషన్ జల్‌శక్తి పేర్లతో జవాన్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీంతో ఆఖరికి వానాకాలంలో కూడా మావోయిస్టులు నిర్భయంగా సంచరించే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా భద్రతా దళాలపై మావోలు జరిపే వ్యూహాత్మక ఎదురుదాడులను గణనీయంగా తగ్గించగలిగారు.

విస్తృతంగా పారా మిలిటరీ క్యాంపులు

సంఖ్య, శిక్షణ, ఆధునిక ఆయుధాలు, లేటెస్ట్ టెక్నాలజీ పరంగా సంసిద్ధమైన తర్వాత బస్తర్ అడవుల్లో ప్రతీ ఆరు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా దళాలకు చెందిన క్యాంపులను ఏర్పాటు చేస్తూ.. మావోయిస్టులను కేంద్రం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం బస్తర్‌లో 370కి పైగా పారా మిలిటరీ క్యాంపులున్నాయి. సుక్మా, బీజాపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలతో కూడిన దండకారణ్యంలో మావోయిస్టుల గెరిల్లా జోన్లు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయాయి. చివరికి మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామమైన పువర్తిలోనూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో భద్రతా దళాలు క్యాంపును ఏర్పాటు చేశాయి.

ఆపరేషన్ కగార్

సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, కోబ్రా, పోలీసులు.. ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ జాయింట్ ఆపరేషన్లకు శ్రీకారం చుడుతూ ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)ను 2024 జనవరిలో ప్రారంభించారు. మావోయిస్టుల షెల్టర్ జోన్‌గా ఉన్న అబూజ్‌మడ్ (బీజాపూర్, నారాయణ్‌పూర్, కాంకేర్, కొండగావ్) అడవులపై ప్రభుత్వం గురి పెట్టింది. ఈనెల 5న తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 38 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇప్పటి వరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 200 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. మరో 400 మందికి పైగా లొంగిపోవడం లేదా అరెస్టయ్యారు. ప్రభుత్వ దళాల నిర్బంధం పెరిగిపోవడంతో మావోయిస్టు అగ్రనేతలు చెల్లాచెదురయ్యారనే ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా...

ప్రజా ఉద్యమకారులను రౌడీషీట్లతో వేధిస్తోంది

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

సాక్షి, అమరావతి: ప్రజాసమస్యలపై ఉద్యమించే వారిపై ఏపీ ప్రభుత్వం రౌడీషీట్‌లు తెరిచి వేధించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పోలయ్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన సింహాచలంపై పోలీసులు కేసులు పెట్టి వారం రోజులుగా వేధించడం దారుణమన్నారు. గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఏకంగా రౌడీషీట్‌లు తెరిచి పోలీసులతో వేధింపులకు గురిచేయడం సరికాదని, తక్షణం వేధింపులను ఆపాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

కొల్లేరు ఆక్రమణలను తొలగించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: కొల్లేరు ఆక్రమణలను తొలగించాలని 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు లక్ష ఎకరాల్లో ఉన్న కొల్లేరు సరస్సు ఆక్రమణలతో నిండిపోయిందని.. చేపల చెరువుల పేరుతో వందలాది ఎకరాలు అక్కడ కబ్జాకు గురయ్యాయన్నారు. కబ్జాలకు గురికాగా ప్రస్తుతం 25 ఎకరాల్లో మాత్రమే సరస్సు ఉందని వివరించారు. అక్రమంగా ఏర్పాటుచేసిన చేపల చెరువులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటించాలన్నారు. అలాగే, కొల్లేరు సరస్సును జాతీయ పర్యాటక, సందర్శన కేంద్రంగా మార్చాలని నారాయణ కోరారు.

సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలి

మంత్రి అచ్చెన్న

సాక్షి, అమరావతి: ఈనామ్ మార్కెటింగ్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వారం రోజులుగా రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈసమస్యపై శనివారం మార్కెటింగ్ శాఖాధికారులతో మంత్రి సమీక్షించారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మద్యం షాపు వద్దే వద్దు



వేటపాలెంలో మద్యం షాపు ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

వేటపాలెం: నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరం, దేవాలయానికి దగ్గరగా మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ బాపట్ల జిల్లా వేటపాలెంలో ప్రజలు శనివారం ఆందోళన చేపట్టారు. చీరాల–వేటపాలెం ప్రధాన రహదారి నుంచి విజయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. దానికి సమీపంలోనే ప్రభుత్వ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, ఆంజనేయ స్వామి దేవస్థానం, చర్చి ఉన్నాయి. ఈ రోడ్డు ద్వారా విజయనగర్ కాలనీకి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి చోట మద్యం షాపు ఏర్పాటు చేయాలని చూడటం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణం ఎదురుగా నిరసన తెలిపారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. మద్యం షాపు తెరిస్తే తిరిగి నిరసన చేపడతామని మహిళలు హెచ్చరించారు.

పట్టాలెక్కిస్తారా.. పక్కన పెట్టేస్తారా?



పరీక్షలు జరిగి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయ్యి పోస్టింగులు నిలిచిపోయిన నోటిఫికేషన్లు కొన్ని..ప్రిలిమ్స్ జరిగి మెయిన్స్‌కి తేదీలు ప్రకటించాక పలుమార్లు వాయిదా పడిన గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలతో పాటు అసలు తేదీలే ప్రకటించకుండా ఉన్న మరో 19 నోటిఫికేషన్లు..సుదీర్ఘకాలం తర్వాత ఏపీపీఎస్సీకి చైర్‌పర్సన్‌గా వచ్చిన ఏఆర్ అనురాధ ముందు ఉన్న సవాళ్లు.



- ఏపీపీఎస్సీ నూతన చైర్మన్ అనురాధ స్పందన కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- ఇప్పటికిప్పుడు పరీక్షలు నిర్వహించాల్సినవి 21 నోటిఫికేషన్లు
- గ్రూప్–1, 2తో పాటు డీవైఈవో పోస్టులు కూడా పెండింగ్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివాద రహిత కమిషన్‌గా జాతీయ గుర్తింపు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అత్యంత సాఫీగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సాగిన సంగతి తెలిసిందే. అయితే కూటమి సర్కారు రాగానే సర్వీస్ కమిషన్ చైర్మన్‌ను తొలగించి, జరగాల్సిన పరీక్షలను నిలిపివేసి అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టివేసింది. ఆయుష్ విభాగంలో పోస్టుల భర్తీకి ధ్రువపత్రాలు పరిశీలన పూర్తయ్యి కూడా ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వలేదు. గతేడాది ఇచ్చిన ప్రధాన నోటిఫికేషన్లలో గ్రూప్–2, 1, డీవైఈవో పోస్టులకు ప్రిలిమ్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి, ఫలితాలను సైతం ప్రకటించింది. ముందుగా ప్రకటించినట్లుగా గ్రూప్–2 మెయిన్స్ జూలైలోను, సెప్టెంబర్‌లో జరగాల్సిన గ్రూప్–1 మెయిన్స్ కూడా వాయిదా వేసింది. గతంలో ప్రకటించిన 19 నోటిఫికేషన్లకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి డిసెంబర్‌కి నియామక ప్రక్రియ జరగాలి. వీటిలో గ్రూప్–2, గ్రూప్–1, డీవైఈవో, డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీవైఈవో) వంటి కీలమైన నోటిఫికేషన్ల ద్వారా 1,475 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. వీటికి 6.35 లక్షల మంది వరకు దరఖాస్తు చేసుకుని సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్నారు. దీంతో పాటు కొత్తగా అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు వంటి పోస్టులతో పాటు వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతినిచ్చిన 800 వరకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలి. ఈ నోటిఫికేషన్‌పై గతంలోనే ఏపీపీఎస్సీ ప్రకటన ఇవ్వడంతో అర్హత గల లక్షలాది మంది కొన్ని నెలలుగా శిక్షణ తీసుకుంటున్నారు. దీంతో పాటు కొత్తగా ఆర్థికశాఖ అనుమతి పొందిన 10కి పైగా నోటిఫికేషన్లు ప్రకటించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో 2019కి ముందు ఇచ్చిన నోటిఫికేషన్లు వివాదాల్లో పడటంతో నిరుద్యోగ యువత అనేక ఇబ్బందులు పడ్డారు. 2018 డిసెంబర్‌లో 32 నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ ఒక్క నోటిఫికేషన్‌కు పరీక్షలు నిర్వహించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో పరీక్షల వాయిదాలు, లీకులు, కోర్టు కేసులు వంటి వివాదాలే కనిపిస్తాయి. దాంతో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారు. ఇప్పుడూ అదే పరిస్థితి ఉంటుందని నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో నిర్విరామంగా సిద్ధమవుతున్న లక్షల మందికి పైగా యువత భవిష్యత్‌ను నిర్ణయించే బాధ్యత ఇప్పుడు కొత్త చైర్‌పర్సన్ అనురాధ చేతుల్లో ఉంది.

నాడు జాతీయ గుర్తింపు

గత ప్రభుత్వంలో సర్వీస్ కమిషన్ నుంచి వచ్చిన అన్ని నోటిఫికేషన్లకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరిగాయి. ఉద్యోగాల భర్తీ పక్కాగా పూర్తి చేశారు. గత ఐదేళ్లలో కమిషన్ ద్వారా అన్ని శాఖల్లోను 78 నోటిఫికేషన్లు ఇచ్చి అర్హత గల ఏ నిరుద్యోగికీ అన్యాయం జరగకుండా 6,296 ఉద్యోగాలను వివాద రహితంగా భర్తీ చేశారు. ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌కు షెడ్యూల్‌లో ప్రకటించిన తేదీల్లోనే పరీక్షలు నిర్వహించారేగాని, ఏ ఒక్కటీ వాయిదా పడిన సందర్భంగానీ, రద్దు చేయడం గానీ జరగలేదు. ఈ ఏడాది కేంద్రం పలు రాష్ట్రాల సర్వీస్ కమిషన్ల పనితీరుపై విడుదల చేసిన నివేదకలో దేశంలోని 15 రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు వివాదాల్లో చిక్కుకుంటే, వివాదరహితంగా ఉద్యోగాలు భర్తీ చేసిన బోర్డుగా ఏపీపీఎస్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా వచ్చిన ఏఆర్ అనురాధ గతంలో ఐపీఎస్ అధికారిగా సమర్థమంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు ఆమె నోటిఫికేషన్లకు సకాలంలో పరీక్షలు నిర్వహిస్తారో లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారో చూడాలి.

డాలర్ డ్రీమ్స్ వదిలి.. ఆత్మసంతృప్తికి కదిలి...

- అధ్యాపక వృత్తిలోకి విద్యాధికుడు
- డిగ్రీ కళాశాలకు సాంకేతిక హంగులు
- వర్చువల్ ఇంటర్న్‌షిప్, సర్టిఫికేషన్ కోర్సులు
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత
- ఏటా వందల మందికి ఉద్యోగాలు
- సేవలకు వరించిన జాతీయ అవార్డులు



ప్రపంచంలోని టాప్ టెన్ ఆర్థిక సంస్థల్లో ఒకటైన మోర్గాన్‌స్టాన్లీలో సీనియర్ సిస్టం ప్రోగ్రామర్ ఉద్యోగం... రూ.లక్షలలో ఆకర్షణీయమైన వేతనం. ఆ ఉద్యోగం వద్దనుకుని స్వదేశంలోని సాధారణ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా కొత్త జీవితం ప్రారంభించారాయన. తన కృషితో విద్యార్థులకు డిజిటల్ నాలెడ్జిని పరిచయం చేశారు. ఇంటర్న్‌షిప్‌లు, ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులను తప్పనిసరి చేశారు. దీంతో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏటా వందల మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధిస్తున్నారు. ఆయన కృషికి జాతీయస్థాయి అవార్డులు కూడా వరించాయి.
- ఆయనే డాక్టర్ కొలసాని రామ్‌చంద్.

తెనాలి: తెనాలి సమీపంలోని ఈపూరు గ్రామం డాక్టర్ రామ్‌చంద్ సొంతూరు. తల్లిదండ్రులు హనుమంతరావు, సీతారామమ్మ. గుల్బర్గా యూనివర్సిటీలో బీటెక్ కాగానే గుంటూరులోని ప్రైవేటు కాలేజీలో ఆయన అధ్యాపకుడిగా చేరారు. బిట్స్ పిలానీలో ఎంఎస్, ఎంజీఆర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంటెక్, 'ఆచార్య నాగార్జున'లో 'కంప్యూటర్ సైన్స్‌లో సాఫ్ట్‌వేర్ విశ్వసనీయత'పై 2011లో పీహెచ్‌డీ చేశారు. 1997లో అమెరికాలో మోర్గాన్‌స్టాన్లీ కంపెనీలో సీనియర్ సిస్టమ్ ప్రోగ్రామర్‌గా జాయినయ్యారు. రూ.లక్షల్లో జీతం, హోదా బాగున్నా ఉద్యోగ సంతృప్తి లేకుండాపోయింది. అధ్యాపక వృత్తిలో సంతృప్తి ముందు ఆ వేతనం దిగదుడుపు అనిపించింది. తల్లిదండ్రులు అభ్యంతర పెట్టినా వినకుండా తెనాలి వచ్చేశారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో అధ్యాపకుడిగా తనకిష్టమైన జీవితాన్ని ఆరంభించారు. కంప్యూటర్ విభాగం హెచ్‌ఓడీగా, పీజీ డైరెక్టర్‌గా, విమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. 2016 నుంచి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తగిన శిక్షణను డిజైన్ చేశారు.

నాన్ ఐటీ రంగాలపై దృష్టి

కరోనాతో వర్చువల్ విధానం తప్పనిసరైంది. కంపెనీల రిక్రూట్‌మెంట్‌కూ ఇదే ప్రాతిపదికైంది. దీనితో శిక్షణ, సాధన, సర్టిఫికేషన్స్‌కు ఇదే విధానం అవలంబించసాగారు. సాఫ్ట్‌వేర్ ఒడిదుడుకులను గమనంలోకి తీసుకుని మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, ఇంగ్లిష్ టీచింగ్ వంటి నాన్ ఐటీ రంగాల్లోనూ అనుగుణమైన శిక్షణను ఆరంభించారు. యాక్సిస్ బ్యాంక్, ఐఎల్ఎం, పిరామిల్ ఫైనాన్స్, సదర్‌లాండ్ వంటి సంస్థలు కాలేజీని రిక్రూట్‌మెంట్ కేంద్రంగా ఎంచుకున్నాయి. మొత్తం మీద డిగ్రీ కాలేజీ నుంచి ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ఏటా 700–1,200 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.

అందుబాటులో ఆధునిక కోర్సులు

ఇంజినీరింగ్ కాలేజీల తరహాలో డిజిటల్ టెక్నాలజీని పెంచుతూ వర్చువల్ మోడ్‌తో తరగతుల నిర్వహణ, ఇంటరాక్షన్ వంటివి ఇక్కడ మరో ప్రత్యేకత! రాష్ట్రంలో జూమ్ పెయిడ్ ఉన్న ఏకైక డిగ్రీ కాలేజీ తమదని డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. ఇంజినీరింగ్‌కే పరిమితమైన ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఈ–కామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులను తప్పనిసరి చేశారు. ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తున్నారు. కంపెనీలకు కాలేజీ యాజమాన్యం డబ్బును చెల్లిస్తూ, విద్యార్థులకు ఉచితంగా అవకాశం కల్పిస్తోంది. వీటిలోనే రెండుసార్లు కాలేజీకి జాతీయస్థాయి అవార్డులు వరించాయి. విద్యార్థుల్లో వాయిదా వేసే అలవాటును మార్చేందుకు రోజుకు 15 గంటల చొప్పున వారానికి 105 గంటల చాలెంజ్, తర్వాత 21 గంటల చాలెంజ్ వంటి ప్రణాళికలను అమలు చేస్తుండటం మరో ప్రత్యేకత. ఇంటరాక్షన్, సందేహాల కోసం తాను కూడా అన్ని గంటలు వర్చువల్‌గా అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తున్నారు డాక్టర్ రామ్‌చంద్.

ఎన్నో గుర్తింపులు

స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్. ఎడ్యుస్కిల్స్ – ఏఐసీటీఈ–జాతీయ ఇంటర్న్ షిప్ పోర్టల్ 2023–2024 కాలానికి వర్చ్యువల్ ఇంటర్న్‌షిప్‌లో కాలేజీకి ఇటీవలే జాతీయస్థాయిలో మూడో ర్యాంక్ లభించింది. సౌత్, సెంట్రల్ జోన్స్‌లో 'బెస్ట్ ఫెర్ఫార్మింగ్ డిగ్రీ కాలేజీ', డిగ్రీ కళాశాలల విభాగంలో 'ప్రిన్సిపల్ ఎక్స్‌లెన్స్ అవార్డు'ల తోపాటు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం లభించింది. ఇంతకుముందు ఏఐసీటీఈ అనుమతి పొందిన 'బ్రెయిన్ విజన్'చే జాతీయ స్థాయిలో 'జ్యేష్ఠ ఆచార్య' అవార్డునూ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌చంద్ స్వీకరించారు. అవార్డును మౌలానా అజాద్ నేషనల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ నుంచి అందుకున్నారు.

బాలినేని పిటిషన్‌పై రేపే తీర్పు

ఒంగోలు: మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి హైకోర్టులో చేసిన ఫిర్యాదుపై ఈ నెల 28న తీర్పు వెలువడనుంది. ఈవీఎంలలో నమోదైన ఓట్లకు, వీవీ ప్యాట్లలో నమోదైన ఓట్లకు మధ్య తేడా ఉండి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తూ 12 బూత్‌లలో వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించాలని బాలినేని ఎన్నికల కమిషన్‌కు డబ్బు కూడా చెల్లించారు. అయితే, ఎన్నికల కమిషన్ మాక్ పోలింగ్ నిర్వహించేందుకు ముందుకు రావడం తప్పించి ఎన్నికల సమయంలో వినియోగించిన వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించేందుకు అంగీకరించలేదు. దీంతో బాలినేని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బాలినేని తరపున న్యాయవాది ఆలపాటి వివేకానంద ఆగస్ట్ 17న వాదనలు వినిపించారు. దీనిపై తాజాగా సోమవారం తీర్పు వెలువడనుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఆఫీస్ ఆర్డర్‌ను పాటిస్తుంటే సమాచార కమిషనర్‌కు జీతమివ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ (ఎస్‌సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషనర్ (ఎస్ఐసీ)ల నెలవారీ హాజరు ఆధారంగా జీతాలు చెల్లించాలన్న ఆఫీస్ ఆర్డర్‌కు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తుంటే, సమాచార కమిషనర్ చావలి సునీల్‌కు సెప్టెంబర్ నుంచి జీత భత్యాలు చెల్లించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని, సమాచార కమిషన్ కార్యదర్శిని, సమాచార ప్రధాన కమిషనర్‌ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తనకు సెప్టెంబర్ నెల నుంచి జీత భత్యాలు నిలిపేసిందని, చట్ట ప్రకారం జీత భత్యాలు చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సమాచార కమిషనర్ చావలి సునీల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ సుజాత ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.



బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

సాక్షి, అమరావతి: నందికొట్కూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ తెలుగు సాయి ఈశ్వరుడు హత్య కేసులో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, చికెన్ బాషా మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులను పరిగణనలోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు సమర్థించింది. మృతుని కుమార్తె తెలుగు జ్యోతి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పులో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చి చెబుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల భుయాన్ ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది.

2014 మార్చిలో జరిగిన సాయి ఈశ్వరుడి హత్యలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన తండ్రి బైరెడ్డి శేషసేనారెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, వీరి అనుచరులు చికెన్ బాషా, బోయ మద్దిలేటి, నాగరాజు తదితరులపై కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విజయవాడలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు విచారణ జరుపుతోంది. తన తండ్రి హత్య విషయంలో సిద్ధార్థ రెడ్డి, చికెన్ బాషాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను పరిగణనలోకి తీసుకుని, సాక్షులను విచారించాలంటూ ఈశ్వరుడి కుమార్తె తెలుగు జ్యోతి దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టేసింది. దీనిపై ఆమె హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు కూడా తిరస్కరించింది. ఈ కేసులో విజయవాడ కోర్టు విచారణను ముగించిందని, తీర్పు వెలువరించడమే మిగిలి ఉందంటూ జ్యోతి పిటిషన్‌ను కొట్టేసింది. దీనిని సవాలు చేస్తూ జ్యోతి సుప్రీంను ఆశ్రయించగా..ధర్మాసనం కొట్టేసింది.

నెల్లూరు కార్పొరేషన్‌లో ఓసీల జారీపై విచారణకు ఆదేశించండి

హైకోర్టులో ఆనం పిల్

సాక్షి, అమరావతి: నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ) పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పలు భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)లు జారీ చేసి, వాటి మార్టగేజ్ డీడ్‌లు విడుదల చేయడంపై విచారణకు ఆదేశించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఎన్ఎంసీ పరిధిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు నివాసయోగ్యమైనవో కావో అన్న విషయాన్ని పరిశీలించకుండానే ఓసీలు జారీ చేశారని, బిల్డర్లకు మార్ట్‌గేజ్ డీడ్‌లు సైతం విడుదల చేశారని పిల్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, ఏసీబీ డీజీ, నెల్లూరు కలెక్టర్, ఎన్ఎంసీ మునిసిపల్ కమిషనర్, ఎస్పీతో పాటు అప్పటి మునిసిపల్ కమిషనర్లు హరిత, వికాస్ మర్మత్, డిప్యూటీ కమిషనర్ చందనను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం వచ్చే నెలలో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,501 మంది స్వామివారిని దర్శించుకోగా 21,203 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఘనంగా లక్ష బిల్వార్చన



పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. ముందుగా స్వామివారికి వేద మంత్రాలతో ప్రదక్షిణ చేసి అనంతరం మహాన్యాసం, రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన, లక్షపత్రి, రుద్రహోమం, కళ్యాణం, పాశుపత పారాయణం, తులసి పూజ, గణపతి పూజ, గరికపూజ, ఏకావహం, ఏక రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం ప్రారంభించిన ఈ పూజా కార్యక్రమాలు సాయంత్రం వరకు కొనసాగాయి.

29న వైద్యమిత్రల మహాధర్నా

నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకాన్ని ప్రభుత్వం ఇన్స్యూరెన్స్ విధానంలోకి మార్పు చేసినా 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్న తమకు క్యాడర్ కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29వ తేదీన మహాధర్నాకు వైద్యమిత్ర (ఆరోగ్య మిత్ర)లు సిద్ధమయ్యారు. తమ సమస్యల పరిష్కారం కోసం కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్న వైద్యమిత్రలు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ×ఇన్స్యూరెన్స్ విధానం ప్రవేశపెడుతున్న క్రమంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యమిత్రలు, టీమ్ లీడర్‌లు, జిల్లా మేనేజర్‌లు, ఇతర సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలి. ఉద్యోగ భద్రతను కల్పించాలి. అంతర్గత ప్రమోషన్లు కల్పించి వేతనాలు పెంచాలి. చనిపోయిన సిబ్బంది కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి. రిటైర్డ్ అయిన సిబ్బందికి రూ.10 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలి.' అని వైద్యమిత్రలు కోరారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వైద్యమిత్ర కంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ నెల 28వ తేదీలోగా తమ డిమాండ్‌ల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే 29న మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్యాలయం ముందు మహాధర్నా చేపడతామని యూనియన్ ప్రెసిడెంట్ గోవిందు తెలిపారు.



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

సంతృప్త స్థాయిలో పథకాల అమలుకు కేంద్రం శ్రీకారం

పది పథకాల అమలుపై గ్రామ పంచాయతీల మధ్య పోటీ

- సమర్థంగా అమలు చేసిన సర్పంచ్‌లు రిపబ్లిక్ డే వేడుకలకు అతిథులు
- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాసిన కేంద్ర డీఏఆర్‌పీజీ డైరెక్టర్

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన పథకాలను గ్రామ పంచాయతీ పరిధిలోనే ప్రజలు సంతృప్త స్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది పథకాలను ఎంపిక చేసింది. వాటిని గ్రామ పంచాయతీ స్థాయిలో శ్యాచురేషన్ (సంతృప్త స్థాయి) విధానంలో 90 శాతం, అంత కంటే ఎక్కువగా వినియోగించుకునేలా దేశవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల మధ్య పోటీతత్వం పెంచి ప్రోత్సహించాలని ఆయా రాష్ట్రాలకు సూచించింది. సంతృప్త స్థాయిలో ఆయా పథకాలను వినియోగించుకున్న గ్రామ పంచాయతీల వివరాలను తమకు పంపాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీఏఆర్‌పీజీ) డైరెక్టర్ రోహిత్ ఆనంద్ పది రోజుల కిందట అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాశారు. పీఎం ముద్ర యోజన, పీఎం విశ్వకర్మ యోజన, హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణం), ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన, మిషన్ ఇంద్రధనస్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ పీఎం–జేఏవై), ప్రధానమంత్రి పోషణ్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీం, ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకాలను సంతప్త స్థాయిలో వినియోగించుకున్న గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను కేంద్రానికి పంపాలని సూచించారు. ఆ వివరాల ప్రకారం సంబంధిత గ్రామ సర్పంచ్‌లను 2025 జనవరి 26న ఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలకు అతిథులుగా ఆహ్వానిస్తామని రోహిత్ ఆనంద్ తెలియజేశారు.



జగన్ పాలనలో సంతృప్తస్థాయిలో...

గతంలో ప్రభుత్వ పథకాలు అంటే పలుకుబడి కలిగినవారికి, పైరవీలు చేసేవారికి మాత్రమే దక్కుతాయనే పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితులను వైఎస్ జగన్ తన పాలనలో పూర్తిగా మార్చివేశారు. కులం, మతం, పార్టీ అనే బేధం చూడకుండా వలంటీర్ల ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అందించారు. ఐదేళ్లు ఎటువంటి పైరవీలు, పక్షపాతం లేకుండా జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు తమ గడప వద్దే అందించారు. జగన్ పాలనలో తరహా సంతృప్త స్థాయిలో పథకాల అమలుపై కేంద్రం దృష్టి పెట్టడం గమనార్హం.

29న తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: తిరుపతిలోని గేట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ తోపాటు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడ్‌ఆఫ్ సంస్థ సంయుక్తంగా జాబ్ మేళా చేపడుతాయని పేర్కొన్నారు. బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్టు వెల్లడించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా కోర్సులు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. వారి విద్యార్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఆ మేరకు సర్టిఫికెట్ల తోపాటు ఆధార్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 8143576866 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

Gold Memories



మనోరంజకం

సత్సంప్రదాయ భారతీయ దాంపత్య జీవన ఔన్నత్యాన్ని, వైశిష్ట్యాన్ని, కుటుంబ విలువల్ని చాటి చెప్పే మనోరంజకమైన సకుటుంబ కథా చిత్రం 'పెళ్లి పుస్తకం'.

రాజేంద్రప్రసాద్ హీరోగా దివ్యవాణి హీరోయిన్‌గా ప్రముఖ దర్శకులు బాపు తీర్చిదిద్దిన ఓ కుటుంబ కావ్యం. బాపు గీత గీసి... ముళ్లపూడి వెంకటరమణ రాత రాసి... శ్రీకారం చుట్టిన 'పెళ్లి పుస్తకం' 1991 ఏప్రిల్ 1న విడుదలై చరిత్ర సృష్టించింది. కొత్తగా పెళ్లి చేసుకున్న కృష్ణ మూర్తి అంటే రాజేంద్రప్రసాద్ ముంబైలోని ఓ సంస్థలో కళా దర్శకుడుగా పని చేస్తుంటాడు. ఇతని భార్య సత్యభామ అంటే దివ్యవాణి కేరళలో స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తుంటుంది. అయితే... తమ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు వీరిద్దరూ కలిసి ఒకే సంస్థలో ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకుంటారు. అలా ఓ పెద్ద సంస్థలో చేరడం కోసం తాము అవివాహితులమని ఆ సంస్థ యజమాని గుమ్మడికి అబద్ధం చెబుతారు. అక్కడ చేరిన తర్వాత వీరు ఎదుర్కొనే సమస్యలే ఈ చిత్రంలోని ప్రధానాంశం.

కడుపుబ్బా నవ్వించిన రచన

కంపెనీ యజమానిగా గుమ్మడి వెంకటేశ్వరరావు నేనూ... అంటూ మాటమాటని కట్ చేసి వెరైటీ స్లాంగ్‌తో మాట్లాడుతుంటే... గుమ్మడి సంస్థలో పని చేసే ఉద్యోగుల చేత బాబాయిగా పిలిపించుకుంటూ... ఈ సినిమాకు కథను అందించిన రావి కొండలరావు బధిర వార్తలు చదువుతున్నట్లు సైగలతో ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించారు. ఇక గిరి పాత్రలో నటించిన శుభలేఖ సుధాకర్ విషయానికొస్తే... గుమ్మడి బావమరిదిగా.. దివ్యవాణిపై మనసు పడి ఆ తర్వాత అక్కతో తన్నులు తినే సన్నివేశాలు లోలోన నవ్వు పుట్టిస్తాయి.


చప్పట్లు కొట్టించిన మాటలు

ఇక సెకండ్ హీరోయిన్‌గా వచ్చిన గుమ్మడి కుమార్తె వసుంధర పాత్రలో నటించిన సింధుజా కూడా హీరో రాజేంద్రప్రసాద్ వెంట పడి అతని భార్య దివ్యవాణి అసూయకు కారణమవుతుంది. కానీ సింధుజాది అంతా నటన అని చివరకు తెలుసుకుంటుంది. అలాగే చిత్రంలోని బ్రహ్మచారి గదులకు భామలే అందం, పెళ్లికి పునాది నమ్మకం, గౌరవం, నవ్వొచ్చినప్పుడు ఎవడైనా నవ్వుతాడు... ఏడుపొచ్చినప్పుడు నవ్వేవాడే హీరో, అసూయ అసలైన ప్రేమకి థర్మామీటర్, నమ్మకం లేని చోట నారాయణా అన్నా బూతులాగే వినిపిస్తుంది... లాంటి డైలాగులు ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించాయి.

ఏ పెళ్లిలోనైనా ఆ పాటే...

పాటలైతే చెప్పనక్కరలేదు.. ఆరుద్ర చేతి నుంచి జాలు వారిన 'శ్రీరస్తూ శుభమస్తూ...' అనే పాట... అప్పటి వరకు తెలుగు లోగిళ్లలోఎక్కడ పెళ్లి బాజా మోగినా వినిపించే 'సీతారాముల కళ్యాణం చూతము రా రండి...' అంటూ సాగే పాటనే పక్కకు నెట్టేసింది. ఇప్పటికీ తెలుగువారి పెళ్లిళ్లలో ఈ పాటే వినిపిస్తుండడం గమనార్హం. మామ కేవీ మహదేవన్ సంగీత దర్శకత్వంలో ట్యూన్ కట్టిన 'అమ్మ కుట్టి అమ్మ కుట్టి మనస్సులాయో...', 'కృష్ణం కలయ సఖి సుందరం...', 'పప్పు దప్పళం అన్నం నెయ్యి...', 'హాయి హాయి శ్రీరంగ సాయి...', 'సరికొత్త చీర ఊహించినాను...' వంటి పాటలు ప్రేక్షక మహాశయులనే కాదు... సంగీత ప్రియులను కూడా ఓలలాడించాయి. పెళ్లికి అర్థాన్నీ, పరమార్థాన్నీ సున్నితంగా, హృద్యంగా అందంగా, రొమాంటిక్‌గా, అన్నింటినీ మించి హాస్యరస భరితంగా చెప్పిన చిత్రం ఈ 'పెళ్లి పుస్తకం'.

- ఇంటూరు హరికృష్ణ



రికార్డు స్థాయిలో రిలీజ్

బాక్సాఫీస్ కొత్త రికార్డులు క్రియేట్ చేసేందుకు పుష్పరాజ్ రెడీ అవుతున్నాడు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. పుష్పరాజ్‌గా ఈ చిత్రంలో అల్లు అర్జున్ టైటిల్ రోల్ చేస్తుండగా, హీరోయిన్ శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో డిసెంబరు 5న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా 11,500ల సిల్వర్‌స్క్రీన్స్‌లో ప్రదర్శితం అయ్యేలా చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. దేశీయంగా 6500 స్క్రీన్స్, విదేశాల్లో 5000 స్క్రీన్స్‌లో 'పుష్ప: ది రూల్' సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టామని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు నార్త్‌లో ఉన్న మరింత క్రేజ్ వల్ల స్క్రీన్స్ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందట. ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమాకు దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇక 2021లో వచ్చిన సూపర్ హిట్ 'పుష్ప: ది రైజ్' సినిమాకు సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



● అల్లు అర్జున్



● పూజా హెగ్డే

శ్రీలీల ఎగ్జిట్... పూజా ఎంట్రీ?

వరుణ్ ధావన్ హీరోగా రమేష్ తురానీ దర్శకత్వంలో 'హే జవానీతో ఇష్క్ హోనా హై' అనే సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా శ్రీలీల నటించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపించింది. కానీ తాజాగా శ్రీలీల ప్లేస్‌లో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటించనున్నారనే టాక్ బీటౌన్‌లో తెరపైకి వచ్చింది. ఇతర సినిమాలతో బిజీగా ఉంటూ ఈ సినిమా షూటింగ్‌కు కాల్షీట్స్ కేటాయించలేని కారణంగా శ్రీలీల ఈ సినిమా నుంచి తప్పుకోవాల్సి వచ్చిందట. ఈ సినిమా షూటింగ్ అనుకున్న సమయాని కన్నా కాస్త ఆలస్యంగా ప్రారంభం కావడంతో శ్రీలీల ఎగ్జిట్ అయ్యారని బాలీవుడ్ భోగట్టా. దాంతో పూజా హెగ్డే ఎంట్రీ అయ్యారట. ఈ ఇద్దరి తారల ఎగ్జిట్... ఎంట్రీ గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది అక్టోబరులో విడుదల చేయాలనుకుంటున్నారు.

ఇరవై రోజులు... రెండు చిత్రాలు

● అజయ్ దేవగన్





బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్ నటించిన రెండు చిత్రాలు ఒకే నెలలో విడుదల కానున్నాయి. హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపొందిన పోలీస్ డ్రామా 'సింగమ్ ఎగైన్' చిత్రం నవంబరు 1న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కరీనా కపూర్ హీరోయిన్‌గా నటించగా, అక్షయ్ కుమార్, రణ్‌బీర్ కపూర్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. మరోవైపు అజయ్ దేవగన్ హీరోగా నటించిన లేటెస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'నామ్'. అనీస్ బాజ్మీ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను నవంబరు 22న రిలీజ్ చేయనున్నట్లుగా శనివారం చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఇలా ఇరవై రోజుల గ్యాప్‌లో అజయ్ దేవగన్ నటించిన రెండు చిత్రాలు విడుదల కానున్నాయి.

నిశ్చితార్థం అయిందనుకున్నారు



● ప్రియాంకా అరుళ్ మోహన్, 'జయం' రవి

"నటుడు 'జయం' రవి, నేను కలిసి 'బ్రదర్' సినిమాలో నటించాం. ఆ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా మేమిద్దరం ఉన్న ఫొటోని విడుదల చేశారు మేకర్స్. అయితే ఆ ఫొటోలో మేమిద్దరం మెడలో పూల దండలు వేసుకుని ఉండటంతో మాకు నిజంగా నిశ్చితార్థం అయిందనుకున్నారు" అని హీరోయిన్ ప్రియాంకా అరుళ్ మోహన్ అన్నారు. ఎం. రాజేష్ దర్శకత్వంలో 'జయం' రవి, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటించిన తమిళ చిత్రం 'బ్రదర్'. ఈ నెల 31న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంకా అరుళ్ మోహన్ ఇక్కడున్న ఫొటోని ఉద్దేశించి స్పందించారు. "'బ్రదర్' ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం విడుదల చేసిన ఫొటోలో 'జయం' రవి, నేను మెడలో పూల దండలు వేసుకుని ఉండటంతో నెట్టింట వైరల్‌గా మారింది. అది చూసి చాలా మంది మాకు ఎంగేజ్‌మెంట్ అయిందనుకున్నారు. షూటింగ్‌తో నేను బిజీగా ఉండటంతో ఆ విషయం నా దృష్టికి రాలేదు. తెలుగు ఇండస్ట్రీలోని నా స్నేహితులు కొందరు నాకు ఫోన్ చేసి అభినందనలు చెప్పడంతో నాకు విషయం అర్థం కాలేదు. పూర్తి విషయం తెలుసుకున్న తర్వాత ఆ ఫొటో 'బ్రదర్' సినిమాలోని స్టిల్ మాత్రమేనని చెప్పాను. ప్రమోషన్స్ కోసం యూనిట్ వేరే ఫొటో ఏదైనా రిలీజ్ చేసి ఉండొచ్చు కదా! అని టీమ్‌ను తిట్టుకున్నా. ఈ సంఘటన నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని ప్రియాంకా అరుళ్ మోహన్ తెలిపారు. ఇదిలా ఉంటే తన భార్య ఆర్తితో విడిపోతున్నట్లు ఇటీవల 'జయం' రవి ప్రకటించిన సంగతి తెలిసిందే. అలా ఆయన ప్రకటించిన కొద్ది రోజులకే ప్రియాంక, రవి కలిసి మెడలో పూలదండలతో ఉన్న ఫొటో బయటికి వచ్చింది. దీంతో వారికి నిశ్చితార్థం జరిగిందంటూ ఇటీవల పలు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ వార్తలపైనే తాజాగా ప్రియాంకా అరుళ్ మోహన్ స్పష్టత ఇచ్చారు.



● ప్రియాంకా అరుళ్ మోహన్

బిగ్ బాస్ ఆలోచించు

చాలా ఏళ్ల క్రితం తెలుగు శాటిలైట్ టెలివిజన్ చరిత్రలో ఓ వార్తా ఛానల్ వచ్చింది. అందరి కంటే తాము విభిన్నంగా కనిపించాలని వాళ్లు ఓ వినూత్న ప్రయోగం చేశారు. ఆ ప్రయోగం వల్ల వాళ్లు లబ్ధి కూడా పొందారు. అదెలాగంటారా... అప్పట్లో ఒక రోజు అన్ని ఛానళ్ళలో ఓ వార్త ఇలా ఉంది.... ఫలానా మంత్రి ఫలానా చోట నడుచుకుంటూ వచ్చారు. కానీ ఈ కొత్త ఛానల్ వాళ్ళు ఇచ్చిన వార్త ఏంటంటే.... ఫలానా మంత్రి ఫలానా చోట నడుచుకుంటూ తడబడ్డారు. ఇంకేముంది వార్తను చూడనివాళ్లు కూడా ఆ ఛానల్‌ను ఎగబడి చూశారు. దాంతో ఆ ఛానల్ వాళ్లు దానినే వాళ్ల సంప్రదాయంగా పెట్టుకుని తమ ఛానల్‌ని లాభాల బాట పట్టిస్తున్నారు. ఎప్పుడైనా రోడ్డులో ఏదైనా మూల ఓ గొడవ జరిగితే ఆగి చూసే కుతూహలం ఉన్న మన సమాజం దాన్ని ఆపే ప్రయత్నం ఏ మాత్రం చేయదు సరికదా ఇంకా ఏం జరుగుతుందో అని వేచి చూసే మనస్తత్వం మన ప్రస్తుత సమాజానిది. సరిగ్గా దీన్నే మంత్రంగా మలచుకొని బిగ్ బాస్ కార్యక్రమం రూపకల్పన జరిగిందని చెప్పవచ్చు. అందుకే బిగ్ బాస్ హౌస్‌లో ఎంత రచ్చ జరిగితే అంత వీక్షకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దానికి నిదర్శనమే ఈ వారం బిగ్ బాస్ సెల్ఫ్ ఎలిమినేషన్. మణికంఠ అనే కంటెస్టెంట్ వీక్షకుల దృష్టిలో ఇంకా హౌస్‌లోనే ఉండాలి అని ఓటేస్తే, నాకు ఈ హౌస్ వద్దు, టార్చర్ అంతకన్నా వద్దు అని తానే సెల్ఫ్ నామినేట్ చేసుకున్నాడు. అర కొర బట్టలతో, అసభ్య పద ధూషణలతో ప్రతిరోజు చూసే ప్రేక్షకుడికి కనువిందు చేస్తూ లోపల ఉన్న కంటెస్టెంట్స్ తమలో తాము మదనపడుతూ ఈ కార్యక్రమంలో కొనసాగుతున్నారంటే వారికి నిజంగా హ్యాట్సాఫ్. అలా అని బిగ్ బాస్ కార్యక్రమం మొత్తమ్మీద చెడు అనట్లేదు, మన పండగల్లో భాగంగా మన సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ కంటెస్టెంట్స్‌తో పండగ ఆచారాలను ప్రేక్షకులకు తెలియజేసేలా చేస్తున్నారు. ముమ్ముందు ఇంకెన్ని సంచలనాలకు తెర తీయనుందో ఈ బిగ్ బాస్ విపరీత వినోద వ్యాపారం వేచి చూడాలి. ఏదేమైనా చెడు గ్రహించినంతగా మంచిని చూడలేని ఈ సమాజానికి ఇంతటి భావావేశాలు అవసరమా బిగ్ బాస్ ఆలోచించు.

అమ్మాయి ఔనంది ఏకంగా...

ప్రియదర్శి పులికొండ, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ చిత్రం డిసెంబరు 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సారంగో సారంగా' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వివేక్ సాగర్ సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను అర్మాన్ మాలిక్ పాడారు. "ఉల్లా ఉల్లా ఉల్లా ఉల్లాస కల్లోలం... గల్లా గల్లా గంతులాడింది భూగోళం... సంబరం నీలాంబరం... మేఘాల అంచుల్లో నించో బెట్టిందే... మెళ్ళోన దండేసి ఛత్రం పట్టిందే... సారంగో సారంగా... అమ్మాయి ఔనంది ఏకంగా... సారంగో సారంగా ఆనందాలందుకో అనేకంగా..." అంటూ సాగుతుందీ పాట. ఈ పాట గురించి దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ– "ఈ సినిమా కథానాయకుడు ప్రియదర్శి పేరు సారంగపాణి. అతని ప్రేమకథ నేపథ్యంలో వచ్చే పాట ఇది. హైదరాబాద్‌లోని విభిన్న ప్రదేశాల్లో ప్రియదర్శి, రూపా కొడువాయూర్‌లపై ఈ పాటను వినూత్నంగా చిత్రీకరించాం" అన్నారు.



● ప్రియదర్శి, రూప



"పెళ్లి అనేది నా వ్యక్తిగత విషయం. నేను పెళ్లెందుకు చేసుకోవడం లేదని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు" అంటున్నారు హీరోయిన్ నిత్యా మీనన్. అందం, అభినయంతో ప్రేక్షకుల్లో తనకంటూ ఎంతో గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ మలయాళ బ్యూటీ. ఇక ఓ మలయాళ స్టార్ హీరోను నిత్యా మీనన్ పెళ్లి చేసుకోనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా నెట్టింట హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్యా మీనన్ పెళ్లి వార్తలపై స్పందిస్తూ, స్పష్టత ఇచ్చారు. "నా వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన జీవితంపై ఎవరూ నాపై ఆధిపత్యం

ఆ అధికారం ఎవరికీ లేదు

- నిత్యా మీనన్

చేయడం నాకు నచ్చదు. నాకు నచ్చినట్లు నేను జీవిస్తాను. నేను పెళ్లెందుకు చేసుకోవడం లేదని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు. ఆ విషయంలో నన్ను ప్రశ్నిస్తే ఒప్పుకోను. అదే విధంగా నాపై వచ్చే పుకార్లు గురించి అస్సలు పట్టించుకోను. ఓ మలయాళ హీరోను నేను పెళ్లి చేసుకోబోతున్నాననే వార్తలు అవాస్తవం. అలాంటి వాటిని బాగా ప్రచారం చేస్తున్నారు. నేను ఎవర్ని పెళ్లి చేసుకోవాలి? ఎప్పుడు చేసుకోవాలి? అనేది నా ఇష్టం. అంతేగానీ ఎవరో రాస్తే చేసుకుంటానా? నా తల్లిదండ్రులు నాకు ఇచ్చిన స్వేచ్ఛను ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయను. నా పరిధిలో నేను జీవితాన్ని ఆస్వాదిస్తుంటా" అని నిత్యామీనన్ తెలిపారు.

బిజినెస్ రీల్

కార్పొరేట్లకు ఐటీఆర్ ఫైలింగ్ గడువు పొడిగింపు



న్యూఢిల్లీ: 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరానికి కార్పొరేట్లకు ఐటీఆర్ ఫైలింగ్ గడువును నవంబర్ 15 వరకు పొడిగిస్తూ ఆదాయపు పన్ను శాఖ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి అక్టోబర్ 31 గడువు తేది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ 15 రోజులు పొడిగిస్తూ శనివారం సర్క్యులర్ జారీ చేసింది.

ఎల్అండ్‌టీ చేతికి భారీ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ: మౌలిక రంగ నిర్మాణ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) తాజాగా ఐటీఈఆర్ నుంచి భారీ ప్రాజెక్టును దక్కించుకున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ఇందులో భాగంగా ఫ్రాన్స్‌లో ఐటీఈఆర్‌కు చెందిన న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రాజెక్టు వద్ద కీలక, ఆధునిక వెల్డింగ్ సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ఆర్డర్ విలువ రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల మధ్య ఉంటుంది.

ప్యూర్ ఈవీ వాహనాలపై రూ. 20 వేల డిస్కౌంటు

PURE

ముంబై: పండుగ సీజన్ సందర్భంగా ఎలక్ట్రిక్ టూ–వీలర్ల సంస్థ ప్యూర్ ఈవీ తమ రెండు మోడల్స్‌పై రూ. 20,000 డిస్కౌంటు ప్రకటించింది. ఎకోడ్రిఫ్ట్, ఈట్రిస్ట్ ఎక్స్ మోటార్‌సైకిల్స్‌పై ఇది వర్తిస్తుంది. దీనితో ప్రారంభ ధర రూ. 99,999కి తగ్గినట్లవుతుంది. నవంబర్ 10 వరకు ఈ ఆఫర్ ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు డి. నిశాంత్ తెలిపారు. రోజువారీ వినియోగం కోసం ఎకోడ్రిఫ్ట్, శక్తివంతమైన రైడింగ్ అనుభూతి కోరుకునే వారి కోసం ఈట్రిస్ట్ ఎక్స్ (171 కి.మీ. రేంజి) అనువుగా ఉంటాయని వివరించారు.

ద్వితీయ శ్రేణి నగరాలపై క్రెడిట్‌బీ దృష్టి

KreditBee

బెంగళూరు: ఆన్‌లైన్ క్రెడిట్ సేవల సంస్థ క్రెడిట్‌బీ.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కార్యకలాపాల విస్తరణపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందుకోసం వ్యాపార రుణాలు, హోమ్ ఇంప్రూవ్‌మెంట్, ద్విచక్ర వాహన రుణాలు మొదలైన వాటిపై ఆఫర్లు అందిస్తున్నట్లు సంస్థ సీఈవో ఇ. మధుసూదన్ తెలిపారు. ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు లక్ష్యంగా వివిధ రకాల రుణాలతో పాటు డిజిటల్ గోల్డ్, క్రెడిట్ రిపోర్ట్ సర్వీసులు మొదలైనవి అందిస్తున్నట్లు వివరించారు. తమకు మొత్తం 17.1 కోట్ల మంది యూజర్లు ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో 75 లక్షల మంది లోన్ కస్టమర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నవంబర్ 1నుంచి కొత్త రూల్స్

మ్యూచువల్ ఫండ్స్‌కు సెబీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: వచ్చే నెల (నవంబర్) 1 నుంచి మ్యూచువల్ ఫండ్స్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిన నూతన మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) ఒక పాన్ ద్వారా యూనిట్లలో రూ. 15 లక్షలకు మించి చేపట్టే అన్ని లావాదేవీలు రెండు రోజుల్లోగా కంప్లయెన్స్ అధికారికి వెల్లడించవలసి ఉంటుంది. సంబంధిత అధికారులు, ట్రస్టీలు లేదా సంబంధిత వ్యక్తులు ఆయా లావాదేవీల వివరాలను రెండు పనిదినాల్లోగా తెలియజేయవలసి ఉంటుంది. ఒక త్రైమాసికంలో సింగిల్ లేదా అనేక లావాదేవీల ద్వారా రూ. 15 లక్షల విలువ ట్రాన్సాక్షన్ జరిగితే.. మినహాయింపులో ఉన్న వికాకుండా అన్ని పథకాలకూ తాజా నిబంధనలు వర్తించనున్నట్లు సెబీ ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. వచ్చే నెల నుంచి ఏఎంసీలు త్రైమాసికవారీగా సంబంధిత అధికారులు, ట్రస్టీలు, సమీప బంధువుల హోల్డింగ్స్ వివరాలను వెల్లడించవలసి ఉంటుంది. అక్టోబర్ 31కల్లా కలిగి ఉన్న హోల్డింగ్స్‌ను నవంబర్ 15కల్లా వెల్లడించవలసి ఉంటుంది. ఆపై ప్రతీ త్రైమాసికం తదుపరి 10 రోజుల్లోగా వీటి వివరాలు దాఖలు పరచాలని సెబీ తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-10-2024	
విశాఖ	540-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

అంచనాలను మించిన ఐసీఐసీఐ బ్యాంక్

క్యూ2 నికర లాభం రూ.11,746 కోట్లు ● మెరుగైన ఆస్తుల నాణ్యత

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంకు, సెప్టెంబర్ త్రైమాసికంలో అంచనాలను మించి రాణించింది. కంపెనీ నికర లాభం స్టాండలోన్ ప్రాతిపదికన రూ.11,746 కోట్లుగా నమోదైంది. 2023–24 ఇదే త్రైమాసిక లాభం రూ.10,261 కోట్లతో పోలిస్తే 14.5% అధికం. మొత్తం ఆదాయం రూ.40,697 కోట్ల నుంచి 17% పెరిగి రూ.47,714 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.34,920 కోట్ల నుంచి రూ.40,537 కోట్లకు పెరిగింది. దేశీయ రుణాలు పెరగడంతో నికర వడ్డీ ఆదాయం 9.5% వృద్ధి చెంది రూ.20,048 కోట్లకు చేరుకుంది. అయితే నికర వడ్డీ మార్జిన్ 4.53% శాతం నుంచి 4.27 శాతానికి తగ్గింది. ఫీజు ఆదాయ వృద్ధి కారణంగా వడ్డీయేతర ఆదాయం(11% పెరిగి రూ.5,861 కోట్ల నుంచి రూ.6,496 కోట్లకు చేరింది. బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 16.66 శాతంగా నమోదైంది.

జూలై– సెప్టెంబర్‌లో బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైంది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏలు) 2.48 శాతం నుంచి 1.97 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.42% నుంచి 0.43 శాతానికి చేరాయి. ప్రొవిజన్లు(కేటాయింపులు) రూ.1,233 కోట్లకు చేరుకున్నాయి. గత క్వార్టర్ కేటాయింపులు రూ.583 కోట్లతో పోలిస్తే రెట్టింపు అయ్యాయి. ప్రొవిజన్ కవరేజ్



రేషియో(పీసీఆర్) 78.5 శాతంగా ఉంది.

రుణాల విషయానికొస్తే.., దేశీయ రుణాలు 15.7%, రిటైల్ రుణాలు 14.2%, బిజినెస్ బ్యాంకింగ్ 30%, కార్పొరేట్ రుణాలు 11.2 శాతం మేర పెరిగాయి. సమస్యాత్మక వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల రుణాల్లో తగ్గుదల ఉంది. ద్విచక్ర వాహన రుణాలు 32.4% తగ్గుముఖం పట్టాయి.

- డిపాజిట్ల వృద్ధి 15.7% పెరిగి రూ.14,28,095 కోట్లుగా నమోదయ్యాయి. కరెంట్ ఖాతా, పొదుపు ఖాతా(కాసా) నిష్పత్తి 38.9% గా ఉంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కొత్తగా 90 శాఖలు ప్రారంభించడంతో మొత్తం బ్రాంచుల సంఖ్య 6,613కు చేరింది. ఏటీఎంలు, క్యాష్ రీసైక్లింగ్ మెషీన్ల సంఖ్య 16,120 గా ఉంది.
- బ్యాంకు అనుబంధ సంస్థల్లో జీవిత బీమా విభాగం లాభం రూ.252 కోట్లు పెరిగింది. సాధారణ బీమా విభాగ లాభం 20% పెరిగి రూ.694 కోట్లకు చేరింది. ఆస్తుల నిర్వహణ విభాగం లాభం రూ.691 కోట్లకు చేరింది.

యస్ బ్యాంక్ నికర లాభం రూ.567 కోట్లు

ముంబై: ప్రైవేటు రంగ యస్ బ్యాంకు సెప్టెంబరు త్రైమాసికంలో రూ.567 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్ లాభం రూ.228.64 కోట్లతో పోలిస్తే ఇది 147 శాతం అధికం. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గడంతో ఇది సాధ్యమైందని బ్యాంకు తెలిపింది. నికర వడ్డీ ఆదాయం 14.3% పెరిగి రూ.2,200 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 2.4 శాతంగా నమోదయ్యాయి. మొత్తం రుణాలు 12.4% వృద్ధిని సాధించాయి. వడ్డీయేతర ఆదాయం 16.3% పెరిగి రూ.1,407 కోట్లకు చేరింది. డిపాజిట్ల వృద్ధి 18%



పెరిగి రూ.2.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2% నుంచి 1.6 శాతానికి మెరుగుపడింది. కేటాయింపులు 40% తగ్గి రూ.297 కోట్లకు పరిమితయ్యాయి. బ్యాంకు కనీస మూలధన నిష్పత్తి 16.1 శాతంగా నమోదైంది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ల వృద్ధి 17–18%, అడ్వాన్సులు 13–14% లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ సెప్టెంబర్ క్వార్టర్‌లో కొత్తగా 1,000 మందికి పైగా ఉద్యోగులను నియమించుకోవడం ద్వారా మొత్తం సిబ్బంది సంఖ్య 29,000లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ప్రథమార్థంలో 18 కొత్త బ్రాంచులను ప్రారంభించాం. ద్వితీయార్థంలోనూ అంతే సంఖ్యలో శాఖలను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాం'' అని యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

టీవీఎస్.. ఎలక్ట్రిక్ రైడ్

- త్వరలో ఈ–త్రీవీలర్స్ విభాగంలోకి
- మార్చికల్లా మరో ఈ–టూ వీలర్

TVS

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ విభాగంలో సుస్థిర స్థానం దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ త్రీ–వీలర్స్ సెగ్మెంట్లోకి ఈ ఏడాదే ఎంట్రీ ఇస్తోంది. కంపెనీ ఇప్పటికే పెట్రోల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీతో నడిచే మూడు రకాల ప్యాసింజర్, ఒక కార్గో రకం త్రిచక్ర వాహనాలను కింగ్ పేరుతో పలు వేరియంట్లలో విక్రయిస్తోంది. భారత త్రిచక్ర వాహన విపణిలో సెప్టెంబర్‌లో అన్ని కంపెనీలవి కలిపి 1,06,524 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2,009 యూనిట్ల విక్రయాలతో టీవీఎస్ వాటా 1.89 శాతం నమోదైంది. 2023 సెప్టెంబర్‌లో ఇది 1.34 శాతంగా ఉంది.

మూడవ ఈ–టూ వీలర్..

సంస్థ నుంచి మూడవ ఈ–టూ వీలర్ మోడల్‌ను మార్చికల్లా ప్రవేశపెట్టనున్నట్టు టీవీఎస్ ప్రకటించింది. 2024 ఆగస్ట్ వరకు ఈ–టూ వీలర్స్ అమ్మకాల్లో భారత్‌లో రెండవ స్థానంలో కొనసాగిన టీవీఎస్ మోటార్.. సెప్టెంబర్‌లో మూడవ స్థానానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అర్థ భాగంలో కంపెనీ నుంచి దేశవ్యాప్తంగా 1.27 లక్షల యూనిట్ల ఈ–స్కూటర్స్ రోడ్డెక్కాయి. 2023 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య ఈ సంఖ్య 96,191 యూనిట్లు నమోదైంది. దీర్ఘకాలంలో ఆదాయాన్ని పెంచుకోవడానికి కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల వ్యాపారం, సాంకేతికతలలో పెట్టుబడులు, రిటైల్ విస్తరణపై దృష్టిసారించింది. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకే అత్యంత ప్రాధాన్యత ఉంటుందని టీవీఎస్ యాజమాన్యం ఇప్పటికే పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,200–1,400 కోట్ల మూలధన వ్యయం చేయాలని టీవీఎస్ నిర్ణయించింది. ఇందులో 70 శాతం ఈవీ, ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) విభాగాలలో నూతన ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అభివృద్ధికి, అలాగే డిజిటల్ సామర్థ్యాలను నిర్మించడానికి ఖర్చు చేస్తారు.

ఇవీ ప్రస్తుత ఈ–టూ వీలర్ మోడళ్లు..

ప్రస్తుతం కంపెనీ ఖాతాలో రెండు ఎలక్ట్రిక్ స్కూటర్స్ ఉన్నాయి. టీవీఎస్ ఎక్స్ మోడల్ ఈ–స్కూటర్‌ను రూ.2,49,990 ఎక్స్‌షోరూం ధరలో విక్రయిస్తోంది. ఒకసారి చార్జింగ్‌తో ఇది 140 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 105 కిలోమీటర్లు. గంటకు 40 కిలోమీటర్ల వేగాన్ని 2.6 సెకన్లలో అందుకుంటుంది. అలాగే టీవీఎస్ ఐక్యూబ్ ఈ–స్కూటర్‌ను రూ.89,999 నుంచి రూ.1,85,373 వరకు ధరల శ్రేణిలో విక్రయిస్తోంది. వేరియంట్‌నుబట్టి ఒకసారి చార్జింగ్‌తో 75–150 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది.

2 ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో పారస్ హెల్త్‌కేర్
- నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్
- జారో ఎడ్యుకేషన్ ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రెండు కంపెనీలను అనుమతించింది. ఈ జాబితాలో ఆరోగ్య బీమా సేవలందించే నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఆరోగ్య పరిరక్షణ సర్వీసుల సంస్థ పారస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఉన్నాయి. నివా బూపా జులైలోనూ, పారస్ హెల్త్ ఆగస్ట్‌లోనూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం.

ఆసుపత్రుల సంస్థ

పారస్ హెల్త్ బ్రాండుతో ఆసుపత్రుల చైన్‌ను నిర్వహిస్తున్న పారస్ హెల్త్‌కేర్ ఐపీవోలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.5 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత వాటాదారు సంస్థ ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, అనుబంధ సంస్థలు పారస్ హెల్త్‌కేర్(రాంచీ) ప్రయివేట్, ప్లస్ మెడికేర్ హాస్పిటల్స్ ప్రయివేట్‌లో పెట్టుబడులకు(రుణ చెల్లింపులు) వెచ్చించనుంది. హర్యానా, బీహార్, యూపీ, రాజస్తాన్, జేఅండ్‌కేలలో సంస్థ పారస్ హెల్త్ పేరుతో 8 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. మొత్తం 2,135 పడకలతో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.




రూ. 3,000 కోట్లపై కన్ను

గతంలో మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీగా సేవలందించిన నివా బూపా ఐపీవోలో భాగంగా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 2,200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్ విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 3,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ప్రస్తుతం కంపెనీలో యూకే దిగ్గజం బూపా(సింగపూర్ హోల్డింగ్స్) 62.27 శాతం వాటాను కలిగి ఉంది. ఫెటిల్ టోన్ ఎల్ఎల్‌పీకు 27.86 శాతం వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 625 కోట్లు మూలధన పటిష్ఠతకు వినియోగించనుంది. స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ తదుపరి రెండో స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరర్‌గా బూపా నివా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానుంది.



ఐపీవో బాటలో జారో

విద్యా రంగ సంస్థ జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(జారో ఎడ్యుకేషన్) పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 170 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం ప్రమోటర్లకు కంపెనీలో 85 శాతానికిపైగా వాటా ఉంది. ఐపీవో నిధుల్లో రూ. 81 కోట్లు బ్రాండ్ విస్తరణకు, రూ. 48 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది.



ఇన్‌ఫ్రా, పెట్టుబడులపై ఫోకస్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



వాషింగ్టన్: 2047 నాటికి భారత్‌ను సంపన్న దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి పెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇందులో ఇన్‌ఫ్రా, పెట్టుబడులు, నవకల్పనలు, సమ్మిళితత్వం ఉన్నట్లు పెన్సిల్వేనియా యూనివర్సిటీ విద్యార్థులకు వివరించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సమావేశాల కోసం అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంగా ఆమె వర్సిటీని సందర్శించారు. '2047లో భారత్ వందేళ్ల స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకుంటుంది. అప్పటికల్లా సంపన్న దేశంగా ఎదగాలన్నది భారత్ ఆకాంక్ష. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం నాలుగు అంశాలపై దృష్టి పెడుతోంది' అని సీతారామన్ పేర్కొన్నారు. వంతెనలు, పోర్టులు, డిజిటల్ తదితర మౌలిక సదుపాయాల కల్పన కీలకమని, అలాగే వాటిపై పెట్టుబడులు పెట్టడం కూడా ముఖ్యమని ఆమె తెలిపారు. భారత్‌కే పరిమితమైన సమస్యల పరిష్కారానికి వినూత్న ఆవిష్కరణలు అవసరమన్నారు. ఇక ప్రతి విషయంలోనూ అందరూ భాగస్వాములయ్యేలా సమ్మిళితత్వాన్ని సాధించడం కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు.

విదేశాల నుంచి కూడా స్విగ్గీలో ఆర్డర్లు

ఇంటర్నేషనల్ లాగిన్ ఫీచర్ ప్రారంభించిన కంపెనీ

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసిస్తున్న వారు భారత్‌లో తమ వారి కోసం ఫుడ్ ఆర్డర్ చేసేందుకు వీలుగా స్విగ్గీ కొత్త ఫీచర్‌ను ఆవిష్కరించింది. 'ఇంటర్నేషనల్ లాగిన్'ను ప్రవేశపెట్టింది. అమెరికా, కెనడా, జర్మనీ, బ్రిటన్, కెనడా తదితర దేశాల్లో నివసిస్తున వారికి ఇది అందుబాటులో ఉంటుంది. అంతర్జాతీయ యూజర్లు ఇక్కడి వారి కోసం ఫుడ్ ఆర్డర్ చేసేందుకు, స్విగ్గీలో భాగమైన క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం ఇన్‌స్టామార్ట్‌లో షాపింగ్ చేసేందుకు, డైన్ అవుట్ ద్వారా హోటల్స్‌లో టేబుల్స్‌ను బుక్ చేసుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులు లేదా అందుబాటులో ఉన్న యూపీఐ ఆప్షన్ల ద్వారా చెల్లించవచ్చని స్విగ్గీ సహ వ్యవస్థాపకుడు ఫణి కిషన్ తెలిపారు.



బీమా విస్తరణకు టెల్కోల సాయం

ఈ-కామర్స్, ఫిన్‌టెక్‌ల నుంచి కూడా...ఎల్ఐసీ సీఈవో సిద్ధార్థ సూచన


ముంబై: దేశంలో బీమాను అందరికీ చేర్చేందుకు టెలికం, ఈ–కామర్స్, ఫిన్‌టెక్ కంపెనీలతో భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ సీఈవో, ఎండీ సిద్ధార్థ మొహంతి అన్నారు. 'ఏజెంట్లు, బ్రోకర్లు, బ్యాంక్–ఇన్సూరెన్స్‌తో సహా ప్రస్తుత ఛానెల్‌లు ప్రభావవంతంగా ఉన్నాయి. విస్తారమైన, మారుమూల గ్రామీణ మార్కెట్‌కు బీమాను విస్తరించడానికి ప్రస్తుతం అమలు చేస్తున్న విధానంలో పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తులో సంప్రదాయేతర విధానాలను అమలు పర్చాల్సిందే. అందరికీ బీమాను చేర్చాలంటే పంపిణీ, మార్కెటింగ్ అంశాలను పునరాలోచించాలి. టెలికం, ఈ–కామర్స్, ఫిన్‌టెక్ వంటి సంప్రదాయేతర కంపెనీల సహకారంతోనే బీమా పాలసీలను పెద్ద ఎత్తున జారీ చేసేందుకు వీలవుతుంది. ఈ సంస్థలు దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకూ విస్తరించాయి. వీటితో భాగస్వామ్యం చేయడం ద్వారా సరసమైన, అందుబాటులో ఉండే కవరేజ్ అందరికీ లభిస్తుంది. కొత్త విధానాన్ని అనుసరించడం వల్ల వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చడానికి బీమా సంస్థలు పెద్ద ఎత్తున ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తాయి. 100 కోట్ల మందికిపైగా బీమా చేర్చడం అంత సులువు కాదు. గ్రామీణ, తక్కువ–ఆదాయ వర్గాలను చేరుకోవడానికి డిజిటల్ టెక్నాలజీ కీలకం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ వంటి సాంకేతికతలు, ప్లాట్‌ఫామ్‌లు మొత్తం బీమా రంగాన్ని విప్లవాత్మకంగా, మరింత కస్టమర్–ఫ్రెండ్లీగా మారుస్తున్నాయి' అని సీఐఐ సదస్సులో వివరించారు.



బీమాలోకి మరిన్ని కంపెనీలు రావాలి

ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ పాండా

ముంబై: ఇన్సూరెన్స్‌లో ఎదిగేందుకు గణనీయంగా అవకాశాలున్న నేపథ్యంలో మరిన్ని దిగ్గజ సంస్థలు ఈ రంగంలోకి రావాలని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేబశీష్ పాండా సూచించారు. కొత్త సంస్థలు మార్కెట్లో ప్రవేశించేందుకు వీలుగా నిబంధనలను కూడా సరళతరం చేశామని సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. ''మేమైతే అనుమతుల ప్రక్రియను వేగవంతం చేశాం. కంపెనీలే మరింత సమయం కోరుతున్నాయి'' అని ఆయన వ్యాఖ్యానించారు. కన్సాలిడేషన్ కన్నా మార్కెట్లో మరిన్ని సంస్థలు వచ్చేలా చూసేందుకే ఐఆర్‌డీఏఐ ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. భారత బీమా రంగంలో అవకాశాలను గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించేందుకు ఇటీవలే జపాన్, యూరప్, అమెరికాలో రోడ్‌షోలు నిర్వహించామని వెల్లడించారు. మరోవైపు, స్టాక్ మార్కెట్లలో లిస్టయ్యేలా మరిన్ని సంస్థలను ఐఆర్‌డీఏఐ ప్రోత్సహిస్తోందని పాండా చెప్పారు. దీనితో పారదర్శకత పెరుగుతుందని, అంతిమంగా షేర్‌హోల్డర్లు అలాగే పరిశ్రమకు ప్రయోజనం చేకూరగలదని పేర్కొన్నారు. దేశీయంగా 140 కోట్ల మంది పైగా జనాభా ఉన్న నేపథ్యంలో మొత్తం బీమా సంస్థలు డెబ్బైకి పైగా ఉన్నా .. ఇంకా వ్యాపార అవకాశాలు ఎక్కువే ఉన్నాయని పాండా చెప్పారు. జీఎస్‌టీ తగ్గింపు వార్తలపై నేరుగా ఎటువంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ బీమా పాలసీలు అందరికీ అందుబాటు స్థాయిలో ఉండేలా చూడాలనేదే ఐఆర్‌డీఏఐ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, పన్నుల తగ్గింపు ఒక్కటే దీనికి పరిష్కారం కాదని తెలిపారు.



బీఎఫ్‌ఎస్ఐలో జోరుగా నియామకాలు

- రుణాలకు పెరుగుతున్న డిమాండ్ కారణం
- టీమ్‌లీజ్ నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పండుగ సీజన్ నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలు, కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. గడిచిన నాలుగు నెలలుగా వ్యక్తిగత రుణాలతో పాటు టూవీలర్లు, కార్లు మొదలైన వాహన రుణాలకు డిమాండు 12 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో వినాయక చవితితో మొదలై నవంబర్ వరకు కొనసాగే పండుగల సీజన్‌లో కార్యకలాపాలను సమర్థమంతంగా నిర్వహించుకునేందుకు బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) సంస్థలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. ఆర్థిక సంస్థలు ఈ బిజీ వ్యవధిలో కస్టమర్లకు మెరుగైన సర్వీసులు అందించగలిగే, డిజిటల్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించగలిగే నైపుణ్యాలున్న సిబ్బందిని రిక్రూట్ చేసుకుంటున్నాయి. స్టాఫింగ్ సేవల సంస్థ టీమ్‌లీజ్ నివేదిక ప్రకారం బీఎఫ్ఎస్ఐ రంగంలో రిటైల్ రుణాలు, సూక్ష్మ రుణాల సంస్థలు (ఎంఎఫ్ఐ), పేమెంట్ సేవల విభాగాల్లో భారీగా ఉద్యోగావకాశాలు ఉంటున్నాయి. పండుగ సీజన్ దన్నుతో జూలై–నవంబర్ మధ్య కాలంలో ఈ విభాగాల్లో కొలువులు సంఖ్య 12,000 నుంచి 19,000కు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ పేర్కొంది. అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి తేవడం, చిన్న మొత్తాల్లో రుణాలివ్వడంపై మైక్రోఫైనాన్స్ ప్రధానంగా దృష్టి పెడుతుండటంతో ఎంఎఫ్ఐ సర్వీసులకు డిమాండ్ 25 శాతం పెరుగుతుందని తెలిపింది. అలాగే, పేమెంట్ సర్వీసుల్లో హైరింగ్ 41 శాతం పెరుగుతుందని, క్రెడిట్ కార్డుల విభాగంలో జాబ్ ఓపెనింగ్స్ 32 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ వివరించింది.



కొత్త నైపుణ్యాల్లో సిబ్బందికి శిక్షణ ..

ఆర్థిక సేవల సంస్థలు కేవలం సిబ్బంది సంఖ్యను పెంచుకోవడమే కాకుండా బిజీ సీజన్‌లో మార్కెట్ డిమాండ్‌కి తగ్గ సేవలందించేలా ప్రస్తుత ఉద్యోగులకు కూడా కొత్త నైపుణ్యాల్లో శిక్షణనివ్వడంపైనా దృష్టి పెడుతున్నాయి. ''ఎప్పుడైనా సరే పండుగ సీజన్‌లో బీఎఫ్ఎస్ఐపై అధిక ఒత్తిడి ఉంటుంది. అయితే, ఈ ఏడాది నిపుణులైన ఉద్యోగులకు డిమాండ్ అసాధారణంగా పెరిగింది. రిటైల్ రుణాల నుంచి పేమెంట్ సేవల వరకు ఈ పరిశ్రమలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మా డేటా ప్రకారం కంపెనీలు కూడా పరిస్థితులకు తగ్గట్లే స్పందిస్తున్నాయి. కీలకమైన ఈ సీజన్‌లో నిరంతరాయ సేవలు అందించేందుకు సిబ్బందిని పెంచుకుంటున్నాయి. అలాగే ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడంపై దృష్టి పెడుతున్నాయి'' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ వీపీ కృష్ణేందు చటర్జీ తెలిపారు.

సాక్షి ప్లస్
ఆదివారం 27-10-2024

సిరీస్‌పై భారత మహిళల గురి



నేడు న్యూజిలాండ్‌తో రెండో వన్డే మ్యాచ్

- గాయంతో అమెలియా అవుట్
- మ.గం.1:30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రసారం

అహ్మదాబాద్: భారత మహిళల జట్టు సిరీస్ లక్ష్యంగా రెండో వన్డే బరిలోకి దిగుతోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తొలి మ్యాచ్‌లో పర్యాటక న్యూజిలాండ్‌ను కంగు తినిపించిన భారత్ ఇప్పుడు వరుస విజయంపై కన్నేసింది. తద్వారా మరో వన్డే మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఉంది. మరోవైపు కివీస్ ఈ మ్యాచ్‌లో పుంజుకొని సిరీస్ రేసులో నిలవాలని ఆశిస్తోంది. తప్పక గెలవాల్సిన ఒత్తిడి ఉన్న కివీస్ ఏమేరకు రాణిస్తుందో చూడాలి.

స్మృతి రాణిస్తేనే...

గత మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫిట్‌నెస్ సమస్యలతో దూరం కావడంతో సారథ్యం వహించిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఫామ్ జట్టును కలవరపెడుతోంది. ఇటీవలి టి20 ప్రపంచకప్ సహా వరుసగా విఫలమవడం బ్యాటింగ్ విభాగాన్ని ఒత్తిడికి గురిచేస్తోంది. టాపార్డర్‌లో షఫాలీ, యస్తిక భాటియా మెరుగ్గా ఆడటం, జెమీమా, దీప్తిశర్మ తమ స్థాయికి తగ్గ ఆటతీరు కనబరుస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. గత మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన తేజల్ హసబ్నిస్ మిడిలార్డర్‌లో కీలకమైన ఇన్నింగ్స్ ఆడటంతో హర్మన్ జట్టులోకి వచ్చినా ఆమె స్థానానికి ఢోకాలేదు.

కివీస్‌కు మరో దెబ్బ

సిరీస్‌లో వెనుకబడిన న్యూజిలాండ్‌కు అమెలియా కెర్ గాయం మరో దెబ్బకొట్టింది. తొలి వన్డే సందర్భంగా ఆమె తొడకండరాల గాయానికి గురైంది. దీంతో మిగతా మ్యాచ్‌లకు దూరమైన ఆమె స్వదేశానికి పయనమైంది. ఇటీవల టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన స్టార్ ఆల్‌రౌండర్ లేకపోవడం జట్టుకు మరింత ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి సమయంలో ఇప్పుడు సోఫీ డివైన్ సేన సమష్టిగా ఆడితేనే గెలిచి సిరీస్‌లో నిలుస్తుంది. లేదంటే సిరీస్ కోల్పోయే పరిస్థితి వస్తుంది.

జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ, యస్తిక, జెమిమా, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, అరుంధతీ, రాధా యాదవ్, సయిమా, రేణుకా సింగ్.

న్యూజిలాండ్: సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీబేట్స్, జార్జియా, బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసాబెల్ల గేజ్, జెస్ కెర్, మోలి ఫెన్‌ఫోల్డ్, ఎడెన్ కార్సన్, లీ తహుహు.

తన్మయ్ అజేయ సెంచరీ



తన్మయ్

- హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 290/1
- పుదుచ్చేరితో రంజీ మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో భాగంగా పుదుచ్చేరితో జరుగుతున్న పోరులో హైదరాబాద్‌కు శుభారంభం దక్కింది. తాజా సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్... సొంతగడ్డపై శనివారం ప్రారంభమైన పోరులో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. గ్రూప్ 'బి'లో భాగంగా ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ టాపార్డర్ ఆకట్టుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్... తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 290 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (276 బంతుల్లో 152 బ్యాటింగ్; 13 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయ సెంచరీతో కదం తొక్కగా... అభిరత్ రెడ్డి (68; 10 ఫోర్లు), రోహిత్ రాయుడు (62 బ్యాటింగ్; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. వేగంగా పరుగులు చేయడం కన్నా ఎక్కువసేపు క్రీజులో నిలవాలనే లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు తొలి రోజు ఒక వికెట్ మాత్రమే కోల్పోయింది. మొదటి వికెట్‌కు అభిరత్ రెడ్డితో కలిసి 111 పరుగులు జత చేసిన తన్మయ్ అగర్వాల్... రోహిత్ రాయుడుతో కలిసి అబేధ్యమైన రెండో వికెట్‌కు 179 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ల అనుభవ రాహిత్యాన్ని సొమ్ము చేసుకుంటూ తన్మయ్ పరుగులు రాబట్టాడు.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (నాటౌట్) 152; అభిరత్ రెడ్డి (సి) అరుణ్ కార్తీక్ (బి) సాగర్ 68; రోహిత్ రాయుడు (నాటౌట్) 62; ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం (90 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 290. వికెట్ల పతనం:** 1-111, **బౌలింగ్:** గౌరవ్ 21-7-50-0; సాగర్ 13-3-47-1, ఫాబిద్ అహ్మద్ 23-4-62-0, అమన్ ఖాన్ 11-1-55-0, అకింత్ శర్మ 11-0-41-0, సతీశ్ 11-1-30-0.

ఆంధ్ర 295/6

- మెరిసిన విహారి, భరత్, రషీద్
- హిమాచల్‌తో రంజీ మ్యాచ్



విహారి

సాక్షి, విశాఖపట్నం: ప్రధాన బ్యాటర్లంతా రాణించడంతో రంజీ ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో పోరులో ఆంధ్ర జట్టు మంచి స్కోరు దిశగా సాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా శనివారం విశాఖపట్నంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్రారంభమైన పోరులో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. కెప్టెన్ షేక్ రషీద్ (69; 9 ఫోర్లు), హనుమ విహారి (66; 12 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించగా... వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (39 బంతుల్లో 65; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) టి20 తరహాల్లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి హాఫ్ సెంచరీ చేశాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టుకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (5), మహీప్ కుమార్ (4) విఫలం కావడంతో 11 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును రషీద్, విహారి ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లు చెలరేగిపోతున్న సమయంలో సంయమనం పాటించిన ఈ జోడీ... క్రీజులో కుదురుకున్నాక వేగంగా పరుగులు రాబట్టింది. రెండో వికెట్‌కు 125 పరుగులు జోడించిన తర్వాత హనుమ విహారి వెనుదిరిగగా... షేక్ రషీద్‌తో కలిసి శ్రీకర్ భరత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అప్పటి వరకు నిదానంగా సాగిన స్కోరుబోర్డు... భరత్ రాకతో పరుగులు పెట్టింది. బౌలర్‌తో సంబంధం లేకుండా భరత్ ఎడాపెడి బౌండ్రీలతో విజృంభించాడు. ఇక మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనుకుంటున్న దశలో వీరిద్దరూ వెనుదిరగడంతో పరుగుల వేగం తగ్గింది. అశ్విన్ హెబర్ (15) ఎక్కువసేపు నిలవలేకపోగా... మనీశ్ (31 బ్యాటింగ్; 2 ఫోర్లు), త్రిపురన విజయ్ (20 బ్యాటింగ్; ఒక ఫోర్) క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ ఏడ వికెట్‌కు అజేయంగా 50 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు.



ట్రోఫీతో పాకిస్తాన్ జట్టు

పాకిస్తాన్‌దే చివరి టెస్టు

- ఇంగ్లండ్‌పై 9 వికెట్లతో విజయం
- 2-1తో సిరీస్ సొంతం

రావల్పిండి: సొంతగడ్డపై సిరీస్ విజయం కోసం చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్న పాకిస్తాన్ జట్టు ఎట్టకేలకు దానిని సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన చివరి టెస్టులో పాకిస్తాన్ 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను పాకిస్తాన్ 2-1తో సొంతం చేసుకుంది. 2021 తర్వాత స్వదేశంలో పాకిస్తాన్‌కు ఇదే తొలి సిరీస్ విజయం. తొలి మ్యాచ్‌లో ఓడిన తర్వాత తిరిగి కోలుకున్న పాకిస్తాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి సిరీస్ చేజిక్కించుకోవడం విశేషం. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై మరోసారి పాక్ స్పిన్ ద్వయం నోమాన్ అలీ, సాజిద్ ఖాన్ విజృంభించడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 24/3తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు 37.2 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌటైంది. పాకిస్తాన్ గడ్డపై ఇంగ్లండ్ జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. మాజీ కెప్టెన్ జో రూట్ (33) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లలో హ్యారీ బ్రూక్ (26) మినహా ఏ ఒక్కరూ కనీసం ఇరవై పరుగుల మార్క్ దాటలేకపోయారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (3), వికెట్ కీపర్ జేమీ స్మిత్ (3), అట్కిన్‌సన్ (10) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో నోమాన్ అలీ 6, సాజిద్ ఖాన్ నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం 36 పరుగుల లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 3.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 37 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ షాన్ మసూద్ (6 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్సర్) ధాటిగా ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జాక్ లీచ్ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగులు చేయగా... పాకిస్తాన్ 344 పరుగులు చేసింది. గత మ్యాచ్‌లో మొత్తం 20 వికెట్లు ఖాతాలో వేసుకున్న పాకిస్తాన్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్, నోమాన్ అలీ... ఈసారి 19 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టిన సౌద్ షకీల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', సాజిద్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి. టెస్టు సారథిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయిన పాకిస్తాన్ సారథి షాన్ మసూద్‌కు ఇదే తొలి సిరీస్ విజయం.

2 మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టెస్టు ఓడిన తర్వాత తిరిగి పుంజుకొని సిరీస్ చేజిక్కించుకోవడం పాకిస్తాన్ జట్టుకు ఇది రెండో సారి. 1995లో జింబాబ్వేతో సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఓడిన తర్వాత పాకిస్తాన్ సిరీస్ కైవసం చేసుకుంది.

9 గత తొమ్మిదేళ్లలో ఇంగ్లండ్‌పై పాకిస్తాన్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. చివరిసారిగా 2015లో యూఏఈ వేదికగా జరిగిన సిరీస్‌లో పాకిస్తాన్ 1-0తో ఇంగ్లండ్‌పై గెలిచింది. ఆ తర్వాత ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు నాలుగు సిరీస్‌లు జరగగా.. అందులో రెండింట ఇంగ్లండ్ విజయం సాధించింది. మరో రెండు సిరీస్‌లు 'డ్రా'అయ్యాయి.

2 రావల్పిండి టెస్టులో పాకిస్తాన్ జట్టు కేవలం స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒక్క ఓవర్ కూడా పేస్ బౌలర్ వేయలేదు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది రెండోసారి మాత్రమే.

అంజలికి రజతం



టిరానా (అల్బేనియా): ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్ అంజలి (59 కేజీలు) రజత పతకం కైవసం చేసుకుంది. 55 కేజీల పురుషుల విభాగంలో చిరాగ్ ఫైనల్‌కు దూసుకెళ్లి మరో పతకం ఖాయం చేశాడు. 55 కేజీల గ్రీకో రోమన్ విభాగంలో రామచంద్ర మోర్, మహిళల 68 కేజీల విభాగంలో మోనిక కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఆదివారం భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరడంతో పాటు మరో పతకం ఖాయం కాగా... అంతకు ముందు శుక్రవారం మన రెజ్లర్లు రెండు కాంస్యాలు గెలుచుకున్నారు. దీంతో ఓవరాల్‌గా భారత్ ఖాతాలో ఐదు పతకాలు చేరాయి. మహిళల 59 కేజీల సెమీఫైనల్లో అరోరా రుసో (ఇటలీ)పై విజయం సాధించిన అంజలి... తుది పోరులో ఉక్రెయిన్ రెజ్లర్ సొలోమియా చేతిలో ఓడింది. పురుషుల 55 కేజీల ఫైనల్లో అడిమాలిక్ కరాచోవ్ (కిర్గిస్తాన్)తో చిరాగ్ తలపడనున్నాడు. 18 ఏళ్ల చిరాగ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-0తో ఒజావా గుకుటో (జపాన్)పై గెలిచాడు. క్వార్టర్స్‌లో లుబుస్ లబాటిరోవ్‌పై సెమీఫైనల్లో అలాన్ ఒరల్‌బెక్ (కజకిస్తాన్)పై గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. అభిషేక్ (61 కేజీలు), సుజీత్ (70 కేజీలు) కాంస్య పతకాల కోసం పోటీ పడనున్నారు.

టైటాన్స్ పరాజయాల 'హ్యాట్రిక్'

- 41-37తో గెలిచిన ఢిల్లీ
- ప్రొ కబడ్డీ లీగ్



సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌ను విజయంతో మొదలుపెట్టిన తెలుగు టైటాన్స్ తర్వాత వరుసగా ఓడిపోతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 37-41 స్కోరు తేడాతో దబంగ్ ఢిల్లీ చేతిలో కంగుతింది. తెలుగు టైటాన్స్‌కు వరుసగా ఇది మూడో ఓటమి. కెప్టెన్ పవన్ సెహ్రావత్ జట్టును గెలిపించేందుకు చక్కని పోరాటమే చేశాడు. 17 సార్లు కూతకెళ్లిన పవన్ 12 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చిపెట్టాడు. 6 బోనస్ పాయింట్లు సహా మొత్తం 18 పాయింట్లు సాధించాడు. మరో రెయిడర్ ఆశిష్ నర్వాల్ (9) కూడా రాణించాడు. మిగతా వారిలో ఆల్‌రౌండర్ విజయ్ మాలిక్ 3, డిఫెండర్ సాగర్ 2 పాయింట్లు తెచ్చారు. అయితే ప్రత్యర్థి దబంగ్ ఢిల్లీ జట్టు తరఫున రెయిడర్లు కెప్టెన్ నవీన్ కుమార్, అషు మాలిక్ చెలరేగారు. ఇద్దరు చెరో 15 పాయింట్లతో జట్టు విజయానికి బాట వేశారు. వీళ్లిద్దరు క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టడంతో తెలుగు టైటాన్స్ ఆఖరిదాకా పోరాడిన ఫలితం లేకపోయింది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లాడిన టైటాన్స్ ఒక్క మ్యాచ్‌లో గెలిచి మూడింట ఓడింది. మూడు మ్యాచ్‌లాడిన ఢిల్లీ రెండో విజయం సాధించింది. ఆదివారం జరిగే పోటీల్లో జైపూర్ పింక్‌పాంథర్స్‌తో తమిళ్ తలైవాస్ పోటీపడుతుంది. యూపీ యోధాస్‌ను గుజరాత్ జెయింట్స్ ఢీకొంటుంది.

బెంగాల్, యూ ముంబా మ్యాచ్ టై

అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో యూ ముంబా, బెంగాల్ వారియర్స్ హోరాహోరీగా తలపడ్డాయి. దీంతో ఈ మ్యాచ్ 31-31 స్కోరు వద్ద టై అయ్యింది. వారియర్స్ జట్టులో రెయిడర్ మణిందర్ సింగ్ (8 పాయింట్లు), డిఫెండర్ మయూర్ కదం (6) అదరగొట్టారు. ఒకరు కూతకెళ్లి పాయింట్లు తెస్తుంటే మరొకరు ప్రత్యర్థి రెయిడర్లను టాకిల్ చేసి పాయింట్లు సాధించారు. మిగిలిన వారిలో నితీశ్ కుమార్ (4), సుశీల్ కాంబ్రేకర్ (3), నితిన్ ధన్కర్ (3), కెప్టెన్ ఫజల్ అత్రాచలి (3) మెరుగ్గా ఆడారు. యూ ముంబా జట్టులో రెయిడర్ మన్‌జీత్ (7 పాయింట్లు) ఆకట్టుకున్నాడు.



హైదరాబాద్ ఎఫ్‌సీ తొలి విజయం

- మొహమ్మదాన్ క్లబ్‌పై 4-0తో గెలుపు
- ఐఎస్‌ఎల్ చరిత్రలో నార్త్ ఈస్ట్ నయా రికార్డు
- 5-0తో జంషెడ్‌పూర్‌పై విజయం

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) తాజా సీజన్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ తొలి విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 4-0తో మొహమ్మదాన్ స్పోర్ట్స్ క్లబ్‌పై గెలుపొందింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో ఆకట్టుకోలేకపోయిన హైదరాబాద్... మొహమ్మదాన్ క్లబ్‌తో పోరులో చెలరేగి ఆడింది. అలాన్ డిసాజా మిరండా (4వ, 15వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరవగా... స్టీఫెన్ సాపిక్ (12వ నిమిషంలో), పరాగ్ శ్రీవాస్ (51వ ని.లో) చెరో గోల్ కొట్టారు. మ్యాచ్ ఆరంభం నుంచే విజృంభించిన హైదరాబాద్ జట్టు... ప్రత్యర్థి డిఫెన్స్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ మ్యాచ్ ఆరంభమైన తొలి 15 నిమిషాల్లోనే మూడు గోల్స్‌తో తిరుగులేని ఆధిక్యం సాధించారు. దీంతో ఒత్తిడికి గురైన మొహమ్మడన్ క్లబ్ ఆటగాళ్లు డిఫెన్స్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. బంతిని ఎక్కువసేపు అదుపులో పెట్టుకున్న మొహమ్మదాన్ ప్లేయర్లు... హైదరాబాద్ కన్నా ఎక్కువ షాట్‌లు ఆడినా... అవి లక్ష్యాన్ని చేరుకోకుండా మనవాళ్లు అడ్డుపడ్డారు. 60 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న మొహమ్మడన్ జట్టుకు 13 కార్నర్‌లు, ఒక ఆఫ్‌సైడ్ లభించినా... వాటిని వినియోగించుకోలేకపోయారు. లీగ్‌లో ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ ఒక విజయం, ఒక 'డ్రా', మూడు పరాజయలతో మొత్తంగా 4 పాయింట్లు సాధించి పట్టికలో 11వ స్థానంలో నిలిచింది.

నార్త్ ఈస్ట్ రికార్డు విజయం

గువాహటి వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ 5-0తో జంషెడ్‌పూర్ జట్టుపై గెలిచింది. ఐఎస్‌ఎల్ చరిత్రలో ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. ఇప్పటి వరకు ఈ లీగ్‌లో ఒక జట్టు ఐదు గోల్స్ నమోదు చేయడం కూడా ఇదే మొదటిసారి. నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టు తరఫున అలాద్దీన్ (5వ, 90వ నిమిషాల్లో), పార్థిబ్ గొగొయ్ (44వ, 55వ నిమిషాల్లో) రెండేసి గోల్స్ చేయగా... లూయిస్ నిక్సన్ (82వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టుకు ఇది రెండో గెలుపు కాగా... 8 పాయింట్లతో ఉన్న ఆ జట్టు పట్టికలో ఐదో స్థానానికి చేరింది. ఈ మ్యాచ్‌లో ఓడిన జంషెడ్‌పూర్ జట్టు ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక రెండో స్థానంలో ఉంది. ఆదివారం ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్‌తో ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ తలపడనుంది.

క్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా

న్యూఢిల్లీ: భారత స్టార్ మహిళా టేబుల్‌టెన్నిస్ ప్లేయర్ మనిక బత్రా ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తెలుగమ్మాయి ఆకుల శ్రీజకు మాత్రం నిరాశ ఎదురైంది. ఆమె తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది. ఫ్రాన్స్‌లోని మాంట్‌పిలియెర్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్‌లో మనిక తనకన్నా ఎంతో మెరుగైన స్థానంలో ఉన్న రొమేనియా స్టార్ బెర్నాడెట్ సాక్స్‌కు షాకిచ్చింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ముగిసిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 30వ ర్యాంకర్ మనిక 3-1 (11-9, 6-11, 13-11, 11-9)తో టోర్నీ ఎనిమిదో సీడ్ ప్రపంచ 14వ ర్యాంకర్ బెర్నాడెట్‌ను కంగుతినిపించింది. ఇద్దరు చెరో గేమ్ గెలిచి పోటాపోటీగా దూసుకెళ్తున్న తరుణంలో మూడో గేమ్‌లో మనిక పోరాటపటిమ మ్యాచ్‌లో గెలిచేందుకు దోహదం చేసింది. రెండు గేమ్ పాయింట్లను కాపాడుకున్న ఆమె ప్రత్యర్థిని ఓడించి 2-1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో గేమ్‌లోనూ ఇదే ఆటతీరును కొనసాగించి మ్యాచ్‌లో గెలిచింది. మెరుగైన రొమేనియన్ క్రీడాకారిణిని 29 నిమిషాల్లోనే ఓడించింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ పోటీల్లో 5-5తో సమంగా నిలువగా తాజా విజయంతో భారత ప్లేయర్ 6-5తో పైచేయి సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత స్టార్ 3-2తో బెర్నాడెట్ సాక్స్‌ను ఓడించింది. తొలి రౌండ్ పోరులో శ్రీజ 2-3 (11-6, 7-11, 1-11, 11-8, 8-11)తో ప్రపంచ 13వ ర్యాంకర్ అడ్రియానా డియాజ్ (ప్యూర్టోరికో) చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో మనిక.. చైనాకు చెందిన ప్రపంచ 21వ ర్యాంకర్ క్వియన్‌తో తలపడనుంది. మరో ప్రిక్వార్టర్స్‌లో ఆమె 3-0తో చైనాకే చెందిన టాప్‌సీడ్ వాంగ్ యిదిని ఓడించింది.





ఎన్నికల్లో పోటీ చేయడమే కొత్త.. ప్రజా పోరాటాలు కొత్త కాదు

ఉప ఎన్నికలో నన్ను గెలిపించండి.. మీ ఆకాంక్షలు పూర్తిగా నెరవేరుస్తా

వయనాడ్ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకా గాంధీ బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తుండడం ఇదే మొదటిసారి అయినప్పటికీ ప్రజా పోరాటాలు తనకు కొత్త కాదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారి తరఫున ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నానని గుర్తుచేశారు. రాజ్యాంగం నిర్దేశించిన విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, న్యాయం కోసం పోరాటం సాగించానని, అదే తన జీవితానికి కేంద్ర బిందువు అని వెల్లడించారు. ఈ మేరకు వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు రాసిన బహిరంగ లేఖను ప్రియాంక శనివారం విడుదల చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ వారికి ప్రతినిధిగా వ్యవహరించారని తెలియజేశారు. వయనాడ్ ప్రజలతో కలిసి పనిచేస్తానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు. నవంబర్ 13న జరిగే ఉప ఎన్నికల్లో తనను గెలిపించాలని వయనాడ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని ఉద్ఘాటించారు. ప్రజా సేవకురాలిగా తన ప్రయాణానికి వయనాడ్ ప్రజలే మార్గదర్శకులు, గురువులు అని ప్రియాంక స్పష్టంచేశారు. తన సోదరుడు రాహుల్ గాంధీపై చూపిన ప్రేమానురాగాలే తనపైనా చూపించాలని కోరారు. సహజసిద్ధమైన ప్రకృతి అందాలు, అరుదైన వనరులను బహుమతిగా పొందిన వయనాడ్‌కు ప్రజాప్రతినిధి కావడం తన అదృష్టంగా, గర్వకారణంగా భావిస్తానని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్‌స్థానానికి జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు.

ఈసారి 33 విమానాలకు బెదిరింపులు

సామాజిక మాధ్యమ వేదికలకు కేంద్రం అడ్వైజరీ ● ఉత్తుత్తి హెచ్చరికలను అడ్డుకోవాలని సూచన

న్యూఢిల్లీ: దేశీయ విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. శనివారం మరో 33 విమానాలకు ఈ హెచ్చరికలు అందాయని అధికారవర్గాలు తెలిపాయి. దీంతో, గత 13 రోజుల్లో 300కు పైగా విమానాలకు ఉత్తుత్తి బెదిరింపులు అందినట్లయింది. ఇండిగో, విస్తార, ఎయిరిండియాలకు చెందిన 11 చొప్పున విమానాలకు శనివారం సామాజిక మాధ్యమ వేదికల ద్వారానే చాలా వరకు బెదిరింపులు అందాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సామాజిక మాధ్యమ వేదికలకు అడ్వైజరీ జారీ చేసింది. బెదిరింపులు శాంతియుత వాతావరణానికి, దేశ భద్రతకు భంగం కలిగించడంతోపాటు దేశ ఆర్థిక భద్రతకు ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేసింది. వీటి వల్ల విమాన ప్రయాణికులు, భద్రతా విభాగాలపై ప్రతికూల ప్రభావం చూపిందని, విమానయాన సంస్థలు తమ సాధారణ కార్యకలాపాలు కొనసాగించ లేకపోయాయని తెలిపింది. ఐటీ నిబంధనల మేరకు ఇటువంటి తప్పుడు సమాచారంపై ఓ కన్నేసి ఉంచాలని, కనిపించిన వెంటనే తొలగించడం లేదా నిలిపివేయాలని కోరింది. భారత సార్వభౌమత్వం, భద్రత, సమగ్రత, ఐక్యతలకు భంగం కలిగించే చర్యలపై ప్రభుత్వానికి సమాచారం అందించడం తప్పనిసరని స్పష్టం చేసింది. ఆయా మాధ్యమ వ్యవస్థలు తమ నియంత్రణ లేదా అధీనంలో సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా లేదా 72 గంటల్లోగా అందించడంతోపాటు సంబంధిత దర్యాప్తు సంస్థలకు విచారణలో సహకరించాల్సి ఉంటుందని గుర్తు చేసింది. ఏ యూజర్ అయినా చట్ట విరుద్ధమైన లేదా తప్పుడు సమాచారం ప్రచురణ, ప్రసారం, ప్రదర్శించడం, అప్‌లోడ్, స్టోర్, అప్‌డేట్, షేర్ వంటివాటిని అడ్డుకునేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సామాజిక మాధ్యమ వేదికలదేనని పేర్కొంది. ఉల్లంఘించిన వారిపై ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత-2023 ప్రకారం చర్యలుంటాయని తెలిపింది. విషయ తీవ్రత దృష్ట్యా ఈ అడ్వైజరీ జారీ చేస్తున్నట్లు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ తెలిపింది. విమానయాన సంస్థలకు అందుతున్న ఉత్తుత్తి బెదిరింపులకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాలంటూ రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ వేదికలను కోరడం తెలిసిందే.

ట్రంప్, వాన్స్ లక్ష్యంగా చైనా సైబర్ దాడి

కమలా హారిస్, వాల్జ్‌లపైనా దాడి జరిగినట్లు అనుమానం

దర్యాప్తు చేపట్టామన్న అమెరికా ప్రభుత్వ వర్గాలు

వాషింగ్టన్: చైనాకు చెందిన సైబర్ నేరగాళ్లు, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ఆయన రన్నింగ్ మేట్ జేడీ వాన్స్‌లు వాడే ఫోన్లు, నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకున్నారని అమెరికా అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ట్రంప్-వాన్స్‌ల ఎన్నికల ప్రచార బృందాన్ని అప్రమత్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారత సంతతికి చెందిన ఉపాధ్యక్షురాలు, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, ఆమె రన్నింగ్ మేట్ వాల్జ్ ఎన్నికల ప్రచారాన్ని కూడా చైనా సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారని బీబీసీ పేర్కొంది. అదే నిజమైతే, ఏ మేరకు సమాచారం నేరగాళ్ల చేతికి చిక్కి ఉంటుందనే విషయం స్పష్టత రాలేదు. అధ్యక్ష ఎన్నికల అభ్యర్థులు సైబర్ నేరగాళ్లకు లక్ష్యమయ్యారా అనే ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, ఎఫ్‌బీఐలు నిరాకరిస్తున్నాయి. చైనాకు చెందిన సైబర్ నేరగాళ్లు దేశంలోని వాణిజ్య టెలీకమ్యూనికేషన్స్ వ్యవస్థల్లోకి దొంగచాటుగా ప్రవేశించిన విషయమై అమెరికా ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించిందని ఎఫ్‌బీఐ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ ఏజెన్సీ(సీఐఎస్ఏ) ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. అయితే, నేరగాళ్లు చేసిన ప్రయత్నాలను తాము గుర్తించామని తెలిపాయి. ఆ వెంటనే సంబంధిత సంస్థలను అప్రమత్తం చేయడంతోపాటు ఇతర బాధితులను అలెర్ట్ చేసి, అవసరమైన సహాయ సహకారాలు అందించామని ఆ ప్రకటనలో వివరించాయి. కమర్షియల్ కమ్యూనికేషన్స్ రంగంలో సైబర్ రక్షణలను బలోపేతం చేసేందుకు, దాడులను ఎదుర్కొనేందుకు సంబంధిత విభాగాలను సమన్వయం చేస్తున్నామని ఎఫ్‌బీఐ, సీఐఎస్ఏ తెలిపాయి. అయితే, దీనిని ఎన్నికల ప్రచారాన్ని ప్రభావితం చేసేలా సైబర్ దాడికి జరిగిన యత్నంగా కాకుండా, గూఢచర్యంగాభావిస్తున్నామని న్యాయ విభాగం తెలిపింది.ఈ పరిణామంపై ట్రంప్ ప్రచార బృందం తీవ్రంగా స్పందించింది. ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవకుండా చేసే కుట్రగా అభివర్ణించింది. ఈ నెల మొదట్లో కూడా హ్యాకర్లు ట్రంప్, వాన్స్‌లే లక్ష్యంగా సైబర్ దాడికి పాల్పడ్డారని సంబంధిత వెరిజోన్ అనే టెలీ కమ్యూనికేషన్ సంస్థ ఆరోపించింది. సెప్టెంబర్‌లో ఇరాన్‌కు చెందిన ముగ్గురు హ్యాకర్లు అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినట్లు అమెరికా ప్రభుత్వం ఆరోపించడం తెలిసిందే.

వంట నూనె ధరలకు రెక్కలు



- దిగుమతి సుంకాల పెంపుతో నెల రోజుల వ్యవధిలో 23–37 శాతం ధరల పెరుగుదల
- పామాయిల్ ధరే రూ.100 నుంచి రూ.137కి చేరిక

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా దీపావళి సంబరాలు మొదలవుతున్న వేళ వంటనూనెల ధరలు చుక్కలనంటుతున్నాయి. గడిచిన నెల రోజులుగా క్రమంగా పెరుగుతూ సామాన్యులకు అందనంతగా పెరిగిపోతున్నాయి. నెల రోజుల్లోనే వంట నూనెల ధరలు 23 నుంచి 37 శాతం వరకు పెరగడంతో పండగ వేళ సామాన్యులకు ఇక్కట్లు తప్పేలా లేవు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే గత నెలలో రూ.100 ఉన్న పామాయిల్ ధర రూ.137 (37 శాతం) పెరగ్గా, సోయాబీన్ నూనె రూ.120 నుంచి రూ.148 (23 శాతం), సన్‌ఫ్లవర్ రూ.120 నుంచి రూ.149 (23.5 శాతం), ఆవ నూనె రూ.140 నుంచి రూ.181 (29శాతం), వేరుశనగ నూనె రూ.180 నుంచి రూ.187 (4 శాతం) మేర పెరిగాయి. దేశీయంగా నూనెగింజల సాగు పెద్దగా లేకపోవడంతో దేశం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్, బ్రెజిల్, ఉక్రెయిన్, రష్యా, అర్జెంటీనా నుంచి సన్‌ఫ్లవర్ నూనెను దిగుమతి చేసుకుంటోంది. మొత్తంగా 58 శాతం ఇతర దేశాల నుంచే భారత్‌కు వస్తోంది. నూనెల వినియోగంలో భారత్ రెండో అతిపెద్ద వినియోగదారుగా ఉంది. దేశీయంగా నూనె పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గత నెలలో ముడి సోయాబీన్, పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెల దిగుమతి సుంకాలను 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచింది. శుద్ధి చేయబడిన ఆవ నూనెల దిగుమతి సుంకాన్ని 13.7 శాతం నుంచి 35.7 శాతానికి పెంచింది. సెప్టెంబర్ 14 నుంచి పెరిగిన సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా హోల్‌సేల్ వ్యాపారులు ధరలు పెంచి అమ్మకాలు చేపట్టారు. దీనితో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు నూనెగింజల సాగులో ముందున్న మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పంట ఉత్పత్తి తగ్గింది. ఈ ప్రభావం సైతం ధరల పెరుగుదలకు కారణమైంది. పెరిగిన ధరల ప్రభావం రెస్టారెంట్‌లు, హోటళ్లతో పాటు దీపావళి సందర్భంగా చేసుకునే తీపి పదార్థలపై గణనీయంగా పడుతోంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో స్వీట్ల ధరలను పెంచి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చే వరకు ధరలు దిగిరావని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

ఇరాన్‌లో దుండగుల దాడి.. 10 మంది పోలీసులు మృతి

- బలూచ్ వేర్పాటువాదుల పనిగా అనుమానం

దుబాయ్: ఇరాన్‌లోని కల్లోలిత దక్షిణ ప్రాంత సిస్తాన్–బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పోలీస్ కాన్వాయ్‌పై జరిగిన దాడిలో 10 మంది పోలీసులు చనిపోయారు. గొహర్ కుహ్ ప్రాంతంలో శనివారం జరిగిన ఈ దాడిని దుండగుల దుశ్చర్యగా ప్రభుత్వం పేర్కొంది. తమదే బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు కూడా. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, ఇరాన్‌లలోని బలూచ్ ప్రజల హక్కుల కోసం పోరాడే 'హల్‌వాష్'గ్రూప్ ఈ దాడికి సంబంధించిన కొన్ని ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ఉంచింది. బుల్లెట్లు తగిలిన గుర్తులున్న ఇరాన్ పోలీసుల వాహనం, ముందు సీట్లో ఇద్దరు పోలీసుల మృతదేహాలు అందులో ఉన్నాయి. మూడు దేశాల సరిహద్దుల్లోని వెనుకబడిన ప్రాంతంలో ఉండే సున్నీ ముస్లింలైన బలూచ్ వర్గం ప్రజలు కొంతకాలంగా హింసాత్మక చర్యలకు దిగుతున్నారు. తాజా ఘటనకు వీరే కారణమని అనుమానిస్తున్నారు.

భావి నైపుణ్యాల కల్పనకు కేంద్రం కట్టుబడి ఉంది: మోదీ

న్యూఢిల్లీ: భావి అవసరాలకు తగినట్టుగా యువతలో నైపుణ్యాలను పెంచేందుకు కావాల్సిన శిక్షణ తదితరాలు అందజేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కౌశల్ దీక్షాంత్ సమారోహ్ పేరిట శనివారం జరిగిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ఆయన ఈ మేరకు సందేశమిచ్చారు. అత్యంత నైపుణ్యంతో కూడిన యువ శక్తికి ఆలవాలంగా భారత్ ఇప్పుడు ప్రపంచమంతటా గుర్తింపు సాధిస్తోందంటూ హర్షం వెలిబుచ్చారు. దేశ ప్రగతిలో వారే కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. నానాటికీ మారుపోతున్న అంతర్జాతీయ అవసరాలకు తగ్గట్టుగా వారిని తీర్చిదిద్దేందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తగిన కార్యక్రమాలను చేపడుతోందని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా 15 వేల పై చిలుకు ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్టు ఆ శాఖ మంత్రి జయంత్ చౌదరి వివరించారు. ఇందుకోసం తాజా బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించడాన్ని గుర్తు చేశారు. స్థానిక పరిశ్రమల అవసరాలను తీరుస్తూనే మొత్తంగా దేశ ప్రగతికి తోడ్పడే కేంద్రాలుగా ఐటీఐలు మారాలన్నది కేంద్రం లక్ష్యమని చెప్పారు.

హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు

టెల్ అవీవ్: దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు చెందిన 70కి పైగా స్థావరాలపై వైమానిక దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం శనివారం వెల్లడించింది. 24 గంటల వ్యవధిలో ఈ దాడులు జరిగాయని, హెజ్‌బొల్లా ఆయుధ డిపోలు, భవనాలను ధ్వంసం చేశామని పేర్కొంది. పలువురు ఉగ్రవాదులు హతమయ్యారని ప్రకటించింది. అంతేకాకుండా హెజ్‌బొల్లాకు సంబంధించిన పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. మరోవైపు లెబనాన్ భూభాగం నుంచి తమ భూభాగం వైపు దూసుకొచ్చిన డ్రోన్‌ను కూల్చివేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా

- తొమ్మిది మంది మృతి, 27 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ వాసులకు శుక్రవారం రాత్రి కాళరాత్రే అయింది. రష్యా గంటలపాటు క్షిపణి, డ్రోన్లతో దాడులకు పాల్పడింది. ఇందుకు సంబంధించిన ఘటనల్లో కనీసం 9 మంది చనిపోగా, 27 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. కీవ్ పశ్చిమ ప్రాంతంలోని 25 అంతస్తుల భవనంపై జరిగిన డ్రోన్ దాడితో బాలిక చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. దాదాపు ఏడున్నర గంటలపాటు కీవ్‌పై దాడులు కొనసాగాయని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. నీప్రో నగరంపై జరిగిన మరో క్షిపణి దాడిలో 14 ఏళ్ల బాలికతోపాటు ఐదుగురు చనిపోగా 21 మంది గాయపడినట్లు గవర్నర్ తెలిపారు. దాడిలో 12 వరకు అపార్టుమెంట్లు ధ్వంసమైనట్లు వెల్లడించారు. ఖర్కీవ్ ప్రావిన్స్‌పై జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. కీవ్ ప్రావిన్స్‌లో ఒకరు చనిపోగా 13 ఏళ్ల బాలుడు గాయపడ్డాడని ఆర్మీ తెలిపింది. రష్యా ప్రయోగించిన మొత్తం 91 డ్రోన్లతో 44 డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది.

కమలా హారిస్‌కు గాయని బియాన్స్ మద్దతు

హ్యూస్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కమలా హారిస్‌కు ప్రఖ్యాత గాయని బియాన్స్ మద్దతు ప్రకటించారు. శుక్రవారం రాత్రి హ్యూస్టన్‌లో జరిగిన డెమొక్రటిక్ ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. ''ఒక సెలబ్రిటీకి ఇక్కడికి రాలేదు. ఒక రాజకీయ నాయకురాలిగా రాలేదు. ఒక తల్లిగా వచ్చాను. మన బిడ్డలు ప్రతిబంధకాలు, పరిమితులు లేకుండా పెరగాలంటే కమలా హారిస్‌కు ఓటు వేయాలి''అని పిలుపునిచ్చారు. హ్యూస్టన్ బియాన్స్ సొంత నగరం కావడం విశేషం. 2016లోనూ ఆమె అప్పటి డెమొక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు మద్దతు పలికారు. క్లీవ్‌లాండ్‌లో ప్రచార సభలో హిల్లరీకి మద్దతుగా ఒక పాట కూడా పాడారు. ఈసారి మాత్రం పాడలేదు. కమలా హారిస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. హ్యూస్టన్ సభలో కమలా హారిస్ మాట్లాడుతూ.. తన ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై విరుచుకుపడ్డారు. మహిళల పునరుత్పత్తి హక్కుల విషయంలో గత 50 ఏళ్లలో సాధించిన ప్రగతిని ట్రంప్ నాశనం చేశారని మండిపడ్డారు. మహిళలకు హక్కులు నిరాకరించారని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో ట్రంప్‌ను చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కమలా హారిస్‌తో బియాన్స్

తటస్థ వైఖరితో తంటాలు

- ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో ఎవరికీ మద్దతు ఇవ్వని వాషింగ్టన్ పోస్ట్
- ఆగ్రహంతో 2 వేల చందాలు రద్దు

వాషింగ్టన్: అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు కొత్త చిక్కు వచ్చింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరికీ మద్దతు ఇవ్వకుండా.. తటస్థంగా ఉండాలని నిర్ణయించడం పాఠకులకు ఆగ్రహం తెప్పించింది. తటస్థంగా ఉంటామని ప్రకటించిన 24 గంటల్లో ఏకంగా రెండు వేల మంది చందాదారులు తమ సబ్‌స్క్రిప్షన్‌ను రద్దు చేసుకున్నారు. ఏ ఒక్కరి పక్షం వహించకుండా వాషింగ్టన్ పోస్టు తటస్థంగా ఉండటం గడిచిన 36 ఏళ్లలో ఇదే తొలిసారి. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు తెలుపుతూ ఎడిటోరియల్ పేజీ ఉద్యోగులు తమ ప్రకటనను సిద్ధం చేశారని, అయితే ఈ ముసాయిదాను పత్రిక బోర్డు ముందుపెట్టలేదని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తటస్థంగా ఉండాలనే నిర్ణయం అమెజాన్ వ్యవస్థాపకుడు, వాషింగ్టన్ పోస్టు పత్రిక యజమాని జెఫ్ బెజోస్ తీసుకున్నారని వార్తలు వెలువడటంతో నెటిజన్లు మండిపడుతున్నారు. వ్యాపార ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొనే బెజోస్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'డెమొక్రసి డైస్ ఇన్ డార్క్‌నెస్ (వాషింగ్టన్ పోస్ట్ ట్యాగ్‌లైన్)''వాపో'(పత్రిక సంక్షిప్తనామం)లు శనివారం 'ఎక్స్'లో ట్రెండ్ అయ్యాయి. రచయిత స్టీఫెన్ కింగ్, నటుడు జార్జ్ తకెలు తమ చందాను రద్దు చేసుకున్నారు. 'అధికారం ముందు జెఫ్ బెజోస్ సాగిలబడితే.. అమెజాన్‌కు దూరంగా ఉండటం ద్వారా వినియోగదారులు తమ బలమేంటో ఆయనకు తెలియజెప్పాలి'అని జార్జ్ తకె పిలుపిచ్చారు.

22 మందితో మహారాష్ట్ర బీజేపీ రెండో జాబితా

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 20వ తేదీన జరిగే ఎన్నికలు బీజేపీ శనివారం 22 మంది పేర్లతో రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో ఆరుగురు సిట్టింగ్‌లకు అవకాశమిచ్చింది. ఇద్దరికి మొండిచేయి చూపింది. ఇందులో ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా ఉండటం గమనార్హం. తాజా జాబితాతో కలిపితే అసెంబ్లీలోని మొత్తం 288 మంది సభ్యులకుగాను అధికార మహాయుతి భాగస్వామ్య బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్)లు ఇప్పటి వరకు 121 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఇలా ఉండగా, మహాయుతి భాగస్వామ్య పక్షాల మధ్య కనీసం 8 సీట్లపై చర్చలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బవాంనుకులే తెలిపారు. ఆదివారం మేనిఫెస్టో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ మరో రెండు జాబితాలు... 39 మందికి టికెట్లు

న్యూఢిల్లీ/ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకుగాను కాంగ్రెస్ శనివారం 23 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితా, 16 మందితో మూడో జాబితా విడుదల చేసింది. వీటితో కలిపి కాంగ్రెస్ ఇప్పటిదాకా మొత్తం 87 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. నాగ్‌పూర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) కుంభకోణంలో దోషిగా తేలడంతో ఆ పార్టీ నేత సునీల్ కేదార్‌పై అనర్హత వేటు పడింది. బదులుగా ఆయన భార్య అనూజ నాగ్‌పూర్ జిల్లా సావొనెర్ నుంచి పోటీ చేయనున్నారు. మొదటి జాబితాలో కాంగ్రెస్ 25 మంది సిట్టింగ్‌లకు అవకాశమిచ్చిన విషయం తెలిసిందే. మిగతా సీట్లపై కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ చర్చలు జరుపుతోందని పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల తెలిపారు.

ఎంవీఏ తరఫున కేజ్రీవాల్ ప్రచారం

- మహారాష్ట్రలో పోటీకి ఆప్ దూరం

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆమ్ ఆద్మీ పార్టీ దూరంగా ఉండనుంది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)కి ప్రచారం చేస్తారని ఎంపీ సంజయ్ సింగ్ శనివారం వెల్లడించారు. మహా వికాస్ అఘాడిలో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) భాగస్వామ్యపక్షాలుగా ఉన్న విషయం తెలిసిందే. 'మహారాష్ట్రలో ఆప్ పోటీ చేయడం లేదు. కేజ్రీవాల్ ఎంవీఏ తరఫున ప్రచారం చేస్తారు'అని సంజయ్ సింగ్ ఎక్స్‌లో తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి రావాల్సిందిగా శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)లు కేజ్రీవాల్‌ను కోరినట్లు ఆప్ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు చెందిన జార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో నవంబరు 20 పోలింగ్ జరగనుంది. జార్ఖండ్‌లో నవంబరు 13, నవంబరు 20న రెండు విడతలుగా పోలింగ్ ఉంది. నవంబరు 23 ఫలితాలు వెల్లడవుతాయి.

రాజ్‌కోట్‌లోని 10 హోటళ్లకు బాంబు బెదిరింపులు

రాజ్‌కోట్: గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ నగరంలోని కనీసం 10 హోటళ్లకు శనివారం బాంబు బెదిరింపులు ఈ మెయిళ్ల అందాయి. ఇటీవల దేశీయ విమానయాన సంస్థలకు చెందిన వందలాది విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో తాజా హెచ్చరికలపై పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా హోటళ్ల లోపల, చుట్టుపక్కల బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్‌తో క్షుణ్నంగా తనిఖీలు జరిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు దాదాపు ఐదు గంటలపాటు సాగిన సోదాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు కనిపించలేదని స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం జడేజా తెలిపారు. బెదిరింపులు వట్టివేనని తేలిందన్నారు. తనను తాను కాన్ డెన్ అని చెప్పుకుంటూ ఓ వ్యక్తి మెయిళ్ల పంపాడని, హోటళ్లలోని ఓ ప్రాంతంలో పెట్టిన బాంబులు మరికొద్ది సేపట్లోనే పేలతాయని అందులో పేర్కొన్నాడని చెప్పారు. అమాయకులు బలికాక మునుపే ఆయా హోటళ్లను తక్షణమే ఖాళీ చేయించాలని అందులో హెచ్చరించాడని ఎస్ఎం జడేజా వివరించారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

ఆర్మీ వాహనం బోల్తా.. జవాను మృత్యువాత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో సైనిక వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒక జవాను ప్రాణాలు కోల్పోగా 13 మంది గాయపడ్డారు. విధుల్లో భాగంగా వెళ్తుండగా ఘటన చోటుచేసుకుందని శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ తెలిపింది. జవాను ప్రాణాలు కోల్పోవడం పట్ల చినార్ కార్ప్స్ విచారం వ్యక్తం చేసింది. క్షతగాత్రుల్లో నలుగురు పౌరులు కూడా ఉన్నారని, వీరిని ఆస్పత్రిలో చేర్పించామని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఈ ప్రమాదం కుల్గాంలోని హెచ్‌డీ పొరాలో శుక్రవారం రాత్రి జరిగిందని వివరించారు.

సహకార సమాఖ్య వ్యవస్థకు జీఎస్టీ మంచి ఉదాహరణ

- సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్

ముంబై: భారత్‌లో గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) ప్రవేశపెట్టడం సహకార సమాఖ్య వ్యవస్థకు మంచి ఉదాహరణ అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. దశబ్దాలుగా కోర్టులు సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేశాయని, రాష్ట్రాల హక్కులకు రక్షణ కల్పించాయని పేర్కొన్నారు. 'సమాఖ్య వ్యవస్థను, దాని సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం'అనే అంశంపై మరాఠీ దినపత్రిక లోక్‌సత్తా నిర్వహించిన సదస్సులో చంద్రచూడ్ శనివారం ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభేదాలను పరిష్కరించుకొని.. అభివృద్ధి అనే ఉమ్మడి లక్ష్యాన్ని అందుకోవడమే సహకార సమాఖ్య వ్యవస్థని సీజేఐ పేర్కొన్నారు. చర్చలు, విభేదాలు.. దేశ సమాఖ్య వ్యవస్థ ఫరిడవిల్లడానికి కీలకమన్నారు. జీఎస్టీని ప్రవేశపెట్టడం సహకార సమాఖ్య వ్యవస్థకు మంచి ఉదాహరణ అని అన్నారు. 1990 తర్వాత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టాక.. రాజకీయ యవనికపై ఆర్థిక వ్యవస్థ ముఖ్యభూమిక పోషిస్తోందన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి కోర్టులు కృషి చేశాయని అన్నారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

తెలుగు భాషా సాహిత్యాలను ఆదరించిన కుతుబ్‌షాహీలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

తెలంగాణ చరిత్ర

కుతుబ్‌షాహీ యుగ విశేషాలు

పాలనా విధానం

రాజు(సుల్తాన్) సర్వాధికారి. కుతుబ్‌షాహీలు తాము దేవుడి ప్రతినిధులమని(జుల్ అల్లా) చెప్పుకున్నారు. రాజుకు సలహాలు ఇవ్వడానికి మంత్రి పరిషత్ ఉండేది. ప్రధాన మంత్రిని పీష్వా అని పిలిచేవారు. పీష్వా తర్వాతి స్థానం మీర్ జుంలా(ఆర్థిక మంత్రి)ది. వీరే కాకుండా ఐనుల్ ముల్క్(యుద్ధ మంత్రి/సర్వ సైన్యాధ్యక్షుడు), మజుందార్(ఆడిటర్ జనరల్), కొత్వాల్ (పోలీస్ అధికారి) మొదలైన అధికారులుండేవారు.

అబుల్‌హసన్ తానీషా కాలంలో గోల్కొండ రాజ్యంలో ఆరు సుబా(రాష్ట్రం)లను ఏర్పాటు చేశారు. సుబాలను 36 సర్కార్లు(జిల్లాలు)గా విభజించారు. సర్కార్లను 517 పరగణా(తాలూకా)లుగా విభజించారు.

కుతుబ్‌షాహీ రాజ్యంలోని సుబాలు	
ఒకటో సుబా	- మహ్మద్‌నగర్, మెదక్, కౌలాస్, ముల్కనూరు.
రెండో సుబా	- ఎల్గందల, వరంగల్, ఖమ్మం, దేవరకొండ.
మూడో సుబా	- పానగల్, ముస్తఫానగర్(కొండపల్లి), భువనగిరి, అకర్‌కర్.
నాలుగో సుబా	- కోయిల్ కొండ, ఘన్‌పూర్, ముర్తజానగర్(గుంటూరు), మచిలీపట్టణం.
అయిదో సుబా	- నిజాం పట్టణం, ఏలూరు, రాజమండ్రి, సికాకోల్.
ఆరో సుబా	- కర్ణాటక ప్రాంతం. ఇందులో 16 సర్కార్లు ఉండేవి.

రాష్ట్ర పాలకుడిని తరఫ్‌దార్‌గా, జిల్లా పాలకుడిని ఫౌజుదార్‌గా వ్యవహరించేవారు. పరగణా పాలకుడిని తహసీల్దార్ అని పిలిచేవారు.

గ్రామాల్లో పన్నెండు మంది ఆయగార్లు ఉండేవారని నాటి ఫర్మానాలను బట్టి తెలుస్తోంది. వారు..

పటేల్, కులకర్ణి (కరణం), చౌద్రి (వర్తకుల పెద్ద), పోతేదార్ (నాణేల మారకందారు), దేశ్ పాండే (గణకుడు), నహని (మంగలి), పారిత్ (చాకలి), పూజారి, సుతార్ (వడ్రంగి), కుంభార్ (కుమ్మరి), జోషి (జోతిష్కుడు), వేశహార(మస్కూరి).

సారంగు తమ్మయ 'వైజయంతీ విలాసం'అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులోని వర్ణనను బట్టి దొంగలను పట్టుకుని, దొంగ సొత్తును కొనుగోలు చేసే కంసాలులను విచారించే అధికారే తలారి(తలవరి) అని తెలుస్తోంది.

కుతుబ్‌షాహీలు హిందూధర్మ సూత్రాల్లో జోక్యం చేసుకోలేదు. గోల్కొండ రాజ్యంలో 84 స్థల, గిరి, వన, జల దుర్గాలు ఉండేవి. వీటిలో ఎక్కువ భాగం తెలంగాణలో ఉండేవి. కేంద్ర సైన్యం, జాగీర్దారీ సైన్యం అని రెండు రకాల సైన్యం ఉండేది.

ఆర్థిక పరిస్థితులు

గోల్కొండ రాజ్యంలో సారవంతమైన తీర భూములు ఉండేవి. ప్రజల ప్రధాన సాంస్కృతిక ధోరణులను సమన్వయ పరచడానికి, సాంఘిక అసమానతలను అదుపు చేయడానికి సూఫీ ఉద్యమం తోడ్పడింది. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. గోల్కొండ సుల్తాన్లు, వారి అధికారులు హుస్సేన్‌సాగర్, ఇబ్రహీంపట్నం, బద్వేల్ లాంటి చెరువులను తవ్వించారు. ఇవే కాకుండా అనేక కాలువలు, బావులను తవ్వించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు. నీటి వనరులకు మరమ్మతు చేయడానికి, ఆయకట్టు భూములకు నీరు అందించడానికి వడ్డెరలను నియమించి, వారికి మేరలు ఏర్పాటు చేశారు.

గోల్కొండ సుల్తాన్ల కృషి వల్ల భూములు విస్తృతంగా సాగులోకి వచ్చాయి. రైతులు వరి, జొన్న, రాగి, పెసర, వేరుశెనగ, కందులతోపాటు పత్తి, పొగాకు, ఆముదం తదితర పంటలను పండించేవారు. అప్పటికే పోర్చుగీసువారు మన దేశంలో పొగాకును ప్రవేశపెట్టారు. పత్తి, పొగాకు పంటల వల్ల ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయం లభించేది. సంత్రాలు, అంజూర, జామ, నారింజ, మామిడి, అరటి, నిమ్మ, దానిమ్మ లాంటి పండ్ల తోటలను పెంచేవారు.

పదిహేడో శతాబ్దంలో గోల్కొండ రాజ్యంలో మేలిరకం ఇనుము, ఉక్కు ఉత్పత్తి అయ్యేవి. వీటితో కత్తులు, బాకులు మొదలైన యుద్ధ పరికరాలను తయారుచేసేవారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన డమాస్కస్ కత్తుల తయారీలో గోల్కొండ ఉక్కును ఉపయోగించారు. నిర్మల్, ఇందూరు పట్టణాలు ఆయుధ పరిశ్రమకు కేంద్రంగా ఉండేవి. గోల్కొండ రాజ్యం వజ్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. గోల్కొండ వజ్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నూతన వజ్రాల గనులు కనుగొన్నారు. వస్త్ర పరిశ్రమకు ఓరుగల్లు పేరొందింది. ఖమ్మం జిల్లాలోని నాగులపంచలో లభించే నీలిరంగును విదేశాలకు ఎగుమతి చేసేవారు. 17వ శతాబ్దం తొలినాళ్లలో 'మిరప' గురించి తెలంగాణ ప్రజలకు తెలిసింది.

సాంఘిక పరిస్థితులు

కుతుబ్‌షాహీల సంస్కృతి తెలంగాణ సంస్కృతిగా రూపుదిద్దుకుంది. ఇతర తెలుగు ప్రాంతాల కంటే మరింత భిన్నమైన సంస్కృతి తెలంగాణలో రూపొందింది. కులీ కుతుబ్‌షా తెలంగాణ ప్రజల వస్త్రాలంకరణను అనుసరించి, వారి అభిమానం చూరగొన్నాడు.

హైదరాబాద్ నగరంలో సుమారు పది లక్షల మంది నివసించేవారు. మొగలులు, ఇరానీలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచున్నారు. హైదరాబాద్‌లో వేశ్యావృత్తి ఉండేది. నాట్యకత్తెలకు ఆదరణ పెరిగింది. అబ్దుల్లా కుతుబ్‌షాతో సహజీవనం చేసిన తారామతి, ప్రేమావతి గొప్ప నాట్యకత్తెలుగా పేరొందారు. కుల వ్యవస్థ కొనసాగింది. కుల కట్టుబాట్లు అధికమయ్యాయి. అనేక ఉపకులాలు స్థిరపడ్డాయి. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. సతీసహగమన దురాచారాన్ని రూపుమాపడానికి కుతుబ్‌షాహీలు ప్రయత్నించారు.

మత పరిస్థితులు

ఈ కాలంలో తెలుగు ప్రజలు స్మార్త, శైవ, వైష్ణవ మతాలను అనుసరించేవారు. ఈ మతాల మధ్య విభేదాలు తీవ్రంగా ఉండేవి. కుతుబ్‌షాహీలు ప్రజల మత విశ్వాసాలను, ఆచార వ్యవహారాలను గౌరవించేవారు. దేవాలయాలకు భూములు దానం చేసేవారు. ప్రతిభను బట్టి తెలుగువారికి అనేక ఉన్నత పదవులిచ్చేవారు. అనేక మంది తెలుగు వారు మీరాసిదార్లుగా, జాగీరుదార్లుగా, దేశ్‌ముఖ్‌లుగా, దేశ్‌పాండేలుగా ఉండటమే అందుకు నిదర్శనం. ఈ ఆదరణ వల్ల తెలుగువారు, ముస్లింలు కలిసిపోయి ఒక సహజీవన సంస్కృతి రూపొందింది. తెలుగు–ముస్లిం మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. ఒకరి ఆచారాలు, సంప్రదాయాలను మరొకరు అనుసరించారు. మొహర్రం(పీర్ల) పండుగను తెలుగువారు తాదాత్మ్యతతో జరుపుకొనేవారు. దర్గాలకు వెళ్లేవారు. కందూరు చేసుకునేవారు. అదే విధంగా తెలుగు పండుగలు, ఆచార వ్యవహారాలను ముస్లింలు ఆదరించేవారు.

షబ్–ఏ రాత్ పండుగలో దీపాలు అలంకరించడం దీపావళి నుంచి వచ్చింది. వసంతోత్సవాల్లో రాజులు, ముస్లిం ప్రజలు పాల్గొనేవారు. తిరుపతికి వెళ్లేవారు. అక్కడి బీబీనాంచారమ్మ అలా వెలిసిందే. ముస్లింలలో మంగ్‌నా(నిశ్చితార్థం), వధూవరులను తలుపు దగ్గర ఆపి పరిహాసాలాడటం, వధూవరుల మధ్య అడ్డంగా తెరకట్టడం, తలంబ్రాలు పోసుకోవడం ఇవన్నీ తెలుగువారి ఆచారాల నుంచి వచ్చినవే. వాస్తు శిల్పాల్లోనూ ఈ మిశ్రమ విధానం కనిపిస్తుంది.

కుతుబ్‌షాహీలు పర్షియా నుంచి వచ్చారు. వీరు షియా తెగకు చెందినవారు. తమ మత సంప్రదాయం ప్రకారం పరమత సహనం పాటించారు. సున్నీలను, తెలుగువారిని చిన్నచూపు చూడలేదు. మతయుద్ధాలు చేయలేదు. కులీకుతుబ్‌షా మొహర్రం పండుగను ప్రవేశపెట్టాడు. ఇతడే పీర్ల చావడులను, హుస్సేనీ ఆలంను నిర్మించాడు. షియాలు, సున్నీల మధ్య వైషమ్యాలు కొంత కాలం కొనసాగాయి. బహమనీల కాలంలో ముస్లింలు, ఉర్దూభాష తెలంగాణకే పరిమితం కాగా, కుతుబ్‌షాహీల కాలంలో ఇతర తెలుగు ప్రాంతాలకు కూడా విస్తరించడం నూతన పరిణామం.



కుతుబ్‌షాహీల చిత్రకళ

కులీకుతుబ్‌షా, ఇతర నవాబులు ఢిల్లీ నుంచి చిత్రకారులను రప్పించి పోషించారు. మొగల్ చిత్రకారుల సాన్నిహిత్యంతో కొత్త శైలి రూపుదిద్దుకుంది. దాన్నే దక్కన్ కలం అంటారు. దక్కనీ శైలి సృష్టికర్త మీర్ హసీం. అబ్దుల్లా, తానీషాల కాలంలో ఈ శైలి మరింత వృద్ధి చెందింది.

భాషా సాహిత్యాలు

ఈ కాలంలో ఉర్దూ 'దక్కనీ ఉర్దూ'గా పేరొందింది. దాని ప్రాభవం ఉచ్ఛస్థితికి చేరింది. హైదరాబాద్‌లో 38 వేల పుస్తకాలున్న గ్రంథాలయం ఉండేది. కుతుబ్‌షాహీలు తెలుగులో శాసనాలు వేయించారు. తెలుగు భాషను, కవులను, సంస్కృతిని ఆదరించారు. ఉర్దూలో కవిత్వం రాశారు. జమ్షీద్ కుతుబ్‌షా (1543–50) స్వయంగా కవి. గజల్‌లు, గేయాలు రాశాడు. ఇబ్రహీం కుతుబ్‌షా (1550–80) విజయనగర రాజుల దగ్గర ఏడేళ్లపాటు ఆశ్రయం పొందాడు. ఆ సమయంలోనే తెలుగు నేర్చుకున్నాడు.

తెలుగు సాహిత్యంలో మల్కిభరాముడిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడి దర్బారులో ఉమర్ షా మహ్మద్ అంజూ, అమీర్ ఇమాదుద్దీన్, మహమూద్ షిరాజీ, జావీ నవీసుల్, జమాఖాసిం బేగ్ షిరాజీ, హుస్సేన్ కులీమీర్జా మొదలైన పండితులుండేవారు. అద్దంకి గంగాధరుడు, మరింగంటి సింగరాచార్యులు, కందుకూరి రుద్రకవి తదితర తెలుగు కవులను ఇబ్రహీం కుతుబ్‌షా పోషించాడు. తెలుగు వనిత అయిన భాగీరథిని ఇతడు వివాహమాడాడు. తారిఖ్ కుతుబ్‌షాహి గ్రంథ రచయిత కుర్షాబిన్ కబ్బాదుల్ హుసేన్ ఇతడి కాలానికి చెందినవాడే. ఈ యుగంలో కనిపించే తొలి కవి చరిగొండ ధర్మన. ఇతడు పెద్దన, సూరన, నందిఘంట కవుల కంటే ముందే రుతువర్ణన, నాయికా వర్ణన, వేటవర్ణన లాంటి అష్టాదశ వర్ణనలు చేశాడు. దీన్ని బట్టి ధర్మనను ప్రబంధ కవిత్వ మార్గదర్శకుడిగా చెప్పవచ్చు. కల్పిత కథ ఆధారంగా ఇతడు చిత్రభారతాన్ని రచించాడు. గయోపాఖ్యానం, కృష్ణార్జున యుద్ధం లాంటి యక్షగానాలు రావడానికి చిత్ర భారతమే మూలం.

మహబూబ్‌నగర్ (చరిగొండ సీమ)కు చెందిన ధర్మన్న కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి వెళ్లి, ఎనుముల పెద్దన దగ్గర ఆశ్రయం పొందాడు. చిత్రభారతాన్ని అతడికే అంకితమిచ్చాడు. ఇందులో నాటి చారిత్రకాంశాలు కనిపిస్తాయి. చరిగొండ ధర్మన్న సోదరుడు చరిగొండ నరసింహకవి. ఇతడు కూడా కవే. పింగళి సూరన కంటే ముందే సూరన అనే మరో కవి కల్పిత కావ్యం (ధనాభిరామం) రాశాడు.

పొశెట్టి లింగ కవి నవపోళ చరిత్ర, మల్హణ చరిత్ర, శంకర దాసమయ్య చరిత్ర, వీర సంగమయ్య దేవ చరిత్ర, శిష్య ప్రబోధం అనే ద్విపద కావ్యాలను రాశాడు. పొశెట్టి అనే పేరు ఇప్పటికీ తెలంగాణలో వాడుకలో ఉంది. ఈ కావ్యంలోని కైకిలి(దినసరి కూలి), కొండెంగ, మోటు, ఉరువడి, పుటిక, తునక తదితర పదాలు తెలంగాణాలోనే వాడుకలో ఉన్నాయి. అందువల్ల ఇతడు తెలంగాణకు చెందినవాడే కావచ్చు.

ఆసూరి మరింగంటి సింగరాచార్యులు దశరథ రాజనందన చరితను రచించాడు. ఇది తెలుగు సాహిత్యంలో తొలి నిరోష్ఠ్య రచన. ఇతడే తొలిసారిగా అచ్చ తెలుగులో సీతాకల్యాణం అనే నిరోష్ఠ్య రచన చేశాడు. తొలి త్ర్యర్థి, చతురర్థి (నలరాఘవయాదవపాండవీయం) రచన కూడా ఇతడిదే. తిరునామరచనకు కూడా సింగరాచార్యులే ఆద్యుడు. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షా నుంచి అగ్రహారాన్ని పొందాడు.

మల్కిభరాముడి(ఇబ్రహీం కుతుబ్‌షా) మరో ఆస్థాన కవి అద్దంకి గంగాధరుడు (1525–80). ఇతడిని రామరాజభూషణుడితో పోల్చవచ్చు. ఇతడు 'తపతీ సంవరణోపాఖ్యానం'ను రచించి, ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో మల్కిభరాముడి ప్రేమ కథను వర్ణించాడు. ఈ శృంగార కావ్యంలో సమకాలీన సాంఘిక విశేషాలెన్నో కనిపిస్తాయి. సిద్ధరామకవి, గంగాధరుడి సమకాలికుడు. ఇతడు ప్రభుదేవర వాక్యం అనే వేదాంత వచన గ్రంథాన్ని రచించాడు. స్తుతి వచన ప్రక్రియకు ఆద్యుడు కృష్ణమాచార్యుడు. శివస్తుతి వచనాలకు ఆద్యుడు గంగాధరయ్య. వీరిద్దరూ తెలంగాణ వారే. మరింగంటి జగన్నాథాచార్యులు(శ్రీరంగనాథవిలాసం), అప్పలాచార్యులు కూడా మల్కిభరాముడి వద్ద ఆశ్రయం పొందారు.


కందుకూరి రుద్రకవి ఈ యుగంలోని అగ్రశ్రేణి కవుల్లో ఒకడు. ఇబ్రహీం కుతుబ్‌షా దేవరకొండ దుర్గపాలకుడిగా ఉన్నప్పుడే ఇతడికి కుతుబ్‌షాతో పరిచయం ఉంది. కుతుబ్‌షా రాజైన తర్వాత అతడి నుంచి రెంటచింతల (ద్వితింత్రిణి)ను అగ్రహారంగా పొందాడు. ఇతడు నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని కందుకూరుకు చెందినవాడని తెలుస్తోంది. ఇతడు 'సుగ్రీవ విజయం'ను రచించాడు. దీన్ని తొలి యక్షగానంగా భావిస్తారు. నిరంకుశోపాఖ్యానం, జనార్దనాష్టకం, బలవదరీ శతకం, జనార్దనాష్టక స్తోత్రం, గువ్వలచెన్నని శతకం తదితర గ్రంథాలను రుద్రకవి రచించాడు. ఇతడి రచనల్లో నిరంకుశోపాఖ్యానం ముఖ్యమైంది. ఇది శృంగార ప్రధాన సాంఘిక కావ్యం. ఇందులో నాటి సాంఘిక జీవనాన్ని చిత్రీకరించారు.

మల్కిభరాముడి అనుచరుడైన అమీన్‌ఖాన్ తొలి అచ్చతెలుగు కావ్యకర్త పొన్నిగంటి తెలగనను ఆదరించాడు. అప్పటి వరకు కవులు అచ్చ తెలుగులో పద్యాలు మాత్రమే రాశారు. కావ్యాలను రాయలేదు. తెలగన అచ్చ తెలుగు కావ్యం రాసి, పాల్కురికి దేశిమార్గాన్ని సుసంపన్నం చేశాడు.

మనం తీసుకునే ఆహారంలో సెల్యూలోజ్ లేకపోతే..

మానవుడి జీర్ణ వ్యవస్థ

- మానవుడి జీర్ణ వ్యవస్థలో భాగాలు.. నోరు, ఆస్యకుహరం, గ్రసని, ఆహార వాహిక, జీర్ణాశయం, చిన్నపేగు, పెద్దపేగు, పురీష నాళం, పాయువు.
- నోటి ద్వారా ఆహారాన్ని తీసుకోవడాన్ని అంతర్ గ్రహణం అంటారు. నోటిలోని కుహరం ఆస్యకుహరం. నోటిలో మూడు జతల లాలాజల గ్రంథులుంటాయి. అవి..
  1) అధోజంభిక (పై దవడలో)
  2) అధోజిహ్వక (నాలుక కింద)
  3) పెరోటిడ్ (చెవి దగ్గర) గ్రంథులు
- లాలాజల గ్రంథులు సంక్లిష్ట నాళాశయ గ్రంథులు. ఇవి శ్లేష్మకణాలు కలిగి ఉంటాయి.
- లాలాజల గ్రంథులు లాలాజలాన్ని స్రవిస్తాయి. లాలాజలం కొద్దిగా క్షారయుతం. ఇందులో టయలిన్ అనే ఎంజైమ్ ఉంటుంది.
- మానవుడి నోటిలో నాలుగు రకాల దంతాలుంటాయి. ఇవి వేరు వేరు నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి వీటిని విషమ దంతాలు అంటారు. అవి కొరకు పళ్ల (కుంతకాలు, కోర దంతాలు (రదనికలు), నములు దంతాలు (అగ్ర చర్వణకాలు), విసరు దంతాలు (చర్వణకాలు).
- మానవుని దంత ఫార్ములా 2123/2123
- నాలుక మీద రుచి కళికలు ఉంటాయి.
- లాలాజలంలో టయలిన్‌లోని ఎమిలేస్ ఎంజైమ్ పిండి పదార్థాన్ని మాల్టోస్/చక్కెరగా మారుస్తుంది. దంతాలతో నమిలిన ఆహారం లాలాజల శ్లేష్మంతో కలిసి జిగురుగా ఏర్పడి, సులువుగా కదిలి గ్రసని చేరుతుంది.
- వాయునాళంలోకి ఆహారం పోకుండా కొండ నాలుక (ఉపజిహ్వక) చూస్తుంది.
- ఆహార వాహిక.. గ్రసనిని జీర్ణాశయంతో కలుపుతుంది. ఇది నియంత్రిత, అనియంత్రిత కండరాలతో నిర్మితమైంది. దీని లోపలి గోడల్లో శ్లేష్మం ఉత్పత్తి అవుతుంది. దీని వల్ల ఆహారం జారుతుంది.



- ఆహార వాహికలో గ్రంథులు లేవు. అందుకే ఇక్కడ ఆహారం మార్పు చెందదు.
- ఆహారం ఆహార వాహిక చేరుకోగానే కండరాల సంకోచ, వ్యాకోచాలు (ఏకాంతర సంకోచ కదలికలు) ప్రారంభమై అలల వంటి చలనాలు కలుగుతాయి.ఈ చలనాలనే పెరిస్టాలిటిక్ చలనాలు అంటారు. ఈ చలనాలు అనియంత్రితమైనవి.
- ఆహారవాహిక నుంచి ఆహార పదార్థం జీర్ణాశయంలోనికి ప్రవేశిస్తుంది. జీర్ణాశయం కండరమంతా సంచిలాంటి నిర్మాణం. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. ఆహార వాహిక తెరచుకునే భాగం.. హార్దిక జీర్ణాశయం. ఆంత్రమూలంలోనికి తెరచుకునే జీర్ణాశయం.. జఠర నిర్గమ జీర్ణాశయం.
- జఠర నిర్గమ జీర్ణాశయం.. ఆంత్రమూలంలోనికి తెరచుకునే చోట జఠర నిర్గమ సంవరణి అనే కవాటం ఉంటుంది. జీర్ణాశయ గోడల్లో అనియంత్రిత కండరాల వల్ల ఆహారం పలుచనవుతుంది.
- మానవుడి జీర్ణాశయంలో సుమారు 35 మిలియన్ల జఠర గ్రంథులుంటాయి. జఠర రసం చిక్కగా, తేటగా, ఎండుగడ్డి రంగులో ఉండే ద్రవం.
- జఠర రసంలోని HCl ఆహారంలోని బ్యాక్టీరియాను చంపుతుంది. HCl చైతన్య రహిత పెప్సినోజన్‌ను పెప్సిన్‌గా మారుస్తుంది. పెప్సిన్‌తోపాటు లైపేజ్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది.
- HCl ప్రొరెనిన్‌ను రెనిన్ ఎంజైమ్‌గా ఉత్తేజపరుస్తుంది. రెనిన్ పాలను పెరుగుగా మార్చే ఎంజైమ్. ఇది పాలు తాగే శిశువులో జీర్ణాశయం నుంచి పాలు త్వరగా పేగులోకి చేరకుండా నిరోధిస్తుంది. పెప్సిన్.. ప్రోటీన్‌లను విశ్లేషించి పెప్టోనులు, ప్రోటియేస్‌లుగా మారుస్తుంది. లైపేజ్‌లు.. కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా, గ్లిజరాల్‌గా మారుస్తాయి.



- జఠర నిర్గమ సంవరణి నియంత్రణ వల్ల కొద్దికొద్దిగా ఆహారం జీర్ణాశయం నుంచి ఆంత్రమూలంలో చేరుతుంది. జీర్ణాశయంలో పిండి పదార్థాలు జీర్ణం కావు. ఆంత్రమూలంలో చేరిన ఆహారం ఆమ్ల స్థితిలో ఉంటుంది. దీన్ని 'కైమ్'గా పిలుస్తారు.
- ఆంత్రమూలంలో రెండు గ్రంథుల రసాలు కలుస్తాయి. అవి..
  1) కాలేయం 2) క్లోమం
- కాలేయం నాలుగు తమ్మెలు కలిగిన గ్రంథి. ఇది పైత్యరసం ఉత్పత్తి చేస్తుంది. పైత్య రసం పిత్తాశయంలో నిల్వ ఉంటుంది. ఇది పసుపు, బంగారు, బూడిద రంగుల మిశ్రమం. ఇందులో ఎంజైమ్‌లు ఉండవు. సోడియం కొలేట్, సోడియం డి ఆక్సికొలేట్ అనే పైత్యరస లవణాలు, బిల్‌రూబిన్, బైలివిరిడిన్ అనే వర్ణకాలు ఉంటాయి. హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు వర్ణకాలు ఏర్పడతాయి. పైత్యరసం క్షారయుతం (PH విలువ = 7.6)
- పైత్యరస లవణాలు కొవ్వుల ఎమల్సీకరణలో ఉపయోగపడతాయి.
- కాలేయం..అమ్మోనియాను యూరియాగా మారుస్తుంది (ఆర్నిథిన్ వలయం). కొవ్వు ల్లో కరిగే విటమిన్లను నిల్వ చేస్తుంది. విటమిన్-డీను క్రియాత్మకంగా చేస్తుంది. పిండ దశలో ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది (హీమోపాయిటిక్ అంగం). ప్రౌఢ దశలో ఎర్ర రక్తకణాలను విచ్ఛిన్నం చేస్తుంది (ఎరిత్రో క్లాస్టిక్ అంగం). కాలేయం విషయుక్త పదార్థాలను హానిరహిత పదార్థాలుగా మారుస్తుంది.
- క్లోమం పసుపు, బూడిద రంగులో ఉండే గ్రంథి. క్లోమం నాళవినాళ గ్రంథిగా పనిచేస్తుంది. క్లోమ రసం క్షారయుతం (PH = 8.0)గా ఉంటుంది. క్లోమరసంలో ఉండే ముఖ్యమైన ఎంజైమ్‌లు ట్రిప్సిన్, కీమోట్రిప్సిన్ ఎమిలేజ్, లైపేజ్. క్లోమరసంలో ఎక్కువ మొత్తంలో బైకార్బనేట్‌లు ఉంటాయి. దీనివల్ల కైమ్‌లో ఉన్న ఆమ్ల గుణం తటస్థీకరణం చెందుతుంది. క్లోమరసంలోని ఎంజైమ్‌లు ట్రిప్సినోజన్, కీమోట్రిప్సినోజన్‌లను ఎంటరోకీనేజ్ చైతన్య రూపంలోనికి మారుస్తుంది. ఎంటరోకీనేజ్ ఆంత్ర రసంలో ఉంటుంది.
- క్లోమ రసంలోని పెప్సిన్‌ల చర్య వల్ల జల విశ్లేషణం చెందిన ప్రొటీన్‌లు కీమోట్రిప్సిన్ వల్ల పాలిపెప్టయిడ్‌లుగా మారతాయి.
- క్లోమరసంలోని ఎమైలేజ్ పిండి పదార్థాల మీద చర్య జరిపి వాటిని చివరకు మాల్టోజ్, చక్కెరలుగా మారుస్తుంది. లైపేజ్.. చిలికిన కొవ్వులను గ్లిజరాల్, ఫాటీ ఆమ్లాలుగా మారుస్తుంది.
- క్లోమంలో రెండో భాగంలో ఐలెట్స్ ఆఫ్ లాంగర్‌హాన్స్ పుటికలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్‌ను స్రవించి డయాబెటిస్‌ను నియంత్రిస్తాయి. ఈ దశలో క్లోమం వినాళ గ్రంథి.
- పేగులో జీర్ణక్రియ ఆంత్రరస గ్రంథుల వల్ల జరుగుతుంది. చిన్నపేగు మొదటి భాగం ఆంత్రమూలం. రెండో భాగం జెజునమ్. మూడో భాగం శేషాంత్రికం.
- ఆంత్రరస గ్రంథుల స్రావాన్ని సక్కస్ ఎంటిరీకస్ అంటారు. ఇందులో ఎంటరోకీనేజ్, పెప్టిడైజ్, లైపేజ్, సుక్రేజ్, న్యూక్లియోటైడేజ్, న్యూక్లియోసైడేజ్ ఎంజైమ్‌లుంటాయి.
- పెప్టిడేస్‌లు.. పెప్టైడులను అమైనో ఆమ్లాలుగా మారుస్తాయి. ఆంత్రరస లైపేజ్‌లు కొవ్వులను పూర్తిగా జీర్ణం చేస్తాయి. సుక్రేజ్, మాల్టేజ్, లాక్టేజ్‌లు వరుసగా సుక్రోజ్, మాల్టోజ్, లాక్టోజ్‌లను చక్కెరలుగా మారుస్తాయి.
- న్యూక్లియోటైడేజ్, న్యూక్లియోసైడేజ్‌లు న్యూక్లిక్ ఆమ్లాల జీర్ణక్రియ పూర్తి చేస్తాయి.
- జీర్ణక్రియలోని అంత్య ఉత్పన్నాలను చిన్న పేగు కుడ్యంలోని ఆంత్ర చూషకాలు శోషణం చేసుకుంటాయి.
- పెద్దపేగు వ్యాసం చిన్నపేగు కంటే ఎక్కువ. నీరు, ఖనిజ లవణాలను పెద్దపేగు గోడలు పీల్చుకుంటాయి. పెరిస్టాలిటిక్ కదలికల వల్ల మలం పురీష నాళంలోనికి పోతుంది. పాయువుని రక్షిస్తూ ఉండే సంవరణీ కండరాలు వ్యాకోచించినప్పుడు మలం పాయువు ద్వారా బయటపడుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆహారం పూర్తిగా జీర్ణం అయ్యేందుకు కావాల్సినవి?
   1) గ్లైకోజన్ 2) ఎమైలేజ్
   3) సెల్యూలోజ్ 4) సుక్రోజ్
2. సోడియం కోలేట్, సోడియం డీ ఆక్సీకోలేట్ అనేవి?
   1) పైత్యరస లవణాలు
   2) పైత్యరస వర్ణకాలు
   3) క్లోమ రస లవణాలు
   4) క్లోమ రస వర్ణకాలు
3. మానవుడిలో సంవరిణీ కండరాలు వ్యాకోచించినప్పుడు?
   1) జీర్ణక్రియ వల్ల ఏర్పడ్డ అంత్య ఉత్పన్నకాలు పేగులో శోషణమవుతాయి
   2) కొవ్వులు జీర్ణమవుతాయి
   3) జీర్ణక్రియ అంత్య ఉత్పన్నకాలను చూషకాలు పీల్చుకుంటాయి
   4) మలం పాయువు ద్వారా బయటకు పోతుంది
4. 'కైమ్' ఏ స్థితిలో ఉంటుంది?
   1) క్షారం, ఆమ్లంగా2) ఆమ్ల స్థితి
   3) క్షార స్థితి 4) సమతుల్య స్థితి
5. 'మ్యూసిన్' అనే శ్లేష్మ పదార్థాన్ని స్రవించేది?
   1) అధోజంబికా 2) అధో జిహ్వక
   3) జఠర గ్రంథులు
   4) పెరోటిడ్ గ్రంథులు
6. రెనిన్ అనే ఎంజైమ్? (డీఎస్సీ-2004)
   1) కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మారుస్తుంది
   2) అమైనో ఆమ్లాలను ప్రోటీన్‌లుగా మారుస్తుంది
   3) పిండి పదార్థాన్ని మాల్టోజ్‌గా మారుస్తుంది
   4) పాలను పెరుగుగా మారుస్తుంది
7. మనం తీసుకునే ఆహారంలో సెల్యూలోజ్ లేకపోతే?
   1) ఆహారం పూర్తిగా జీర్ణం అవదు, పేగు ల కదలిక క్రమబద్ధంగా ఉంటుంది.
   2) ఆహారం పూర్తిగా జీర్ణం అవదు, మల బద్ధకం ఏర్పడుతుంది.
   3) పేగుల కదలిక క్రమబద్ధంగా ఉండి, మల బద్ధకం ఏర్పడుతుంది.
   4) ఆహారం పూర్తిగా జీర్ణమై, మలబద్ధకం ఏర్పడదు
8. పెరిస్టాలిటిక్ చలనాలు గల మానవుడి జీర్ణ మండలంలోని భాగం?
   1) జీర్ణాశయం 2) ఆంత్రమూలం
   3) కాలేయం 4) ఆహార వాహిక
9. ప్రౌఢ మానవుడి నోటిలో నములు దంతాల (అగ్ర చర్వణకాలు) సంఖ్య?
   1) 8 2)4 3) 12 4) 2
10. లాలాజలం లక్షణం?
   1) క్షారం, ఆమ్లం 2) కొద్దిగా క్షారం
   3) పూర్తిగా నీరు కలిగి ఉండటం
   4) కొద్దిగా ఆమ్లం

సమాధానాలు

1) 2; 2) 1; 3) 4; 4) 2;
5) 3; 6) 4; 7) 3; 8) 4;
9) 1; 10) 2.

మాదిరి ప్రశ్నలు

1. లాలాజల గ్రంథులకు సంబంధించి సరైన ప్రవచనం?
   1) లాలాజల గ్రంథులు 4 జతలుంటాయి
   2) పెరోటిడ్ గ్రంథులు నాలుక కింద ఉంటాయి.
   3) లాలాజల గ్రంథుల స్రావంలో టయలిన్ ఉంటుంది.
   4) లాలాజలం తటస్థంగా ఉంటుంది.
2. జీర్ణ వ్యవస్థలోని ఏ భాగంలో జీర్ణక్రియ జరగదు?
   1) నోరు 2) ఆంత్రమూలం
   3) చిన్నపేగు 4) ఆహార వాహిక
3. ప్రౌఢ మానవుడిలో ఉండే మొత్తం కుంతకాల సంఖ్య?
   1) 4 2) 8 3) 12 4) 6

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2

ఆమ్ల వర్షానికి కారణమైన వాయువులేవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పర్యావరణ రసాయన శాస్త్రం

వాయు కాలుష్యం

వివిధ జీవరాశుల మనుగడకు అవసరమైన వాతావరణం ఒక్క భూమిపైనే ఉంది. అయితే మానవుని చర్యల వల్ల వాతావరణ సమతౌల్యం దెబ్బతిని జీవుల మనుగడ ప్రమాదంలో పడింది. సాధారణ వాతావరణంలో ప్రధాన వాయువులైన నైట్రోజన్ 78.32%, ఆక్సిజన్ 20.16%గా ఉంటాయి. కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరి, ఆర్గాన్, నియాన్, హీలియం, హైడ్రోజన్, క్రిప్టాన్, ఓజోన్‌లు స్వల్ప మొత్తంలో ఉండే వాయువులు.

సాధారణ శ్వాసక్రియతో ప్రాణికోటి ఆక్సిజన్‌ను తీసుకుని కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి. ఈ కార్బన్ డై ఆక్సైడ్‌ను మొక్కలు పీల్చుకుని సూర్యరశ్మి సమక్షంలో నీటిఆవిరితో కలిసి 'కిరణజన్య సంయోగక్రియ' ద్వారా పిండి పదార్థాలను తయారుచేసుకుంటూ మనకు కావల్సిన 'ఆక్సిజన్'ను విడుదల చేస్తాయి. నైట్రోజన్‌ను స్థిరీకరణం చేసే సూక్ష్మజీవులు వాతావరణంలోని నైట్రోజన్‌ను ఉపయోగించుకుంటాయి. పారిశ్రామిక విప్లవంతో మొదలైన పారిశ్రామికీకరణ, విచ్చలవిడిగా అడవుల నరికివేత, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, వాహనాల కారణంగా వాతావరణంలోకి వివిధ కాలుష్యకర వాయువులు విడుదలవుతున్నాయి. ఈ వాయువుల వల్ల గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్‌ల నిష్పత్తికి భంగం కలుగుతోంది. తద్వారా వాతావరణ సమతౌల్యత దెబ్బతింటోంది. వాతావరణం భూమి నుంచి సుమారు 500 కి.మీ. వరకు విస్తరించి ఉంటుంది. వాతావరణంలో ప్రధానంగా నాలుగు పొరలు ఉంటాయి.



1. ట్రోపోవరణం (0–11 కి.మీ.)
2. స్ట్రాటోవరణం (11–50 కి.మీ.)
3. మీసోవరణం (50–85 కి.మీ.)
4. థర్మోవరణం (85–500 కి.మీ.)

వీటిలో ప్రధానమైంది ట్రోపోవరణం. ఈ పొరలోనే గాలి ఉంటుంది. ఎత్తుకు పోయే కొద్దీ గాలి సాంద్రత పీడనం తగ్గుతుంది. ఈ పొర ఉష్ణ సమతౌల్యతను కాపాడుతుంది. అయితే మానవ చర్యల వల్ల అధిక మోతాదులో వివిధ కాలుష్య కారక వాయువులు చేరి వాతావరణ సమతౌల్యత దెబ్బతింటోంది. అవి ప్రధానంగా..

- **కార్బన్ డై ఆక్సైడ్:** కార్బన్ మోనాక్సైడ్ (CO), కార్బన్ డై ఆక్సైడ్ (CO_2)
- **నైట్రోజన్ ఆక్సైడ్‌లు:** నైట్రస్ ఆక్సైడ్ (N_2O), నైట్రిక్ ఆక్సైడ్ (NO), నైట్రోజన్ డై ఆక్సైడ్ (NO_2)
- సల్ఫర్ ఆక్సైడ్ అయిన సల్ఫర్ డై ఆక్సైడ్ (SO_2)
- **హైడ్రో కార్బన్‌లు:** మీథేన్, ఈథేన్, ఎసిటలీన్, బ్యూటేన్ మొదలైనవి.
- **లోహాలు:** లెడ్, మెర్క్యూరీ మొదలైనవి.
- ఫ్రియాన్‌లు (క్లోరో ఫ్లోరో కార్బన్‌లు)
- కాంతి రసాయన స్మాగ్ (పొగమంచు)
- ఓజోన్‌లు
- ధూళి కణాలు
- అమ్మోనియా

వీటివల్ల కలిగే ప్రధాన అనర్థాలు మూడు.
1. భూగోళం వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్) లేదా హరిత గృహ ప్రభావం (గ్రీన్‌హౌస్ ప్రభావం)
2. ఆమ్ల వర్షాలు
3. ఓజోన్ పొర తరుగుదల

ఈ కాలుష్య కారక వాయువులు వాతావరణంలో వివిధ రకాలుగా కలుస్తున్నాయి. థర్మల్ ప్లాంట్లలో, వివిధ పరిశ్రమల్లో బొగ్గును మండించడం, వంటచెరకు మండించడం, వాహనాల్లో పెట్రోల్, డీజిల్‌ను మండించడం వల్ల కార్బన్ ఆక్సైడ్‌లు వాతావరణంలోకి చేరుతున్నాయి. ఆయిల్ రిఫైనరీలు, థర్మల్ ప్లాంట్లలో బొగ్గును మండించడం, అగ్నిపర్వతాలు, రసాయన పరిశ్రమల ద్వారా సల్ఫర్ డై ఆక్సైడ్ చేరుతోంది. శీతలీకరణ పరిశ్రమ ద్వారా ఫ్రియాన్‌లు, శిలాజ ఇంధనాల దహనం వల్ల నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్‌లు; సూపర్‌సోనిక్ జెట్ విమానాల ద్వారా నైట్రిక్ ఆక్సైడ్, ఉరుములు మెరుపుల ద్వారా నైట్రస్ ఆక్సైడ్‌లు వాతావరణంలో చేరుతాయి. పెట్రోల్ దహనం, నెయిల్‌పాలిష్, పెయింట్ల ద్వారా లెడ్ వాతావరణంలోకి చేరుతోంది.

హరిత గృహ ప్రభావం లేదా భూగోళం వేడెక్కడం: సాధారణంగా సూర్యరశ్మి ద్వారా భూ ఉపరితలాన్ని చేరే కిరణాల శక్తి, భూమి తిరిగి అంతరాళంలోకి వికిరణం చెందించే ఉష్ణ శక్తుల మధ్య సమతౌల్యత ద్వారా భూమి ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. అయితే గ్రీన్‌హౌస్ వాయువులుగా పిలిచే కార్బన్ డై ఆక్సైడ్, ఓజోన్, మీథేన్ నీటిఆవిరి, నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్‌ల ఫ్రియాన్ పరిమాణం పెరిగితే ఇవి సూర్యరశ్మిలోని ఉష్ణ వికిరణాలైన పరారుణ (IR) వికిరణాలను పట్టి బంధించి అంతరాళంలోకి పోనియ్యవు. అందువల్ల భూమి వేడెక్కుతుంది. అంటే తలుపులు మూసివేసిన కారు గాజు పలకల్లా, లేదా నర్సరీల్లో 'గ్రీన్‌హౌస్'కు గాజు పలకల్లా పని చేస్తాయి. ఈ ప్రక్రియనే హరిత గృహ ప్రభావం (గ్రీన్‌హౌస్ ప్రభావం) లేదా భూగోళం వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్) అని అంటారు. దీనికి ప్రధాన కారణమైన కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిలో 50 శాతం పెరుగుదల భూగోళ ఉష్ణోగ్రతను సుమారు 3°C వరకు పెంచుతుంది. భూగోళం వేడెక్కడం కారణంగా ధ్రువ ప్రాంతాల్లోని మంచు కరిగి సముద్ర నీటిమట్టాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు మునగడం, జలాశయాల్లో నీటి బాష్పీభవన రేటు పెరిగి నీటికొరత ఏర్పడటం, అకాల వర్షాలు మొదలైన దుష్ప్రభావాలు కలుగుతాయి.

ఆమ్ల వర్షాలు: నైట్రిక్ ఆక్సైడ్‌లు, నైట్రోజన్ డై ఆక్సైడ్‌లు, సల్ఫర్ డై ఆక్సైడ్‌లు ప్రధానంగా ఆమ్ల వర్షానికి కారణాలు. ఆమ్ల వర్షాల వల్ల నేల సహజ ఆమ్లత్వం లేదా pH మారిపోయి భూసారం దెబ్బ తింటుంది. చలువరాతితో కట్టిన పురాతన కట్టడాలు దెబ్బతింటాయి. చర్మ వ్యాధులు కూడా రావచ్చు.

ఓజోన్ పొర క్షీణించడం: స్ట్రాటోవరణంలో భూమి చుట్టూ ఉండేదే ఓజోన్ పొర. ఇది సూర్యుని నుంచి భూమిని చేరే అతినీల లోహిత (UV) కిరణాలను వడపోసి భూమిని చేరకుండా కాపాడుతుంది (ఈ ఓజోన్ గాలిలో ఉన్నప్పుడు గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌ను కలుగజేస్తుంది). అయితే క్లోరోఫ్లోరో కార్బన్‌లు (CFC), నైట్రిక్ ఆక్సైడ్, క్లోరిన్‌లు ఈ ఓజోన్ పొరకు చిల్లులు పడేట్లు చేసి దాన్ని క్షీణింపచేస్తున్నాయి. ఈ ధ్రువ ప్రాంతాల్లో ఓజోన్ పొరకు ఎక్కువ నష్టం కలుగుతోంది. ఓజోన్ పొరకు చిల్లులు పడటం వల్ల హానికారక UV కిరణాలు భూమిని చేరి చర్మ వ్యాధులను కలుగజేస్తాయి. స్ట్రాటోవరణంలో మేఘాలు, ఫ్రియాన్ల అంతర ప్రవాహం వల్ల చర్మ క్యాన్సర్ వ్యాధులు, కంటి శుక్లాలు పెరుగుతాయి. మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం విపరీతంగా తగ్గిపోతుంది.

మాదిరి ప్రశ్నలు

1. సరైన వాక్యాలు గుర్తించండి.
A) కార్బన్ మోనాక్సైడ్ విషపూరిత కాలుష్య కారిణి.
B) కార్బన్ మోనాక్సైడ్‌ను ఎక్కువగా పీల్చినప్పుడు అది రక్తంలోని హీమోగ్లోబిన్‌తో చర్య జరిపి కార్బాక్సీ హీమోగ్లోబిన్‌ను ఏర్పరచి శరీర భాగాలకు ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. ఫలితంగా స్పృహ కోల్పోవడం, చివరగా మరణం లాంటివి సంభవిస్తాయి.
C) కార్బన్‌మోనాక్సైడ్, కార్బన్‌డైఆక్సైడ్ ఆమ్ల వర్షాన్ని కలుగజేస్తాయి.
D) వాతావరణంలో కార్బన్‌మోనాక్సైడ్ ఆమోదించదగిన స్థాయి 9 ppm.
1) A, B మాత్రమే
2) A, B, C మాత్రమే
3) A, B, D మాత్రమే
4) పైవన్నీ

2. కిందివాటిలో సరైన వాక్యం?
A) ఆమ్ల వర్షంలో ఉండేవి సల్ఫ్యూరిక్, నైట్రిక్ ఆమ్లాలు
B) వరి పొలాలు విడుదల చేసే ప్రధాన గ్రీన్‌హౌస్ వాయువు మీథేన్
C) సముద్రాలు, మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్‌ను శోషించుకునే సింక్‌లు
D) అడవులు మండటం ద్వారా వాతా వరణంలోకి ప్రధానంగా విడు దలయ్యే వాయువు సల్ఫర్ డై ఆక్సైడ్
1) A, B 2) A, C
3) A, B, C 4) A, B, D

3. సరైన వాక్యాలు గుర్తించండి.
A) ఆమ్ల వర్షాలు ప్రధానంగా పారిశ్రా మిక వాడల్లో కురుస్తాయి.
B) ఓజోన్ పొర క్షీణత ప్రధానంగా భూమధ్యరేఖ ప్రాంతంలో కన్పిస్తుంది
C) థర్మల్ విద్యుత్ కేంద్రాలు విడుదల చేసే ప్రధాన వాయువులు కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్
1) A, B 2) A, C
3) B, C 4) A, B, C

4. సరైన వాక్యాలు గుర్తించండి.
A) కార్బన్ క్రెడిట్ అనే భావన 'క్యోటో ప్రోటోకాల్' ద్వారా ఉద్భవించింది.
B) ఒక టన్ను కార్బన్ డై ఆక్సైడ్ లేదా దానికి తుల్యమైన ఏదైనా ఇతర గ్రీన్‌హౌస్ ఉద్గారం చేయడాన్ని కార్బన్ క్రెడిట్ ద్వారా కొలుస్తారు.
C) క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించుకోవడానికి ఉద్దేశించింది.
1) A మాత్రమే
2) B మాత్రమే 3) B, C
4) A, B, C

5. కిందివాటిలో సరికాని వాక్యం ఏది?
1) మీసోవరణంలో శబ్ద తరంగాల ప్రసారం ఉండదు.
2) అయనోవరణంలో రేడియో తరంగాలు ప్రయాణించడానికి కారణం వాటికి తక్కువ శక్తి, ఎక్కువ తరంగదైర్ఘ్యం ఉండటం.
3) ఓజోన్ పొర ట్రోపోవరణంలో ఉంటుంది.
4) థర్మోవరణంలో అయనీకరణం చెందిన వాయువులుంటాయి.

6. ఆమ్ల వర్షానికి కారణమైన వాయువులేవి?
A) నైట్రోజన్ ఆక్సైడ్‌లు
B) కార్బన్ ఆక్సైడ్‌లు
C) సల్ఫర్ ఆక్సైడ్‌లు
D) హైడ్రోజన్ ఆక్సైడ్‌లు
E) క్లోరోఫ్లోరో కార్బన్‌లు
1) A, B, C 2) A, C, D
3) A, C 4) A, E

7. కాంతి రసాయన స్మాగ్‌కు సంబంధించి సరైన వాక్యాలు.
A) NO_2, O_3, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ (PAN)లు అతినీలలోహిత (UV) కిరణాల సమక్షంలో చర్య జరపడం వల్ల ఏర్పడుతుంది.
B) శీతాకాల ప్రాతఃకాలంలో
C) వేసవి మధ్యాహ్న సమయంలో
D) దుమ్ము ధూళి ఎక్కువ ఉన్నప్పుడు
E) దుమ్ము, ధూళి తక్కువ ఉన్నప్పుడు
1) A, B, D 2) A, C, D
3) B, C, E 4) A, C, E

8. మోటారు వాహనాల నుంచి విడుదలయ్యే విష వాయువు ఏది?
1) కార్బన్ మోనాక్సైడ్ 2) కార్బన్ డై ఆక్సైడ్
3) నైట్రస్ ఆక్సైడ్ 4) నైట్రోజన్

9. పబ్లిక్ టాయిలెట్ల నుంచి వెలువడే కాలుష్యకర వాయువు ఏది?
1) కార్బన్ డై ఆక్సైడ్
2) అమ్మోనియా
3) సల్ఫర్ డై ఆక్సైడ్
4) హైడ్రోజన్ సల్ఫైడ్

10. 'స్టోన్ లెప్రొసీ' అనే చలువరాతి కట్టడాల క్షయం దేనితో సంబంధం కలిగి ఉంది?
1) హరిత గృహ ప్రభావం 2) ఆమ్ల వర్షాలు
3) కార్బన్ డై ఆక్సైడ్ 4) కార్బన్ మోనాక్సైడ్

సమాధానాలు

1) 3; 2) 3; 3) 2; 4) 4; 5) 3;
6) 3; 7) 2; 8) 1; 9) 2; 10) 2

Ramesh didn't know the rules of..



BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The Ministry of Home Affairs on Thursday issued (1)/ an order authorizing 10 Central agencies (2)/ to intercept, monitor, and decrypt any information (3)/ generated, transmitted, receiving or stored in any computer. (4)/ no error (5)
2. Delhi's air quality deteriorated to severe category on Saturday (1)/ as a cover of smog surrounded (2)/ national capital (3)/ and prevented dispersion of pollutants. (4)/ no error (5)
3. Mr.Michel is between the three alleged middlemen (1)/ being probed (2)/ in the Augusta Westland VVIP chopper deal case(3)/ by the Enforcement Directorate (ED) and the CBI.(4)/ no error (5)
4. Britain is forbidding puppies and kittens (1)/ from being sold by pet shops (2)/ in a bid to crack down (3)/ on animal exploitation and abuse. (4)/ no error (5)
5. The government and the opposition has last week reached(1)/ an understanding(2)/ to discuss the triple talaq bill(3)/ in Lok Sabha. (4)/ no error (5)

Directions (Q. No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Hospitals are increasing the hours of doctors, significantly affecting the frequency of surgical errors, which already are a cost to hospitals of millions of dollars in malpractice lawsuits.
1) significantly affecting the frequency of surgical errors, which already cost hospitals
2) significantly affecting the frequency of surgical errors, already with hospital costs of
3) significant in affecting the frequency of surgical errors, and already costs hospitals
4) significant in affecting the frequency of surgical errors and already costs hospitals
5) no correction required
7. The pharmaceutical company hired a consultant to supervise a division for studying what are the effects in employees' morale that lower salaries would cause.
1) studying lower salaries as to their effects on employees' morale
2) studying the effects of lower salaries on employees' morale
3) studying the effects of employees' morale on lower salaries
4) studying what the effects lower salaries would have on employees' morale
5) no correction required
8. Eye movement occurs more rapidly during dreams than when waking.
1) when dreaming more rapidly than waking hours
2) more rapidly during dreaming than waking
3) more rapidly during dreams than during the period of time when a person is awake
4) more rapidly when dreaming than when waking
5) no correction required
9. Parent's disagreements on how to discipline their child, has made problems for teachers as they are teaching such spoiled students.
1) have made it problematic for teachers as they are teaching such
2) has made problems for teachers teaching such
3) has made problems for teachers as they are teaching
4) have made it problematic for teachers to teach such
5) no correction required
10. Despite her recent promise not to talk about her divorce with the media, she decided to do so at the press conference because she thought that many women, likely most, would appreciate her message of empowerment.
1) talk at the press conference since she thought that many women, likely most, would have appreciated
2) so talk at the press conference due to her thinking that many women, even most, would likely appreciate
3) do so at the press conference because she thought that many women, if not most, would appreciate
4) do so at the press conference since she thought many women, and even most, would likely appreciate
5) no correction required

Directions (Q.No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. As_____beings we live each day conscious of our shortcomings and victories.
1) sensational 2) sentient
3) sentimental 4) static 5) senile
12. The curious crowd gathered to watch the_____ customer_____about the poor service he received in the restaurant.
1) irritate, antiquate
2) fuming, trivialize 3) irate, rant
4) angry, placate 5) mad, fetter
13. The man's _____ driving resulted in a three-car pile-up on the freeway.
1) burdensome 2) charismatic
3) exceptional 4) boastful
5) negligent
14. Ramesh didn't know the rules of rugby, but he could tell by the crowd's _____ that it was a critical _____ in the game.
1) response, acclamation
2) retort, conviction
3) reaction, juncture
4) feedback, enigma
5) effect, revelation
15. My ancestor who lost his life in the Freedom Struggle was a _____ for Indian independence.
1) knave 2) reactionary
3) compatriot 4) nonconformist
5) martyr

Directions (Q.No.16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Foreign direct investments have become the major economic driver of globalization, accounting for all cross-border investments.
B) The rise of small internet startups that require less research and development investment and the shift towards knowledge based economies, where the emphasis is placed on human capital rather than manual labour, has altered the playing field for FDIs.
C) Given the high growth rates and changes to global investment patterns, the definition to FDI has evolved to include foreign mergers and acquisitions, investments in joint ventures or strategic alliances with local enterprises.
D) With the advent and growth of the internet, many traditional cases of FDI which required huge amount of capital and physical investments are slowly becoming obsolete, especially for developed countries.
E) The "Asian Tiger" economies such as China, South Korea, Singapore and the Philippines benefitted tremendously and experienced high levels of economic growth at the onset of foreign direct investment into their economies.
F) FDIs do not only provide foreign capital and funds, but also provide domestic countries with an exchange of skill sets, information and expertise, job opportunities and improved productivity levels.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Suddenly, the prime minister of India, Narendra Modi appears vulnerable - with a national election looming by May of 2019. This India observer admits to being a stunned mullet. Less than five years ago, Modi was elected with an absolute majority in a landslide victory, something not seen since the aftermath of the assassination of Indira Gandhi in 1984. Modi's Bharatiya Janata Party (BJP) has seemed to be an **impregnable** fortress during the prime minister's tenure.

In a dramatic **repudiation** of Modi, last week it was announced that voters in three major states elected the Congress Party to dominate national assemblies. The Hindi speaking northern states of Madhya Pradesh, Rajasthan, and Chhattisgarh, with a combined population of almost 170 million, rejected the BJP in this traditional Hindi stronghold, suggesting that the coming general election could be a contest for Modi. The BJP did not do well in the small northeast state of Mizoram and in Telangana in the south. Congress already exerts leadership in the major states of Karnataka and Punjab. In a country as complex as India with its regional, religious, linguistic, and ethnic diversity, and with a predominantly rural population, it is difficult to define the precise reasons for this disaffection. However, some opinions and press reports include disappointing growth in farm income in a country where about two-thirds of the population is rural, coupled with increasing production costs; inadequate nonfarm job creation, in a country that must create 15 million such jobs yearly by some estimates; a complicated new Goods and Services Tax that has overwhelmed small entrepreneurs; residual anger from the demonetization of 86% of the country's currency two years ago and job losses that followed; and slow development of the promised manufacturing/export hub as part of the "Make In India" policy.

Contrary to the free market image he cultivated, critics say that Modi has also been slow to enact economic reforms such as privatization of state-owned companies, with Air India being one such example. Further, the middle and upper middle classes seem **skeptical** of Modi's Hindu nationalist approach, focusing on principle in a country that in 1947 was created to be secular. Historically, the similarly populist left of center Congress has formed large coalitions and emphasized inclusivity, while Modi has relied much on Hindu nationalist sentiment and symbolically branding itself with the Hindu color of saffron. Demonstrating a turnaround in perception, Rahul Gandhi, the heir of the Nehru-Gandhi dynasty, is of late presenting himself as a formidable challenger. A major battleground in the general election will be the Hindi speaking state of Uttar Pradesh with a population of over 200 million. Supporters of the prime minister note the still attractive GDP growth rate of 7.1% for the third quarter versus the same period last year, in spite of a global slowdown and rising trade tensions. Increasing emphasis on infrastructure in the rural sector, including electrification, is also cited. Based on an early 2017 estimate of Bloomberg, 240 million Indians were without access to electricity, versus a World Bank estimate of 400 million when Modi was elected.

KEY

1) 4 2) 3 3) 1 4) 5 5) 1
6) 1 7) 2 8) 3 9) 4 10) 3
11) 2 12) 3 13) 5 14) 3 15) 5
16) 3 17) 5 18) 5 19) 2 20) 2